

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 318

శనివారం 8-2-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈఎంఐలు ఇక దిగొస్తాయ్!

- కొత్త గవర్నర్ సారథ్యంలో ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం
- ఐదేళ్ల తర్వాత తొలిసారి వడ్డీ రేట్ల తగ్గింపు...
- రెపో రేటు పావు శాతం కోత.. 6.25 శాతానికి డౌన్
- మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు చికిత్స..
- 2025–26లో జీడీపీ వృద్ధిరేటు 6.7శాతంగా అంచనా
- ద్రవ్యోల్బణం 4.2శాతానికి తగ్గుతుందని వెల్లడి...


17లో



నేడే ఢిల్లీ ఎన్నికల ఫలితాలు

హస్తిన అధికార పీఠం ఎవరికి దక్కుతుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి.

- వివరాలు 6లో



10న ఫ్రాన్స్‌కు.. 12న అమెరికాకు..

ప్రధాని మోదీ ఈ నెల 10 నుంచి 12 దాకా ఫ్రాన్స్‌లో, 12, 13 తేదీల్లో అమెరికాలో పర్యటించేలా షెడ్యూల్ ఖరారైంది.

- వివరాలు 6లో



ఐసీసీపైనా ట్రంప్ ఆంక్షలు

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 6లో



'మహా' ఎన్నికల్లో భారీ అక్రమాలు

మహారాష్ట్ర ఎన్నికల్లో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

- వివరాలు 6లో

కులగణనే కొలమానం!

కులగణన ఆధారంగానే స్థానిక సంస్థల్లో సీట్లు, పార్టీ పదవుల పంపకాలు

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ భేటీలో నిర్ణయం

- ఈ అంశంలో తెలంగాణ దేశానికే నమూనాగా నిలవాలన్న ఖర్గే, వేణుగోపాల్
- ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దని.. వారికి సమయం ఇవ్వాలని సూచన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని స్పష్టీకరణ.. గజ్వేల్ సభకు వచ్చేందుకు ఖర్గే ఓకే ..
- పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు.. 20 మందికిపైగా వైస్ ప్రెసిడెంట్లు..
- కార్యవర్గం ఏర్పాటుపై స్పష్టత.. నేడో రేపో ప్రకటించే అవకాశం



శుక్రవారం పార్లమెంటులో ఖర్గేతో భేటీ అనంతరం పార్టీ ఎంపీలతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వంలోగానీ, పార్టీలోగానీ ఇకముందు తీసుకునే విధానపర నిర్ణయాలన్నింటికీ కులగణనే ప్రాతిపదికగా ఉండాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు జరిపిన భేటీలో నిర్ణయించినట్టు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, నిధుల కేటాయింపుల్లో కులగణన లెక్కలను కొలమానంగా తీసుకుని ముందుకెళ్లాలని.. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలు నామినేటెడ్ పోస్టులు, పీసీసీ పదవుల భర్తీ దాకా ఇదే ఫార్ములాను అనుసరించాలని నిశ్చయానికి వచ్చినట్టు తెలిపాయి. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు పలు రాజకీయ అంశాలపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు శుక్రవారం ఖర్గేతో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని ఖర్గే కార్యాలయంలో సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. అనంతరం పీసీసీ కూర్పుపై కేసీ వేణుగోపాల్‌తోనూ నేతలు విడివిడిగా భేటీ అయి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కులగణన దేశానికి నమూనా కావాలి

రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణలకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన అంశాన్ని రాష్ట్ర నేతలు ఖర్గేకు వివరించారు. దీనిపై రాష్ట్రంలోని నిమ్న వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని

మిగతా 2వ పేజీలో ▶

మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదు

- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్
- మంత్రి పదవుల కోసం ఎవరి పేరూ సిఫార్సు చేయట్లేదు
- కేటీఆర్‌ను అరెస్టు చేయాలన్న తొందరేమీ లేదని వ్యాఖ్య
- రాహుల్‌గాంధీతో తనకు ఎలాంటి గ్యాప్ లేదన్న రేవంత్

మంత్రి పదవి ఆశలపై నీళ్లు

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

19 మంది జడ్జీల ఫోన్ ట్యాప్



తెలంగాణ హైకోర్టుకు చెందిన 19 మంది న్యాయమూర్తుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్‌పై విచారణలో ఆయన వాదనలు వినిపించారు.

- వివరాలు 14లో

సెంటిలియాన్ రూ. 500 కోట్ల పెట్టుబడి



రాష్ట్రంలో డ్రోన్ల తయారీ రంగంలో సెంటిలియాన్ నెట్‌వర్క్స్‌కు చెందిన హెచ్‌సీ రోబోటిక్స్ సంస్థ రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.

- వివరాలు 18లో



కాలయాపన సరికాదు

మార్గదర్శి కేసులో ఆర్‌బీఐ తీరుపై తెలంగాణ హైకోర్టు అసంతృప్తి

- వీలైనంత త్వరగా విచారణ ముగించాలని సుప్రీంకోర్టు సూచించింది
- కౌంటర్లు వేయడానికి ప్రతిసారీ వాయిదాలు కోరడం సమంజసం కాదు
- రెండు వారాలు గడువు ఇవ్వలేం.. వారంలో అదనపు అఫిడవిట్ వేయండి
- ఆర్‌బీఐని ఆదేశించిన ద్విసభ్య ధర్మాసనం.. విచారణ 14కు వాయిదా

14లో

వారంలో 'స్థానిక' షెడ్యూల్!

- బీసీ రిజర్వేషన్లపై 10న డెడికేటెడ్ కమిషన్ నివేదిక
- నివేదిక అందిన వెంటనే బీసీ, ఇతర రిజర్వేషన్లు తేల్చనున్న సర్కార్
- తర్వాత ఎన్నికల తేదీలపై ఎస్ఈసీకి స్పష్టత ఇచ్చే అవకాశం
- వెనువెంటనే నోటిఫికేషన్ జారీ చేసేందుకు కమిషన్ సిద్ధం
- ఒకే విడతలో మండల, జిల్లా పరిషత్..రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు!
- మార్చి 17, 18లోగానే స్థానిక ఎన్నికలు పూర్తి చేసే యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 15వ తేదీ లోగా వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. ఈ నివేదికపై చర్చించాక స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల కోటాను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయనుంది. అనంతరం రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికల తేదీలపైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ప్రభుత్వం తన నిర్ణయాన్ని తెలియజేయనుంది. వెంటనే ఎస్ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుంది. మార్చి మొదటి వారంలో

మిగతా 3వ పేజీలో ▶

బడి పిల్లల గొంతు తడిచేదెలా?

తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

- ఎండలు పెరుగుతుండటంతో నానాటికీ తీవ్రమవుతున్న సమస్య
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలల్లో ఇదే దుస్థితి
- విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చిన డీఈఓలు
- 6 వేల స్కూళ్లకు 'మిషన్ భగీరథ' దూరం
- 4,500 పాఠశాలల్లో ట్యాంకుల నిర్వహణ లోపం
- 10 వేల స్కూళ్లలో ఇళ్ల నుంచే నీళ్లు తెచ్చుకుంటున్న వైనం

- 14లో



దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని

- అన్నపూర్ణ స్టూడియోను విదేశీ సెలబ్రిటీలకు విజిటింగ్ ప్లేస్ చేస్తాం
- ప్రధాని నరేంద్ర మోదీ
- అక్కినేనిపై రాసిన పుస్తకాన్ని నాగార్జున కుటుంబంతో కలిసి ప్రధానికి అందించిన యార్లగడ్డ

- వివరాలు 18లో

ఇదండీ సంగతి



డిన్నర్ మీటింగ్‌లు వద్దన్నారని బ్రేక్‌ఫాస్ట్, లంచ్ మీటింగ్‌లు పెట్టుకుంటున్నార్సార్!

క్లుప్తంగా...

హిందూ బీసీ, ముస్లిం బీసీ అని ఏ చట్టంలో ఉంది?

రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: 'ఎక్కడా లేని విధంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో తెలంగాణలోనే హిందూ బీసీ, ముస్లిం బీసీ ఉంది. ఇదెక్కడి విధానం? హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో రాసి ఉంది' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజలను కులం, మతం పేరుతో విభజించడం కంటే ఘనమైంది ఏమీ రాహుల్ గాంధీకి లేదన్నారు. ముస్లింలను బీసీల్లో కలపడమే విప్లవాత్మక నిర్ణయమని రాహుల్ అనుకుంటే అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని, ముస్లిం బీసీ, హిందూ బీసీ పేర్లతో కులగణన చేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. బీసీ జనాభా 5 శాతం తగ్గిందని చెప్పడం చాలా విచారకరమని పేర్కొన్నారు. 50 శాతం ఇళ్లలోకి వెళ్లకుండానే తూతూమంత్రంగా సర్వే చేయడాన్ని అనేక బీసీ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన బీసీలకు అన్యాయం చేసేలా ఉందని దుయ్యబట్టారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు కృష్ణయ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నేతృత్వంలో బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బోను దుర్గ నరేశ్ బృందంతో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. ఈ మేరకు 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. బీసీ సంఘం డిమాండ్లపై ప్రతేక చొరవ తీసుకుంటామని, బీసీల సంక్షేమం కోసం ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి వెల్లడించినట్లు కృష్ణయ్య తెలిపారు.

నివేదిక కోసం డెడికేటెడ్ కమిషన్‌పై ఒత్తిడి చేయొద్దు

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలనే ఉత్సాహంతో నివేదిక కోసం డెడికేటెడ్ బీసీ కమిషన్‌పై ఒత్తిడి చేయొద్దని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలిచ్చి కనీసం వారం కూడా కాకముందే డెడికేటెడ్ కమిషన్‌పై నివేదిక కోసం ఒత్తిడి చేయొద్దన్నారు. కమిషన్‌కు అధ్యయనం చేసేందుకు వీలుగా ఎక్కువ సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర సర్వే వివరాల్లో, బీసీలతో పాటుగా ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, ఈ సమయంలో లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని వకుళాభరణం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఇచ్చే లెక్కల ఆధారంగా స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో డెడికేటెడ్ కమిషన్ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, ప్రామాణిక పద్ధతులను పాటించకుంటే.. ఆ నివేదిక న్యాయస్థానాల్లో వీగిపోయే ప్రమాదం ఉంటుందని వకుళాభరణం తెలిపారు.

గ్రేటర్‌లో సమగ్ర సర్వే కవరేజీ ఎంత?

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబర్ ఆరోతేదీ నుంచి యాభై రోజుల పాటు ఈ సర్వే నిర్వహించగా.. ఆ సమయంలో ఎన్యూమరేటర్లు చాలా ఇళ్లకు వెళ్లలేదని, ఆయా ఇంటి యజమానుల వివరాలను సేకరించలేదనే ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో సర్వే జరిగిన తీరుపై విచారణ చేపట్టాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఏడు రకాల అంశాలకు సంబంధించి సమాచారం ఇవ్వాలని ఆయన శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలంబర్తికి ప్రత్యేకంగా లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జనాభా ఎంత, ఎంత జనాభా సర్వే పరిధిలోకి వచ్చారు, మొత్తం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇళ్ల సంఖ్య, సర్వే చేసిన ఇళ్లు, జీహెచ్‌ఎంసీలో ఎన్యూమరేషన్ బ్లాకులు, నియమితులైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేషన్ బ్లాకుల వారీగా ఎన్యూమరేటర్ల వివరాలు, వారి ఫోన్ నంబర్లు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.



ఏఐలో భారత పతాక

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భారత టెకీలదే పైచేయి | ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవటంలో నంబర్‌వన్ స్థానం | పని పద్ధతుల్లోకి ఏఐని ప్రవేశపెట్టడం ద్వారా కెరీర్ జూమ్ | 2025 గ్లోబల్ వర్క్‌ప్లేస్ స్కిల్స్ స్టడీలో ఆసక్తికర అంశాలు

సాక్షి, హైదరాబాద్: టెక్నాలజీని సృష్టించటంలో కాస్త వెనుకబడి ఉండవచ్చు.. కానీ టెక్నాలజీని అందిపుచ్చుకుని దానిని శిఖర స్థాయికి తీసుకెళ్లటంలో భారతీయ నిపుణులకు ఎవరూ సాటి రారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలో భారతీయ టెకీలతో అగ్రరాజ్యాల నిపుణులు కూడా పోటీ పడలేరని ఇప్పటికే నిరూపణ అయ్యింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారిన కృత్రిమ మేధ (ఏఐ)లో కూడా భారతీయ నిపుణులదే అగ్రస్థానమని తాజా సర్వేలో తేలింది. పని ప్రదేశాల్లో ఏఐ, జెనరేటివ్ ఏఐ టూల్స్ వినియోగం ద్వారా ప్రపంచ సగటు కంటే మెరుగైన ఉత్పాదకతను సాధించి భారతీయులు ప్రత్యేకతను చాటుతున్నారు. వృత్తి నైపుణ్యం, వృత్తిగతంగా అత్యాధునిక సాంకేతికతల వినియోగం, ఏఐతో కూడిన 'వర్క్‌ప్లేస్ ట్రాన్స్‌ఫార్మేషన్'ను భారతీయ వృత్తి నిపుణులు వేగంగా అందిపుచ్చుకుంటున్నారని '2025 గ్లోబల్ వర్క్‌ప్లేస్ స్కిల్స్ స్టడీ' పేరిట ఎడ్‌టెక్ యూనికార్న్ ఎమెరిటస్ నిర్వహించిన సర్వేలో తేలింది.

సర్వేలోని కీలక అంశాలు..

- 18 దేశాల్లోని ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మాన్యుఫాక్చరింగ్, సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీసెస్, ఎడ్యుకేషన్ తదితర రంగాల్లో పనిచేస్తున్న 6 వేల మంది (21–65 ఏళ్ల లోపువారు) ఈ సర్వేలో పాల్గొన్నారు. వీరిలో 1,700 మంది భారతీయ వృత్తి నిపుణులు ఉన్నారు.
- ఏఐ మెళకువలను అందిపుచ్చుకోవడం (ఏఐ అడాప్షన్)లో 96 శాతంతో ప్రపంచంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. 84 శాతంతో ద్వితీయ స్థానంలో ఇంగ్లాండ్, 81 శాతంతో తృతీయ స్థానంలో అమెరికా నిలిచాయి.
- ఏఐ ద్వారా భిన్నమైన రంగాల్లో పరిశ్రమల స్థాపన (ఇండస్ట్రీ డైవర్సిఫికేషన్)కు అవకాశం లభిస్తుందని 94 శాతం మంది భారతీయులు భావిస్తున్నారు.
- ఏఐకి అనుగుణంగా పని విధానాన్ని మలుచుకున్నందు వల్ల ఉత్పాదక పెరిగిందని 95 శాతం మంది భారతీయ నిపుణులు తెలిపారు.
- ఏఐ నైపుణ్యాలు దీర్ఘకాలిక కెరీర్‌కు, ప్రాధాన్యత కోల్పోకుండా ఉద్యోగాలు, వృత్తుల్లో కొనసాగింపునకు దోహదపడుతుందని 94 శాతం మన టెకీలు భావిస్తున్నారు.
- కెరీర్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరచడానికి ఏఐ, జనరేటివ్ ఏఐ కీలకమని 90 శాతం భారత వృత్తి నిపుణులు విశ్వసిస్తున్నారు.
- 71 శాతం సంస్థల అధిపతులు, యాజమాన్యాలు ఏఐ శిక్షణలో పెట్టుబడులను పెంచాయి.

భారత్‌లో కోరుకుంటున్న టాప్–5 నైపుణ్యాలు

- ఏఐ డెవలప్‌మెంట్, అప్లికేషన్
- మాస్టరింగ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్
- ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్
- మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్)
- స్ట్రాటజిక్ లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్

మన టెకీల కృషి అభినందనీయం

మారుతున్న కాలాన్ని బట్టి అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతికతను వర్క్‌ఫోర్స్ అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. దీనికి తగ్గట్టుగా నూతన నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంచుకోవాలి. ఇండియాలోని వర్క్‌ఫోర్స్ ఏఐ మెళకువలను అందిపుచ్చుకుని, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దే దిశలో కృషి సాగించడం అభినందనీయం.

– అశ్విన్ దామెర, ఎమెరిటస్ కో ఫౌండర్, సీఈవో

మంత్రి పదవి ఆశలపై నీళ్లు!


ఇప్పట్లో రాష్ట్ర కేబినెట్ విస్తరణ ఉండదని స్పష్టతనిచ్చిన కాంగ్రెస్ అధిష్టానం

కూర్పు కుదరకనేనా.. ముహూర్తం ముడిపడకనా?

వరుస ఎన్నికల కోడ్‌లతో కార్పొరేషన్ల చైర్మన్ పోస్టుల భర్తీకి కూడా ఆటంకం

స్థానిక సమరం తర్వాతే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు సర్కారీ పదవులు

ప్రస్తుతానికి టీపీసీసీ కార్యవర్గం కూర్పుతోనే సరి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంత్రి పదవుల ఆశావహులకు కాంగ్రెస్ అధిష్టానం షాకిచ్చింది. రాష్ట్ర పార్టీ పెద్దలంతా ఢిల్లీ వెళ్లారని, ఈసారి కేబినెట్ బెర్తులు ఖరారై త్వరలోనే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తామనుకున్నవారి ఆశలపై నీళ్లు చల్లింది. కేబినెట్ విస్తరణ ఇప్పుడప్పుడే అవసరం లేదని తేల్చేసింది. ఎమ్మెల్యేలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అంకం ఎప్పటికో తెలియని సమయానికి వాయిదా పడింది. సీఎం రేవంత్ స్వయంగా ఈ విషయం ప్రకటించడంతో మంత్రి పదవి రేసులో ఉన్న ఎమ్మెల్యేలు నిరాశలో మునిగిపోవాల్సి వచ్చింది.

అదిగో ఇదిగో అంటూనే..

రాష్ట్ర కేబినెట్‌లో ప్రస్తుతం సీఎంతోపాటు మరో 11 మంది మంత్రులు కలిపి మొత్తం 12 మంది ఉన్నారు. నిబంధనల ప్రకారం మరో ఆరుగురిని మంత్రులుగా నియమించే అవకాశం ఉంది. 2023 డిసెంబర్ 7న సీఎం, 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచీ మిగిలిన ఆరు బెర్తులు ఖాళీగానే ఉన్నాయి. వీటిని భర్తీ చేసే అంశంపై తరచూ ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. ఆ పండుగ, ఈ పండుగ, ఆ ఎన్నికలు, ఈ ఎన్నికల తర్వాత అంటూ కేబినెట్ విస్తరణ వాయిదా పడుతూనే వచ్చింది. సామాజిక వర్గాలు, జిల్లాల వారీగా కూర్పు కుదరడం లేదని, ఎమ్మెల్సీ ఎన్నికలతో కూడా ఈ అంశం ముడిపడి ఉన్నందున ముహూర్తం కుదరడం లేదనే చర్చ జరిగింది. అయితే ఈసారి పార్టీ అధిష్టానం తెలంగాణ పార్టీ పెద్దలను ఢిల్లీకి పిలిపించడంతో.. మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ కార్యవర్గం, కార్పొరేషన్ల చైర్మన్ పోస్టుల భర్తీ వంటివి కొలిక్కి వస్తాయని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఆశించారు.

కార్యవర్గానికి లైన్ క్లియర్..

రాష్ట్ర నేతల ఢిల్లీ పర్యటనలో కొలిక్కి వచ్చిన ఏకైక అంశం టీపీసీసీ కార్యవర్గ కూర్పు మాత్రమే. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు తీసుకుని నాలుగు నెలలు దాటింది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ పార్టీ సంస్థాగత పదవులు ఖాళీగా ఉండటాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు 15 రోజుల్లో పార్టీ పదవులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. దీనితో వేగంగా కసరత్తు చేపట్టి ఓ కొలిక్కి తేవడంతో.. టీపీసీసీ కార్యవర్గ కూర్పునకు అధిష్టానం ఆమోదం తెలిపింది. ఒకట్రెండు రోజుల్లోనే టీపీసీసీ కార్యవర్గాన్ని ఏఐసీసీ ప్రకటించే అవకాశం ఉంది. పీసీసీ కార్యవర్గంలోనూ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు చాలా డిమాండ్ ఉందని.. దీనితో 25కు చేరిందని తెలిసింది. పార్టీ కోశాధికారి, ప్రచార కమిటీ చైర్మన్ పోస్టులను కూడా ఈసారి భర్తీ చేయనున్నట్టు సమాచారం. కొన్ని జిల్లాల డీసీసీ అధ్యక్షులను కూడా మార్చే అవకాశం ఉందని సమాచారం.

కార్పొరేషన్ పదవులకు 'కోడ్' తిప్పలు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పోస్టుల అంశం కూడా ఈసారి తేలిపోతుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశించాయి. చాలా మంది నేతలు ఆ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇప్పటికే వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, త్వరలోనే రానున్న స్థానిక ఎన్నికల కోడ్ కారణంగా ప్రస్తుతానికి వీటిని కూడా వాయిదా వేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుతానికి పార్టీ పదవులు.. స్థానిక ఎన్నికలు ముగిశాకే అధికారిక పదవులు దక్కనున్నాయి.

నాలుగు జిల్లాలు.. నాలుగు సామాజిక వర్గాలు

ప్రస్తుత కేబినెట్ కూర్పును పరిశీలిస్తే... రాష్ట్రంలోని నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ఏ ఒక్కరికీ మంత్రివర్గంలో చాన్స్ దక్కలేదు. దీంతో ఈ నాలుగు జిల్లాల నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమకు మంత్రి పదవులు వస్తాయనే ఆశలో ఉన్నారు. రేసులో ప్రేమ్‌సాగర్‌రావు, జి.వివేక్, వినోద్, పి.సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, దానం నాగేందర్‌ల పేర్లు వినిపించాయి. ఇప్పటికే కేబినెట్‌లో స్థానమున్న జిల్లాల నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, వాకిటి శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఈర్లపల్లి శంకర్ తదితరుల పేర్లు తెరపైకి వచ్చాయి. మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్ కూడా కేబినెట్ రేసులోకి వచ్చారు. పేర్ల మాట ఎలా ఉన్నా ఈసారి నాలుగు బెర్తులు తప్పకుండా భర్తీ అవుతాయని.. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఒక్కో ఎమ్మెల్యేకు చాన్స్ ఉంటుందనే చర్చ జరిగింది. కానీ కేబినెట్ విస్తరణ లేదని అధిష్టానం తేల్చేసింది.

కులగణనే కొలమానం!

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ అంశాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి మూడు, నాలుగు జిల్లాలకు కలిపి ఒక సభను ఏర్పాటు చేస్తామని.. ఆ సభలకు హాజరుకావాలని ఖర్గేను కోరారు. ఇందులో ఎస్సీ వర్గీకరణ అంశంపై గజ్వేల్‌లో నిర్వహించే సభకు వచ్చేందుకు ఖర్గే ఒకే చెప్పినట్టు తెలిసింది. ''జనాభా ప్రాతిపదికన అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నది నాతోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాన ఉద్దేశం. కులగణనతో ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని మేం విశ్వసిస్తున్నాం. విద్య, ఉద్యోగం, ఉపాధి, నిధుల కేటాయింపులలో ఓబీసీ, గిరిజన, దళితులు, మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు ఉండాలి...'' అని ఖర్గే సూచించారని సమాచారం. తెలంగాణలో కులగణన, దాని ఆధారంగా అమలు చేసే అంశాలు దేశానికే దిక్సూచిగా నిలవాలని పేర్కొన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సైతం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వర్గీకరణను పూర్తి చేసిన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలకు ఖర్గే సూచించినట్టు తెలిసింది.

ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దు..

ఇటీవల కొందరు ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ అంశం కూడా ఖర్గే వద్ద ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. ఒకరిద్దరు మంత్రుల తీరు నచ్చక జరిగిన ఈ భేటీతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయని.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ దీన్ని ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చకు పెట్టిందని నేతలు ప్రస్తావించారని సమాచారం. అయితే దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యేలతో మాట్లాడామని... ఏ విషయమైనా నేరుగా తమతోగానీ, అధిష్టానం పెద్దలతోగానీ మాట్లాడొచ్చని సూచించామని దీపాదాస్ మున్షీ, రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దని, వారితో ఎప్పటికప్పుడు చర్చించుకోవాలని, రెండు, మూడు నెలలకోసారి సీఎల్పీ భేటీలు నిర్వహించుకోవాలని ఖర్గే సూచించారని సమాచారం. బీఆర్‌ఎస్ బలంగా ఉన్న నేపథ్యంలో ఎలాంటి వదంతులు, తప్పుడు సంకేతాలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేసినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు పాలనకు పరీక్ష అని.. ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఖర్గే పేర్కొన్నట్టు తెలిసింది.

నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు.. 20మందికిపైగా వైస్ ప్రెసిడెంట్లు..

పీసీసీ కార్యవర్గ కూర్పుపై ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో రాష్ట్ర నేతలు జరిపిన భేటీలలో కొంతమేర స్పష్టత వచ్చినట్టు తెలిసింది. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను, 20 నుంచి 25 మంది వరకు వైస్ ప్రెసిడెంట్లను నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. వర్కింగ్ ప్రెసిడెంట్లలో బీసీ, రెడ్డి, ఎస్సీ, మైనార్టీ వర్గాల వారు ఉండాలనే భావనకు వచ్చినట్టు సమాచారం. ఇక జిల్లా నేతల ఆమోదం ఉన్న చోట్ల డీసీసీ అధ్యక్షులను ఒకట్రెండు రోజుల్లో ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదు

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

- మంత్రి పదవుల కోసం నేను ఎవరి పేరూ సిఫార్సు చేయడం లేదు
- శాస్త్రీయంగా కులగణన చేశాం.. బీసీలు ఐదున్నర శాతం పెరిగారు
- ఈ లెక్కల ఆధారంగానే సంక్షేమ పథకాల అమలు



సాక్షి, న్యూఢిల్లీ: మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ పెద్దలతో చర్చించినా, ప్రస్తుత ఎన్నికలు, ఇతర అంశాల దృష్ట్యా ప్రస్తుతం విస్తరణ చేయడం లేదన్నారు. ''మంత్రివర్గ విస్తరణపై చర్చలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటికైతే విస్తరణ ఉండదు. ఓ వైపు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. మరోవైపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీనిపై అధిష్టానం ఎప్పుడు నిర్ణయిస్తే అప్పుడు విస్తరణ ఉంటుంది. ఈ విషయంలో నా ప్రమేయం ఏమీ లేదు. నేను మంత్రి పదవుల కోసం ఎవరి పేరును సిఫార్సు చేయడం లేదు. మంత్రి పదవులకు అర్హులైన వారిని ఏఐసీసీనే ఎంపిక చేస్తుంది. వారు ఎవరి పేరు సూచిస్తే వారితో ప్రమాణస్వీకారం చేయిస్తా..'' అని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శితో కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ చిట్‌చాట్ చేశారు. అత్యంత శాస్త్రీయంగా కులగణన నిర్వహించామని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఒక్కరోజులో పూర్తి చేయలేదని చెప్పారు. 1.12 కోట్ల కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించాకే లెక్కలు బయటపెట్టామన్నారు. ఈ సర్వేలో ఎక్కడా బీసీల శాతం తగ్గలేదని, బీసీలు ఐదున్నర శాతం పెరిగారని.. ఈ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా బీజేపీ సభ్యులు సైతం అంగీకరించారని పేర్కొన్నారు. ఈ కులగణన లెక్కల ఆధారంగానే సంక్షేమ విధానాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రస్తుత సర్వేతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.

కేటీఆర్ అరెస్ట్‌పై తొందరపడం..

ఫార్ములా–ఈ రేసు కేసులో చట్టప్రకారమే నడుచుకుంటున్నామని, ఇప్పటికే నగదు బదిలీ జరిగిన కంపెనీకి నోటీసులు ఇచ్చామని సీఎం రేవంత్ తెలిపారు. నోటీసులపై స్పందించేందుకు సదరు కంపెనీ గడువు కోరిందన్నారు. ఈ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలన్న తొందరేమీ తమకు లేదని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో ఎక్కడా రాజకీయ జోక్యం లేదని, చట్టప్రకారమే నడుచుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక అందిందని, దానిని అడ్వొకేట్ జనరల్ పరిశీలనకు పంపామని వెల్లడించారు.

రాహుల్‌గాంధీతో దూరమేమీ లేదు..

రాష్ట్రంలో పీసీసీ కమిటీ కూర్పు కొలిక్కి వచ్చిందని, ఒకట్రెండు రోజుల్లోనే దీనిపై ప్రకటన ఉంటుందని రేవంత్ చెప్పారు. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉంటారని, అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇక పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో తనకు ఎలాంటి గ్యాప్ లేదని రేవంత్ చెప్పారు. ఈ పర్యటనలో తాను రాహుల్ అపాయింట్‌మెంట్ కూడా కోరలేదన్నారు. రాహుల్ గాంధీతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో టచ్‌లో ఉన్నామంటూ.. రాహుల్ గాంధీ పెట్టిన మెసేజీలను చూపించారు.

వైఎస్సార్‌సీపీలోకి పీసీసీ మాజీ చీఫ్

సాకే శైలజానాథ్

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన వైఎస్ జగన్

- ఏఐసీసీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి కూడా చేరిక
- జగన్ నాయకత్వంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతా: శైలజానాథ్



శైలజానాథ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతోపాటు ఏఐసీసీ సభ్యుడు, అనంతపురం డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కూడా పార్టీలో చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత వెంకట్రామిరెడ్డి, వేంపల్లి సతీష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య, మేరుగ నాగార్జున పాల్గొన్నారు.

మొక్కవోని ధైర్యంతో పనిచేసే నాయకుడు జగన్

అనంతరం శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ మొక్కవోని ధైర్యంతో పని చేసే నాయకుడని, అందుకే ఆయన నేతృత్వంలో పని చేసేందుకు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు. జగన్ నాయకత్వంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేసి పేదలకు వైద్యవిద్యను దూరం చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, రాయలసీమలో రైతుల కష్టాలను అస్సలు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ విద్యా రంగంలో అమలు చేసిన అనేక సంస్కరణలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు.

బాబు నిజస్వరూపం బయటపడుతోంది: అనంత వెంకట్రామిరెడ్డి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత వెంకట్రామిరెడ్డి మట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలతో ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబు నిజ స్వరూపం బయటపడుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ పని చేస్తుందని అనేక మంది పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. రాయలసీమకు కృష్ణా జలాలు తెస్తానని చంద్రబాబు చెబుతున్నది శుద్ధ అబద్ధమని, సీమకు బాబు ద్రోహం చేశారన్నారు. చంద్రబాబు 1996లో ఆ పనులకు శంకుస్థాపన చేసి, ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కృష్ణా జలాలను రాయలసీమకు అందించారని తెలిపారు. వైఎస్ జగన్ సీఎంగా రాయలసీమ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సీమకు మళ్ళీ అన్యాయం చేస్తోందని తెలిపారు. శైలజానాథ్ అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009 లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారని, పాఠశాల విద్యా శాఖ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారన్నారు. తర్వాత ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని చెప్పారు. శైలజానాథ్ ఇక నుంచి వైఎస్సార్‌సీపీ నేతగా పార్టీ నిర్వహించే ఆందోళన కార్యక్రమా ల్లో క్రియాశీలకంగా పాల్గొంటారని వెంకట్రామిరెడ్డి చెప్పారు.



ఎంపీలు రఘురాంరెడ్డి, అనిల్, మల్లురవి, చామల కిరణ్, బలరాంనాయక్‌లతో భేటీ అయిన డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్

నిధులు సాధించుకు రండి


- కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.15 వేల కోట్లు రావాలి
- పెండింగ్ పనుల నిధులు కూడా తెచ్చేందుకు కృషి చేయండి
- కాంగ్రెస్ ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.15 వేల కోట్ల నిధులు వచ్చేలా కృషిచేయాలని కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్కమార్క సూచించారు. ఇటీవల కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.5.50 లక్షల కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. ఈ మొత్తంలో తెలంగాణకు రూ.15 వేల కోట్లు రావాలని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పలువురు ఎంపీలతో భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. పెండింగ్ నిధులపై వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రధానంగా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్య, పట్టణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల నుంచి రాష్ట్రానికి నిధులు రావాల్సి ఉందని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ పనులకు సంబంధించిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బుక్‌లెట్‌లను ఎంపీలకు అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరామ్ నాయక్, సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

తెలంగాణలో జీతాలకూ డబ్బుల్లేవు

బడ్జెట్‌పై చర్చలో ఈటల

- కేంద్రానికి పలు సూచనలు.. ప్రశంసించిన స్పీకర్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జీతాలివ్వడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. గ్రామాల్లో సఫాయి కార్మికుల నుంచి వీధుల్లో వెలిగే లైట్ల వరకు డబ్బుల్ని కేంద్రమే ఇస్తున్నదనే విషయం మరిచిపోవద్దన్నారు. 2014 వరకు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు బడ్జెట్‌లో రెండో, మూడో కోట్లు ఇచ్చి చేతులు దులుపుకునే వారని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.2వేల కోట్లతో చర్లపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వేస్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూడాలంటూ ప్రతిపక్ష సభ్యులను కోరారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఈటల 15 నిమిషాల పాటు ప్రసంగించారు. పలు అంశాలపై ఈటల మాట్లాడుతూ కేంద్రానికి సూచనలు చేస్తుండగా, మధ్యలో స్పీకర్ ఓం బిర్లా కల్పించుకొని ప్రశంసించారు. 'మంచి విషయాలు చెబుతున్నప్పుడు అంతా చప్పట్లు కొట్టొచ్చు కదా' అంటూ నవ్వుతూ సభ్యులకు సూచించారు.

తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ

భారత పర్యాటకుల రాకపైనే మాల్దీవుల ఆశ

- ఈ ఏడాది 3 లక్షల మంది భారతీయ పర్యాటకులను ఆకర్షించే లక్ష్యం
- 2023లో దౌత్య సంబంధాల కారణంగా మాల్దీవులను బహిష్కరించిన భారత పర్యాటకులు
- మాల్దీవుల్లో 2020-23 వరకు మాల్దీవులకు పోటెత్తిన భారతీయులు
- 2024లో 6వ స్థానానికి పడిపోయిన అక్కడి పర్యాటకం

పర్యాటక రంగమే కీలక ఆదాయ వనరుగా ఉన్న మాల్దీవుల ప్రభుత్వం భారతీయుల రాకపై ఆశలు పెట్టుకుంది. భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. దీనికోసం ఎన్నడూ లేనివిధంగా వినూత్న నిర్ణయాలతో అడుగులు వేస్తోంది. 2023లో మాల్దీవుల మంత్రులు భారత ప్రధాని మోదీపై అవమానకర రీతిలో విమర్శలు చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ పర్యాటకులు ఘాటుగా స్పందించి మాల్దీవుల పర్యాటకాన్ని బహిష్కరించారు. చాలా ట్రావెల్ కంపెనీలు సైతం మాల్దీవుల పర్యాటకాన్ని బ్లాక్ లిస్టు చేశాయి. దీంతో మాల్దీవుల పర్యాటకంలో కీలకంగా ఉండే భారతీయులు భారీగా తగ్గిపోయారు. ఫలితంగా ఆదాయ వనరులు క్షీణించడంతో పాటు అక్కడి స్థానికుల ఉపాధికి తీవ్ర విఘాతం ఏర్పడింది. ఈ క్రమంలో దౌత్య సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు గత అక్టోబర్‌లో మాల్దీవులు అధ్యక్షుడు ముయిజు భారతదేశాన్ని సందర్శించారు. ఈ తర్వాత రెండు నెలల్లో పర్యాటకుల సంఖ్య నెమ్మదిగా పెరుగుతోంది. - సాక్షి, అమరావతి

3 లక్షలమందిని ఆకర్షించే లక్ష్యంతో..

మాల్దీవుల పర్యాటకంలో భారతీయలే అగ్రస్థానంలో ఉండేవారు. కోవిడ్–19 తర్వాత 2020–23 వరకు ఇదే పరిస్థితి ఉండేది. కానీ.. దౌత్య సంబంధాలు దెబ్బతిన్న తర్వాత మాల్దీవులకు భారతీయ పర్యాటకులు తగ్గిపోయారు. 2023లో 18.87 లక్షల మంది విదేశీ పర్యాటకులు మాల్దీవులకు వెళ్లగా.. గతేడాది 20.46 లక్షలకు పెరిగారు. ఇందులో చైనా మొదటి స్థానం, రష్యా రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు ద్వీప సమూహ దేశానికి భారత పర్యాటకుల సందర్శనలు తగ్గిపోయాయి. 2023లో 2.09 లక్షల మంది పర్యటిస్తే 2024లో 1.30 లక్షలకు పడిపోయారు. 2024లో అక్కడి పర్యాటకం 6వ స్థానానికి పడిపోయింది. ఈ క్రమంలో భారతీయులపై గంపెడాశలు పెట్టుకున్న మాల్దీవులు ప్రభుత్వం ఈ ఏడాది 3 లక్షల మంది భారతీయ పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో ప్రణాళికలు వేస్తోంది.

విమాన సర్వీసులు పెంపు

భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు నెలవారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మాల్దీవులు ప్రభుత్వం ప్రకటించింది. దేశీయ మీడియాలో విస్తృత ప్రచారంతో పాటు బ్రాండ్ అంబాసిడర్‌ను నియమించాలని భావిస్తోంది. ఇక మాల్దీవుల్లో క్రికెట్ వేసవి శిబిరాలను కూడా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. పర్యాటకులకు సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా భారతదేశంలోని మరిన్ని గమ్యస్థానాల నుంచి విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపడుతోంది. కలకత్తా, పుణె, చెన్నై వంటి కొత్త గమ్యస్థానాల నుంచి విమానాలు నడపనుంది.



క్లుప్తంగా...

‘ఉపాధ్యాయ ఎమ్మెల్సీ’కి ఒక్కరోజే అవకాశం

- నేడు, రేపు సెలవు.. సోమవారం చివరి గడువు
- ఇప్పటివరకు 17 మంది నామినేషన్


అలుగుబెల్లి నర్సిరెడ్డి


శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ: వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ సమర్పించిన వారిలో బీజేపీ నుంచి పులి సరోత్తం రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ నుంచి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్టీయూ నుంచి పింగిళి శ్రీపాల్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా ఏలె చంద్రమోహన్, ఎస్.సుందర్‌రాజు, దామెర బాబూరావు, పూల రవీందర్, తలకొప్పుల పురుషోత్తంరెడ్డి, పోలిపాక వెంకటస్వామి, చాలిక చంద్రశేఖర్, కంటె సాయన్న, జంగిటి కైలాసం, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు. ఈనెల 3వ తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా.. శుక్రవారం వరకు 17 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శని, ఆదివారం సెలవు కావడంతో నామినేషన్ల సమర్పణకు 10వ తేదీ సోమవారం ఒక్క రోజే అవకాశం ఉంది.

యూపీఎస్ అమలుతో ఉద్యోగుల తాకట్టే


ఎస్‌ఎంటీపీఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్) అమలుతో ప్రభుత్వ ఉద్యోగుల భవిష్యత్‌ను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడమే అని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలని దశాబ్దకాలంగా తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తుంటే... ఇప్పుడు కొత్తగా ఈఏప్రిల్ నుంచి యూపీఎస్ అమలు చేస్తామంటూ చర్యలు తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో జరిగిన ఉపవాస సత్యాగ్రహ ధర్నాలో రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఎస్ ద్వారా ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరమవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌లలో కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారో... అదే తరహాలో కర్ణాటక, తెలంగాణ, ఏపీలోనూ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో ఎస్‌ఎంటీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం పైసా ఇవ్వడం లేదు

బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్



సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం భయాందోళనకు గురి చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకుడు జి.దేవీప్రసాద్ విమర్శించారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందడం లేదన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి వరకు 8,764 మంది ఉద్యోగులు రిటైర్ అయినా ఒక్క రూపాయి కూడా వారికి ఇవ్వలేదన్నారు. దీంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం కొందరు రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు రావడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా, ఉద్యోగులకు వేతన సవరణ కమిషన్ ద్వారా వేతనాల పెంపు జరగలేదన్నారు. ఇప్పటికి 35 సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నయాపైసా తేలేక పోయారన్నారు.

ఎటూ తేలని బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక

పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ రాష్ట్ర పర్యటన వాయిదా

- నేతల నుంచి అభిప్రాయాల సేకరణ ప్రక్రియ పెండింగ్
- ఇంకా 19 సంస్థాగత జిల్లాలకు ఖరారు కాని అధ్యక్షులు
- పార్టీ ఎన్నికల పర్యవేక్షకులు కూడా అభిప్రాయాలు తెలుసుకున్నాకే అధ్యక్షుడి ఎంపిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఎటూ తేలడం లేదు. అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనే దానిపై స్థానిక నేతల అభిప్రాయాలు తెలుసుకునేందుకు శనివారం ఇక్కడకు రావాల్సిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ పర్యటన వాయిదా పడింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనుండగా, బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయనే అంచనాల నేపథ్యంలో బన్సల్‌ను ఢిల్లీలోనే ఉండాలని జాతీయ నాయకత్వం సూచించినట్టు సమాచారం. పార్టీకి సంబంధించి రాష్ట్రాన్ని 38 సంస్థాగత జిల్లాలుగా బీజేపీ విభజించింది. వాటిలో 19 జిల్లాలకు అంటే సగం జిల్లాలకు అధ్యక్షులను, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు. దీంతో రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమం అయ్యింది. ఈ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేశాక తదుపరి కార్యాచరణను చేపట్టనున్నారు. అయితే తొలుత జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల నుంచి బన్సల్ అభిప్రాయాలు సేకరించాల్సి ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షకులు, కేంద్రమంత్రి శోభా కరాంద్లజే అధ్యక్షుడి నియామకానికి సంబంధించి మరోసారి రాష్ట్ర నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ జరుపుతారు. ఈమె నుంచి ఇందుకు సంబంధించిన వివరాలు అందాక, రాష్ట్ర అధ్యక్షుడి పేరును జాతీయ నాయకత్వం ప్రకటిస్తుందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

సైద్ధాంతిక నేపథ్యమా లేక ప్రజల్లో గుర్తింపా?

రాష్ట్ర అధ్యక్షుడి పదవి కోసం బీజేపీలో పాత–కొత్త నేతల మధ్య పోటీ తీవ్రంగా సాగుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న, బలమైన సైద్ధాంతిక నేపథ్యమున్న వారికే అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని పాత నాయకులు కోరుతున్నారు. ఇటీవల కొందరు నాయకులు ఢిల్లీ కూడా వెళ్లి మరోసారి జాతీయ నేతలకు ఈ విషయం విన్నవించినట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రంలో పార్టీ మరింత విస్తరించి, వచ్చే ఎన్నికల్లో అధికారంలోనికి రావాలంటే ప్రజల గుర్తింపుతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వారికి అవకాశం కల్పించాలని ఇటీవలి మూడు, నాలుగేళ్ల కాలంలో పార్టీలో చేరిన కొత్త నాయకులు గట్టిగా కోరుతున్నారు. జాతీయ నాయకత్వం సైతం ఈసారి కొత్త వారికి అవకాశం కల్పిస్తే ఎలా ఉంటుందనే కోణంలో సమాలోచనలు జరుపుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. పాత వారికి అవకాశం కల్పిస్తే, తమకు ఆ పదవిని ఇవ్వాలని కోరుతున్న వారిలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు, ఇతర నేతలున్నారు. ఇంకోవైపు నుంచి ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, అర్వింద్ ధర్మపురి, ఎం.రఘునందన్ రావు, ఇతర నాయకులు తమను అధ్యక్షుడిని చేయాలని కోరుతున్నారు.

సామాజిక సమతూకంపై భరోసా

ఇప్పటివరకు నియమించిన 19 జిల్లాల అధ్యక్షుల్లో సామాజిక సమీకరణలు సరిగా పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. మహిళలకు ఒక్కరికి కూడా అవకాశం లభించకపోగా, బీసీల్లోని కొన్ని కులాలను ఈ పదవుల కోసం పరిగణనలోకి తీసుకోలేదని నిరసనలు సైతం వ్యక్తమయ్యాయి. అయితే మిగిలిన 19 జిల్లాల అధ్యక్షుల నియామకం తర్వాత సామాజిక సమతుల్యత నెరవేరుతుందని, మొత్తంగా జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర కార్యవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మహిళలకు కూడా తగిన ప్రాధాన్యత లభిస్తుందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై భేటీ

శనివారం ఉదయం ఓ ప్రైవేట్ హోటల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై బీజేపీ కీలక భేటీ జరగనుంది. కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ముఖ్య నేతలందరూ పాల్గొననున్నారు.

యంత్రాల వినియోగం తప్పనిసరిగా మారింది

- టెక్నాలజీ సాయంతో రైతులు అత్యుత్తమ సాగు విధానాలు అవలంబించాలి
- కిసాన్ అగ్రిషో –2025లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


కిసాన్ అగ్రి షోలో వ్యవసాయ యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాదాపూర్ (హైదరాబాద్): వ్యవసాయంలో యంత్రాల వినియోగం తప్పనిసరిగా మారిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కిసాన్ అగ్రి షో–2025ను కిసాన్ ఫోరం ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ నిరంజన్ దేశ్‌పాండేతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ యంత్ర పరికరాల పనితీరును చూసి రైతులందరూ ఏ విధంగా వాడుకుంటే ఖర్చు తగ్గుతుందో తెలుసుకోవాలన్నారు. అగ్రిషోను జిల్లాల వారీగా కూడా ఏర్పాటు చేసి, ఇక్కడకు రాని రైతులకు కూడా యంత్ర పరికరాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యాంత్రీకరణ ఫలితాలను తెలంగాణ రైతులకు అందించాలని కోరారు. ఈ సంవత్సరం నుంచి యంత్రాల కొనుగోలుకు సబ్సిడీలు ఇచ్చి పెద్దఎత్తున చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, వివిధ రకాల పనిముట్లు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వ్యవసాయ ఇన్‌పుట్‌లు, రక్షిత సాగుతోపాటు వ్యవసాయం కోసం మొబైల్ యాప్‌లు, కస్టమ్ క్లియరెన్స్ సేవలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. 140కిపైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు.


కేటీఆర్‌తో భేటీ అయిన శంభీపూర్ రాజు, కేపీ వివేకానంద, మధుసూదనాచారి, గంగుల, జోగు రామన్న, చెరుకు సుధాకర్, భిక్షమయ్యగౌడ్, జూలూరు గౌరీశంకర్, నోముల భగత్ తదితరులు

బీసీలకు కాంగ్రెస్ అన్యాయం

- ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్యను తగ్గించి చూపారంటున్న బీఆర్‌ఎస్ బీసీ నేతలు
- బీసీలకు ఇచ్చిన హామీల ఉల్లంఘనపై ఉద్యమ బాట పట్టాలని నిర్ణయం
- అందుబాటులో ఉన్న నేతలతో కేటీఆర్ భేటీ
- రేపు తెలంగాణ భవన్‌లో పార్టీ బీసీ నేతలతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. కులగణన పేరిట వారికి తీవ్రమైన అన్యాయం చేసిందని బీఆర్‌ఎస్ బీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్యను భారీగా తగ్గించి చూపిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం రాత్రి అందుబాటులో ఉన్న పార్టీ బీసీ నేతలతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో భేటీ అయ్యారు. బీసీ సామాజికవర్గానికి బీఆర్‌ఎస్ అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలు, రాజకీయ అవకాశాలపై ఈ భేటీలో చర్చించారు. అధికారంలోకి వచ్చేందుకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ డొల్ల హామీలు ఇచ్చిందని బీసీ నేతలు పేర్కొన్నారు. బీసీల సంఖ్యను తగ్గించడం ద్వారా కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పేర్కొన్నారు. బీసీలకు అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ తరఫున కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ మేరకు తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ భేటీలో మధుసూదనాచారి, శంభీపూర్ రాజు, కేపీ వివేకానంద్, కాలేరు వెంకటేశ్, జోగు రామన్న, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు భగత్, బూడిద భిక్షమయ్య, పార్టీ నేతలు పల్లె రవి కుమార్, తుల ఉమ, చెరుకు సుధాకర్ పాల్గొన్నారు.

అసమర్థ ప్రభుత్వం.. అన్నదాతకు బలిపీఠం

కాంగ్రెస్ చేతకాని పాలనతో 420 మంది రైతుల ఆత్మహత్య: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసమర్థులు అధికారంలోకి వచ్చి అన్నదాతలను బలిపీఠం ఎక్కిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేతకాని పాలనతో తెలంగాణలో ఇప్పటికే 420 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ‘‘రైతులతోపాటు కౌలు రైతులు కూడా పిట్టల్లా రాలిపోతుండటంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ భారీ మూల్యం చెల్లిస్తోంది. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పంజాబ్‌ను తలదన్నేలా వరి దిగుబడి పెరిగింది.. ఇప్పుడు రైతులకు పెట్టుబడి కూడా రావట్లేదు. చలనం లేని సీఎం, బాధ్యత లేని ప్రభుత్వంతో పల్లెలు కన్నీరు పెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంక్షోభాన్ని తీర్చడం ద్వారా అన్నదాతల ఆత్మహత్యల పరంపరను ఆపాలి..’’అని కేటీఆర్ డిమాండ్ చేశారు. బడి పిల్లలకు భోజనం పెట్టడంలోనూ శ్రద్ధ చూపడం లేదని, సీఎం సొంత జిల్లాలోనే పాఠశాల విద్యార్థులు పస్తులు ఉంటున్నారని విమర్శించారు.

కేటీఆర్‌కు నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆహ్వానం

అమెరికా ఇల్లినాయీ రాష్ట్రంలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఏప్రిల్ 19న జరిగే కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్–2025 (కేఐబీసీ–25)కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆ యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ మేరకు కేఐబీసీ వైస్ ప్రెసిడెంట్ చెనాక్షా గోరెంట్ల లేఖ రాశారు.

మీ సేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- కొత్త కార్డులతో పాటు పాతవాటిలో కుటుంబ సభ్యుల చేర్పు
- ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే స్వీకరణకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన రేషన్ కార్డుల దరఖాస్తు స్వీకరణ ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో మీ సేవా కేంద్రాల ద్వారా స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులే కాకుండా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు జత చేసే అవకాశాన్ని కూడా కల్పించింది. రేషన్ కార్డుల జారీకి సంబంధించి గతేడాది ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రత్యేకంగా సమీక్షించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతో పాటు కొత్త కార్డుల జారీ, కుటుంబ సభ్యుల చేర్పునకు సంబంధించి ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ సిఫారసులను రాష్ట్ర మంత్రివర్గం ఈ ఏడాది జనవరి 4న ఆమోదం తెలిపింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు సూచనలిస్తూ ఆదేశాలిచ్చారు. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి సర్వీసును అందుబాటులోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వీసులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఎస్‌బీసీ రాష్ట్ర సమాచార అధికారికి సూచించింది.


సంకెళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న ఫిరోజ్‌ఖాన్, వీహెచ్, షబ్బీర్ అలీ, సునీతారావు తదితరులు

గులాంగిరీ బంద్ కరో!

- అమెరికా నుంచి భారతీయుల డిపోర్టేషన్‌పై కాంగ్రెస్ నిరసన
- గాంధీభవన్‌లో చేతులకు సంకెళ్లు వేసుకొని నేతల ప్రదర్శన
- ట్రంప్‌కు ప్రధాని మోదీ భయపడుతున్నారని ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: అమెరికాకు గులాంగిరీ బంద్ కరో అన్న నినాదాలతో గాంధీభవన్ శుక్రవారం హోరెత్తింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ భయపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న భారతీయుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి బలవంతంగా స్వదేశం పంపించడంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టింది. ఏఐసీసీ పిలుపు మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమెరికా నుంచి భారతీయులను అవమానకర రీతిలో తిప్పి పంపుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, పార్టీ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అమెరికాకు గులాంగిరీ బంద్‌కరో అంటూ నినాదాలు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాపై చూపిస్తున్న శ్రద్ధ.. అమెరికాలోని భారతీయ బాధితుల పట్ల ప్రధాని చూపటంలేదని ఆరోపించారు.

ట్రంప్‌నకు మోదీ భయపడుతున్నారు

సరైన పత్రాలు లేవని 104 మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం ఇండియాకి పంపించిందని, దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడేందుకు ప్రధాని మోదీ భయపడుతున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 104 మంది భారతీయులను టెర్రరిస్టుల్లాగా అమెరికా ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు తమ హయాంలో విదేశాల్లో ఉన్న జైళ్ల నుంచి 44 వేల మందిని తెలుగు రాష్ట్రానికి తీసుకొచ్చామని షబ్బీర్ అలీ గుర్తుచేశారు.

వారంలో ‘స్థానిక’ షెడ్యూల్!

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటర్ పరీక్షలు, అదే నెల 21 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. టెన్త్ పరీక్షలకు ఎక్కువగా పరీక్షా కేంద్రాలు అవసరం కాబట్టి, ఇవి మొదలవడానికి లైదారు రోజుల ముందే... అంటే మార్చి 17, 18 లోగానే స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

మూడు కాదు..రెండు విడతల్లోనే ‘పంచాయతీ’

ఈ నెల 15వ తేదీ లోగా నోటిఫికేషన్ జారీచేస్తే..ఆ తర్వాత 10 నుంచి 15 రోజుల వ్యవధిలోనే తొలుత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ఒకే విడతలో పూర్తి చేసేందుకు ఎస్‌ఈసీ సిద్ధమవుతోంది. ఈ లెక్కన ఫిబ్రవరి చివర్లోగా ఈ ఎన్నికలు పూర్తయితే..తర్వాత మార్చి 17, 18 లోగానే రెండు విడతల్లో గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. 2019లో పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించగా, ఈసారి కూడా అలాగే జరిపేందుకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలేవీ పెద్దగా లేవు కాబట్టి రెండు విడతల్లోనే పంచాయతీ పోరు ముగించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థలకు నోడల్ ఏజెన్సీ అయిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరంగా కూడా ఎన్నికల దిశగా అన్ని రకాల కసరత్తును వేగవంతం చేశారు.

11న కలెక్టర్లతో ఎన్నికల కమిషనర్ భేటీ

ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉన్నా అందుకు తగిన విధంగా సిద్ధంగా ఉండేలా ఎస్ఈసీ కసరత్తు ముమ్మరం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు చేస్తున్న సన్నాహాలు, సన్నద్ధమవుతున్న తీరుపై ఈ నెల 11న జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీ కుముదిని సమావేశం నిర్వహించనున్నారు. మరోవైపు ఈ నెల 10 తేదీన...ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఓటర్ల జాబితాలను జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లలో పరిశీలన కోసం ప్రదర్శించాలని ఆదేశిస్తూ శుక్రవారం రాణీ కుముదిని నోటిఫికేషన్ విడుదల చేశారు. అలాగే గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలను ఎంపీటీసీ, జడ్పీటీసీ నియోజకవర్గాల వారీగా విభజించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే నాగర్‌కర్నూల్ జిల్లాలోని నరసింహాపురం ఎంపీటీసీ, కొల్లాపూర్ జడ్పీటీసీ, ఖమ్మం జిల్లాలోని పోలేపల్లి ఎంపీటీసీ, ఖమ్మం రూరల్ జడ్పీటీసీ స్థానాలు మినహా ప్రచురించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ తేదీ దాకా గ్రామ పంచాయతీ ఫొటో ఓటర్ల జాబితాల్లో పేర్లు చేర్చడం, తొలగింపు, దిద్దుబాటు వంటివి చేసే అవకాశం ఉన్నందున చట్టంలోని అంశాలకు లోబడి ఆ ప్రక్రియను చేపట్టాలని ఆమె సూచించారు. ఇదిలా ఉంటే.. ఈ నెల 10వ తేదీకల్లా రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది నియామకం, 12వ తేదీలోగా జిల్లా, మండల స్థాయిల్లోని క్షేత్ర స్థాయి సిబ్బంది (రిటర్నింగ్ ఆఫీసర్లతో సహా)కి శిక్షణా తరగతులు చేపట్టాలని ఎస్ఈసీ సూచించింది. 15వ తేదీలోగా పోలింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు(ఏపీవో) శిక్షణ తరగతులు పూర్తి చేయాలని తెలిపింది.

15న పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణ

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈనెల 15న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాలను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లు / జిల్లా ఎన్నికల అధికారులకు (హైదరాబాద్ మినహా) ఎస్ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీఈవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలకు సర్క్యులర్ జారీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారుల (కలెక్టర్లు) నుంచి ఆమోదం లభించాకే వాటిని ప్రచురించాలని సూచించారు. ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులు పోలింగ్ స్టేషన్ల కోసం ప్రతిపాదిస్తున్న భవనాలను స్వయంగా పరిశీలించి, స్టేషన్ల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయనే నిర్ధారణకు రావాలన్నారు.

23 శాతంలోపే బీసీ రిజర్వేషన్లు?

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా.. ఆ మేరకు సాధ్యమయ్యే అవకాశాలు లేవు. సమగ్ర కులగణన సర్వే అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ ఆదేశాల ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ జనాభా ఆధారంగా వారికి రిజర్వేషన్లు కల్పించాలని (1), మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా చూడాలని (2), డెడికేటెడ్ కమిషన్‌ను నియమించి రిజర్వేషన్లు ఖరారు చేయాలని (3) న్యాయ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతంగా ఉన్నారు. జనాభాకు అనుగుణంగా వీరికి రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నందున ఈ రెండు వర్గాలకు 27.88 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంటుందని, 50 శాతంలో ఇంకా మిగిలింది 22.12 శాతమేనని చెబుతున్నారు. ఇక డెడికేటెడ్ కమిషన్ కూడా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతానికి మించకుండానే రిజర్వేషన్లను ఖరారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ భావిస్తోంది.

పుట్టినవాడు గిట్టక తప్పదు. గిట్టినవాడు పుట్టక తప్పదు.
అనివార్యమైన ఈ సంగతిని గురించి దుఃఖించ తగదు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 8 ఫిబ్రవరి 2025

'కారుణ్యం' శాపం కారాదు!

వైద్య కారణాల రీత్యా ఎప్పటికీ కోలుకోలేని అచేతన స్థితికి చేరుకుని, మరణం తప్ప మరో దారిలేని రోగులకు 'కారుణ్య మరణం' ప్రసాదించే నిబంధనలు దేశంలోనే తొలిసారి కర్ణాటకలో అమల్లో కొచ్చాయి. వాస్తవానికి కేరళ, గోవా, మహారాష్ట్రలు ఇప్పటికే ఇందుకు సంబంధించి నిర్ణయాలు తీసుకున్నాయి. అయితే కర్ణాటక మరో అడుగు ముందుకేసి సవివరమైన న్యాయ నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఈ విషయంలో 2018లోనూ, 2023లోనూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీచేసింది. ప్రభుత్వాలు తగిన చట్టాలు చేసేవరకూ ఇవి అమల్లో వుంటాయని ప్రకటించింది. ప్రపంచంలో ఇప్పటికే చాలా దేశాలు ఇందుకు సంబంధించిన చట్టాలు తీసుకొచ్చాయి. సమస్య చాలా జటిలమైనది. మంచానికి పరిమితమైపోయిన రోగులు లోలోపల ఎంత నరకం చవి చూస్తున్నారో బయటి ప్రపంచానికి తెలియదు. నిత్యం సేవలందించే వైద్య సిబ్బందికి, నిరంతరం కనిపెట్టుకుని వుండే కుటుంబ సభ్యులకు సైతం ఆ రోగుల అంతరంగం, వారు పడుతున్న యాతనలు అర్థంకావు. వ్యాధి నయమయ్యే అవకాశం ఎంతమాత్రం లేదని, వైద్య ఉపకరణాల సాయంతో కోమాలో మంచంపై వెళ్లదీయటం తప్ప మరో మార్గం లేదని తెలిశాక వారిని ఆ స్థితి లోనే ఉంచటం సరికాదన్న వాదనలు ఎప్పటినుంచో ఉన్నాయి. అందుకు విరుద్ధంగా ప్రాణం పోసే శక్తిలేని మనిషికి ప్రాణం తీసే హక్కు ఎక్కడిదన్న వాదనలూ ఉన్నాయి. ఒక మానవ మృగం సాగించిన లైంగిక హింస పర్యవసానంగా కోమాలోకి వెళ్లి ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ (కేఈఎం) ఆసుపత్రి బెడ్‌పై దాదాపు 42 ఏళ్లపాటు జీవచ్ఛవంలా బతికి 2015లో కన్నుమూసిన అరుణా రామచంద్ర శాన్‌బాగ్ కేసు ఉదంతంలో తొలిసారి ఈ కారుణ్య మరణం అంశం చర్చకొచ్చింది. ఆమె దశాబ్దాల తరబడి జీవచ్ఛవంలా రోజులు వెళ్లదీయటం చూడలేకపోతున్నానని, ఇంకా ఎన్నాళ్లపాటు ఆమె ఇలా కొనసాగాల్సి వస్తుందో వైద్యులు కూడా చెప్పలేకపోతున్నారని జర్నలిస్టు పింకీ విరానీ సుప్రీంకోర్టు ముందు 2009లో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె ప్రశాంత మరణానికి అవసరమైన ఆదేశాలివ్వాలని విరానీ విన్నవించుకున్నారు. కానీ ఆమె శాన్‌బాగ్ కుటుంబ సభ్యురాలు కాకపోవటంతో సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇలాంటి స్థితికి చేరుకున్న రోగుల కారుణ్య మరణానికి చట్టబద్ధతను కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించింది. అయితే ఆ తీర్పు అరుణకు 'పునర్జన్మ'నిచ్చిందంటూ ఆమెకు సేవలు చేస్తున్న నర్సులంతా మిఠాయిలు పంచుకుని పండుగ చేసుకున్నారు. రిటైరవుతున్నవారి స్థానంలో వచ్చే కొత్త నర్సులు సైతం ఆమెను కంటికి రెప్పలా చూసుకునేవారు. కారుణ్య మరణంపైనే కామన్ కాజ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పునిస్తూ 2018లో తొలిసారి మార్గదర్శకాలు రూపొందించింది. ఆ మార్గదర్శకాలను మరింత సరళం చేస్తూ 2023లో మరో తీర్పునిచ్చింది. హుందాగా జీవించటం మాత్రమే కాదు... హుందాగా మరణించటం కూడా రాజ్యాంగంలోని 21వ అధికరణం పరిధిలోకి వస్తుందని చెప్పింది.

అయితే కారుణ్య మరణం కేసుల్లో ఇమిడివుండే జటిల సమస్యలేమిటో, వాటిని స్వప్రయోజనపరులు ఎలా ఉపయోగించుకునే ప్రమాదమున్నదో న్యాయమూర్తులు గుర్తించే వుంటారు. అందుకే ఆ మార్గదర్శకాలు అత్యంత జాగ్రత్తగా రూపొందించారు. తిరిగి కోలుకునే అవకాశం లేదని, కేవలం వైద్య సాయంతో జీవచ్ఛవాల్లా బతుకీడ్చక తప్పదని గుర్తించిన రోగులకు ఇది వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. అలాగే చికిత్స తీసుకునేముందే రోగి ఆ ప్రక్రియలో ఎదురుకాగల ప్రమాదాన్ని గుర్తించి, ఆ పరిస్థితి ఏర్పడిన పక్షంలో వైద్యాన్ని నిలిపేయటానికి అంగీకారం తెలిపే ముందస్తు ఆదేశం(ఏఎండీ)పై సంతకం చేసి ఇవ్వొచ్చు. దాన్ని 'లివింగ్ విల్'గా పరిగణించాల్సి వుంటుంది. ఒకవేళ అది రోగి ఇవ్వలేని పక్షంలో వైద్యానికి ముందు ఆయన తరఫున కుటుంబంలోని పెద్ద ఎవరైనా ఏఎండీని అందజేయొచ్చు. దాని ఆధారంగా రోగికి అమర్చే ఆక్సిజన్ మాస్క్, వెంటిలేటర్, ఇతరేతర ఉపకరణాల వంటి ప్రాణావసర వ్యవస్థల్ని తొలగిస్తారు. అయితే ఈ ప్రక్రియ సవ్యంగా సాగడానికీ, ఎలాంటి లొసుగులకూ ఆస్కారం లేకుండా ఉండటానికీ ప్రతి ఆసుపత్రిలోనూ ముగ్గురేసి సీనియర్ డాక్టర్లతో రెండు బోర్డులు ఏర్పాటుచేయాలి. ప్రాథమిక స్థాయి బోర్డు తన అభిప్రాయం చెప్పాక, సెకండరీ బోర్డు మరోసారి పరిశీలించాలి. జిల్లా వైద్యాధికారి ఈ నిర్ణయ ప్రక్రియలో పాలుపంచుకోవాలి. దీన్ని ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరిశీలించాలి. ఆమోదించిన పక్షంలో ఆ సంగతిని హైకోర్టు రిజిస్ట్రార్‌కి తెలపాలి. ఇలాంటి అంశాల్లో కుటుంబ సభ్యుల మధ్యే ఏకాభిప్రాయం కుదరక పోవచ్చు. అందుకే విడివిడిగా అందరితో మాట్లాడటం, వారి అంగీకారం విషయంలో ఇమిడి వున్న సమస్యలేమిటో చెప్పటం ఎంతో అవసరం.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ ప్రక్రియ దుర్వినియోగమయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. డబ్బు కోసం, ఆస్తుల కోసం ఆరాటపడుతూ ఎంతకైనా తెగించే లోకంలో స్వపరభేదాలుండవు. ఇది గాక వైద్యానికి తడిసి మోపెడవుతుందన్న భయంవల్ల లేదా త్వరగా 'వదుల్చుకోవాలన్న' తొందర వల్ల వైద్యులను పక్కదోవ పట్టించే ప్రబుద్ధులుంటారు. కనుక ఈ సమస్య చుట్టూ అల్లుకుని వుండే చట్టపరమైన అంశాలు సరే... నైతిక, సామాజిక, ఆర్థిక అంశాలను సైతం తరచి చూడక తప్పదు. సమాజ పోకడలు ఎలా వుంటున్నాయో గమనించుకోక తప్పదు. 'హుందాగా మరణించటం' హక్కే కావొచ్చు... కానీ అది 'మరణించటానికి గల హక్కు'గా పరిణమించకూడదు. ఈ 'హక్కు' నిస్సహాయ రోగుల పాలిట శాపంగా మారకూడదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం,శిశిర ఋతువు మాఘ మాసం, పుష్య మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.9.26 వరకు తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మృగశిర రా.7.32 వరకు తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.3.44 నుండి 5.16 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.38 నుండి 8.07 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.10 నుండి 12.40 వరకు, భీష్మ ఏకాదశి.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

మయన్మార్ ముక్కలవడం ఖాయమా?

విశ్లేషణ



శ్రుబణ బారువా

2025 ఫిబ్రవరి 1న మయన్మార్ అంతర్యుద్ధం ఐదో సంవత్సరంలోకి ప్రవేశించింది. 'తమడో' (మయన్మార్ సైనిక బలగాలు) తిరుగుబాటు చేసినప్పటి నుండి దేశంలో జనజీవితం మారిపోయింది. 2020 ఎన్నికలలో గెలిచినప్పటికీ 'నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ' నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సైనిక నాయకత్వం ఎన్నడూ అనుమతించలేదు. దాని నాయకులను, మద్దతుదారులను అరెస్టు చేశారు. ఏడాదిపాటు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సైన్యం ద్వారా నూతన ప్రభుత్వం 'స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్' ఏర్పడింది. దీనికి సైన్యం కమాండర్ ఇన్ చీఫ్ అయిన సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లైంగ్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన తనను తాను మయన్మార్ ప్రధానమంత్రిగా ప్రకటించుకున్నారు. 2008 రాజ్యాంగం ప్రకారం ఈ పదవి లేదు. సంవత్సరం లోపే ఎన్నికలు జరుగుతాయని ఆయన హామీ ఇచ్చారు.

2025లో మయన్మార్ ఎన్నికలపై ఊహాగానాలు జరుగుతున్నాయి. ప్రతిపక్ష నాయకులను, జుంటా (సైనిక నాయకత్వం) వ్యతిరేకులను అరెస్టు చేస్తూనే ఉన్నారు. అంతర్యుద్ధానికి పరిష్కారాలను కనుగొనే ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. మయన్మార్ ప్రజలు బాధలకు గురవుతూనే ఉన్నారు. గ్రామాలను తగలబెట్టడం, వైమానిక బాంబు దాడులు, మరణ శిక్షలు వంటి పాత వ్యూహాలనే సైనిక నాయకత్వం ఉపయోగిస్తున్న క్రమంలో, మయన్మార్‌లో అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తుల సంఖ్య 33 లక్షలను దాటింది.

తగ్గుతున్న సైన్య ప్రాభవం

గత రెండేళ్ల కాలంలో, మయన్మార్‌లో సైనిక బలగాల అధికారం, భూభాగంపై నియంత్రణ తగ్గిపోవడం ప్రత్యేకంగా కనిపిస్తుంది. జనరల్ నే విన్ తలపెట్టిన 1962 సైనిక కుట్ర, సైనిక కుట్రకు దారితీసిన 1988 తిరుగుబాటు రెండు సందర్భాల్లోనూ అధికారం చేజిక్కించుకున్నాక సైన్యం బలపడింది. కానీ 2021 సైనిక కుట్ర తర్వాత విషయాలు భిన్నంగా ఉన్నాయి. ప్రజా ప్రతిఘటన మరింత ఆచరణీయమైన నిర్మాణంతో తన బలాన్ని పెంచుకుంది. ప్రవాసంలో ఉన్న 'నేషనల్ యూనిటీ గవర్నమెంట్' ఏర్పర్చిన 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్' సైనిక అణచివేతను ఎదుర్కోవడంలో సమర్థవంతంగా సహకరించింది. ఇది పౌర అవిధేయతా ఉద్యమానికి ఊపునిచ్చింది. ప్రజాస్వామ్యం నుండి మయన్మార్ వెనక్కి తగ్గడం వల్ల నిరాశ చెందిన యువత ఈ ఉద్యమంలో పెద్ద సంఖ్యలో చేరారు.

దీనికి సమాంతరంగా, అనేక జాతి సాయుధ సంస్థలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అవి చాలా కాలంగా పోరాడుతున్న ప్రాంతాల నుండి తమడో బలగాలను వెనక్కి నెట్టాయి. షాన్‌లోని 'మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ', 'తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ', రఖైన్‌లోని 'అరకాన్ ఆర్మీ', కరెన్నిలోని 'కరెన్ని ఆర్మీ' దీనికి కొన్ని ఉదాహరణలు. ఆసక్తికరంగా, 'కాచిన్ ఇండిపెండెన్స్ ఆర్మీ' వంటి అనేక జాతీయ సాయుధ సంస్థలు 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్'కు బహిరంగంగా మద్దతు ఇచ్చాయి. తమడోకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇలాంటి వివిధ సంయుక్త ఫ్రంట్‌ల ఉనికి మయన్మార్‌లో దీర్ఘకాలిక అంతర్యుద్ధానికి ప్రారంభ సంకేతం. గతంలో మాదిరిగా కాకుండా, మయన్మార్ అంతటా ఉన్న 330 టౌన్‌షిప్‌లలో కనీసం 321 పట్టణాలకు ఈ పోరాటం వ్యాపించిందని వార్తలు వస్తున్నాయి.



మయన్మార్ సైనిక బలగమైన తమడో అనేక కీలకమైన అంశాలలో విఫలమైంది. బలగాల పరంగా, 2024లో ఉన్న సైనికుల సంఖ్య 4,00,000 నుండి కేవలం 70,000కు పడిపోయింది. చాలా మంది సైన్యాన్ని విడిచిపెట్టి, వెళ్లిపోయారు. దీనికి ప్రాథమిక వేతనం, బీమా లేకపోవడంతో పాటు ఇతర కారణాలు ఉన్నాయి. తమడో బలగాలకు నైతిక స్థైర్యం, యుద్ధరంగంలో నైపుణ్యాలు లేకపోవడం కూడా ఉంది. నాయకత్వ పరంగా, మిన్ ఆంగ్ హ్లైంగ్ ఇప్పటికీ అగ్రస్థానంలోనే ఉన్నారు. 2024 ఆగస్టులో జరిగిన ఒక అంతర్గత కుట్ర గురించిన పుకార్లు, మయన్మార్‌లో పరిస్థితులు అంత చక్కగా లేవని సూచిస్తున్నాయి. సైన్యంలో మొదటి రెండు స్థానాల్లో ఉన్న మిన్ ఆంగ్ హ్లైంగ్, సో విన్ ఇద్దరూ 2023లో నేపిటా ప్రాంతంలో త్రుటిలో తప్పించుకున్నారు. ఇది వారి రక్షణ దుర్బలత్వాన్ని బహిర్గతం చేసింది. తమడో తన భూభాగాలను నిలుపుకోలేకపోవడం మరింత ముఖ్యమైనది. మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ, తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ, అరకాన్ ఆర్మీలతో కూడిన 'త్రీ బ్రదర్‌హుడ్ అలయన్స్' 2023 అక్టోబర్‌లో నిర్వహించిన 'ఆపరేషన్ 1027' ఈ విషయంలో ఒక మలుపు అని చెప్పాలి.

దీని తర్వాత కరెన్ని రాష్ట్రంలో జరిగిన 'ఆపరేషన్ 1111' ద్వారా ప్రతిఘటనా బలగాలు ప్రయోజనాలు సాధించాయి. కొత్త పాలనా వ్యవస్థలను ఎలా రూపొందిస్తున్నారో చూపించే తాత్కాలిక కార్య నిర్వాహక మండలిని కూడా అక్కడ ఏర్పాటు చేశారు. 2024 ప్రారంభం నాటికి, మయన్మార్ భూభాగంలో 50 శాతాన్ని సైనికేతర దళాలే నియంత్రిస్తున్నట్లు నివేదికలు వచ్చాయి.

అంతర్యుద్ధం ముగిసిపోతుందా?

సైనిక నియంతృత్వం విఫలమైతే, అంతర్యుద్ధం ముగిసిపోతుందా? అంతర్యుద్ధానికి అంత తేలికైన ముగింపు లేదు. ఈ అంతర్యుద్ధంలో పాల్గొంటున్న పార్టీల సంఖ్య చాలా ఎక్కువ. 2021 నుండి యుద్ధంలో పాల్గొంటున్న కొత్త ప్రభుత్వేతర సైనికుల సంఖ్య 2,600 అని ఒక అంచనా. ఉదాహరణకు, 'మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ', 'షాన్ స్టేట్ ప్రోగ్రెసివ్ పార్టీ' వంటి వాటి మధ్య కూడా పోరాటం ఉంది. ఇవి రెండూ 'ఫెడరల్ పొలిటికల్ నెగోషియేషన్ అండ్ కన్సల్టేటివ్ కమిటీ'లో భాగం. 'త్రీ బ్రదర్‌హుడ్ అలయన్స్' కూడా మయన్మార్ పరిణామాలపై భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉంది. చైనా ఆదేశం మేరకు, 'తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ' 2024లో కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. 'మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ' ఇటీవలే దానిని అనుసరించింది. కానీ తమడో ఆధీనంలో ఉన్న రఖైన్ లోని చివరి కీలక ప్రాంతాలలో ఒకటైన సిట్వే వద్ద సైన్యంతో పూర్తి యుద్ధానికి 'అరకాన్ ఆర్మీ' సిద్ధమవుతోంది. అందువల్ల, మయన్మార్ ముఖచిత్రం చాలా అస్పష్టంగా ఉంది.

ఇప్పుడు ఏమి జరగవచ్చు? మొదట, మయన్మార్ విచ్ఛిన్నం కావడం ఆశ్చర్యం కలిగించకపోవచ్చు. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న జాతి రాజ్యాలు సైనిక దళాల నియంత్రణ నుండి దాదాపుగా బయటపడ్డాయి. ప్రత్యేక రాజ్యాలు లేదా ముఖ్యంగా రఖైన్‌లో ఏదో ఒక రకమైన సమాఖ్య కోసం ప్రకటన కూడా తయారు కావచ్చు. అయినప్పటికీ, బామర్లు నివసించే ప్రాంతాల్లో సైనిక దళాలు అధికారంలో ఉంటాయని ఒక అంచనా. సైనిక దళాలు ప్రతిపాదిస్తున్నట్లుగా 2025లో ఎన్నికలు జరిగితే, అది సైన్యం ఆధ్వర్యంలోని 'స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్'(ఎస్ఏసీ) పాలనను మరింత చట్టబద్ధం చేయడానికే ఉపయోగపడుతుంది. దీని అర్థం సైనిక కుట్ర తర్వాత గత వారం ఏడవసారి పొడిగించిన అత్యవసర పరిస్థితి ఈ ఏడాది కూడా ముగిసిపోదు. చైనా ప్రాబల్యంలోని పార్టీలను చర్చలకు తీసుకురాగలిగితే, కొత్త సైనిక ప్రభుత్వం ఎస్ఏసీ స్థానంలోకి రావచ్చు. కానీ, ఇది మయన్మార్ కోసం మరొక కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే పనిలో పడుతుంది. మళ్లీ దేశ నిర్మాణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, మయన్మార్ గతంలో కంటే ఈ ఏడాది మరింత వార్తల్లో ఉంటుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, డైరెక్టర్ ఓపీ జిందాల్ విశ్వవిద్యాలయంలోని నెహ్గిన్‌పావో కిప్గెన్ సెంటర్ ఫర్ ఆగ్నేయాసియా స్టడీస్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

◆ గ్రామాలను తగలబెట్టడం, వైమానిక బాంబు దాడులు, మరణ శిక్షలు వంటి పాత వ్యూహాలనే సైనిక నాయకత్వం ఉపయోగిస్తున్న క్రమంలో, మయన్మార్‌లో అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తుల సంఖ్య 33 లక్షలను దాటింది.

◆ ఐదేళ్ల అంతర్యుద్ధం తర్వాత, మయన్మార్ భూభాగంలో 50 శాతాన్ని సైనికేతర దళాలే నియంత్రిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న జాతి రాజ్యాలు సైనిక దళాల నియంత్రణ నుండి దాదాపుగా బయటపడ్డాయి.

సోషల్ మీడియా

నిలబడితేనే విజయం



చాలామంది వైఫల్యానికి కారణం ప్రతిభ లేకపోవడం కాదు, ఫోకస్ లేకపోవడం. జిమ్ మెంబర్‌షిప్ తీసుకుంటారు, కానీ రోజూ వెళ్లరు. వ్యాపారాన్ని మొదలుపెడతారు, మొదటి ఇబ్బంది రాగానే వదిలేస్తారు. పుస్తకాన్ని రాయాలని కలగంటారు, మొదటి పేజీయే పూర్తిచేయరు. దాని మీద గట్టిగా నిలబడినవారినే విజయం వరిస్తుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఏదో జరగనుంది!



గట్టిగా ఆలోచిస్తుంటే, ఒక పరిధి అంటూ దాటాక కృత్రిమ మేధ వల్ల భవిష్యత్‌లో ఏదో తప్పనిసరిగా జరుగు తుందని మళ్లీ మళ్లీ అనిపిస్తోంది. అదేదో మనల్ని బానిసల్ని చేసుకుంటుందని కాదు. దాని గురించి నా ఆందోళన ఇప్పటికే ఉంది. కానీ ఇంకేదో సూక్ష్మమైనది...

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

తెలీదు అంటే...



'నాకు తెలీదు' అనేది అజ్ఞానాన్ని ఒప్పుకోవడం కాదు. అది మేధో అణకువకు చిహ్నం. 'నేను పొరబడ్డాను' అనేది వైఫల్యపు ఒప్పుకోలు కాదు. అది మేధో సమగ్రతను చూపడం. 'నాకు అర్థం కాలేదు' అనడం మూర్ఖత్వపు చిహ్నం కాదు. అది మేధో కుతూహలానికి ఉత్ప్రేరకం.

– ఆడమ్ గ్రాంట్, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మళ్లీ వెనక్కి!



1997లో ఈ రోజు (ఫిబ్రవరి 7): తన కంపెనీ 'నెక్స్ట్ కంప్యూటర్'ను యాపిల్ కంపెనీ కొనుగోలు చేశాక స్టీవ్ జాబ్స్ అందులో సలహాదారుగా చేరారు. తానే స్థాపించిన యాపిల్ నుంచి తొలగించబడ్డాక స్టీవ్ జాబ్స్ 11 ఏళ్ల తర్వాత తిరిగి అందులో చేరారు.

– జాన్ ఎర్లిచ్‌మాన్, ఫైనాన్షియల్ కామెంటేటర్

వాస్తవం



నీకంటే బలహీనులను అవమానించడంలో నువ్వు ఆనందం పొందుతున్నప్పుడు, నీకన్నా బలవంతులు నిన్ను అవమానించినప్పుడు పట్టించుకోవు.

– అపూర్వానంద్, ప్రొఫెసర్

తీరే వేరు

ఏ సమాజంలోనైనా, దాని జనాభాలోని అతి తక్కువ శాతమే కొత్తవి కనిపెట్టేవాళ్లుగా, ఆలోచనలు రగిలించేవాళ్లుగా, పరిశ్రమలు నెలకొల్పేవాళ్లుగా ఉంటారు. వీళ్లే మిగతా దేశాన్ని భవిష్యత్‌లోకి నడిపిస్తారు. ఈ టాప్ 3 శాతం జనాభాను మిగిలిన దేశాలు ఒక నిధిలా చూస్తాయి. ఇండియాలో మాత్రం వారిని వ్యవస్థీకృతంగా దేశం వదిలేలా చేస్తాం.

– అరవింద్, సామాజికాంశాల వ్యాఖ్యాత

ఇంకేదో!



ఆగస్ట్ 6న కూడా ఈ విషయం చెప్పాను, మళ్లీ చెబుతున్నాను. బంగ్లాదేశ్‌లో వచ్చింది విప్లవం కాదు.

– స్టాన్లీ జానీ, కాలమిస్ట్

ఇన్ బాక్స్

వడ్డీరేట్ల తగ్గింపు ప్రభావం

వడ్డీరేట్ల తగ్గింపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజా ప్రకటనలతో భారత ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన మార్పులు చోటు చేసుకునే విధంగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యంగా, రెపో రేట్‌ను 6.50 శాతం నుండి 6.25 శాతానికి తగ్గించినట్లు ప్రకటించారు. ఇది రుణ గ్రహీతలకు ప్రయోజనకరంగా మారనుంది. ఎందుకంటే తక్కువ వడ్డీరేట్లతో హౌసింగ్, ఆటో, ఎంఎస్ఎంఈ వంటి రంగాల్లో రుణాల భారం తగ్గుతుంది. ప్రజల చేతిలో డబ్బు మిగిలి వినియోగ వ్యయం పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగనుంది.

ద్రవ్యోల్బణ స్థితిగతులు పరిమితి లోపలే కొనసాగుతున్నందున రెపో రేట్ తగ్గింపు సాధ్యమైంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం 6 శాతం కంటే తక్కువ స్థాయిలో ఉంది. ఇది ఆర్థిక వృద్ధికి అనుకూలంగా మారనుంది. వడ్డీరేట్లు తగ్గడం వల్ల పెట్టుబడులు పెరుగుతాయని, వ్యాపార వృద్ధికి దోహదం చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

ఆర్‌బీఐ గవర్నర్ వృద్ధి అంచనాలను 6.6 శాతం నుండి 6.7 శాతానికి పెంచారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు మెరుగుపడటం, మంచి ఖరీఫ్ దిగుబడి వృద్ధిని ప్రోత్సహించనున్నాయని తెలిపారు. గ్రామీణ డిమాండ్ పెరుగుతుండగా, పట్టణ డిమాండ్ స్థిరంగా ఉందని గమనించారు. ఆదాయ పన్ను మినహాయింపులు పెరగడం, వడ్డీరేట్లు తగ్గడం వంటి పరిణామాలు వినియోగాన్ని పెంచే అవకాశముందని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేస్తోంది. అయితే అది చెబుతున్నట్టు ఇక్కడ కొన్ని సవాళ్లు కూడా లేకపోలేదు. పట్టణ డిమాండ్ స్థిరంగా ఉండటం వల్ల కొన్ని రంగాల్లో వృద్ధి మందగించవచ్చు. అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి, ముఖ్యంగా అమెరికా డాలర్ దృఢత్వం, గ్లోబల్ కమోడిటీ ధరల హెచ్చుతగ్గులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించవచ్చు. అలాగే, వాతావరణ మార్పులు... వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేయవచ్చు. పట్టణ డిమాండును మెరుగుపరచడం, అంతర్జాతీయ సవాళ్లను అధిగమించడం కోసం ప్రభుత్వం, ఆర్బీఐ సంయుక్త చర్యలు మరిన్ని అవసరం.

– శ్రీనివాస్ గౌడ్ ముద్దం, 'ఫిన్ నా' ఫౌండర్

ఏఐ రంగంలో పోటాపోటీ

'డీప్ సీక్ ఆర్–1' అనే ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్‌ను 'డీప్ సీక్' అనే చైనా స్టార్టప్ సంస్థ ఇటీవల విడుదల చేసింది. అది వచ్చీ రాగానే ఏఐ మార్కెట్‌లో సంచలనాత్మకమైన పరిణామాలను సృష్టించింది. ఒకటిన్నర సంవత్సరంగా 'చాట్ జీపీటీ' మోడల్ అందరికీ ఉపయోగకరమైన ఏఐ మోడల్‌గా గుర్తింపు తెచ్చుకుంది. 'ఓపెన్ ఏఐ' సంస్థ దీనిని తయారు చేయటానికి కొన్ని బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టింది. అయితే డీప్ సీక్ ఆర్–1ను కేవలం రెండు నెలల్లోనే ఆరు మిలియన్ డాలర్ల పెట్టుబడితో చైనా స్టార్టప్ సంస్థ డీప్‌సీక్ తయారు చేసింది. గూగుల్ జెమినీ, బైదు ఎర్నీ, క్వ్యాన్ వంటి సంస్థలు... డీప్ సీక్ కంటే ముందుగానే మార్కెట్ లోకి వచ్చినా చాట్ జీపీటీకి పోటీ ఇవ్వలేకపోయాయి. చాట్ జీపీటీకి డీప్ సీక్ సరి సమానంగా పని చేయడం, ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ లేకుండా ఉచితంగా ఓపెన్ సోర్స్‌లో ఫైన్ ట్యూన్ చేసుకునేలా ఉండడం... ముఖ్యంగా డీప్ సీక్ ఏపీఏ ధరలు చాట్ జీపీటీతో పోలిస్తే 90 శాతం వరకు తక్కువగా ఉండటం వలన విడుదలైన వారంలోనే ఆపిల్ స్టోర్‌లో డౌన్‌లోడ్స్‌లో మొదటి స్థానం సంపాదించి ఒకేరోజు దాదాపు 20 లక్షల మంది యూజర్లకి చేరువయ్యింది.

డీప్ సీక్ విడుదలతో ఏఐ ఆధారిత కంపెనీల స్టాక్‌లు భారీగా పతనం అయ్యాయి. డీప్ సీక్ వంటి మోడల్స్‌ను అభివృద్ధి చేయడానికి అవసరమైన అధునాతన జీపీయూలు, సెమీ కండక్టర్లను అమెరికాలోని ఎన్‌వీఐడీఐఏ సంస్థ తయారుచేస్తోంది. ఇలాంటి జీపీయూలు, అధునాతన చిప్స్‌ను అమెరికా నుండి వేరే దేశాలకు వెళ్లకుండా ఆదేశం అనేక ఆంక్షలను పెట్టింది. అయినప్పటికీ డీప్ సీక్ తయారీకి ఎన్‌వీఐడీఐఏ జీపీయూలను సింగపూర్ నుండి చైనా రాబట్ట గలిగిందనే వదంతులతో... ఇన్వెస్టర్లు ఎన్‌వీఐడీఐఏపై నమ్మకం కోల్పోవడం వలన 20 బిలియన్ డాలర్ల మేర



కంపెనీ విలువ పడిపోయింది. ఇతర ఏఐ సెమీ కండక్టర్లను తయారుచేసే కంపెనీల షేర్లు కూడా దాదాపు 15 నుండి 20 శాతం పడిపోయాయి.

ఈ నేపథ్యంలో డీప్ సీక్ 'ఐపీ అడ్రస్‌ను తస్కరిస్తుంది' అనే వదంతి వినిపిస్తోంది. అలాగే డీప్ సీక్‌పై భారీ సైబర్ దాడి జరగటం వలన వ్యక్తిగత వివరాల లీక్ ముప్పు ఉండటం, డీప్ సీక్ మోడల్‌లో చైనీస్ సెన్సార్‌షిప్ ఉండటం (ఉదాహరణకు చైనాలో జరిగిన నిరసనలు భారత్‌కి సంబంధించిన అరుణాచల్ ప్రదేశ్, లద్దాఖ్ గురించి అడిగినప్పుడు సరైన సమాచారం ఇవ్వదు ఈ మోడల్). అలాగే కొన్ని ప్రాంతాలకు చైనా అనుకూలంగా ఉండే సమాధానం ఇవ్వటం ఈ మోడల్‌పై అనుమానాలు కలిగిస్తున్నాయి.

డీప్ సీక్ రావటం ఒక విధంగా మంచిదే అని టెక్ సంస్థలు చెబుతున్నాయి. ఇలా తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఇవ్వగలిగే మోడల్స్‌ని తయారు చేయటానికి మార్కెట్‌లో అనువైన కాంపిటీషన్ రాబోతుందనీ, దీనివల్ల వినియోగదారులు అతి తక్కువ ధరలకే ఏఐ సర్వీసులు పొందవచ్చనీ చెబుతున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ వేదికపై అమెరికా, చైనా అన్ని అంశాలలో సై అంటే సై అంటూ పోటీ పడుతున్న విషయం తెలిసినదే. ట్రంప్ 2.0లో ఏఐ ఇండస్ట్రీ అభివృద్ధికి ఏటా వంద బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనీ, అమెరికాను ఏఐ అగ్రగామిగా చేస్తామనీ చెప్పిన మరుసటి రోజే... మేమేమీ తక్కువ కాదన్నట్లు డీప్ సీక్‌ను విడుదల చేసి అమెరికాకు చైనా గట్టి సమాధానమే ఇచ్చింది.

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవటం, దాన్ని అన్ని రంగాలలో సమీకృతం చేయటం పరిశ్రమల ముందు ఉన్న పెను సవాళ్ళు. ఈ సవాళ్లకు మొదటి మెట్టుగా చాట్ జీపీటీ, డీప్ సీక్‌లను మనం చూడవచ్చు. భవిష్యత్తులో ఏఐ పరిశ్రమ మరింతగా ఎదిగి మానవ జీవనాన్ని సుగమం, సౌకర్యవంతం చేస్తుందని ఆశిద్దాం.

– శ్రీరామ్ సుదర్శన్
ఏఐ పరిశోధక విద్యార్థి । 93903 74682

కష్టం కలుపుతుంది

సామాజిక జీవన విధానంలో శాంతియుత సహజీవనాన్ని పాటించడం ప్రతి పౌరుడి ధర్మం. తాను నివాసం ఉంటున్న ప్రదేశంలో ఇరుగు పొరుగుతో సఖ్యతను పోగొట్టుకున్న సందర్భాలలో అక్కడి వ్యక్తులకు సుఖ సంతోషాలు కరవవుతాయి. మనిషి మనశ్శాంతితో బ్రతకడం అనే నాణేనికి పొరుగువాడితో సఖ్యత ఒక పార్శ్వం అయితే, తన సొంత కుటుంబంలోని వ్యక్తులపై తాను చూపే ప్రేమ, ఆప్యాయతలు రెండవ పార్శ్వం. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు సహృదయతతో గౌరవించి ఇంటిలోను, ఇంటి బయట స్నేహపూర్వక వాతావరణం కొనసాగేలా నడుచుకోవలసిన అవసరం నేడు మరింతగా పెరిగిందన్నది వాస్తవం. స్వల్పమైన భేదాభిప్రాయాల కారణంగా మనస్పర్థలను పెంచుకుని తోటివాళ్లకు మానసికంగా దూరం కావడం అభిలషణీయం కాదు. అయినప్పటికీ, అకస్మాత్తుగా విరుచుకుపడి మానవకోటి మనుగడకు ముప్పు కలిగించే ఆపదలు మనుషుల మధ్య నెలకొన్న వ్యక్తిగత మనస్పర్థలను దూదిపింజల్లా ఎగరగొట్టి అందరినీ ఒకే తాటిపైకి తెచ్చి నిలబెడతాయి. గోపాలుని సింగయ రచించిన 'కిరాతార్జునీయం' చతుర్థాశ్వాసంలోని కింది పద్యం ఈ సంగతినే హృద్యంగా చెప్పింది.

క. మెకములు పక్షులు భయపడి / ప్రకటంబుగ నొక్కత్రోవ బఱచెను వైరం / బొకటైనను మదిదలపక / యకటా యాపదలు వైరమణచునె కాదే!

దివ్యాస్త్రాల సాధన కోసం అడవిలో తపస్సు చేస్తున్న అర్జునుడిని పరీక్షించేందుకు శంకరుడు బోయ దొర వేషంలో వచ్చాడు. ప్రమథ గణాలు బోయసైన్యంగా మారి, పలు ఉపకరణాలు, వాయిద్యాలతో పెద్దగా శబ్దం చేస్తూ అడవిలో తిరగసాగాయి. ఆ శబ్దానికి అడవిలోని మృగాలు, పక్షులు భీతి చెంది, వాటిలో వాటికి సహజంగా ఉండే వైరాన్ని తాత్కాలికంగా మరిచిపోయి, దొరికిన దారిని పట్టి, ఒకదానిని అనుసరించి ఒకటి భయంతో పరుగెట్టాయట! ఆ సందర్భంలో వ్యాఖ్యగా చివరి పాదంలో 'ఆపదలు వైరమణచునె కాదే!' అన్న మాటల ద్వారా 'సమష్టిగా వచ్చిన ఆపద, తమలో తమకుండే వైరాన్ని తాత్కాలికంగా మరిచిపోయేట్లు చేస్తుంది కదా!' అనే సత్యం బోధపడేలా చెప్పింది.

– భట్టు వెంకటరావు

GOVERNMENT OF GUJARAT





Future-ready, today

Invest in Gujarat's Thriving **Emerging Sector Ecosystem**

Gujarat is at the forefront of breakthroughs in emerging sectors, driven by progressive, business-friendly policies-from the Aatmanirbhar Gujarat Scheme and Renewable Energy Policy to the Semiconductor Policy and Waste Land Policy for Renewable Energy Projects. With world-class infrastructure and a visionary approach, the state ensures seamless growth and exceptional business performance.

Evolving Sectors in Gujarat



Gujarat: Shaping the Future of Rising Sectors

- **India's first** semiconductor fabrication facility foundation laid in Dholera.
- **Semiconductor ATMP and OSAT plants** coming up in Sanand.
- **C295 aircraft manufacturing** for the Indian Air Force under "Make in India" in Vadodara.
- **India's first Lithium-Ion Cell Giga-Factory** (20 GW) coming up in Ahmedabad.
- **India's first Solar Giga-Factory** coming up in Jamnagar.


Invest in Gujarat, Invest in the Future

10న ఫ్రాన్స్‌కు.. 12న అమెరికాకు

ప్రధాని మోదీ విదేశీ పర్యటనలు ఖరారు ● ఇమ్మానుయేల్ మాక్రాన్‌తో కలిసి ఏఐ సదస్సుకు ● డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు



డొనాల్డ్ ట్రంప్



నరేంద్ర మోదీ



మాక్రాన్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ఖరారయ్యింది. ఆయన ఈ నెల 10 నుంచి 12వ తేదీ దాకా ఫ్రాన్స్‌లో, 12, 13వ తేదీల్లో అమెరికాలో పర్యటిస్తారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారం ఈ విషయం వెల్లడించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌తో కలిసి కృత్రిమ మేధ(ఏఐ) కార్యాచరణ సదస్సులో మోదీ పాల్గొంటారని చెప్పారు. అలాగే ఇండియా–ఫ్రాన్స్ సీఈఓల సదస్సుకు హాజరవుతారని అన్నారు. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పరిమెంటల్ రియాక్టర్‌ను మోదీ సందర్శిస్తారని వెల్లడించారు. అమెరికా పర్యటనలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధానమంత్రి సమావేశమవుతారని పేర్కొన్నారు. మోదీ పర్యటనతో భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని తెలియజేశారు. ఇరుదేశాల మధ్య పరస్పర సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలు, కీలక రంగాల్లో భాగస్వామ్యంపై మోదీ, ట్రంప్ చర్చిస్తారని వివరించారు. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం కొలువుదీరిన మూడు వారాల్లోపే నరేంద్ర మోదీకి ఆహ్వానం అందిందని అన్నారు. తమ దేశంలో పర్యటించాల్సిందిగా ట్రంప్ ప్రభుత్వం ఆయనను ఆహ్వానించిందని చెప్పారు. ఇండియాతో భాగస్వామ్యానికి అమెరికా ఇస్తున్న ప్రాధాన్యతకు ఇదొక ప్రతీక అని విక్రమ్ మిస్రీ వివరించారు.

ట్రంప్‌ను ఒప్పిస్తారా?

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారిగా అమెరికాలో అడుగుపెట్టబోతున్నారు. వారిద్దరి భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అమెరికాలో నివసిస్తున్న భారతీయ అక్రమ వలసదార్లను వెనక్కి పంపిస్తున్న సమయంలో మోదీ, ట్రంప్ సమావేశం కాబోతున్నారు. భారత్–అమెరికా మధ్య వ్యాపారం, వాణిజ్యం, రక్షణ, ప్రాంతీయ భద్రత వంటి కీలక అంశాలపై వారు విస్తృతంగా చర్చించబోతున్నట్లు సమాచారం. ఇరు దేశాల నడుమ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై వారు ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇంధన భద్రత, కృత్రిమ మేధ(ఏఐ) వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకొనేలా నిర్ణయం తీసుకోవచ్చు. అక్రమ వలసదార్ల సమస్యను పరిష్కరించే విషయంలో ట్రంప్ ప్రభుత్వం చురుగ్గా పని చేస్తున్న సంగతి తెలిసిందే. మోదీతో భేటీలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చే వీలుంది. భారతీయ అక్రమ వలసదార్లపై కఠినంగా వ్యవహరించకుండా మోదీ తన మిత్రుడైన ట్రంప్‌ను ఒప్పిస్తారా? అనేది వేచి చూడాలి. అమెరికాలో ఎలాన్ మస్క్ సహా ప్రముఖ వ్యాపారవేత్తలతో మోదీ సమావేశం కానున్నారు.

ట్రంప్ ప్రియమిత్రుడు.. మోదీ గొప్ప నాయకుడు

ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆయనతో మాట్లాడిన అతికొద్ది మంది ప్రపంచ దేశాల నేతల్లో మోదీ కూడా ఉన్నారు. గతవారం కూడా ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. వలసలు, భద్రత, వాణిజ్య సంబంధాలపై వారు చర్చించుకున్నారు. ట్రంప్, మోదీ మధ్య ఫలవంతమైన చర్చలు జరిగాయని వైట్‌హౌస్ ప్రకటించింది. ట్రంప్‌తో మోదీకి చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ట్రంప్ తనకు ప్రియమిత్రుడు అని మోదీ చెబుతుంటారు. మోదీ గొప్ప నాయకుడు అని ట్రంప్ సైతం ప్రశంసించారు. అయితే, ఇండియాలో అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు అధికంగా విధిస్తున్నారని ట్రంప్ ఆక్షేపించారు. ఇండియాను టారిఫ్ కింగ్‌గా అభివర్ణించారు. గత వారం భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ట్రంప్ వ్యాఖ్యల ప్రభావం కనిపించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కొన్ని రకాల మోటార్ సైకిళ్లతోపాటు పలు ఉత్పత్తులపై టారిఫ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. మోదీ చివరిసారిగా 2024 సెప్టెంబర్‌లో అమెరికాలో పర్యటించారు. క్వాడ్ దేశాల అధినేతల సదస్సులో పాల్గొన్నారు.

నేడే ఢిల్లీ ఎన్నికల ఫలితాలు

- ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు
- వరుసగా మూడోసారి విజయంపై 'ఆప్' ధీమా
- అధికారం బీజేపీదేనని వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు

న్యూఢిల్లీ: హస్తిన అధికార పీఠం ఎవరికి దక్కుతుందో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడి కానున్నాయి. ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 19 కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుంది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 5న ఒకే విడతలో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈసారి ఎన్నికల్లో 60.54 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తాము వరుసగా మూడోసారి విజయం సాధించడం తథ్యమని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ 2015లో 67 సీట్లు, 2020లో 62 స్థానాలు గెలుచుకుంది. అయితే, ఈసారి బీజేపీకి విజయావకాశాలు అధికంగా ఉన్నట్లు మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు స్పష్టంచేశాయి. ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత కమలం పార్టీ మళ్లీ అధికారంలోకి రాబోతోందని అంచనా వేశాయి. వరుసగా రెండుసార్లు ఘోర పరాజయం మూటగట్టుకున్న కాంగ్రెస్ ఈసారి ఆప్, బీజేపీలతో గట్టిగానే తలపడింది. అధికారం దక్కకపోయినా కొన్ని సీట్లయినా వస్తాయని కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు.

కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ అధికారులు

ఓట్ల లెక్కింపునకు ఒక్కరోజు ముందు ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. బీజేపీ 'ఆపరేషన్ కమలం' ప్రారంభించిందని, తమ అభ్యర్థులను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తోందని, ఒక్కొక్కరికి రూ.15 కోట్ల చొప్పున నగదు, మంత్రి పదవులు ఇవ్వజూపిందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించడం సంచలనం సృష్టించింది. అధికారం సొంతం చేసుకోవడానికి బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని ఆయన మండిపడ్డారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని, లేకపోతే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాకు సైతం ఫిర్యాదు చేశారు. కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై వి.కె.సక్సేనా స్పందించారు. నిజాలు నిగ్గుతేల్చడానికి ఏసీబీ దర్యాప్తు జరపాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఫిరోజ్‌షా రోడ్డులోని కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన అందుబాటులోకి రాలేదు. దాంతో అధికారులు లీగల్ నోటీసు జారీ చేశారు. ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని పేర్కొన్నారు.



ఘటన ప్రాంతంలో తగులబడిన టెంట్లు

మేళా క్యాంపులో అగ్ని ప్రమాదం

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ నగర్‌లో ఇస్కాన్ క్యాంపులో శుక్రవారం మంటలు చెలరేగాయి. అవి వెంటనే పక్కనున్న క్యాంపులకు కూడా వ్యాపించి బుగ్గి చేశాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. ఉదయం 10.35 గంటల సమయంలో ప్రమాదం విషయం తెలిసిన వెంటనే దాదాపు 12 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని అరగంటలోనే మంటలను ఆర్పి వేసినట్లు చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ తెలిపారు. ప్రమాదానికి కారణాలు, జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. సెక్టార్ 19లోని ఇస్కాన్ క్యాంపు భారీ వంటశాలతో అందరినీ ఆకర్షిస్తోంది. అదానీ ఫౌండేషన్ సహకారంతో దీనిని నిర్వహిస్తున్నారు. కాగా, జనవరి 19న మేళా ప్రాంతంలో సిలిండర్ పేలుడు కారణంగా భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అనంతరం జనవరి 25న రెండు కార్లకు నిప్పంటుకుంది.

40 కోట్ల మంది స్నానాలు

యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో శుక్రవారం వరకు పుణ్య స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 40 కోట్ల మార్కును దాటింది. గంగ, యమున, సరస్వతి త్రివేణీ సంగమంలో శుక్రవారం 48 లక్షల మంది స్నానాలు చేశారని యూపీ ప్రభుత్వం తెలిపింది. అత్యధికంగా మౌని అమావాస్య రోజున 8 కోట్ల మంది స్నానాలు చేసినట్లు పేర్కొంది. అదేవిధంగా, మకర సంక్రాంతి రోజున 3.5 కోట్లు, జనవరి 30న 2 కోట్లు, ఫిబ్రవరి ఒకటిన 1.7 కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో మునిగినట్లు ప్రభుత్వం వివరించింది. జనవరి 13వ తేదీన మొదలైన మహా కుంభ మేళా ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగే ఈ మహాక్రతువులో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలతోపాటు ప్రపంచ దేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర ప్రముఖులు సంగమ్‌లో స్నానాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు.

ఐసీసీపైనా ట్రంప్ ఆంక్షలు

- మమ్మల్ని, ఇజ్రాయెల్‌ను అవమానిస్తోంది
- డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు

వాషింగ్టన్/ద హేగ్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు గురువారం కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాను, తమ మిత్రదేశం ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని ఐసీసీ నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ''అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ చట్టాలను కచ్చితంగా పాటించే సైన్యాలతో కూడిన ఆ ప్రజాస్వామ్య దేశాలు. వాటిపై ఐసీసీకి ఎలాంటి అధికార పరిధి లేదు. అయినా ఇరు దేశాలపై అభ్యంతరకర చర్యల ద్వారా ప్రమాదకరమైన ఉదాహరణను ప్రపంచం ముందుంచింది. హమాస్‌కు, ఇజ్రాయెల్‌కు ఒకేసారి వారెంట్లు జారీ చేసింది. తద్వారా ఇజ్రాయెల్‌ను అగౌరవ పరుస్తోంది. ఐసీసీ దుర్మార్గపు ప్రవర్తన అమెరికా సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఇజ్రాయెల్ సహా అమెరికా ప్రభుత్వం, మిత్రదేశాల కీలకమైన జాతీయ భద్రత, విదేశాంగ విధానం తదితరాలను ఐసీసీ తీరును బలహీనపరుస్తుంది'' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తుండగానే ట్రంప్ ఈ చర్యకు దిగడం విశేషం. అమెరికా పౌరులు, మిత్రదేశాలపై ఐసీసీ దర్యాప్తులకు సాయపడే వ్యక్తులు, వారి కుటుంబాలపై ఈ ఉత్తర్వులు ఆర్థిక, వీసా పరిమితులను విధిస్తాయి. ట్రంప్ ఆదేశాలను ఐసీసీ తీవ్రంగా ఖండించింది. న్యాయాన్ని నిలబెట్టే దిశగా తమ కృషి ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొంది. ట్రంప్ ఆంక్షలపై మానవహక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఐసీసీ.. చివరి అస్త్రం

రక్షణపరంగా చిట్టచివరి అస్త్రంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును పరిగణిస్తారు. సంబంధిత జాతీయ అధికారులు ప్రాసిక్యూట్ చేయనప్పుడు, చేయలేనప్పుడే ఐసీసీ జోక్యం చేసుకుంటుంది. అందులో 125 సభ్య దేశాలున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ ఐసీసీకి దూరంగా ఉన్నాయి. అమెరికా అధికారులు, పౌరులపై ఐసీసీ అధికారాన్ని అగ్రరాజ్యం పదేపదే తిరస్కరిస్తూ వస్తోంది. గాజాలో యుద్ధ నేరాల ఆరోపణలపై ఐసీసీ గత నవంబర్‌లో నెతన్యాహుకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. హమాస్ కమాండర్‌కు కూడా వారెంట్ జారీ చేసింది. ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి చేసి 250 మంది దాకా పౌరులను హతమార్చడమే గాక వందలాది మందిని బందీలను చేసుకుంది. అందుకు ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ తలపెట్టిన యుద్ధంలో ఇప్పటికే వేలాదిగా పాలస్తీనియన్లు మరణించడం తెలిసిందే. ఇరాన్, ఇజ్రాయెల్ వ్యతిరేక గ్రూపులను విస్మరిస్తూ ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కుపైనే ఐసీసీ ఆంక్షలు విధించిందని అమెరికా ఆరోపించింది. ఆఫ్గానిస్తాన్‌లో అమెరికా దళాల యుద్ధ నేరాలపై దర్యాప్తు చేస్తున్న ఐసీసీ అధికారులపై ట్రంప్ తన తొలి హయాంలో ఆంక్షలు విధించారు. అనంతరం జో బైడెన్ ప్రభుత్వం వాటిని ఎత్తివేసింది. నెతన్యాహుకు ఐసీసీ వారెంట్‌ను బైడెన్ కూడా తన పదవీకాలం చివరి రోజుల్లో తప్పుబట్టారు. ఐసీసీపై ఆంక్షలు విధించాలన్న బిల్లుకు అనుకూలంగా అమెరికా ప్రతినిధుల సభ గత నెలలో ఓటేసింది. సెనేట్‌లోనూ బిల్లు ఆమోదం పొందింది.

రూ.230 కోట్ల డ్రోన్ కాంట్రాక్టులు రద్దు

వాటిలో చైనా విడిభాగాలు ఉండడమే కారణం



న్యూఢిల్లీ: దేశీయ డ్రోన్ల తయారీదారులకు భారత సైన్యం షాక్ ఇచ్చింది. రూ.230 కోట్ల విలువైన డ్రోన్ల కొనుగోలు కాంట్రాక్టులను రద్దు చేసింది. ఆయా డ్రోన్లలో చైనా విడిభాగాలు ఉన్నట్లు తేలడమే ఇందుకు కారణం. తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంట మోహరించడానికి 400 డ్రోన్లు కొనుగోలు చేయాలని భారత సైన్యం తొలుత నిర్ణయించింది. ఇందులో 200 మీడియం–అల్టిట్యూడ్ డ్రోన్లు, 100 హెవీవెయిట్ డ్రోన్లు, 100 లైట్‌వెయిట్ డ్రోన్లు ఉన్నాయి. సైన్యానికి డ్రోన్లు సరఫరా చేయడానికి పలు కంపెనీలు ముందుకొచ్చాయి. ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నాయి. అయితే, చైనాలో తయారైన ఎలక్ట్రానిక్ విడిభాగాలను ఈ డ్రోన్ల తయారీలో ఉపయోగిస్తున్నట్లు వెల్లడయ్యింది. ఇలాంటి వాటితో దేశ భద్రతకు, సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండడంతో ఆయా కాంట్రాక్టులకు రద్దు చేస్తున్నట్లు సైన్యం ప్రకటించింది. అయితే, దేశ భద్రతకు సంబంధించిన పరికరాల్లో చైనా విడిభాగాలు అమర్చడం ఇదే మొదటిసారికాదు. గతంలోనూ ఇలాంటి ఉదంతాలు బహిర్గతమయ్యాయి. మన రక్షణ వ్యవస్థలో చైనా హార్డ్‌వేర్ గానీ, సాఫ్ట్‌వేర్ గానీ ఉపయోగించడానికి వీల్లేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మిలటరీ ఇంటెలిజెన్స్(డీజీఎంఐ) గతంలో రెండుసార్లు హెచ్చరికలు జారీ చేసింది. చైనా తప్ప ఇతర దేశాల విడిభాగాలను డ్రోన్లలో ఉపయోగించేందుకు అనుమతి ఉందని అధికారులు అంటున్నారు.

అలాస్కాలో విమానం గల్లంతు

విమానంలో పైలట్ సహా 10 మంది



యాంకరేజ్ (అమెరికా): అమెరికాలో విమాన ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా అలస్కాలోని నోమ్ సమీపంలో సెస్నా 208బి గ్రాండ్ కారవాన్ విమానం గల్లంతైంది. అందులో పైలట్ సహా 10 మంది ప్రయాణికులున్నారు. గురువారం మధ్యాహ్నం ఉనలక్లీట్ నుంచి టేకాఫ్ అయిన విమానం గంటలోపే అదృశ్యమైంది. కాసేపట్లో నోమ్‌లో మరో అరగంటలో ల్యాండవనుండగా రాడార్‌తో సంబంధం కోల్పోయింది. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నోమ్ సమీపంలోని వైట్ మౌంటైన్‌లో గాలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది నోమ్ నుంచి టాప్‌కోక్ వరకు గాలింపు చర్యలు చేపట్టారని అగ్నిమాపక శాఖ తెలిపింది. వరుస విమాన ప్రమాదాలు అమెరికాను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

ముడా కేసులో సిద్దరామయ్యకు ఊరట



బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ప్లాట్ల కేటాయింపు కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. సహచట్టం కార్యకర్త స్నేహమయి కృష్ణ వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ నాగప్రసన్న తీర్పు వెలువరించారు. ముఖ్యమంత్రి హోదాలో సిద్దరామయ్య ఉన్నందున రాష్ట్ర పోలీసులు, లోకాయుక్త దర్యాప్తు సజావుగా సాగకపోవచ్చని పిటిషనర్ అనుమానం వ్యక్తం చేశారు. ముడా) ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, భార్య పార్వతికి 14 ప్లాట్లను సీఎం సిద్దరామయ్య కేటాయించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, లోకాయుక్త పోలీసు విభాగం స్వతంత్రంగా పనిచేస్తోందని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ముడా కుంభకోణంపై గవర్నర్ విచారణకు ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య వేసిన పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్‌లో జస్టిస్ నాగ ప్రసన్న కొట్టి వేశారు. ఆ మరునాడే స్నేహమయి కృష్ణ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టాలంటూ ప్రత్యేక న్యాయస్థానం లోకాయుక్త పోలీసులను ఆదేశించడం గమనార్హం.

మహారాష్ట్ర ఎన్నికల్లో భారీ అక్రమాలు

- ఓటరు జాబితాలో తీవ్ర అవకతవకలు
- ఈసీ స్పందించకుంటే కోర్టుకెళతాం: రాహుల్ గాంధీ
- రాత పూర్వకంగా బదులిస్తామన్న ఈసీ



మీడియాతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, పక్కన సంజయ్ రౌత్, సుప్రియా సూలే

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఎన్నికల్లో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్రంలోని వయోజనుల కంటే నమోదైన ఓటర్లే ఎక్కువమంది ఉన్నారన్నారు. అయిదేళ్ల క్రితం కంటే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో ఎక్కువ మంది పేర్లను జాబితాలో చేర్చారని చెప్పారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలనాటి ఓటరు జాబితాను ఇవ్వాలంటూ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌లు, శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)లు కోరినా ఈసీ ఇప్పటి వరకు స్పందించలేదని ఆయన తెలిపారు. దీనిపై తాము చట్ట ప్రకారం ముందుకెళతామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఎన్సీపీ(ఎస్పీ)నేత సుప్రియా సూలేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాలా మంది ఓటర్ల పేర్ల తొలగింపు లేక బదిలీ చేశారని, వీరిలో ఎక్కువ మంది దళితులు, గిరిజనులు, మైనారిటీ వర్గాల వారే ఉన్నారని రాహుల్ వివరించారు. కొత్తగా చేర్చిన ఓటర్ల కంటే తొలగింపునకు గురైన పేర్లే ఎక్కువగా ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు అనుమానిస్తున్నాయని ఆయన చెప్పారు.

5 నెలల్లోనే 39 లక్షల కొత్త ఓటర్లు

'మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ఈసీని పలు ప్రశ్నలు అడిగాం. 2019 విధాన సభ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల మధ్యలో ఐదేళ్ల వ్యవధిలో మహారాష్ట్రలో 32 లక్షల ఓటర్ల పేర్లను చేర్చారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలు, 2024 అసెంబ్లీ ఎన్నికలకు గాను కేవలం ఐదు నెల్ల వ్యవధిలో ఏకంగా 39 లక్షల కొత్త ఓటర్ల పేర్లు చేరాయి'అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత అంత స్వల్ప వ్యవధిలో అంత ఎక్కువ మంది ఓటర్లను కొత్తగా ఎలా చేర్చారు? ఈ 39 లక్షల మంది ఓటర్లు ఎవరు? 39 లక్షల మంది హిమాచల్ ప్రదేశ్ మొత్తం జనాభాతో సమానం. అయిదేళ్లలో కంటే కేవలం ఐదు నెలల్లో మహారాష్ట్రలో ఈసీ ఎక్కువ మంది ఓటర్లు ఎందుకు చేర్చింది?'అని ఆయన ప్రశ్నించారు.

కొత్త ఓట్లు బీజేపీ ఖాతాలోకే

మహారాష్ట్రలో వయోజనుల జనాభా 9.54 కోట్లు. అసెంబ్లీ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య 9.7 కోట్లు. మహారాష్ట్రలోని మొత్తం వయోజనుల కంటే నమోదైన ఓటర్లు ఎక్కువ మంది ఉండటం ఎలా సాధ్యమని ఆయన సందేహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల ఓటు బ్యాంకు యథాతథంగా ఉండగా కొత్తగా చేరిన ఓటర్లలో ఎక్కువ మంది బీజేపీకే ఓటేశారన్నారు. ఉదాహరణకు కంతీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సాధించిన మెజారిటీ కొత్తగా చేరిన ఓటర్ల సంఖ్యతో సమానంగా ఉందని ఆయన వివరించారు. అదేవిధంగా, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన ప్రతిపక్షాలకు పడిన ఓట్ల సంఖ్యలో ఎలాంటి తగ్గుదల నమోదు కాలేదని కూడా ఆయన చెప్పారు. తమ ప్రశ్నలకు ఈసీ ఎందుకు బదులివ్వడం లేదన్నారు. పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఈసీకుందన్నారు. లేకుంటే తమ తదుపరి చర్య న్యాయస్థానాలను ఆశ్రయించడమేనని స్పష్టం చేశారు.

అన్ని గణాంకాలను వెల్లడిస్తాం: ఈసీ

మహారాష్ట్ర ఎన్నికల్లో అవకత వకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన పలు ఆరోపణలపై ఈసీ స్పందించింది. పూర్తి గణాంకాలతో లిఖిత పూర్వకంగా సమాధానమిస్తామని స్పష్టం చేసింది.

అలాగైతే కేంద్రానికి బానిస అన్నట్లే..

శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ...'ఈసీ సజీవంగా, సొంతంగా పనిచేయగలిగి ఉంటే రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. లేదంటే కేంద్ర ప్రభుత్వానికి అది బానిసగా మారినట్లే భావించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంకెళ్ల నుంచి ఈసీ బయటకు రావాలి'అని అన్నారు. ఎన్నికల్లో గెలిచాక కూడా తమ పార్టీకి చెందిన మల్షిరాస్ ఎమ్మెల్యే ఉత్తమ్ జన్‌కార్ మళ్లీ ఎన్నికలు జరపాలని, ఈసారి బ్యాలెట్‌ను వాడాలని డిమాండ్ చేయగా, ప్రభుత్వం అక్కడికి పోలీసులను పంపించిందని ఎన్సీపీ(ఎస్పీ)నేత సుప్రియా సూలే ఆరోపించారు.

ఐటీ బిల్లుకు ఆమోదం

వారంలో పార్లమెంటు ముందుకు

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఆర్థిక వ్యవహారాల పార్లమెంటు స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపుతారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రత్యక్ష పన్నుల విధానాన్ని సరళీకరిస్తూ 60 ఏళ్లనాటి ఐటీ చట్టం స్థానంలో ఈ కొత్త ఆదాయ పన్ను బిల్లును తీసుకొచ్చారు. స్కిల్ ఇండియా కార్యక్రమాన్ని (ఎస్ఐపీ) కొనసాగించాలని కూడా కేబినెట్ తీర్మానించింది. దానికి రూ. 8,800 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పీఎం కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై 4.0), పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (పీఎం–ఎన్ఏపీఎస్), జన్ శిక్షణ్ సంస్థాన్‌లను ఎస్ఐపీ కింద ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు.

గౌనును బట్టి గౌరవం లభించదు

లాయర్లకు సీనియర్ గుర్తింపుపై సుప్రీం

న్యూఢిల్లీ: ధరించిన గౌనును బట్టి లాయర్లకు గౌరవం లభించదని సుప్రీంకోర్టు పేర్కొంది. 70 మంది లాయర్లకు ఢిల్లీ హైకోర్టు సీనియర్ హోదాను ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. గౌనును బట్టి వేరుగా గౌరవం దక్కుతుందని తాము భావించడం లేదని పేర్కొంది. పిటిషన్ వేసిన నెడుంపర అనే లాయర్ వాదనను తోసిపుచ్చుతూ, ''జడ్జిలు కూడా అవసరాన్ని బట్టి రాత్రి దాకా కేసుల విచారణలోనే ఉంటున్నారు. వాళ్లు మనుషులే. శాయశక్తులా చేయగలిగిందంతా చేస్తున్నారు'' అని పేర్కొంది. కేసుల సత్వర విచారణకు మరింతమంది జడ్జీల అవసరముందని నెడుంపర తెలపగా ఎక్కువ మంది జడ్జీలను నియమించడం తమ చేతుల్లో లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

అతి పే.....ద్ద రేడియో జెట్



ఇదేమిటో తెలుసా? ఇప్పటిదాకా మనిషి కంటికి చిక్కిన అతి పెద్ద రేడియో జెట్. కాంతివేగంతో దూసుకెళ్లే ఎలక్ట్రో మ్యాగ్నటిక్ రేడియేషన్, అంతరిక్ష ధూళితో కూడిన ప్రవాహాలు. క్వాజార్‌గా పిలిచే కృష్ణబిలాల సమూహాలు నుంచి ఇవి పుట్టుకొస్తుంటాయి. వీటి ఉనికి ఇంత స్పష్టంగా చిక్కడం ఇదే తొలిసారి. ఈ రేడియో జెట్ ఏకంగా 2 లక్షల కాంతి సంవత్సరాల పొడవున పరుచుకుని ఉన్నట్టు తేలడం సైంటిస్టులనే విస్మయపరుస్తోంది. అంటే పాలపుంత కంటే రెట్టింపు పరిమాణంలో ఉంది! దర్హాంకు చెందిన పరిశోధకుల బృందం ఇంటర్నేషనల్ లో ఫ్రీక్వెన్సీ అర్రే (లోఫర్) టెలిస్కోప్ ద్వారా దీన్ని ఉనికిని కనిపెట్టింది. ఇది విశ్వం ఆవిర్భవించిన తొలినాళ్లలో ఏర్పడ్డ జే1601+3102 అనే క్వాజార్ నుంచి పుట్టుకొచ్చిన రేడియో జెట్ అని నిర్ధారణయింది. దీని పుట్టుకకు కారణమైన కృష్ణబిలం పరిమాణంలో మరీ పెద్దదేమీ కాకపోవడం సైంటిస్టులను మరింత ఆశ్చర్యపరుస్తోంది. అతి భారీ కృష్ణబిలాలు మాత్రమే భారీ రేడియో జెట్లకు జన్మనిస్తాయని భావించేవారు. దీనిద్వారా అతి భారీ కృష్ణబిలాల ఆవిర్భావంపై కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

గృహ హింస కేసుల్లోకి కుటుంబ సభ్యులను లాగొద్దు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: గృహ హింస కేసులను అత్యంత సున్నితంగా పరిశీలించాలని సుప్రీంకోర్టు అభి ప్రాయపడింది. ఈ కేసుల్లో నిర్దిష్ట నేరారోపణలు లేకుండా నిందితుడి కుటుంబ సభ్యుల ను లాగడం తగదని పేర్కొంది. వివాహ సంబంధ కేసుల్లో భావోద్వేగాల పాలు ఎక్కువ. ఇలాంటి సమయాల్లో ఫిర్యాదుదారుని పక్షాన నిలబడని, మౌన సాక్షులుగా ఉండే కుటుంబసభ్యులను ఇరికించే ధోరణి లుంటాయని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. నిందితుడి కుటుంబ సభ్యులపై విచారణను నిలిపివేస్తూ తీర్పు వెలు వరించింది. గృహ హింస కేసులో ఒక మహిళ తన అత్తింటి వారిపై చేసిన ఆరోపణలను కొ ట్టివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. వారు సుప్రీంను ఆశ్రయించారు.

అభిప్రాయం చెప్పకుండా గవర్నర్ బిల్లుల్ని ఆపరాదు

తమిళనాడు ప్రభుత్వం పిటిషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తొక్కిపెట్టడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి సందర్భాల్లో ప్రతిష్టంభన ఎలా తొలుగుతుందని ప్రశ్నించింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై ఆమోద ముద్ర వేయడంలో గవర్నర్ ఆర్ఎన్ రవి జాప్యం చేస్తున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఏదైనా బిల్లు కేంద్ర చట్టానికి విఘాతం కలిగిస్తుందని మీరు భావిస్తే, ఆ మేరకు మీరు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపుతున్నట్లు గవర్నర్ చెప్పాలి. లేకపోతే ప్రతిష్టంభన తలెత్తుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టంభనను ఎలా అధిగమిస్తుందని మీరు భావిస్తున్నారు? ఇటువంటి ప్రతిష్టంభనను మీరే తొలగించాలి. ఈ విషయం గమనించండి'అని గవర్నర్ తరఫున వాదించిన అటార్నీ జనరల్ వెంకటరమణికి సూచించింది. అటార్నీ జనరల్ వినతి మేరకు తదుపరి విచారణను 10వ తేదీకి వాయిదా వేసింది.


ఎయిర్‌పోర్టులో విజయ్ దేవరకొండ

ప్రయాగ్‌రాజ్ వెళ్లే విమానంలో సాంకేతిక సమస్య

- ఏడున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరిన విమానం
- ఆందోళనకు దిగిన ప్రయాణికులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఏడున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ప్రయాణికులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎస్‌జీ–773 విమానంలో ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరేందుకు బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. అయితే విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలెట్లు దానిని నిలిపివేశారు. ఈ క్రమంలో విమానం ఎప్పుడు బయలుదేరుతుందన్న విషయాన్ని ఎయిర్‌లైన్స్ అధికారులు మధ్యాహ్నం వరకు స్పష్టం చేయకపోవడంతో ప్రయాణికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సాంకేతిక సమస్యను పరిష్కరించిన తర్వాత విమానం సాయంత్రం 5.58 గంటలకు ప్రయాగ్‌రాజ్ బయలుదేరింది. ప్రయాణికుల్లో సినీనటుడు విజయ్ దేవరకొండతో పాటు పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు, ఇతర సినీనటులు, రాజకీయ నేతలు ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం–సి
ప్రాథమిక ప్రకటన
(చట్టంలోని సెక్షన్ 11 కింద 10ఎ మినహాయింపు ఇవ్వబడింది)
(రూల్ 6/12 చూడండి)

గెజిట్ నెం. ఆర్.ఆర్. నెం. 05, తేదీ: 04.02.2025
ఫైల్ నెం. ఇ1/5953/2015 తేదీ: 04.02.2025
నం. డి/2730/2018 తేదీ: 01.02.2025

ఇండస్ట్రియల్ పార్క్/ఐ.టి. పార్క్ స్థాపన కొరకు రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, నాగిరెడ్డిపల్లి గ్రామంలో మొత్తం ఎ. 198.21 గుంటల భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వము/ కలెక్టర్ వారు భావిస్తున్నారు.
కావున రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, నాగిరెడ్డిపల్లి గ్రామంలో పైన తెలిపిన ప్రాజెక్ట్ కొరకు దిగువ విస్తీర్ణము ఎక్కువ లేదా తక్కువగా ప్రామాణిక కొలత ఎ. 195.05 గుంటల భూమి సేకరణ కొరకు ప్రకటించబడినది. వాటి వివరాలు దిగువ విధముగా ఉన్నవి.

షెడ్యూల్
జిల్లా: రంగారెడ్డి మండలం: మహేశ్వరం గ్రామం: నాగిరెడ్డిపల్లి

వరుస సంఖ్య	సర్వే నెం.	పట్టా రకము	భూమి రకము	సేకరించే విస్తీర్ణం (ఎ.గుం)	ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు తూ	ప	ఉ	ద	చెట్లు		నిర్మాణాలు		వివరణ
1	2	3	4	5	6	7				8	9	10	11	12
1	9అ/2	సీలింగ్ పట్టా	మెట్ట	2.17	నాగయ్య తండ్రి ఐలయ్య	59	8	10,1	96	-	-	-	-	-
2	9అ	సీలింగ్ పట్టా	మెట్ట	3.20	ఖరీజ్ ఖాతా సర్కారీ	59	8	10,1	96	-	-	-	-	-
3	9అ	సీలింగ్ పట్టా	మెట్ట	1.2000	వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	59	8	10,1	96	-	-	-	-	-
4	9అ/2	సీలింగ్ పట్టా	మెట్ట	1.0900	[illegible] తండ్రి [illegible]	59	8	10,1	96	-	-	-	-	-
98	144/2	సీలింగ్ పట్టా	మెట్ట	1.0000	ఖరీజ్ ఖాతా సర్కారీ	139,143	150	163	145,137	-	-	-	-	-
99	144/3	సీలింగ్ పట్టా	మెట్ట	8.0000	ఉరుగుల రాములు తండ్రి లక్ష్మయ్య	139,143	150	163	145,137	-	-	-	-	-
100	144/1	సీలింగ్ పట్టా	మెట్ట	0.3900	ఖరీజ్ ఖాతా సర్కారీ	139,143	150	163	145,137	-	-	-	-	-
131	163/3	సీలింగ్ పట్టా	మెట్ట	1.0000	ఖరీజ్ ఖాతా సర్కారీ	178	162	గ్రామ కంఠం నేరి హద్దు	144	-	-	-	-	-
		మొత్తం		12.19										
		మొత్తం		195.05										

అట్టి ప్రకటన భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నెం. 21/2017) ద్వారా సవరించబడిన విధముగా భూసేకరణ, పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు 2013 సెక్షన్-11(1) (కేంద్ర చట్టం నం. 30/2013) ప్రకారము సంబంధము కలిగిన వ్యక్తులు అందరికీ తెలియజేయుటకు గాను ఈ నోటిఫికేషన్ జారీ చేయనైనది.
భూమి యొక్క ప్లాన్‌ను జిల్లా కలెక్టరు & ఆర్‌డిఓ. కందుకూరు డివిజన్ గారి కార్యాలయములో పని వేళల్లో ఏదేని పని దినమున తనిఖీ చేసుకొనవచ్చును. అధీకృత అధికారి మరియు వారి సిబ్బందిని భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమిని చదును చేయడానికి, భూగర్భంలో తవ్వడానికి లేదా బోర్ చేయడానికి మరియు సెక్షన్-12లో పేర్కొన్న విధంగా వారి పనిని సక్రమ నిర్వహించడానికి అవసరమైన అన్ని ఇతర చర్యలను చేయడానికి తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్-కమ్-సంబంధిత ప్రభుత్వం వారికి అధికారం ఇవ్వడమైనది.
ఈ చట్టంలోని సెక్షన్ 11 (4) ప్రకారం, జిల్లా కలెక్టర్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఏ వ్యక్తి కూడా సదరు నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి సదరు భూమిపై ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా ఏదైనా లావాదేవీకి కారణం కాకూడదు అంటే అమ్మకం/కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా సదరు భూమిపై ఏదైనా తాకట్టుని సృష్టించకూడదు.
ఈ సేకరణకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే, మరియు పరిహారం హక్కు ద్వారా పరిష్కారం కొరకు ఆసక్తి ఉన్న/ ప్రభావితమైన వారందరి వ్యక్తుల నుండి క్లెయిమ్‌లను, చట్టంలోని సెక్షన్ 15 కింద ఏర్పాటు చేసిన ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి (60) (అరవై రోజుల) లోగా జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి సమక్షములో భూమిలో ప్రయోజనం గల వ్యక్తి ద్వారా దాఖలు చేయవచ్చును.

సం/- తహశీల్దార్ మహేశ్వరం మండలం | సం/- రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కందుకూర్ మండలం | సం/- అడిషనల్ కలెక్టర్ (ఆర్) రంగారెడ్డి జిల్లా | సం/- జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లా

DIPR RO NO. 655/LA/PP-Advt/Agency/2024-25

మస్తాన్‌సాయి కేసులో లీకులే లీకులు

- హార్డ్ డిస్క్ పోలీసుల వద్ద ఉన్నా వీడియో, ఆడియోలు వైరల్
- మీడియాలో అనుకూల, ప్రతికూల వాదనల హోరు
- లావణ్య కూడా నిందితురాలేనని ఆర్జే శేఖర్‌బాషా వాదన




మణికొండ: మస్తాన్‌సాయి నగ్న వీడియోల కేసు రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనంగా మారింది. మస్తాన్‌సాయితో పాటు ఆర్‌జే శేఖర్‌బాషాపైనా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మస్తాన్‌సాయి చిత్రీకరించిన నగ్న వీడియోలు ఉన్న హార్డ్ డిస్క్‌ను లావణ్య పోలీసులకు అందించినా, అందులోని ఆడియో, వీడియోలు రికార్డులు మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ అంశంపై ఆర్‌జే శేఖర్‌బాషా, లక్ష్మీ పడాల అనే మహిళ మీడియాలో ప్రధానంగా వాదనలు చేస్తున్నారు. పోలీసులు హార్డ్ డిస్క్‌ను ఫోరెన్సిక్ పరిశీలనకు పంపారు. అది రాకముందే అందులోని వీడియోలపై ప్రచారం జోరుగా సాగుతోంది. ఆర్‌జే శేఖర్‌బాషా, మస్తాన్‌సాయిలు లావణ్య ఇంట్లో డ్రగ్స్ పెట్టి పోలీసులకు పట్టించాలని వేసిన పథకానికి సంబంధించిన ఆడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఓ పోలీసు అధికారి, ఒక మీడియా ప్రతినిధితో లావణ్య మాట్లాడిన హనీట్రాప్ రికార్డులు కూడా వైరల్‌గా మారాయి. శేఖర్‌బాషా మీడియాతో మాట్లాడుతూ.. లావణ్యకు ఇప్పటివరకు డ్రగ్స్ టెస్ట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించాడు. ఆమె ఫిర్యాదు చేయగానే పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఆమెకు ఒక పోలీస్ అధికారి సహకరిస్తున్నారని వాదించాడు. లావణ్య పలుమార్లు డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి 40 రోజులు జైలులో ఉందని, ఆమె అమాయకురాలా? అని ప్రశ్నిస్తున్నాడు. లక్ష్మీ పడాల అనే మహిళ తనను చంపేందుకు కుట్ర చేసిందని ఆరోపించాడు. తన వ్యక్తిగత కాల్ రికార్డింగులను సోషల్ మీడియాలో వైరల్ చేసి పరువు తీశాడని సహాయ కొరియోగ్రాఫర్ శ్రేష్టివర్మ చేసిన ఫిర్యాదుపై స్పందించిన శేఖర్‌బాషా.. తన వద్ద ఉన్న సమాచారాన్ని మాత్రమే షేర్ చేశానని తెలిపాడు. ఇదిలా ఉండగా మస్తాన్‌సాయి కస్టడీకి నార్సింగి పోలీసులు వేసిన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

దీపాదాస్ మున్షీ పరువునష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు(హైదరాబాద్): బీజేపీ నేత, మాజీఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ వాయిదా పడింది. శుక్రవారం నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ గైర్హాజరు కాగా, ప్రతివాది ప్రభాకర్ కూడా గైర్హాజరయ్యారు. దీపాదాస్ మున్షీ తరఫున న్యాయవాది థామస్‌లాయిడ్, ప్రభాకర్ తరపు న్యాయవాది వేణుగోపాల్ హాజర్రై పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణను మే 23కు వాయిదా వేసింది. కాంగ్రెస్ నేతల నుంచి బెంజ్ కారు లబ్ధి పొందినట్టు ప్రభాకర్ తనపై అసత్యపు ఆరోపణలు చేశారని దీపాదాస్ మున్షీ నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో దీపాదాస్‌మున్షీ స్టేట్‌మెంట్ ఇవ్వగా కోర్టు రికార్డు చేసింది. వచ్చే విచారణలోపు పోలీసులు సాక్ష్యం దాఖలు చేయాలని కోర్టు ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

సుస్థిర ఆరోగ్య సంరక్షణ పద్ధతుల్లో భారత్ నాయకత్వం వహించాలి

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారతదేశం సుస్థిరమైన ఆరోగ్య సంరక్షణ పద్ధతుల్లో నాయకత్వం వహించాలని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏఐజీ హాస్పిటల్స్ నిర్వహించిన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ (జీఐఈ) విధానాలు, పర్యా వరణ ప్రభావంపై ఒక మార్గదర్శక అధ్యయనం ప్రతిష్టాత్మక జర్నల్ గట్‌లో ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కార్యకలాపాలు పర్యావరణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయన్నారు. దేశంలో పెరుగుతున్న జనాభాతో పాటు ఆరోగ్య సంరక్షణ అవసరాలు పెరుగుతున్నాయని నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ అధ్యయనం ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ ప్రభావం గురించి మాట్లాడాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందన్నారు. ఆస్పత్రుల కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించడం, అధిక నాణ్యత, సంరక్షణను అందించడం కొనసాగిస్తూనే పర్యావరణ ఉద్గారాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు.

కాజీపేటలో రూ.521కోట్లతో రైల్వే యూనిట్

సాక్షి, న్యూఢిల్లీ: కాజీపేటలో వివిధరకాల ఆధునిక రోలింగ్ స్టాక్‌ల తయారీ, నిర్వహణ సామర్థ్యం కలిగి ఉన్న రైల్వే తయారీ యూనిట్‌ను రూ. 521.36 కోట్లతో ప్రారంభించేందుకు రైల్వే శాఖ ప్రణాళిక సిద్ధం చేసుకుందని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కాగా గత ఏడాది డిసెంబర్ వరకు ఈ పనిపై ఇప్పటికే రూ. 251.09 కోట్లు విడుదలయ్యాయని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి శుక్రవారం రాజ్యసభలో బదులిచ్చారు.

తెలంగాణలో 30.77 లక్షల మందికి పీఎం కిసాన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 30.77 లక్షల మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నట్టు కేంద్ర రైతు సంక్షేమ శాఖ తెలిపింది. రాజ్యసభలో ఆ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఆ వివరాలు వెల్లడించారు. పీఎం కిసాన్ 2019లో ప్రారంభం కాగా, రూ.6 వేల ఆర్థిక సాయం మూడు వాయిదాల్లో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా...

బతికున్నప్పుడు దరఖాస్తు.. చనిపోయాక పెన్షన్

- 191 మందికి పెన్షన్ మంజూరు..
- వారిలో 32 మంది చనిపోయినట్లు గుర్తింపు
- 2022లో దరఖాస్తు చేయగా.. ఇప్పుడు మంజూరు

కాప్రా: బతికున్నంత కాలం కాసింత 'ఆసరా' కోసం తపించారు. తీరా ఆ ఆశ తీరకుండానే చనిపోయాక వారికి పెన్షన్లు మంజూరయ్యాయి. దీంతో నివ్వెరపోవడం బాధిత కుటుంబాల వంతైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాప్రా సర్కిల్‌లో 2022లో పెన్షన్ కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 191 మందికి పెన్షన్ మంజూరైనట్లు తాజాగా సర్కిల్ అధికారులకు జాబితా చేరింది. కాగా ఈ జాబితాలో 32 మంది మృతుల పేర్లు కూడా ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. బతికున్నప్పుడు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. చనిపోయాక వారి పేరున మంజూరైంది. 191 మందితో జాబితా సర్కిల్ కార్యాలయానికి చేరడంతో సంబంధిత అధికారులు వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. 'మీకు పెన్షన్ వస్తుంది.. బ్యాంక్ ఖాతా తనిఖీ చేసుకోండి' అని లబ్ధిదారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. కాగా, వారిలో కొందరు చనిపోయినట్లు వారి కుటుంబసభ్యులు చెప్పారని అధికార వర్గాలు వెల్లడించాయి.

మనమిద్దరమే..

- ఒక విద్యార్థి.. ఇంకో ఉపాధ్యాయుడు..



పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు శంకర్

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి ఎస్సీకాలనీ–భగత్‌సింగ్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి, ఇంకో ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి చరణ్‌తేజ్ రోజూ బడికి వస్తున్నాడు. ఉపాధ్యాయుడు శంకర్ ఆ బాలునికి బోధిస్తున్నారు. గతేడాది పాఠశాలలో 8 మంది విద్యార్థులు ఉండేవారు. వారు వివిధ పాఠశాలలకు వెళ్లిపోవడంతో.. చరణ్‌తేజ్ ఒక్కడే మిగిలాడు. ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో బడిబాట నిర్వహిస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా విద్యార్థులు చేరడం లేదని ఉపాధ్యాయునితోపాటు గ్రామస్తులూ చెబుతున్నారు.

నేషనల్ స్పేస్ సొసైటీ పోటీల్లో నారాయణ సత్తా

సాక్షి, హైదరాబాద్: నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లివ్ ఇన్ ఏ హెల్త్ స్పేస్ డిజైన్ కాంటెస్ట్ 2024లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. వరల్డ్ నంబర్ 1 స్థానంలో 4 సెలక్షన్స్‌ను నారాయణ విద్యార్థులు దక్కించుకున్నారు. వరల్డ్ నంబర్ 2 స్థానంలో 13, వరల్డ్ నంబర్ 3 స్థానంలో 9 సెలక్షన్లతో పాటు 32 బహుమతులను తమ విద్యార్థులు వసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణ వెల్లడించారు. 58 ప్రాజెక్టుల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు తెలిపారు. నారాయణకు చెందిన 276 మంది విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. మొత్తం విజేతల్లో నారాయణ విద్యార్థుల శాతం అంతర్జాతీయ స్థాయిలో 47.2 శాతం ఉండగా, జాతీయస్థాయిలో 65.9 శాతం ఉందన్నారు.

కేయూలో విద్యార్థుల ఘర్షణ

- కామన్‌మెస్‌లో ఒకసారి, హాస్టల్ వద్ద మరోసారి



కామన్‌మెస్‌లో కొట్టుకుంటున్న జూనియర్, సీనియర్ విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామన్‌మెస్‌లో ఒకసారి, మరోసారి హాస్టల్‌లో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం దాడి చేసుకున్నారు. ఇద్దరు జూనియర్లకు గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మొత్తం 17మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం మధ్యాహ్నం కామన్ మెస్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ సీనియర్, జూనియర్ విద్యార్థులు భోజనం చేస్తుండగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగింది. ప్లేట్లు, వంటసామగ్రి కిందపడేశారు. ఆ తరువాత ఒకరినొకరు తోసుకుంటూ ఘర్షణకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఇద్దరు జూనియర్లకు దెబ్బలు తాకటంతో వారిని క్యాంపస్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. సాయంత్రం వారిద్దరు హాస్టల్ ప్రాంతానికి రాగా, ఆ తర్వాత జూనియర్లకు, సీనియర్లకు మధ్య మళ్లీ ఘర్షణ జరిగింది. సీఐ రవికుమార్, ఎస్సై మాధవ్ ఇతర పోలీస్‌సిబ్బంది ఇరువర్గాలకు చెందిన విద్యార్థులను అదుపులోకి తీసుకుని కేయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 8 మంది సీనియర్, 10 మంది జూనియర్ విద్యార్థులు, నలుగురు ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పూర్వగిరిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీనృసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజ, స్వస్తివచనం, రక్షాబంధనం, పుణ్యాహవచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రధానాలయం, ఉప ఆలయాలు, తిరువీధిలోని కల్యాణ మండపం వద్ద సంప్రోక్షణ నిర్వహించారు. రాత్రి అంకురార్పణ, మృత్సంగ్రహం వేడుకను జరిపారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో ఘనంగా మహాకుంభాభిషేకం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మహాకుంభాభిషేక సంప్రోక్షణ పూజలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు శుక్రవారం తెల్లవారుజామున త్రివేణి సంగమ గోదావరికి వెళ్లి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి జలాలను ఐదు కలశాలతో కాళేశ్వరం దేవస్థానానికి తీసుకువచ్చారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు వేద స్వస్తి వాచకాలు, గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం వరకు వివిధ పూజలు, పారాయణాలు నిర్వహించారు.

అంతే లేని అధికారుల అవినీతి

- ఏసీబీ దాడులకు వెరవని వైనం
- ఆదాయానికి మించిన ఆస్తులు... ఏటా పెరుగుతున్న కేసులు
- పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, రిజిస్ట్రేషన్ శాఖల్లో విచ్చలవిడిగా అవినీతి
- తెలంగాణలో జనవరి 1 నుంచి ఇప్పటివరకు ఏసీబీకి చిక్కిన 20 మంది అధికారులు
- తాజాగా హనుమకొండ డీటీసీ శ్రీనివాస్ ఇళ్లల్లో సోదాలు

- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సీఐగా పనిచేసిన కర్రి జగదీష్ రేషన్ బియ్యం లారీని విడిచిపెట్టినందుకు రూ.4 లక్షల డిమాండ్ చేసి, రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు జనవరి 6న పట్టుకున్నారు.
- జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ ఆసీఫుద్దీన్ ఓ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కోసం రూ.10 వేలు డిమాండ్ చేసి రూ.5 వేలు లంచంగా తీసుకుంటూ జనవరి 15న ఏసీబీకి చిక్కారు.
- జనవరి 26 హైదరాబాద్ సిటీ–1 పరిధిలో షాయినాయత్ గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలుచౌహాన్‌ను ఒక మిస్సింగ్ కేసుకు సంబంధించి రూ.1.50 లక్షలు డిమాండ్ చేసి, రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.



హనుమకొండలో డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

- ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ తహసీల్దార్ తిరుపతి, గ్రామ కార్యదర్శి శేఖర్‌లు ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

సాక్షిప్రతినిధి, వరంగల్: అవినీతిపరులు, అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొరడా ఝుళిపిస్తున్నా.. కొందరు అధికారుల తీరు మారడం లేదు. కొంతకాలంగా అక్రమాస్తులు కూడబెట్టుకున్న వారిపై ఏసీబీ దూకుడు పెంచింది. మరోవైపు అవినీతి ఊపిరిగా పనిచేసే అధికారులు కొందరు రూటు మార్చి అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు.

అక్రమాస్తుల ఫిర్యాదుతో.....

రవాణాశాఖ హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం నుంచి ఏసీబీ దాడులు చేసింది. హనుమకొండలోని ఆయన అద్దె ఇంటితోపాటు, జగిత్యాల, హైదరాబాద్‌లోని వారి బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో ఎనిమిది చోట్ల సోదాలు జరిగాయి.పుప్పాల శ్రీనివాస్ తండ్రి పుప్పాల రాంచందర్ రిటైర్డ్ హెచ్‌ఎం కాగా, జగిత్యాలలోని ఆయన ఇంట్లో అక్రమాస్తుల వివరాలు ఏమీ దొరకలేదంటున్నారు. రాత్రి వరకు కూడా ఏసీబీ అధికారులు డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌కు సంబంధించిన అక్రమాస్తుల వివరాలు అధికారికంగా వెల్లడించలేదు.

ఏసీబీ దూకుడు.. అక్రమార్కుల్లో దడ

2023, 2024 సంవత్సరాలతో పాటు ఈ ఏడాది ఇప్పటి వరకు ఏసీబీకి చిక్కిన వారి వివరాలు పరిశీలిస్తే.. పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారు.

- ఏసీబీ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2024లో ఏసీబీ మొత్తం 152 కేసులు నమోదు చేసి, 223 మంది నిందితులను అరెస్టు చేసింది. వీటిలో 129 ట్రాప్ కేసులు.. 200 మంది నిందితులను అరెస్టు చేయగా వారిలో 159 ప్రభుత్వ ఉద్యోగులు.
- 129 ట్రాప్ కేసుల్లో ఏసీబీ మొత్తం రూ.85 లక్షల పైగా నగదును స్వాధీనం చేసుకొని, అందులో రూ.65.80 లక్షలు ఫిర్యాదుదారులకు తిరిగి చెల్లించినట్టు పేర్కొంది.
- అక్రమార్జనే లక్ష్యంగా పనిచేసి విచ్చలవిడిగా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టుకున్న 12 కేసుల్లో రూ.101 కోట్ల విలువైన అక్రమాస్తులను నిందితుల నుంచి ఏసీబీ అటాచ్ చేసింది.
- ఈ ఏడాది జనవరి 1 నుంచి శుక్రవారం నాటికి 20 కేసులు నమోదు చేసింది.

ఫిబ్రవరిలోనే భగభగలు

- వేగంగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 3 – 4.5 డిగ్రీలు అధికంగా నమోదు
- చలిగాలులు తగ్గటం, పొడి వాతావరణమే కారణం



శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.3	14.2
భద్రాచలం	35.6	22.2
దుండిగల్	32.5	19.1
హకీంపేట్	32.6	18.8
హనుమకొండ	32.5	18.0
హైదరాబాద్	32.7	19.6
ఖమ్మం	35.6	21.0
మహబూబ్‌నగర్	35.2	21.0
మెదక్	36.0	17.2
నల్లగొండ	33.0	19.2
నిజామాబాద్	35.2	20.1
రామగుండం	34.4	18.4

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి ప్రారంభంలోనే మధ్యాహ్న సమయం వేసవి కాలాన్ని తలపిస్తోంది. గతవారం వరకు పగటి ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగి సాయంత్రానికి కాస్త చల్లబడగా.. ఇప్పుడు పగలూ, రాత్రి కూడా వేడెక్కి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని చాలాచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4.6 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి. పొడి వాతావరణానికి తోడు చలిగాలుల తీవ్రత కూడా తగ్గడంతో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. మరో మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదవుతాయని తెలిపారు. శుక్రవారం అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత మెదక్‌లో 36 డిగ్రీ సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 14.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి. మెదక్, భద్రాచలం, ఖమ్మంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు అధికంగా ఉన్నాయి. మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో 3 డిగ్రీల సెల్సియస్ చొప్పున అధికంగా నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం చాలాచోట్ల 1 నుంచి 2 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

గిరిజన గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

- స్నాక్స్‌గా బొబ్బర్లు, రాత్రి సాంబార్‌తో భోజనం
- వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చేరిక

గూడూరు: గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచలోని గురుకులంలో చోటుచేసుకుంది. వీరిలో నలుగురిని సీహెచ్‌సీకి తరలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులు సాయిప్రసాద్, అనిల్, రాహుల్, యాకూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం స్నాక్స్ సమయంలో బొబ్బర్ల గుడాలు తిన్నారు. రాత్రి సాంబార్‌తో భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాంతులు, విరోచనాలయ్యాయి. వెంటనే ఓ టీచర్‌కు చెప్పడంతో గురుకులానికి చెందిన ఏఎన్‌ఎం ద్వారా విరోచనాలు తక్కువయ్యే ట్యాబ్లెట్స్ వేయించారు. రెండు గంటల్లో 20 మందికి విరేచనాలు అయ్యాయి. వారిలో నలుగురికి తీవ్రంగా కావడంతో తెల్లవారుజామున 6 గంటలకు ముందుగా ఇద్దరిని ఓ టీచర్ బైక్‌పై గూడూరులోని సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఆ తర్వాత మరో ఇద్దరు విద్యార్థులను తీసుకెళ్లారు. మిగతా వారికి గురుకులంలోనే ఏఎన్‌ఎం చికిత్స అందించారు. బొబ్బర్లు పాడైనా, అందులో కారం ఎక్కువైనా విరోచనాలు అవుతాయని, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఒక డాక్టర్‌గా పరీక్షించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బీఆర్‌ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ సీహెచ్‌సీలో విద్యార్థులను పరామర్శించారు. అధికారుల పర్యవేక్షణలోపం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

గురుకుల విషాహార ఘటన నిర్లక్ష్యానికి పరాకాష్ట

- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో జరుగుతున్న విషాహార ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఏడాది కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యాసంస్థల్లో వందలాది విషాహార ఘటనలు చోటు చేసుకున్నాయి. వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే రీతిలో గురుకులాల పనితీరు ఉంది. సీఎం మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనం. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

బడికి చీరల ప్రహరీ తొలగింపు

- నిధుల మంజూరుకు ప్రతిపాదనలు



సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్ రూరల్: ప్రభుత్వ 'బడికి చీరల ప్రహరీ'శుక్రవారం సాక్షి మెయిన్ మొదటి పేజీలో ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారని ఎంఈవో మనీల తెలిపారు. బడి ప్రహరీకి బదులుగా కట్టిన చీరలను తొలగించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. రోడ్డు పనులు పూర్తయిన వెంటనే ప్రహరీని నిర్మిస్తామన్నారు.

స్వల్ప ఉద్రిక్తతల నడుమ భూసర్వే పూర్తి

- ప్లకార్డులు పట్టుకొని మహిళా రైతుల నిరసన
- భారీగా మోహరించిన పోలీసులు

దుద్యాల్: లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో నిర్వహించిన భూ సర్వే స్వల్ప ఉద్రిక్త పరిస్థితుల మధ్య పూర్తయ్యింది. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటులో భాగంగా శుక్రవారం మూడు గ్రామాల పరిధిలోని 110.32 ఎకరాల అసైన్డ్ భూములకు సర్వే పూర్తయినట్టు తహసీల్దార్ కిషన్ తెలిపారు. లగచర్లలో 43 మంది రైతులకు చెందిన 47.25 ఎకరాల భూమి, రోటిబండతండాలోని సర్వే నంబరు 102లో 30 మంది రైతులకు చెందిన 22 ఎకరాల భూమి, పులిచర్లకుంటతండా సర్వే నంబర్లు 117, 120, 121లోని 20 మంది రైతులకు చెందిన 40.15 ఎకరాల భూములకు సర్వే చేసి హద్దులను గుర్తించారు.

నిరసన తెలిపిన గిరిజనులు

మాకున్న కొద్దిపాటి భూములు మీకిస్తే మా పరిస్థితి ఏంటని రోటిబండతండా వాసులు నిరసన తెలిపారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ మా భూములు ఇవ్వమంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. సర్వే ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కల్పించుకోవడంతో పరిస్థితి చక్కబడింది. అంగీకార పత్రాలు అందజేసిన రైతుల భూములను మాత్రమే సర్వే చేస్తున్నామని అధికారులు చెప్పడంతో మహిళలు శాంతించారు.

బృందాలుగా ఏర్పడి..

మూడు గ్రామాల్లో ఇటు రెవెన్యూ అధికారులు, అటు పోలీసులు బృందాలుగా ఏర్పడి పక్కా ప్రణాళికతో సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ఒక్కో రెవెన్యూ బృందం వెనుక ఒక్కో పోలీసు బృందం ఉండడంతో సర్వేకు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. లగచర్లలో భూ సర్వే ప్రక్రియ సజావుగా సాగడానికి భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. గత సంఘటన నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు మోహరించారు. మరిన్ని ప్రత్యేక బలగాలు కూడా గ్రామానికి చేరుకున్నాయి. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



లగచర్లలో మోహరించిన పోలీసు బలగాలు

ప్రయాణం ఫ్రీనే.. బస్సే లేదు

- కరీంనగర్–కామారెడ్డి మార్గంలో ప్రజల అవస్థలు
- పెద్దమ్మ స్టేజీ వద్ద రెండున్నర గంటల పడిగాపులు
- 98 కిలోమీటర్ల మార్గంలో అరకొరగా ఆర్టీసీ బస్సులు




గంభీరావుపేట మండలం పెద్దమ్మస్టేజీ వద్ద కామారెడ్డి బస్సు కోసం మహిళల నిరీక్షణ

సిరిసిల్ల: అది రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతం.. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట శివారులోని పెద్దమ్మ స్టేజీ.. అక్కడి నుంచి ఎటు చూసినా రెండు కిలోమీటర్ల మేర అడవి తప్ప ఒక్క ఊరు ఉండదు. కనీసం తాగేందుకు మంచినీరు కూడా దొరకదు. అలాంటి ప్రాంతంలో రెండు రోజుల క్రితం పాతిక మంది ప్రయాణికులు... అందులోనూ మహిళలు బస్సు కోసం గంటలకొద్దీ వేచి ఉన్నారు. వీరంతా దమ్మన్నపేట, నాగంపేట, ముచ్చర్ల, సమీపంలోని గిరిజన తండాలకు చెందిన వారు. పెద్దమ్మ స్టేజీ నుంచి కామారెడ్డికి వెళ్లేందుకు మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చారు. మూడున్నర గంటల వరకూ ఒక్క బస్సు కూడా రాకపోవడంతో ఎండలో గొంతులెండి అలమటించారు. ఒక్క బస్సు కూడా రాకపోవటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. కొందరైతే ప్రయాణం మానుకుని వెనుదిరిగారు. ఉచిత ప్రయాణం అనుకుంటే ఉన్న బస్సులు కూడా రావటంలేదని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

ఇది ఆర్డీనరీ బస్సుల బాట: కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారి నిడివి 98 కిలోమీటర్లు. ఆర్డినరీ బస్సులు తప్ప ఒక్క ఎక్స్‌ప్రెస్ కూడా ఈ మార్గంలో లేవు. ఈ మార్గంలో సిరిసిల్ల జిల్లా కేంద్రం, వేములవాడ పుణ్యక్షేత్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, మాచారెడ్డి, గంభీరావుపేట మండలాలు, అనేక గ్రామాలున్నాయి. అయినా ఆర్టీసీ అధికారులు అరకొరగా ఆర్డినరీ బస్సులతో నెట్టుకొస్తుండటంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

ఆ రూట్ మా పరిధిలో లేదు



ఆ రూట్ మా పరిధిలో లేదు. కామారెడ్డి–కరీంనగర్ రూట్‌ను కరీంనగర్–1, కామారెడ్డి డిపోలు పర్యవేక్షిస్తాయి. బస్సులు రాకపోవడం, లేకపోవడంపై నాకు సమాచారం లేదు. ఆ రెండు డిపోల అధికారులను సంప్రదిస్తే కారణాలు తెలుస్తాయి.

– ప్రకాశ్‌రావు, సిరిసిల్ల డిపో మేనేజర్.

బుద్ధవనంలో ఘనంగా త్రిపీటక పఠనోత్సవం

- దక్షిణాసియాలోనే తెలంగాణలో తొలిసారి: స్మితా సబర్వాల్



మహాస్తూపం అంతర్భాగంలోని అష్టబుద్ధుల వద్ద ప్రార్థనలు

నాగార్జునసాగర్: అంతర్జాతీయ బౌద్ధ కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం బౌద్ధసన్యాసుల ప్రార్థనలతో (చాంటింగ్) మార్మోగింది. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో త్రిపీటక పఠనోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పలు దేశాల నుంచి బౌద్ధులు సాగర్‌కు వచ్చారు. మహాబోధి బుద్ధవిహార్ సికింద్రాబాద్, త్రిపీటక సంగాయన మండలి (లైఫ్ ఆఫ్ బుద్ధదమ్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్), తెలంగాణ పర్యాటకశాఖ సంయుక్తంగా త్రిపీటక పఠనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా బుద్ధవనం ప్రవేశద్వారం వద్దకు చేరుకున్న బౌద్ధ భిక్షులకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తెలంగాణ సంప్రదాయ ఒగ్గు కళాకారుల నృత్యాలతో, బుద్ధుని బొమ్మలతో, పూలమాలలతో అలంకరించిన పల్లకీలో ధర్మయాత్ర సాగింది. శ్రీలంక, మయన్మార్, కంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి వచ్చిన బౌద్ధభిక్షువులు స్తూపవనంలో నిర్మించిన బౌద్ధ స్మారక స్తూపాన్ని ఆవిష్కరించి ప్రార్థనలు చేశారు. అనంతరం మహాస్తూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్ద ఆనందభంతే ఆధ్వర్యంలో పఠనోత్సవం ప్రారంభమైంది. బుద్ధవనం రూపశిల్పి చెన్నూరు ఆంజనేయరెడ్డి బుద్ధవనం నిర్మాణ నేపథ్యాన్ని, విశిష్టతలను వివరించారు. దక్షిణాసియాలోనే తొలిసారి తెలంగాణలోని బుద్ధవనంలో త్రిపీటక పఠనోత్సవం జరుగుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ అన్నారు. పఠనోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మొదటగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో అధికారులు సుధన్‌రెడ్డి, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమీన్‌పూర్‌లో సమగ్ర సర్వే

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో లే అవుట్ల కబ్జాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరలోనే సాంకేతిక సర్వే చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. -10లో



ఆర్టిస్టిక్.. ఫ్రేమ్..ఫ్రేమ్..

నగర రహదారుల్లోని గోడలు, అండర్ పాస్ వంతెనలు, ఫ్లై ఓవర్లు అద్భుతమైన చిత్రాలకు వేదికగా నిలుస్తున్నాయి. ప్రయాణికులను ఈ చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/20.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు వాతావరణం ఉండనుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

తనను అందరిలా పెంచలేదని తాతను చంపిన మనవడు

పంజగుట్ట: చిన్నప్పటి నుంచి తనను అందరిలా పెంచలేదని.. అందరిని చూసినట్లు తనను చూడలేదని తాతను కత్తితో పొడిచి చంపేశాడు ఓ మనవడు. అడ్డుకోబోయిన కన్నతల్లిని గాయపరిచాడు. ఈ దారుణ ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎస్ మక్తాలో నివాసం ఉండే వి.చంద్రశేఖర జనార్దన్ రావు (86) వ్యాపారవేత్త. ఇతను వెల్జాన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీ చైర్మన్. ఆయనకు సరోజ అనే కూతురు. ఆమె భర్త బెంగళూరులో ఉండగా.. సరోజ తండ్రి జనార్దన్ రావుతో కలిసి బీఎస్ మక్తాలో ఉంటోంది. సరోజ కొడుకు కిలారు కార్తి తేజ (29) అమెరికాలో మాస్టర్స్ పూర్తి చేసి నగరానికి తిరిగి వచ్చాడు. తాత ఆస్తి కోసం నిత్యం గొడవ పడేవాడు. అందరినీ చూసినట్లు తనను చూడడంలేదని.. అందరిలా తనను పెంచలేదంటుండేవాడు. ఈ విషయంలో తాతతో విభేదించి కార్తితేజ ల్యాంకోహిల్స్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి బీఎస్ మక్తాకు వచ్చి ఆర్థిక లావాదేవీల గురించి తల్లి, తాతతో గొడవకు దిగాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో తాత జనార్దన్ రావు కడుపులో పొడిచాడు. అడ్డుకున్న తల్లి సరోజను గాయపరిచాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంతలోపే కార్తి తేజ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి అప్పటికే జనార్దన్ రావు మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయాలపాలైన సరోజను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు కార్తి తేజ కోసం గాలిస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి



లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీను

పంజగుట్ట: కుల ధ్రువీకరణకు సంబంధించిన ఫైల్ ముందుకు కదిలేందుకు రూ.లక్ష లంచం తీసుకుంటున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో గొల్ల శ్రీను అనే వ్యక్తి ఔట్ సోర్సింగ్ ఏఓగా పని చేస్తున్నాడు. రూ.లక్ష ఇస్తేనే కుల ధ్రువీకరణ ఫైల్ ముందుకు కదులుతుందని నగరానికి చెందిన ఓ వ్యక్తిని లంచం అడిగాడు. శుక్రవారం ఉదయం కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా పక్కా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వీఐపీల కార్ల బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పలువురి కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. వారం రోజుల క్రితమే కారు బ్లాక్ ఫిల్మ్, సైరన్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. ఎవరైనా తమ కార్లకు బ్లాక్ ఫిల్మ్, సైరన్ ఉంటే తొలగించుకోవాలని సూచించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు కౌశిక్ రెడ్డి కారుకు 28 చలానాలు పెండింగ్‌లో ఉండగా రూ.26 వేల బకాయిలు కట్టించి బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించినట్లు.. అలాగే చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కారుకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తీసివేయించినట్లు పేర్కొన్నారు.

ఓయూలో ఉద్రిక్తత

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరీక్షలు వాయిదా వేయాలని పీజీ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఆందోళన అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల సిలబస్ పూర్తి కానందున ఈ నెల 18 నుంచి జరగాల్సిన 1, 3 సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలంటూ మూడు రోజులుగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్ధరాత్రి వరకు పాలన భవనం ఎదుట సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఆందోళన చేపట్టారు. పరీక్షలు వాయిదా వేయాలని.. వీసీ ప్రొ.కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో విద్యార్థుల ఆందోళన



ఇక్కడ ఇలా.. అక్కడ అలా..
చెత్త ఎలా?

జవహర్‌నగర్‌లో పేరుకుపోయిన డంపింగ్ గుట్టలు

- ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుకు వ్యతిరేకతలు
- ప్యారానగర్‌లో కొనసాగుతున్న ఆందోళనలు

సాక్షి, సిటీబ్యూరో: విస్తరిస్తున్న నగరంతో పాటే చెత్త సమస్యలూ పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ నుంచి గతంలో రోజుకు 3,500 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడగా.. ప్రస్తుతం 7,500 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. దీని నిర్వహణ కోసం జవహర్‌నగర్ డంప్ యార్డుకు తరలిస్తున్నారు. ఏళ్ల తరబడి పేరుకు పోయిన చెత్తతో ఎంతో కాలంగా అక్కడి పరిసర గ్రామాల ప్రజలు తల్లడిల్లుతున్నారు. చెరువుల కాలుష్యం తగ్గించేందుకు లీచెట్ ట్రీట్‌మెంట్ వంటి పనులు జరుగుతున్నా తమ ఆరోగ్యానికి ముప్పేనని అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని చెత్త మొత్తం ఒకేచోట పోగు పడకుండా ఉండేందుకు నగరానికి నాలుగు వైపులా డంపింగ్ యార్డులు, చెత్త నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వాలు ఎప్పటి నుంచో ప్రకటిస్తున్నాయి. దశాబ్దం క్రితం నుంచే ఆ దిశగా చర్యలు ప్రారంభమైనా, స్థానిక ప్రజల నుంచి వ్యతిరేకత, నిరసనలతో అవి ముందుకుసాగడం లేదు. తాజాగా సంగారెడ్డి జిల్లా పరిధిలోకొచ్చే నగర శివార్లలోని ప్యారానగర్‌లో ఏర్పాటు కానున్న చెత్త నిర్వహణ కేంద్రానికీ అదే పరిస్థితి ఎదురవుతోంది. పనులకు సాగనీయకుండా గత నాలుగు రోజులుగా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి.

బతుకులు బలి చేస్తారా?

అక్కడ అత్యాధునిక సాంకేతికతతో యూరోపియన్ దేశాల్లోని చెత్త నిర్వహణ పద్ధతుల్ని పాటిస్తామని, దాని వల్ల పరిసరాల్లో ఎలాంటి కాలుష్యం వ్యాపించదని చెబుతున్న జీహెచ్ఎంసీ అధికారుల మాటల్ని ప్రజలు విశ్వసించడం లేదు. నగరంలోని చెత్తతో తమ బతుకులు బలి చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏం కానుందన్నది ముందు ముందు తేలనుంది.

అక్కడ ఏర్పాటు కానున్న చెత్త నిర్వహణ కేంద్రం గురించి జీహెచ్ఎంసీ అధికారులేమంటున్నారంటే..

- అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఫెసిలిటీతో ఏర్పాటు కానున్న ప్లాంట్‌లో అడ్వాన్స్‌డ్ డ్రై అనరోబిక్ బయోమిథనేషన్ టెక్నాలజీ (డీఏబీటీ)తో తడిచెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది. కంపోస్టు ఎరువు తయారవుతుంది.
- ఆర్‌డీఎఫ్(రెఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయెల్) ప్రాసెసింగ్‌తో పొడిచెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.
- జవహర్‌నగర్‌లో పుష్కరకాలంగా పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన, కాలుష్యం వంటి సమస్యలుండగా, ప్యారానగర్ ప్లాంట్‌లో అలాంటి సమస్యలుండవు.
- చెత్త అనేది అసలు నిల్వ లేకుండానే ఎప్పటికప్పుడు ప్రాసెస్ అవుతుంది. చెత్త బహిరంగంగా కనిపించదు.
- డీఏబీటీతో వెలువడే బయోగ్యాస్‌ను ఇంధనంగా లేదా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించవచ్చు. ఆర్‌డీఎఫ్‌ను విద్యుత్ తయారీకి ఉపయోగిస్తారు.
- ఈ ప్లాంట్‌లో పనులన్నీ భూమిలోపల బంకర్లలో, మూసివేసిన షెడ్లలో జరుగుతాయి. చెత్త రవాణా సైతం ఆయిల్ ట్యాంకర్ల మాదిరిగా పూర్తిగా మూసి ఉండే వాహనాల ద్వారా జరుగుతుంది. గాలిని కూడా బయో ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేయడం వల్ల ఎలాంటి దుర్వాసనలు రావు.
- డ్రై డైజెషన్ టెక్నాలజీ వల్ల లీచెట్ (విష జలాల) సమస్య ఉండదు. చెత్త నిర్వహణలో పర్యావరణపరంగా మేలైనది. అక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్ స్థానిక అవసరాలకు సరిపోతుంది.
- రోజుకు 2 వేల మెట్రిక్ టన్నుల చెత్తతో 15 మెగావాట్ల విద్యుత్, 270 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది.

జీహెచ్ఎంసీలో ఒక వ్యక్తి నుంచి రోజుకు వెలువడుతున్న చెత్త

2019లో 500 గ్రాములు
2024లో 733 గ్రాములు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలుతున్న చెత్త

2014లో 3,500 మెట్రిక్ టన్నులు
2024లో 7,500 మెట్రిక్ టన్నులు

- పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ చెత్త 9వేల మెట్రిక్ టన్నులకు పెరుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. నగరానికి నాలుగువైపులా డంపింగ్ కేంద్రాలు, చెత్త నిర్వహణ కేంద్రాల ఏర్పాటుతో జవహర్‌నగర్‌పై భారం తగ్గుతుంది.

చెత్తను మోయలేని జవహర్‌నగర్

నగరం నుంచి ప్రస్తుతం వెలువడుతున్న దాదాపు 7,500 మెట్రిక్ టన్నుల చెత్తతో పాటు శివార్లలోని మున్సిపాలిటీల చెత్త అక్కడికే వెళ్తోంది. జవహర్‌నగర్‌పై పడుతున్న ఈ భారాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా నలువైపులా చెత్త నిర్వహణ ఏర్పాటు కేంద్రాలకు ఎప్పటినుంచో ఆలోచనలున్నాయి.



ప్యారానగర్‌లో ఏర్పాటు కానున్న ప్లాంట్ నమూనా చిత్రం

మహా కుదుపు!

గొర్రె తోక బెత్తెడు చందంగా హెచ్ఎండీఏ ఆదాయం

- ఔటర్ వరకు జీహెచ్ఎంసీలో విలీనంతో తగ్గనున్న రాబడి
- రియల్ కుదేల్‌తో ఇప్పటికే భారీగా పడిపోయిన ఆదాయ వనరులు
- ప్రస్తుతం నెలకు రూ.100 కోట్లు రావడమూ కనాకష్టమే



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) రెండేళ్ల క్రితం వరకు అప్పటి సర్కారు ఖజానాకు భారీగా ఆదాయాన్ని ఆర్జించిపెట్టిన సంస్థ. నగర అభివృద్ధిలో ఎంతో క్రియాశీలమైన భాగస్వామ్యం కలిగిన ప్రభుత్వ విభాగం. ఔటర్‌రింగ్‌రోడ్డు నిర్మాణం నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే సహా అనేక ఫ్లైఓవర్‌లు, భారీ ప్రాజెక్టులు, ఉప్పల్ భగాయత్ వంటి భారీ లే అవుట్‌లను అభివృద్ధి చేసి రూ.వేల కోట్ల ఆదాయాన్ని గడించింది. అలాంటి హెచ్ఎండీఏ పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి. వందలాది ఎకరాల భూములు ఉన్నా కొనుగోలు చేసేవారే లేకుండాపోయారు. మరోవైపు మహా నగర పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ప్రణాళికలతో హెచ్ఎండీఏ ఆదాయం మరింత పడిపోయే పరిస్థితి. రానున్న రోజుల్లో హెచ్ఎండీఏ కార్యకలాపాల్లో పెద్ద ఎత్తున స్తబ్దత నెలకొంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

నెలకు రూ.100 కోట్ల లోపే..

గతంలో వివిధ రకాల అనుమతులు, ప్రొసీడింగ్స్, ఫీజులు తదితర రూపాల్లో ప్రణాళికా విభాగం నుంచి హెచ్ఎండీఏకు ప్రతి నెలా రూ.150 కోట్ల పైనే ఆదాయం లభించేది. ప్రస్తుతం రూ. వంద కోట్లు కూడా లభించడం లేదు. వివిధ రూపాల్లో వచ్చే ఆదాయం కేవలం అధికారులు, ఉద్యోగుల జీత భత్యాలు, సంస్థ కార్యకలాపాల నిర్వహణ, రవాణా తదితర అవసరాలకే ఖర్చవుతోంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్దత కారణంగా భారీ వెంచర్లు, లే అవుట్‌లు తగ్గుముఖం పట్టాయి. హైరైజ్ భవనాల నిర్మాణాలు కూడా తగ్గాయి. మరోవైపు అనుమతుల్లో జాప్యంతోనూ నిర్మాణ సంస్థలు వెనుకంజ వేస్తున్నాయి.

ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించినా..

ప్రస్తుతం హెచ్ఎండీఏ సుమారు 7,257 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. 7 జిల్లాలు.. 70 మండలాలు, 1032 గ్రామాలు హెచ్ఎండీఏ దీని పరిధిలో ఉన్నాయి. 40 మున్సిపాలిటీలలో హెచ్ఎండీఏ అనుమతులిస్తోంది. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తోంది. ఇందులో భాగంగా అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించనున్నారు. ఈ మేరకు ఓఆర్ఆర్ వరకు ఉన్న మున్సిపాలిటీలు, నగర పంచాయతీలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. దీంతో ఔటర్ వరకు అనుమతులు ఇచ్చేందుకు జీహెచ్ఎంసీకి అవకాశం లభిస్తుంది. సాంకేతికంగా హెచ్ఎండీఏ పరిధి ట్రిపుల్ వరకు విస్తరిస్తుంది. అంటే 14,000 చదరపు కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంది. కానీ.. ఔటర్ లోపల జరిగే నిర్మాణాలు, అభివృద్ధి కార్యకలాపాలతో పెద్ద ఎత్తున ఆదాయం లభిస్తుందని, భవిష్యత్ అవసరాల కోసం ట్రిపుల్ ఆర్ వరకు సెమీ అర్బన్ పరిధిని పెంచినా నిర్మాణరంగం అభివృద్ధికి చాలా ఏళ్లు పట్టవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో ఔటర్ వరకు జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల ఆ సంస్థ ఆదాయం పెరిగి, హెచ్ఎండీఏ రాబడి గణనీయంగా తగ్గనుంది.

అప్పట్లో కల్పవృక్షం..

గత సర్కార్ హయాంలో హెచ్ఎండీఏ కాసులు కురిపించే కల్పవృక్షంగా ఉండేది. వందల ఎకరాల భూములను ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో విక్రయించి రూ.వేల కోట్లు ఆర్జించింది. కోకాపేట్ నియోపోలిస్ భూములపై దాదాపు రూ.3319 కోట్లు లభించగా, బుద్వేల్‌లో వంద ఎకరాలు విక్రయాలతో మరో రూ.3625.73 కోట్లు వచ్చాయి. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇవ్వడం ద్వారా రూ.7,380 కోట్లు సమకూరాయి. ప్రస్తుతం భూములు విక్రయించే అవకాశం లేక.. ఆదాయ మార్గాలు లేక హెచ్ఎండీఏ కుదేలవుతోంది. భవిష్యత్ మరింత ప్రశ్నార్థకంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

కుక్క దొరికిందని ఠాణా మెట్లెక్కారు!

రెండు రోజులు శ్రమించి యజమానికి అప్పగింత

- యువకులను అభినందించిన పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో నివసించే 21 ఏళ్ల సంవీత్.. తన స్నేహితులైన గౌతమ్, దీక్షిత్, తరుణ్, ధనుష్‌లతో కలిసి మంగళవారం రాత్రి కారులో వెళ్తున్న సమయంలో మాదాపూర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదుట సలూకి జాతికి చెందిన పెంపుడు శునకం కనిపించింది. దాని యజమానిని గుర్తించేందుకు వారంతా ప్రయత్నించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో చివరికి మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. శునకానికి తాడు కొని దానిని గౌతమ్ ఇంటికి తీసుకువెళ్లారు. బుధవారం ఉదయం ఉద్యోగాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. శునకం యజమానిని కనుగొనేందుకు చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో వెతుకుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం సమీపంలోకి వెళ్లారు. అక్కడ ఉన్న ఒక సెక్యూరిటీ సదరు కుక్కను గుర్తు పట్టి సమీపంలో చూశానని చెప్పారు. దీంతో యజమానిని గుర్తించేందుకు చుట్టుపక్కల ఉన్న అందరి ఇళ్లను తట్టారు. ఈ క్రమంలోనే ఓ ఇంటి వాచ్‌మన్ ఈ కుక్కను గుర్తించాడు. అంతకు కొన్ని గంటల ముందే కుక్క యజమాని వెతుక్కుంటూ వచ్చాడని, అతని సెల్ నంబర్ ఇచ్చాడు. దీంతో జూబ్లీహిల్స్‌కు చెందిన ఆ యజమానికి కుక్కను అప్పగించారు. బ్లేజ్ పేరుతో పిలుచుకునే ఈ కుక్క కనిపించగానే యజమాని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పోలీసులు యువకులను అభినందించారు. కాగా.. తనకు రెండు పెంపుడు కుక్కలు ఉన్నాయని, తన స్నేహితుడు గౌతంకు ఆరు కుక్కలు ఉన్నాయని.. వాటితో ఉండే అనుబంధం వేరుగా ఉంటుందని సంవీత్ తెలిపారు. అందుకే రెండు రోజుల పాటు కుక్క యజమానిని గుర్తించేందుకు గల్లీ గల్లీ జల్లెడ పట్టామన్నారు. అప్పగించిన కుక్క ఖరీదు దాదాపు రూ.2 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందని.. అందుకే ఎంత కష్టమైనా దాని యజమానిని గుర్తించి అప్పగించామన్నారు.



తమకు దొరికిన పెంపుడు కుక్కతో సంవీత్, గౌతమ్

ఓఆర్ఆర్ పరిధిలో మరిన్ని రిజర్వాయర్లు

ప్రెషర్ ఫిల్టర్లు ఏర్పాటు సైతం..

- గేటెడ్ కమ్యూనిటీలు, కొత్త కాలనీలకు తాగునీరు
- ఫేజ్–2 నీటి సరఫరాపై దృష్టి సారించిన జలమండలి



హిమయత్ సాగర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రెషర్ ఫిల్టర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఓఆర్ఆర్ పరిధిలోని కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల దాహార్తి తీర్చేందుకు జలమండలి చర్యలకు ఉపక్రమించింది. మరో మూడు రిజర్వాయర్లను అందుబాటులోకి తెచ్చింది. మరో వైపు ప్రెషర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసింది. దీంతో కొత్త కనెక్షన్లకు అవకాశంతో పాటు ప్రస్తుత నీటి నీటి సరఫరాలో ఒత్తిడి మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా మణికొండ పరిధిలో అల్కాపురి వద్ద 2.5 మిలియన్ లీటర్ల, నార్సింగి పరిధిలోని మంచిరేవులలో 5 మిలియన్ లీటర్లు, శంషాబాద్ వద్ద 2 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించింది. ఈ రిజర్వాయర్ల అందుబాటులో రావడంతో గ్రీన్ ల్యాండ్స్, మంచిరేవుల, బాలాజీ నగర్, శంషాబాద్, హుడా కాలనీ, సిద్ధంతి, ఆర్‌బీనగర్, సిద్ధేశ్వర కాలనీ, ఆదర్శ్ నగర్, రెహమాన్ నగర్, మధుర నగర్, సోమ ఎన్‌క్లేవ్, శ్రీనివాస కాలనీ, శ్రీనివాస ఎన్‌క్లేవ్, స్పోర్ట్ పార్క్, అల్కాపురి టౌన్‌షిప్ కాలనీ, నెక్నాంపూర్, నార్సింగి తదితర ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య తీరినట్లయింది. మిగిలిన ప్రాంతాలకు కూడా తాగు నీరు అందించేందుకు పనులు వేగిరం చేసింది.

మూడు ప్రెషర్ ఫిల్టర్లు..

శివారు ప్రాంతాల్లో వేసవిలో సైతం నీటి ఎద్దడి అధిగమించేలా జలమండలి మూడు ప్రెషర్ ఫిల్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హిమాయత్ సాగర్ నుంచి తరలిస్తున్న నీటి కోసం హిమాయత్ సాగర్ వద్ద 5 ఎంఎల్‌డీలు బుద్వేల్ వద్ద 3 ఎంఎల్‌డీల సామర్థ్యం, గండిపేట్ గ్రామంలో 3 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్రెషర్ ఫిల్టర్‌లను నిర్మించింది. వీటితో హిమాయత్ సాగర్, దర్గా కాలిస్కా, గండిపేట తదితర ప్రాంతాలకు నీటిని సరఫరా మెరుగుపడుతుంది. మరోవైపు ట్రీట్‌మెంట్ తర్వాత తాగునీటిని పంపిణీ కోసం నేరుగా సంప్‌లోకి విడుదల చేసే వెసులుబాటు కలిగినట్లయింది.

ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ దశ– 2

ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ రెండో దశ రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో జలమండలి చర్యలు చేపట్టింది. ఇందులో 138 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 73 కొత్త సర్వీస్ రిజర్వాయర్లు, 2,988 కి.మీ పైపులైన్ నెట్‌వర్క్ ఉంది. ప్యాకేజీ –1 కింద 33 సర్వీస్ రిజర్వాయర్లు.. 1,522 కి.మీ పైపులైన్ నెట్‌వర్క్ సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర తదితర ప్రాంతాలను కవర్ చేస్తుంది. రెండో ప్యాకేజీలో 38 కొత్త సర్వీస్ రిజర్వాయర్లు, 1,270 కి.మీ పైపులైన్ నెట్‌వర్క్ రాజేంద్రనగర్, శామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, పటాన్ చెరు, ఆర్‌సీ పురం, బొల్లారం మండలాలను కవర్ చేస్తుంది.

అంతా కట్టుకథేనా!

కత్తితో యువకుడి ఆత్మహత్యా యత్నం

- అడ్డొచ్చిన తల్లిని పొడిచిన తనయుడు
- కేసును తప్పుదోవ పట్టించిన సోదరులు
- దుండగులు దాడి చేశారని అబద్ధపు సమాచారం
- 150 సీసీ కెమెరాలు జల్లెడ పట్టిన పోలీసులు
- చివరికి బాధితుడే నిందితుడిగా తేలిన వైనం

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో ఇంట్లోకి చొరబడిన దుండగులు కత్తులతో దాడి చేసి పొడిచింది కట్టుకథేనని పోలీసులు తేల్చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో కుమారుడు యశ్వంత్ కూరగాయలు కోసే చాకుతో కడుపులో పొడుచుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతుండగా.. వద్దని వారించేందుకు అడ్డొచ్చిన తల్లిని పొడిచినట్లు పోలీసులు భావిస్తున్నారు. దుండగులకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించకపోవడం, స్థానికులు అందించిన కీలక సమాచారంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ఇది వేరే వారి పని కాదని, కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలే కారణమని నిర్ధయించి అందుకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన తల్లి రేణుక తన ముగ్గురు కుమారులతో కలిసి నివసిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఆరుగురు దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేయగా, తల్లి రేణుక, పెద్ద కుమారుడు యశ్వంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సుమారు 150 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా దుండగులకు సంబంధించిన ఏ ఒక్క ఆధారమూ లభించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చిన ఆనవాళ్లు లేవని స్థానికులు స్పష్టం చేశారు. గట్టిగా కేకలు వినిపించడంతో వెళ్లిచూడగా లోపల నుంచి తలుపు గడియ పెట్టి ఉందని, కొన్ని క్షణాల తర్వాత తలుపులు తెరుచుకోగా రేణుక, యశ్వంత్ ఇద్దరూ రక్తపు మడుగులో పడి ఉన్నారని, అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.



రేణుక, యశ్వంత్ (ఫైల్)

వినియోగించిన చాకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు..

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, వివాహం కాకపోవడం తదితర సమస్యలో తల్లి రేణుక కుమారుడు యశ్వంత్‌ల మధ్య మనస్పర్థలు నెలకొన్నాయని తెలిసింది. మూడు నెలలుగా యశ్వంత్ ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనైన అతను.. కూరగాయలు కోసే చాకుతో కడుపులో పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించగా, అడ్డుకున్న తల్లిని కూడా పొడిచినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఈ ఘటనలో వినియోగించిన చాకును పోలీసులు స్వాధీనం చేసుకుని ఫింగర్‌ప్రింట్స్ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సమాచారం.

బాధితుడే.. నిందితుడు...

ఈ ఘటనలో బాధితుడే నిందితుడు కావడం గమనార్హం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యశ్వంత్‌ను బాధితుడిగా పేర్కొన్న పోలీసులు ఇప్పుడు నిందితుడిగా చేర్చనున్నారు. ఆత్మహత్యా యత్నంతో పాటు తల్లిని చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడినందుకు యశ్వంత్‌పై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. కేసును తప్పుదారి పట్టించేలా వ్యవహరించిన యశ్వంత్ సోదరులు యశ్‌పాల్, వినయ్‌లపై కూడా కేసులు నమోదు చేసేందుకు న్యాయనిపుణుల సలహా తీసుకోనున్నట్లు తెలిసింది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణుక, యశ్వంత్‌లు కోలుకుంటున్నారని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. వీరు పూర్తిగా కోలుకున్న తర్వాత వాంగ్మూలం నమోదు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ స్పష్టం చేశారు.

నాలుగేళ్ల తర్వాత...

మీ సేవ ద్వారా
కొత్త రేషన్‌కార్డుల
దరఖాస్తుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డులు లేని నిరుపేద కుటుంబాలకు శుభవార్త. మీ సేవ ఆన్‌లైన్ ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు ఆన్‌లైన్ ఎఫ్ఎస్‌సీ లాగిన్ పునరుద్ధరణకు పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 ఫిబ్రవరిలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ లాగిన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు తాజాగా మీ సేవ ద్వారా దరఖాస్తుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఆఫ్‌లైన్‌లో 5.73 లక్షల దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం గ్రేటర్‌లో ప్రజాపాలన ద్వారా సుమారు 5.73 లక్షల కుటుంబాల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేశారు. వీటిని పక్కన పెట్టగా..విమర్శలు రావడంతో తిరిగి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరణకు రంగం సిద్ధమైంది. కాగా గ్రేటర్‌లో రేషన్‌కార్డులు లేని పేద కుంటుంబాలు పది లక్షలకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు భూమి పండుగ

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో ఈ నెల 9వ తేదీ ఆదివారం భూమి పండుగ నిర్వహించనున్నారు. జీవకోటి ఉనికికి, మనుగడకు నిలయమైన భూగ్రహం ప్రపంచమానవుల వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యంతో పర్యావరణ సుస్థిరతను కోల్పోతోంది. జిడ్డు కృష్ణమూర్తి సెంటర్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరుగనుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనియంత్రణ, అనేక రకాల ఉపద్రవాల నుంచి భూమిని కాపాడుకోవాలనే లక్ష్యంతో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు జిడ్డు కృష్ణమూర్తి సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

అమీన్‌పూర్‌లో సమగ్ర సర్వే

- ఆక్రమణలు గుర్తించేందుకు త్వరలో నిర్వహణ
- ప్రకటించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



అమీన్‌పూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో లే ఔట్ల కబ్జాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిహద్దుల్ని తేల్చేందుకు త్వరలోనే సాంకేతిక సర్వే నిర్వహిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని పలు లేఔట్లలో కబ్జాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఐలాపూర్, చక్రపురి కాలనీ, ఆర్టీసీ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో రంగనాథ్ పర్యటన జరిగింది. ఈ మున్సిపాలిటీ పరిధిలో సర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియా, ఏడీ సర్వే విభాగం, రెవెన్యూ, హైడ్రా సర్వే బృందాలను వినియోగిస్తూ అందరి సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఐలాపూర్‌లో నాలుగు వేల మంది ప్లాట్లు ఖరీదు చేసిన వెంచర్ ప్రభుత్వ భూమి అంటూ గతంలో రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై దాదాపు 40 ఏళ్లుగా ఆయా ప్లాట్ల యజమానులు న్యాయపోరాటం చేస్తున్నారు. కోర్టు ఉత్తర్వులు వెలువడకుండానే ముఖీం అనే న్యాయవాది తమ ప్లాట్లు కబ్జా చేసినట్లు స్థానికులు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపు 700 ప్లాట్లు వేరే వారికి విక్రయించేశారని, ఇతడితో ప్రభుత్వ విభాగాలు సైతం కుమ్మక్కు కావడంతో కరెంట్, మంచినీరు, రోడ్ల సౌకర్యాలు కూడా వచ్చాయని స్థానికులు పేర్కొన్నారు. ఇదేమంటూ ప్రశ్నిస్తే గతంలో ఓ హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న ముఖీం తమపై దాడులకు దిగుతున్నాడని ఆరోపించారు. అలాగే విజయ కృష్ణం రాజు అనే వ్యక్తి ఇక్కడ 2005లో 53 ఎకరాలు కొన్నారని..తర్వాత 18 ఎకరాలకు పైగా కబ్జా చేశారంటూ చక్రపురి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. త్వరలోనే హైడ్రా పోలీసుస్టేషన్ కూడా ఏర్పడుతోందని, ఆపై కబ్జాదారులపై కఠిన చర్యలు ఉంటాయని రంగనాథ్ తెలిపారు.

ఈ భూమి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాం

అమీన్‌పూర్ రాజగోపాల్‌నగర్‌లో ఉన్న ఐలాపూర్‌లో భూమికి సంబంధించి ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చింది. తాము 1980ల్లో తీసుకున్న ప్లాట్స్‌ను కొందరు కబ్జా చేస్తున్నట్లు బాధితులు హైడ్రాకు విన్నవించారు. ఈ భూమిపై ప్రభుత్వానికి- అప్పట్లో వెంచర్ చేసిన వారికి మధ్య వివాదం నడుస్తోందని, దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఇప్పుడు తమ ప్లాట్లకు కబ్జా చేస్తున్నారని మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా అడ్వకేట్ ముఖీం స్థానికంగా ఉన్న దళితులను అడ్డం పెట్టుకుని కబ్జాలకు పాల్పడుతున్నారని, ఆ ప్లాట్ల యజమానుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని వివరించారు. 2020లో కరోనా సమయాన్ని అనుకూలంగా మార్చుకుని కబ్జా చేసిన స్థలాల్లో ఇళ్లు కట్టారని, వాటిని 2023లో ప్రభుత్వం కూల్చేసిందని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే స్థానికులతో భేటీ కావడంతో పాటు పాటు అడ్వకేట్ ముఖీంతోనూ చర్చించాం. త్వరలో ప్రతి ఒక్కరి నుంచి డాక్యుమెంట్లు సేకరించి పరిశీలిస్తాం. గతంలో హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్స్ ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు. వాటినీ పరిగణలోకి తీసుకుని చట్ట ప్రకారం ముందుకు వెళ్తాం. ఒకటి రెండు నెలల్లోనే చర్యలు తీసుకోవడానికి హైడ్రా కృషి చేస్తుంది. ఇక్కడ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారనీ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. లేఔట్ సక్రమమైనా, అక్రమమైనా అందులో ఉన్న ఓపెన్ ప్లేసులన్నీ ప్రభుత్వ స్థలాలే అవుతాయి. వాటిని కచ్చితంగా హైడ్రా పరిరక్షిస్తుంది. ప్రభుత్వ స్థలమైతే స్వాధీనం చేసుకుంటుంది. – ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామంలో ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామంలోని యాంఫీ థియేటర్‌లో సాయంత్రం 5 గంటలకు ఒడిశా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు జరుగుతాయి.
- బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గం. నుంచి రాత్రి 8 గం. వరకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది. ప్రవేశం ఉచితం.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 11 గం. నుంచి రాత్రి 8 గం. వరకు కిసాన్ అగ్రి షో –2025 అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కార్ల వ్యాపారమంటూ కాజేశారు!

- నగర వాసికి వాట్సాప్ ద్వారా ఎర
- ఖర్చులు, అడ్వాన్స్ పేరుతో టోకరా
- రూ.37.9 లక్షలు స్వాహా, కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యాపారికి వాట్సాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారమంటూ ఎర వేశారు. నమ్మకం కలిగించడానికి కొన్ని పత్రాలను పంపించారు. దీంతో తానూ ఆ బిజినెస్‌లోకి వస్తానని బాధితుడు చెప్పడంతో అసలు కథ మొదలెట్టారు. అడ్వాన్సు, కార్ల రవాణా ఖర్చుల పేరుతో దఫదఫాలుగా రూ.37.95 లక్షలు కాజేశారు. నగరంలో నివసిస్తున్న ఓ వ్యాపారికి గత ఏడాది వాట్సాప్ నుంచి ఓ సందేశం వచ్చింది. తాము సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేస్తుంటామని, ఆసక్తి ఉంటే మీరూ ఈ దందాలోకి దిగవచ్చని దాని సారాంశం. ఆపై వేర్వేరు వాట్సాప్ నెంబర్ల నుంచి, దఫదఫాలుగా మాట్లాడిన నలుగురు తాము ఇన్నోవా, క్రిస్టాలతో పాటు ఐచర్లు, జేసీబీలు కూడా విక్రయిస్తుంటామని నమ్మబలికారు. తమకు చోళమండలం ఇన్వెస్టిమెంట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీతో ఒప్పందం ఉందని చెప్తూ..నకిలీ పత్రాలు తయారు చేసి పంపారు. ఫైనాన్స్‌పై ఆయా వాహనాలు ఖరీదు చేసి, సరైన సమయానికి కిస్తీలు చెల్లించకపోతే వాటిని ఆ కంపెనీ జప్తు చేస్తుందని, అలాంటి వాహనాలు అతి తక్కువ ధరకే తాము ఖరీదు చేస్తామని నమ్మించారు. దీంతో నగర వ్యాపారి సైతం వారితో కలిసి సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేయాలని, వీటిని వారి నుంచి ఖరీదు చేసి ఇక్కడ విక్రయించాలని భావించారు. ఇదే విషయాన్ని సైబర్ నేరగాళ్లకు చెప్పగా.. అవసరమైన కార్లు తామే సరఫరా చేస్తామని నమ్మబలికారు. వీటి కోసం కొంత అడ్వాన్స్, రవాణా ఖర్చులు చెల్లిస్తే చాలని, మిగిలిన మొత్తం కారు విక్రయించిన తర్వాత ఇవ్వొచ్చని చెప్పారు. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న సొమ్ముతో పాటు తన రెగ్యులర్ కస్టమర్స్ దగ్గర అప్పు చేసి, స్నేహితుల వద్ద తీసుకుని పలు విడతల్లో రూ.37.95 లక్షలు వారికి బదిలీ చేశారు. ఎట్టకేలకు మోసపోయానని గుర్తించి శుక్రవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమై, ఇలా వాహనాలు విక్రయిస్తామంటే గుడ్డిగా నమ్మకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి వ్యాపారం కేంద్రం ఎక్కడ ఉంది? గోదాములు ఉన్నాయా? తదితరాలు సరిచూసుకోవాలని చెప్తున్నారు. స్వయంగా వెళ్లి నిర్ధారించుకోకుండా నగదు చెల్లించవద్దని స్పష్టం చేస్తున్నారు.

హైదర్‌షాకోట్‌లో బాలికపై సామూహిక లైంగికదాడి?

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో ఓ బాలికపై నలుగురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు ఆలస్యంగా వెల్లడైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కపిలానగర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినిని ప్రలోభాలకు గురిచేసిన మధుసూదన్ అనే యువకుడు తన మిత్రులతో కలిసి గత ఏడాది అక్టోబర్‌లో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం బాలిక ఈ విషయం తల్లితండ్రులకు తెల్పడంతో తండ్రి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు మధుసూదన్‌తోపాటు అతని మిత్రులు జయంత్, తరుణ్‌కుమార్, సాయికుమార్ ఉన్నట్టు తెలిసింది. వీరంతా కలిసి లైంగిక దాడి చేశారా? లేక మధుసూదన్‌కు సహకరించారా? అనే విషయం పోలీసులు నిర్ధారించాల్సి ఉంది. నిందితుడు మధుసూదన్ గతంలోనూ ఇలాంటి చర్యకు పాల్పడి పోక్సో కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్టు తెలిసింది. నలుగురు యువకులను నార్సింగి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సమాచారం. ఈ విషయమై నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోరగా కేసు నమోదైందని, విచారణ కొనసాగుతుందని, మరికొంత మంది నిందితులు ఉన్నట్టు తెలుస్తోందని, పూర్తి వివరాలు వచ్చాక తెలియజేస్తామన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

– ప్రియుడి వేధింపులే కారణం..



ప్రవళిక (ఫైల్)

బౌద్ధనగర్: ప్రేమించిన వ్యక్తి తరచూ అనుమానిస్తూ..వేధింపులకు పాల్పడడంతో భరించలేక ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం..బౌద్ధనగర్‌లోని అంబర్‌నగర్‌కు చెందిన నాగయ్య కుమార్తె ప్రవళిక (23) కోఠి ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతుంది. కాలేజీ అయ్యాక సాయంత్రం 6 నుండి రాత్రి 10 గంటల వరకు వారాసిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తుంది. కాగా నాలుగేళ్లుగా ప్రవళిక..సృజన్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా సృజన్ ఆమెను వేధిస్తూ వేధింపులకు దిగాడు. మరో యువకుడితో మాట్లాడుతున్నావని అనుమానించేవాడు. ఇదే విషయంపై పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నెల 6వ తేదీన సాయంత్రం ఉస్మానియా యూనివర్సిటీలోని ఓ బేకరీలో ప్రవళిక, సృజన్‌ల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో మరో స్నేహితుడు మధుకర్ వచ్చి ఇద్దరిని సముదాయించాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ప్రవళిక తన తండ్రి నాగయ్యకు ఫోన్ చేయగా, తాను ఫంక్షన్‌కు వెళ్తున్నానని ఆలస్యంగా వస్తానని చెప్పాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంటికి వచ్చిన నాగయ్యకు బెడ్రూమ్‌లో ప్రవళిక దుప్పటితో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. వెంటనే స్థానికుల సహాయంతో ప్రవళికను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రవళిక స్నేహితుడు మధుకర్..సృజన్‌తో ప్రేమ, గొడవల గురించి నాగయ్యకు తెల్పగా..ఆయన ఫిర్యాదు మేరకు సృజన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ-హెచ్, ఆల్ఫా గ్రేప్‌ల మధ్య అవగాహన ఒప్పందం



భాగస్వామ్య కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు

గచ్చిబౌలి: విద్యార్థులకు తగిన వనరులు, మార్గదర్శకత్వం, అవకాశాలను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, అల్ఫాగ్రెప్ సంస్థలు నిర్ణయించాయి. శుక్రవారం ఈ మేరకు రెండు సంస్థలు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం రూ.3.5 కోట్లను పరిశోధనలు, నైపుణ్య సాధన, ఏఐ/ఎంఎల్, ఆవిష్కరణలకు వినియోగించాలని తలపెట్టారు. అల్ఫాగ్రెప్ క్వాంటిటేటివ్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని అంగీకరించాయి. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి వాటి పరిశోధనలో ప్రభావ వంతమైన ఆవిష్కరణలే లక్ష్యంగా పనిచేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలటిక్స్‌లో అల్ఫాగ్రెప్‌కున్న సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని గుర్తు చేశారు. అల్ఫాగ్రెప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహిత్ ముత్రేజా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఆర్ అండ్ డీ డీన్ ప్రొఫెసర్ జవహర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కెఎస్ రాజన్, ఫ్యాకల్టీ, అధికారులు, అల్ఫాగ్రెప్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ హేమంగ్ మండాలియా, ప్రొఫెసర్ పొన్నురంగం కుమారగురు తదితరులు పాల్గొన్నారు.

రాజాసింగ్‌పై కేసులో మీ వివరణేంటి?

– ఫిర్యాదుదారుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన కేసుపై వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారు ఎస్.తాజంరెడ్డిని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పోలీసులను కూడా కౌంటర్ దాఖలు చేయమని ఆదేశిస్తూ..తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా వేసింది. జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట 2021, జూన్‌లో ధర్నా నిర్వహించినప్పుడు సైఫాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మరో 20 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ..నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని బీజేపీ నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా కార్యాలయంలోకి జొరబడ్డారని తప్పుడు కేసు నమోదు చేశారన్నారన్నారు. కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించారని సైఫాబాద్ ఎస్ఐ ఎం.తాజంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని..తప్పుడు కేసు కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి..ఫిర్యాదుదారు తాజంరెడ్డికి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి నోటీసులు

అల్వాల్: మల్కాజిగిరి శాసన సభ్యుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి అల్వాల్ పోలీసులు ఇండియన్ కోడ్ సెక్షన్ 35(3) ప్రకారం శుక్రవారం నోటీసులు జారీ చేశారు. గత సంవత్సరం మార్చిలో అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తన విధులకు ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఆటంకం కల్పించారని, దూషించడంతోపాటు భౌతిక దాడికి యత్నించారని అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా పోలీసులను కోరారు. దీంతో దర్యాప్తు చేపట్టిన అల్వాల్ పోలీసులు దాదాపు సంవత్సరం తర్వాత సెక్షన్ 35(2) ప్రకారం ఎమ్మెల్యే, మరో ఇద్దరికి శుక్రవారం నోటీసులు పంపారు.

200 కిలోల గంజాయి పట్టివేత



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

చాంద్రాయణగుట్ట: గంజాయి రవాణ చేస్తున్న ఓ అంతరాష్ట్ర పెడ్లర్‌ను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.50 లక్షల విలువైన 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సౌత్ ఈస్ట్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా మేఘ్యానాయక్ తండాకు చెందిన డ్రైవర్ జాదవ్ శివరాం, తన స్నేహితుడైన బానావత్ జైపాల్‌తో కలిసి 2015 నుంచి వైజాగ్‌లోని సీలేరుతో పాటు ఒడిశా నుంచి మహారాష్ట్రలోని వినియోగదారులకు గంజాయి రవాణా చేస్తున్నాడు. తక్కువ ధరకు కొనుగోలు చేసి అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తూ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం ఒడిశాకు చెందిన సుభాష్ అనే వ్యక్తి వద్ద కిలో రూ.4 వేల చొప్పున 200 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయించేందుకు కారులో తీసుకొస్తున్నాడు. జైపాల్‌తో కలిసి కిలో రూ.8 వేలకు ఎల్‌బీ నగర్‌లో వినియోగదారులకు విక్రయించాలని పథకం రచించాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు వలపన్ని చాంద్రాయణగుట్టలో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 200 కిలోల గంజాయి, కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడు గతంలోనూ ఎన్‌డీపీఎస్ కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్, సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కారులో తరలిస్తుండగా 14 కిలోలు...

- లేడీ డాన్‌తో పాటు మరో ఇద్దరి అరెస్ట్
- రూ.8.50 లక్షల విలువైన గంజాయి, కారు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: గంజాయి అక్రమ రవాణ కొత్త పుంతలు తొక్కుతోంది. నిఘా వ్యవస్థకు చిక్కకుండా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీస్ బృందం రట్టు చేసింది. వివిధ మార్గాల్లో గంజాయి తరలించే అక్రమార్కులు ఈ సారి సరికొత్త ఎత్తుగడను అనుసరించారు. కుటుంబ సభ్యులతో కలిసి కారులో ప్రయాణం చేస్తున్నట్లుగా ఎలాంటి అనుమానాలు రాకుండా కారు వెనుక సీటు కింది భాగంలో ప్రత్యేక అరలు చేసి అందులో 14 కిలోల గంజాయి ప్యాకెట్లును అమర్చారు. ఒడిశాలోని మల్కన్‌గిరి, జగ్దల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సీఐ నాగరాజు టీమ్ హయత్‌నగర్‌లో పట్టుకున్నారు. అక్రమంగా రవాణాకు పాల్పడిన లేడీ డాన్ సునీతా దాస్ ధూల్‌పేట్‌లోని ఒక వ్యాపారికి విక్రయించేందుకు గంజాయిని తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో లేడీడాన్ సునీతా దాస్‌తో పాటు కారు డ్రైవర్ ఇస్తియాఖురేషి, కంకన్ నన అనే వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయి రవాణాకు వినియోగించిన కారు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.3.50 లక్షలు, కారు ఖరీదు మరో రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

ప్రజావాణిలో 4,901 దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157, విద్యుత్ శాఖ 105, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,865 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1640 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

ఏఐపీసీ తెలంగాణ (హెల్త్‌కేర్) అధ్యక్షుడిగా అస్కారీ




లక్డీకాపూల్: ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) తెలంగాణ హెల్త్ కేర్ విభాగం అధ్యక్షుడిగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముజ్తబా హసన్ అస్కారీ నియమితులయ్యారు. ఆయన తెలంగాణలో ఆరోగ్య సంరక్షణ నిపుణుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అత్యవసర వైద్య సిబ్బంది వంటి ఆరోగ్య కార్యకర్తలకు మద్దతుగా ప్రభుత్వంతో కలిసి పని చేయనున్నారు

వర్సిటీల్లో పాత పద్ధతిలోనే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్

ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌కు టీజీడీఏ విజ్ఞప్తి

లక్డీకాపూల్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో చేపట్టే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) డిమాండ్ చేసింది. స్క్రీనింగ్ టెస్టుల పేరుతో రిక్రూట్ మెంట్‌ను వివాదాస్పదం చేయకుండా యూజీసీ నిబంధనల మేరకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపట్టాలని సూచించింది. 15 ఏళ్లుగా యూనివర్సిటీల్లో ఎలాంటి రిక్రూట్‌మెంట్లు లేక ఆందోళన చెందుతున్న నిరుద్యోగుల బాధలను, సమస్యలను గుర్తించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పాలాడి రమణ రావు, అధ్యక్షులు డాక్టర్ పి.నరేందర్ రెడ్డిలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నేత మృతి



రంగరాజ్‌గౌడ్ (ఫైల్)

చిక్కడపల్లి: అతివేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొట్టడంతో బీజేపీ నేత ఒకరు మృత్యువాతపడ్డారు. చిక్కడపల్లి పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన కథనం ప్రకారం శుక్రవార సాయంత్రం కవాడిగూడకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు రంగరాజ్ గౌడ్, రాగం రవికుమార్ బైకుపై కవాడిగూడ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్ మీదుగా బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయానికి వెళ్తుండగా..చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వద్ద అతివేగంగా దూసుకొచ్చిన ఆటో బలంగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రంగరాజ్‌గౌడ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాగం రవికుమార్‌కు గాయాలయ్యాయి. సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా రంగరాజ్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్ఐ మౌనికలు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

నేడు, రేపు ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశం

లిబర్టీ: అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 8, 9వ తేదీల్లో జాతీయ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని వివరించారు. సమైక్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు పాల్గొంటారన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సమావేశాలకు అతిథ్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి నాయకత్వం రెండు రోజులు జరిగే సమావేశాల్లో పాల్గొంటుందని తెలిపారు.

పీఎన్‌బీ హోమ్ లోన్ ఎక్స్‌పో



ఖైరతాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో హోమ్ లోన్ ఎక్స్‌పో నిర్వహించింది. క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, పీఎన్‌బీ జోనల్ హెడ్ దీపక్‌కుమార్ శ్రీవాస్తవ్ సంయుక్తంగా దీనిని ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో దాదాపు రెండు వేల మంది దరఖాస్తుదారులకు రూ.45కోట్ల గృహరుణాల మంజూరు పత్రాలు అందించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: బీఆర్ఎస్ హయాంలో ఎంతో మంది నిరుపేదలను ఆదుకున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలియజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం షేక్‌పేటకు చెందిన 99 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు (రూ.99,11,484) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట ఆర్ఐ యాదగిరి, వీఆర్ఓ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్, ఎల్లేష్, లక్ష్మణ్, రాజ్‌కుమార్, అక్బర్, విక్టర్ రాజ్, సరస్వతి, సునీత, పార్వతితో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసాయి మందిరంలో పూజలు

బంజారాహిల్స్: మాఘమాస మహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని విశ్వసాయి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాయిబాబాకు దానిమ్మ రసంతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకున్నారు.

కాంగ్రెస్ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్‌గా దేశ్‌కాంత్



బంజారాహిల్స్: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్‌గా దేశ్‌కాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన విచార్ విభా గ్ చైర్మన్ గిరిజా వ్యాస్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు దేశ్‌కాంత్ పుదుచ్చేరి, తమిళనాడు కర్ణాటక రా ష్ట్రాల కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. దేశ్‌కాంవత్ తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకుగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎ న్నికల్లో విజయానికి కృషి చేశారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం విచార్ విభాగ్ జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియమించింది.

రోడ్లకు త్వరలో మహర్దశ



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్‌లో పాడైపోయిన రోడ్లకు త్వరలోనే మహర్దశ రాబోతుందని కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్, మధురానగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యే నిధులను రూ.5కోట్ల వరకు విడుదల చేయించారని తెలిపారు. ఆ నిధులతో రోడ్లకు మరమ్మతులు, రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ నేతలు విజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, వేణు, బాలు, యాదగిరి, మధురానగర్‌కాలనీ జాయింట్ సెక్రటరీ హనుమంతరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కార్ల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్ తొలగింపు, 108మందికి జరిమానా



కేబీఆర్ పార్కు వద్ద స్పెషల్ డ్రైవ్‌లో సైరన్లను తొలగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా



బ్లాక్ ఫిల్మ్‌లను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో శుక్రవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ తనిఖీలు చేపట్టారు. వెస్ట్‌జోన్ పరిధిలో బ్లాక్ ఫిలింలు, సైరన్లు తదితర కేసుల్లో 108 వాహనాలకు జరిమానాలు విధించారు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో..

కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు ఏర్పాటు చేసుకుని ఎంవీ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ గోపీతో కలిసి స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని కారు అద్దాలకు అక్రమంగా అంటించిన బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా కార్లకు ఏర్పాటు చేసుకున్న సైరన్లను కూడా తొలగించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కారు అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లు, అధిక శబ్దంతో ఏర్పాటు చేసిన సైరన్‌లను తొలగించి జరిమానాలు కూడా విధించారు. బ్లాక్‌ఫిల్మ్‌లు ఏర్పాటు చేసిన కార్లకు రూ.700 జరిమానా విధించారు.

సందడిగా 'డిస్ట్రిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్'



గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు ప్రదానం చేసిన నిర్వాహకులు

పంజగుట్ట: నెహ్రూ యువకేంద్ర హైదరాబాద్, సమైక్య భారతి యూత్ అసోసియేషన్‌ల సహకారంతో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 'డిస్ట్రిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్'నిర్వహించారు. కబడ్డీ ఉమెన్స్, వాలీబాల్ మెన్స్, రన్నింగ్ 200 మీటర్స్ మెన్స్, ఉమెన్స్ పోటీలను నిర్వహించారు. కబడ్డీ ఉమెన్స్ పోటీల్లో సిటీ కాలేజీ విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకోగా, రెండో బహుమతి ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వాళ్లు గెలుపొందారు. వాలీబాల్‌లో ఖైరతాబాద్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు గెలుపొందారు. 200 మీటర్స్ రన్నింగ్ ఉమెన్స్‌లో ఖైరతాబాద్ డిగ్రీ కాలేజీకి చెందిన పి.యశస్విని, రెండో బహుమతి సిటీ కాలేజీకి చెందిన బి.శృతి గెలుపొందారు. 200 మీటర్స్ మెన్స్ రన్నింగ్‌లో మొదటి బహుమతి ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన డది.ప్రవీణ్, అదే కాలేజీకి చెందిన బి.సతీష్ రెండో బహుమతి, సిటీ కాలేజీకి చెందిన సాయికుమార్ మూడో బహుమత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. రాజేంద్రకుమార్, సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.నాగేశ్వరరావు, వైస్‌ప్రిన్సిపల్ డా. రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనడానికి వచ్చి.. చీరలతో ఉడాయించి!

వెంగళరావునగర్: చీరలు కొనడానికి వచ్చిన కస్టమర్స్ విలువైన 20 చీరలను చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాచలం ప్రాంతానికి చెందిన కె.నవ్య కొంత కాలంగా స్థానిక మధురానగర్‌కాలనీలో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు షాపులోకి వచ్చి చీరలు చూపమన్నారు. దాదాపు రూ.2.60 లక్షలు ఖరీదు చేసే 20 చీరలు మాయం అయ్యాయి. హుటాహుటిన ఆమె షాపు బయటకు వచ్చి వారి కోసం వెతకగా కనిపించలేదు. దాంతో నవ్య శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

ఫిలింనగర్: ఇంటి తాళాలు పగలగొట్టి నగలు, నగదు తస్కరించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్ బస్తీలో నివసించే హుస్సేన్ సాహెబ్ వాటర్ ప్రూఫ్‌వర్క్ చేస్తుంటాడు. ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి పనికివెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటితాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఆందోళన చెందిన హుస్సేన్ ఇంట్లోకి వెళ్లి చూడగా అలమారా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన రూ.15వేల నగదుతో పాటు నెక్లెస్, ఉంగరాలు, గొలుసులు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారని బాధితుడు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేద్దాం

లిబర్టీ: ఆకాశానంటే అందమైన భవనాలు నిర్మిస్తున్న భవన కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని మార్చి 28వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా కార్స్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థికంగా చేయూతను ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇందులో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైక్లింగ్ ట్రాక్‌లపై సీఎం దృష్టి పెట్టాలి

బైసైకిల్ మేయర్ ఆఫ్ హైదరాబాద్ శంతన సెల్వన్



బంజారాహిల్స్: హైదరాబాద్‌లో సైకిల్ ట్రాకును ఏర్పాటుచేసి మరింత ప్రోత్సహించాలని బైసైకిల్ మేయర్ ఆఫ్ హైదరాబాద్ శంతాన సెల్వాన్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి 'ఎక్స్'వేదికగా విజ్ఞప్తి చేశారు. నగరంలో సైక్లింగ్‌కు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సైక్లింగ్ ట్రాక్‌లు, కారు ఫ్రీ జోన్లు, బహుళ మోడల్ రవాణా వ్యవస్థపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఉన్న సైకిల్‌ట్రాక్‌లపై పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో సైక్లింగ్ చేసేవారి భద్రతపై ఆందోళన నెలకొందన్నారు. పాదచారులు, సైక్లిస్టులు, ప్రజా రవాణా వినియోగదారులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

'అన్వేషణ' ప్రాజెక్టుల ప్రదర్శన



ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో విద్యార్థుల వినూత్న ప్రాజెక్టులు

ఖైరతాబాద్: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి ప్రత్యేకంగా రూపొందించిన 45 ప్రాజెక్టులను శుక్రవారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రదర్శించారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏజీఎం బలరాం ఈ ప్రదర్శనను ప్రారంభించారు. మొత్తం 175 రిజిస్ట్రేషన్లు రాగా వాటిలో 45 ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిని ప్రదర్శించారు. 12ఏళ్లుగా 'అన్వేషణ'అనే కార్యక్రమంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయిస్తూ ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను ప్రాజెక్టుల రూపంలో సమాజం ముందుకు తీసుకొస్తున్నామని అన్నారు. ఈ ప్రదర్శన శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి అశోక్, కోఆర్డినేటర్ మల్లేష్, ఏరియా మేనేజర్ శ్రీదేవి, మౌనిక, సభ్యులు పాల్గొన్నారు.

12న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం

కాచిగూడ: మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ డ్డి పూర్తిగా విఫలమైందన్నారు. ఈనెల 12వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక శాతం జనాభా కల్గిన మున్నూరు కాపులకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడలోని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించి తిరిగి మున్నూరు కాపులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపుల పేరు చివరన పటేల్ అని ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు బత్తుల రాములు, అమరం శ్యామ్‌కుమార్, వెంపటి సోమన్న, కిష్టంగారి ప్రకాష్, కటికం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్



వెంగళరావునగర్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఎదగడానికి ఎంతో మంచి అవకాశాలు ఉన్నాయని ఎంజీఎం ఇంటర్నేషనల్ హైస్కూల్ చైర్మన్ ఎంఎం నాయుడు తెలియజేశారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాల బాలికలకు జిల్లాస్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థులు అండర్-14 విభాగంలో బాస్కెట్‌బాల్ రన్నర్‌గా నిలిచారు. వీరికి శుక్రవారం ఎల్‌బీస్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి బహుమతి, ట్రోఫీలను అందజేశారు. అనంతరం యూసుఫ్‌గూడ హైస్కూల్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి చైర్మన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిరణ్‌నాయుడు, కోచ్ ఇమ్రోజ్, టీచర్లు సబిత, వీణా, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది విజేతలను అభినందించారు.

ఎంబీఎస్‌సీ కులాలకు మరోసారి అన్యాయం

ఎంబీఎస్‌సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం

కాచిగూడ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దళితుల్లో అత్యంత వెనకబడిన ఎంబీఎస్‌సీ కులాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వకపోవడం.. తమ కులాలను మాల, మాదిగ గ్రూపుల్లో కలపడం వల్ల మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్సీ 57 ఎంబీఎస్‌సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అమలు జరిగిన వర్గీకరణ వల్ల ఎంబీఎస్‌సీ కులాలకు అన్యాయం జరిగిందన్నారు. పోరాడితే మళ్లీ ఇప్పుడు కూడా అదే విధంగా అన్యాయం చేశారని అన్నారు.

◆ సుప్రీంకోర్టు వెనకబడ్డ దళిత కులాలను ప్రత్యేక గ్రూపులో ఉంచి ప్రత్యేక కోటా రిజర్వేషన్లు ఇవ్వాలంటే దానికి విరుద్ధంగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాల కులం గ్రూపులో అత్యంత నిరుపేదలైన రెల్లి, హోలిదాసరి, మాల జంగం, డోల్ కులాలు వీరితో ఎలా పోటీ పడగలవో చెప్పాలని ప్రశ్నించారు. అదే విధంగా మాదిగ గ్రూపులో కలిసిన అత్యంత నిరుపేదలైన సంచారకులాలు, దొంబర, చిందు, మాస్టిన్, ఎల్లమ్మల వాండ్లు వంటి కులాలు ఎలా మాదిగలతో పోటీ పడగలవో చెప్పాలన్నారు. ఇలా ఆశాస్త్రీయంగా విభజించి ఈ కులాల ఉనికే లేకుండా చేసే కుట్రలు చేశారని అన్నారు. ఇలా కాకుండా 57 ఎంబిఎస్‌సీ కులాలను 'ఏ'గ్రూపులో చేర్చి 5శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తే సామాజిక న్యాయం జరిగేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జనాభా ప్రాతిపదికన ఉపకులాలకు రిజర్వేషన్లు అందేలా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించి బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీలో శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే నివేదికను ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి బీసీల మనస్సును దోచుకున్నారని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బీసీలకు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారని కుమారస్వామి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరహాలోనే బీజేపీ, బీఆర్ఎస్ ఇతర రాజకీయ పక్షాలు స్థానిక సంస్థల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో బీసీల తిరుగుబాటును ప్రతిఘటనలను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు స్పష్టం చేశారు.

గవర్నర్, మంత్రి అభినందించడం మరచిపోలేను

పోచంపల్లి ఫ్యాబ్రిక్ యూనిట్ వ్యవస్థాపకురాలు శృతి



వీ హబ్‌లో పోచంపల్లి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న శృతి

బంజారాహిల్స్: తెలంగాణ హెరిటేజ్ స్టేట్ స్టేటస్ సింబల్ అయిన పోచంపల్లి ఫ్యాబ్రిక్ యూనిట్‌ను నెలకొల్పి వివిధ రకాల వస్త్ర ఉత్పత్తులను వీ-హబ్‌లో ప్రదర్శించిన నల్లగొండ జిల్లాకు చెందిన శృతి ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల ప్రశంసలు అందుకుంది. తాను పదేళ్ల నుంచి ఈ యూనిట్ ద్వారా చీరలు, దుప్పట్టాస్, ఫ్యాబ్రిక్, తెలియా రుమాల్ తదితర రకాల వస్త్ర ఉత్పత్తులను తయారు చేస్తున్నానని శృతి తెలిపారు. దీని ద్వారా 200 మంది ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఇటీవలే స్టిచ్చింగ్ యూనిట్‌ను కూడా ప్రారంభించగా వీటిని ఎలా సేల్ చేయాలి? దీనిని ఎలా అభివృద్ధి చేయాలనే ఆందోళన ఉండేదన్నారు. అయితే మూడు నెలల క్రితం వీ-హబ్ గురించి తెలుసుకున్నానని తెలిపారు. ఇక్కడ చిన్న చిన్న లేబులింగ్ వివరాల నుంచి ఇంటర్నేషనల్ షిప్పింగ్ వరకు ప్రతి అంశంపై శిక్షణ ఇచ్చారు. దీంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. గవర్నర్, మంత్రి తన ఉత్పత్తులు చూసి అభినందించడం మరిచిపోలేనన్నారు. ఎంతోమంది దీనిని స్ఫూర్తిగా తీసుకుని భారత ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటునందిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యమ చరిత్రలో టీజేయూ నాతోనే నడిచింది



తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ డైరీ ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ తదితరులు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: మూడు దశాబ్దాల ఉద్యమ చరిత్రలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ప్రతిచోట తనతో నడిచిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ 2025 డైరీ, కేలండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, ఒంటరి మహిళలకు, వికలాంగులకు ఫిన్షన్ రావడం ఉద్యమాల్లో ఎమ్మార్పీఎస్ కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. నిండు అసెంబ్లీలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణగదొక్కుతా అని కేసీఆర్ అవమానిస్తే, వర్గీకరణకై జరిగిన అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి 40నిమిషాల ప్రసంగంలో ఎమ్మార్పీఎస్ పేరు తీయకుండా అవమానించారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, మాజీ ఎంపీ నేతకాని వెంకటేష్, బిజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, సీనియర్ పాత్రికేయులు సాయికృష్ణ, సుధాకర్, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, బింగి స్వామి, దాసన్న, పెద్దాపురం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

11శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే సంపూర్ణ వర్గీకరణ




సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు నరేష్‌మాదిగ

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ వర్గీకరణ అసంపూర్ణంగా ఉందని.. మాదిగలకు జనాభా దామాషా ప్రకారం 11 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే అది సంపూర్ణమైన వర్గీకరణ అవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. మాదిగల చిరకాల స్వప్నమైన వర్గీకరణ జరిగినప్పటికీ కేవలం గాంధీభవన్‌లో తప్ప ఏ మాదిగ వాడల్లో సంబురాలు జరగడం లేదన్నారు. ఇందుకు కారణం జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకపోవడమేనని అన్నారు. జనాభా పరిగణలోకి తీసుకున్నా, వెనుకబాటుతనం పరిగణలోకి తీసుకున్నా తమకు న్యాయపరంగా 11 శాతం రిజర్వేషన్లు రావల్సిందే అని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అనుభవించడంలో మెరుగైన ఫలితాలు పొందిన మాలలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి, మాదిగలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మాలలకు ఒకశాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు 3.50 జనాభాను పరిగణలోకి తీసుకుంటే మాదిగలను 3.65 పరిగణలోకి తీసుకోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'లక్షల డప్పులు - వేల గొంతులు'కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ, ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు దరువు ఎల్లన్న, గిద్దె రాంనరసయ్య, నల్లిగంటి శరత్ చమర్, మచ్చ దేవేందర్, డప్పు స్వామి, మల్లిక, అమూల్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు.. కేసు నమోదు

ఫిలింనగర్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ షేక్పేట తహసీల్దార్ అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేడ్కర్నగర్ బస్తీని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలంలో ఇటీవల డొక్కా సురేష్, డొక్కా ఉమాదేవి తదితరులు గుడిసెలు వేయడంతో పాడు సుమారు 150 గజాలలో షెడ్డు నిర్మాణం చేపట్టి స్థలాన్ని ఆక్రమించారు. ఈ మేరకు ఫిర్యాదులు అందుకున్న షేక్ పేట మండల రెవెన్యూ సిబ్బంది గత నెల 30న ఆక్రమణలను కూల్చివేశారు. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా మరుసటి రోజు మరోసారి 150 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని తిరిగి షెడ్ల నిర్మాణం చేయించుకున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న తహసీల్దార్ అనితారెడ్డి నిందితులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డొక్కా సురేష్ , డొక్కా ఉమారాణి తదితరుల మీద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపడం విద్యార్థులకు తీవ్ర నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ తాజుద్దీన్

పంజగుట్ట: విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడంవల్ల విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలను తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్, అసోసియేషన్ ఫర్ సోషియో ఎకనామిక్, ఎన్‌పవర్‌మెంట్ ఆఫ్ ది మార్జినైజేడ్ (ఆసీం) ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... చదువు పూర్తయి రెండేళ్లు అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదన్నారు. 2022-23 సంవత్సరంలో రూ.200కోట్లు చెల్లించాల్సి ఉంటే కేవలం రూ.117.45 విడుదల చేశారని, 2023-24 సంవత్సరంలో రూ.236 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.120.30 విడుదల చేశారని తెలిపారు. దీంతో సగం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. విద్యా సర్టిఫికెట్లు నిల్వ పెట్టుకోకూడదని ఆదేశించాలని కోరారు. ఆయా సంఘాల ప్రతినిధులు మహ్మద్ తాజుద్దీన్, సయ్యద్ అబ్బాస్ ఉల్ హక్, ఎస్‌కే మసూద్, మహ్మద్ ఫైజల్ ఖాన్ పాల్గొన్నారు.

నగర రహదారుల్లోని గోడలు, అండర్ పాస్ వంతెనలు, ఫ్లై ఓవర్లు అద్భుతమైన చిత్రాలకు వేదికగా నిలుస్తున్నాయి. వాహన చోదకులు, పాదచారులు, అటుగా వెళ్లే ప్రయాణికులను ఈ గోడ చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. సుమారు రెండు లక్షల ఎస్ఎఫ్‌టీల విస్తీర్ణంలో పలు చిత్రాలకు ప్రాణం పోసిన యువ కళాకారుడు ప్రేమ్ ఇస్రమ్ ఫ్రేమ్స్ నగరానికి కొత్త సొబగులు అద్దుతున్నాయి. ములుగు జిల్లా గిరిజన తాండా నేపథ్యంలో ఈ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి చిత్రాలు నలుగురికీ స్ఫూర్తిని కలిగిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ మార్గాలకు కొత్త సొబగులు

రెండు లక్షల ఎస్ఎఫ్‌టీల విస్తీర్ణంలో కళకళ రూపం

చిత్రాలకు ప్రాణం పోసిన యువ కళాకారుడు ప్రేమ్ ఇస్రమ్

నేపథ్యం ములుగు జిల్లా గిరిజన తాండా

నలుగురికీ స్ఫూర్తిని కలిగిస్తున్న ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి



ఆర్టిస్టిక్.. ఫ్రేమ్..ఫ్రేమ్..

నగరంలో అబ్బురపరుస్తున్న గోడ చిత్రాలు

ఇటీవలి కాలంలో నగరంలో ఎక్కడ చూసినా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ రోడ్లు అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. రంగు రంగుల చిత్రాలు కొత్త సొబగులు అద్దుతున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భాగ్యనగరాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగానే పలువురు ఫైన్ ఆర్ట్స్ కళాకారులు గోడలపై తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీని కోసం దాదాపు 149 కోట్ల నిధులతో రోడ్లు, కూడళ్లు, వీధులను ప్రత్యేకంగా, అత్యంత సుందరంగా మారుస్తున్నారు. నగరానికి తలమానికమైన హైటెక్ సిటీ, కొండాపూర్, ఇతర ప్రధాన రహదారులు అందమైన పెయింటింగ్స్‌తో ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా శేరిలింగంపల్లి జోన్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లు, స్ట్రీట్ ఆర్ట్‌లో ఓ యువకుడి కళాత్మకత కృషి దాగి ఉంది. మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్‌యూ వేదికగా ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసిన ప్రేమ్ ఇస్రమ్ (27) కొన్ని ఫ్లై ఓవర్లకు అత్యాధునిక టెక్నాలజీని ప్రతిబింబించే రంగుల చిత్రాలతో హంగులను అద్దాడు.







హాబీగా మొదలై..

ములుగు జిల్లా అటవీ ప్రాంతంలోని నార్లపూర్ అనే మారుమూల గ్రామం మాది. చిన్నప్పుడు ఆర్ట్ పై పెరిగిన మక్కువ ఈ ప్రయాణానికి కారణం. చిన్నతనంలో సమీపంలోని రోడ్లపై చాక్‌పీస్‌తో పెద్ద పెద్ద బొమ్మలు వేసి సంతోషపడే వాడిని. అదే హాబీగా మారి నగరాన్ని అందంగా మార్చే స్థాయికి రావడం ఆనందంగా ఉంది. సాధారణంగా ఆయిల్ పెయింటింగ్ పోర్ట్రేట్స్ వేయడంలో అనుభవజ్ఞుడిని.. గతంలో నల్గొండ జిల్లాలోని దేవరకొండలో ప్రభుత్వ ప్రాజెక్టులో భాగంగా చారిత్రాత్మక అంశాలతో స్ట్రీట్ ఆర్ట్ వేశాను. నగరంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో నా మూలాలైన ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలపై వేసిన పెయింటింగ్స్‌తో 'వేరియస్ ఇంప్రెషన్స్' అనే ప్రత్యేక ప్రదర్శన చేశాను.

– ప్రేమ్ ఇస్రమ్, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి







నాలుగు ఫ్లై ఓవర్లు..

హైటెక్ సిటీ నుంచి కూకట్‌పల్లి మార్గంలోని ఫ్లై ఓవర్‌పై సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, అధునాతన సాంకేతికత, ఈ తరం అధునాతన ఆలోచనలు ప్రతిబింబించే చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. దీనికి సమీపంలోని అయ్యప్ప సొసైటీ – 100 ఫీట్ రోడ్ అండర్ పాస్‌లో 'బజార్స్ ఆఫ్ హైదరాబాద్' థీమ్‌తో వేసిన పెయింటింగ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వీటన్నింటినీ తన బృందం (15 నుంచి 20 మంది)తో పూర్తి చేశానని, వీరందరూ కూడా తనతో చదువుకున్న జూనియర్స్, ఆర్ట్ ఫ్రెండ్స్ అని ప్రేమ్ తెలిపారు. ఒక ఫ్లై ఓవర్‌పూర్తి చేయడమే కష్టతరమైన నేపథ్యంలో దాదాపు 2 లక్షల ఎస్ఎఫ్‌టీల విస్తీర్ణంలో నాలుగు ఫ్లై ఓవర్లు కళాత్మకంగా సుందరీకరించానని పేర్కొన్నాడు. కొత్తగూడ అండర్‌పాస్‌లో ఇండియన్ ఆర్మీ లైఫ్ స్టోరీ, అదే ప్రాంతంలోని ఫ్లై ఓవర్‌పై అడ్వెంచర్, ట్రావెలింగ్‌కు సంబంధించిన పెయింటింగ్స్ వేశానని వివరించారు.



ఆకట్టుకుంటున్న గలేరియా 2025



మాదాపూర్ : స్థానిక చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన గలేరియా 2025 ఫొటోగ్రఫీ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే.లక్ష్మి కళాకారులు వేసిన సందేశాత్మక చిత్రాల ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 11 వరకూ నిర్వహించే ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 42 మంది ఫొటోగ్రాఫర్‌లు తీసిన 143 అపురూపమైన ఫొటో చిత్రాలు సందర్శకులను మెప్పిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జేఎన్ఏఎఫ్ఏయూ రిజిస్ట్రార్ జి.మధుకర్, ఇండియన్ ఫొటో ఫెస్టివల్ డైరెక్టర్ అక్విన్ మాథ్యూస్, కళాకారులు పాల్గొన్నారు.

పారాసైక్లిస్టుల సత్తా

ఆసియా రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు పతకాలు

సాక్షి, సిటీబ్యూరో: థాయిలాండ్‌లో జరుగుతున్న ఆసియా రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతీయ పారాసైక్లిస్టులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఒక స్వర్ణ పతకం, రెండు రజతాలు, ఒక కాంస్యం కలిపి మొత్తం నాలుగు పతకాలు గెలుచుకున్నారు. మహారాష్ట్రకు చెందిన జ్యోతి గడేరియా మహిళల సీ–2 విభాగంలో వ్యక్తిగత టైమ్ ట్రయల్‌లో స్వర్ణ పతకం గెలుచుకోగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అర్షద్ షేక్ పురుషుల సీ–2 విభాగంలో రజత పతకం, మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ అర్కల్ పురుషుల హ్యాండ్ సైక్లింగ్ హెచ్–4 విభాగంలో రజత పతకం, బీహార్ నుంచి జలాలుద్దీన్ అన్సారీ పురుషుల సీ–2 విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ విజయం పట్ల పారా అథ్లెట్లకు శిక్షణ ఇచ్చిన సంస్థలు ఆదిత్య మెహతా ఫౌండేషన్, అల్కాన్, జీఎంఎంసీఓ సంస్థల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారాసైక్లిస్టులు మాట్లాడుతూ ఈ విజయం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ ఘనత సాధించడంలో సహకరించిన కోచ్‌లు, మద్దతుదారులు దేశానికి కృతజ్ఞతలు తెలిపారు.





నగరంలో బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్..

మూడు రోజుల పాటు ప్రముఖ చిత్రాల ప్రదర్శన

హాజరుకానున్న జయప్రద, అపర్ణాసేన్, రాఖీ గుల్జార్, గౌతం ఘోష్, శేఖర్ కమ్ముల

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మక బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్–2025 జరుగుతోంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్, బెంగాలీ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ హరికృష్ణ మామిడి, హైదరాబాద్ బెంగాలీ సమితి అధ్యక్షులు మౌషుమి చౌదరి, జనరల్ సెక్రెటరీ జాయ్ కుమార్ దత్తా, బప్పా ముజేంద్రర్ పాల్గొన్నారు. 2017 నుంచి ప్రాంతీయ సినిమా గొప్పతనాన్ని ఈ వేడుకల ద్వారా చాటుతున్నారు. 9వ తేదీ వరకూ కొనసాగనున్న ఈ ఫెస్టివల్‌లో బెంగాలీ సినిమాలతో పాటు తమిళం, మలయాళం, ఒడియా, తెలుగులోని పలు ప్రాంతీయ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ వేడుకల్లో సినీ ప్రముఖులు జయప్రద, అపర్ణాసేన్, రాఖీ గుల్జార్, గౌతం ఘోష్, శేఖర్ కమ్ముల, ప్రొసెంజిత్ ఛటర్జీ, మున్ మున్‌సేన్ తదితరులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది అబిర్ ఛటర్జీ 'సూపర్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకోనున్నారని పేర్కొన్నారు.



మొదటి రోజు ప్రదర్శనల్లో..

ఇందులో భాగంగా సూరజ్ కా సత్వాన్ ఘోడా, గ్యాంగ్‌స్టర్ చిత్రాలను ప్రదర్శించారు.

- 8న 11.30కు పరమ, 12 గంటలకు జునూన్, ఒంటి గంటకు దో ఆన్స్, 2.45కు నానా హీ, 5 గంటలకు పదటిక్, 7.30కు చాల్‌చిత్ర సినిమాలను ప్రదర్శించనున్నారు.
- 9న 12 గంటలకు ఇట అమదేర్ గోల్పో, 2.30కు బెలైన్, 4 గంటలకు దో ఆన్స్, రాత్రి 7 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుంది.
- ఇదే వేదికగా ఇంద్రనీల్ చౌదరి ఆధ్వర్యంలో ఉత్తమ్ కుమార్‌కు చెందిన సినీ పుస్తకాలు, బుక్‌లెట్స్, మేగజైన్ కవర్స్, ఇతర పుస్తకాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు.

పోలీసు విభాగంలో ఉండే పని ఒత్తిడి, వేళాపాళా లేని విధులు, సరైన సమయానికి ఉండని తిండి-నిద్ర.. వెరసి ఆ విభాగంలో అత్యధికులు ఐదు పదుల వయసుకు చేరేసరికి దీర్ఘకాలిక రోగాల భారినపడుతూ ఉంటారు. ఊబకాయంతో పాటు బీపీ, షుగర్ వంటివి వీరిలో అత్యధికులకు మామూలే. వేల మంది ఉన్న ఈ విభాగంలో ఉద్యోగ విరమణ పొందే వరకూ ఫిట్‌గా ఉండే వారి సంఖ్య చాలా తక్కువనే చెప్పాలి. అలాంటి వారిలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోలో (టీజీ ఏఎన్‌బీ) డీఎస్పీగా పని చేస్తున్న కె నర్సింగ్‌రావు ఒకరు. ఆయన చేసిన సాహసమేంటి? తెలుసుకుందాం..! - సాక్షి, సిటీబ్యూరో



56 ఏళ్ల యంగ్‌స్టర్!

పవర్ లిఫ్టింగ్‌లో ఏసీపీ కె నర్సింగ్ రావు ప్రతిభ

- తనకంటే చిన్న వయస్కుడితో పోటీపడి విజయం
- పోలీసు పోటీల్లో బంగారు పతకం పొందిన అధికారి
- ఫిట్‌నెస్‌తో పాటు టెక్నిక్ కూడా కీలకం : నర్సింగ్‌రావు

ఆయన వయసు 56 ఏళ్లు. ఈ వయసులో కూడా కేవలం ఫిట్‌గా ఉండటమే కాదు.. ఇటీవల కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 105 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో తనకంటే సగం వయసు వారితో పోటీ పడ్డారు. మూడు విభాగాల్లోనూ కలిపి 402.5 కేజీల బరువు ఎత్తి బంగారం పతకం సాధించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆయన పంచుకున్న పలు అంశాలు..

మానసిక సంసిద్ధత ఎంతో కీలకం..

పోటీల్లో విజయం సాధించాలంటే ఫిట్‌నెస్‌తో పాటు టెక్నిక్ కూడా తోడవ్వాలి. రింగులో అడుగు పెట్టే ముందే మానసికంగా పూర్తిగా సంసిద్ధం కావాలి. రాష్ట్ర స్థాయి పోటీల కోసం కరీంనగర్‌లో అడుగుపెట్టినప్పుడు ఎందరో యువ క్రీడాకారులను చూశా. తొలుత వారితో పోటీ పడగలనా? అనిపించింది. అయితే పోటీ ప్రారంభమైన మరుక్షణం నా వయసు పూర్తిగా మర్చిపోయా. కేవలం లక్ష్యాన్ని మాత్రమే గుర్తుంచుకున్నా. బరువులు ఎత్తడానికి అవసరమైన బలం ఉన్నా.. నైపుణ్యం లేకపోతే దీర్ఘకాలిక గాయాల బారినపడే ప్రమాదం ఉంది. అందుకే మరింత ఏకాగ్రతతో వ్యవహరించా. పవర్ లిఫ్టింగ్‌లో స్క్వాట్స్‌తో పాటు బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టింగ్ అత్యంత కీలకం. స్క్వాట్స్ సమర్థవంతంగా చేయడానికి వెన్నుముక గట్టిగా ఉండాలి.

ఐదు రోజుల పాటు పోటీలు..

రాష్ట్ర స్థాయి పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ కరీంనగర్‌లో గత నెల 28 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకూ ఐదు రోజుల పాటు జరిగింది. నేను 105 కిలోల కేటగిరీలో పోటీ పడ్డాను. నేను 35 కిలోల స్క్వాట్స్, 92.5 కిలోల బెంచ్ ప్రెస్, 175 కిలోల డెడ్ లిఫ్ట్ కలిపి మొత్తం రూ.402.5 కిలోలు ఎత్తాను. దినచర్యలో నిత్యం వ్యాయామం ఉండటం, రిజర్వ్ పోలీసు బలగాల్లో పనిచేసే వాళ్లు శాంతిభద్రతల విభాగం వారి కంటే ఫిట్‌గా ఉంటారు. ఆ విభాగానికి చెందిన, 25–30 ఏళ్ల మధ్య వయసు ఉన్న రిజర్వ్ సబ్–ఇన్‌స్పెక్టర్‌తో పోటీ పడ్డా. ఆయన 400 కేజీలు ఎత్తారు. దీంతో మరింత సమాయత్తమై, నైపుణ్యంతో 402.5 కేజీలు ఎత్తి బంగారం పతకం సాధించా. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని నిర్ణయించుకున్నా. ఈ పోటీలో గెలవడం కోసం దినచర్యలో అనేక మార్పులు చేశా.



ప్రాక్టీస్‌తో పాటు డైట్ అవసరం..

ఇలాంటి ఈవెంట్స్‌లో మన మార్కు చూపించాలంటే అవసరమైన ప్రాక్టీస్‌తో పాటు డైట్ కూడా అవసరం. వయసును దృష్టిలో పెట్టుకుని పండ్లతో పాటు క్యాల్షియం అధికంగా ఉండే ఆహారం, ప్రొటీన్ తీసుకున్నా. శరీరం బరువు వల్ల పోటీ పడే కేటగిరీ మారిపోయే ప్రమాదం ఉంటుంది. కీలకమైన ప్లాన్‌తో రోజును సద్వినియోగం చేసుకుంటా. దీని వల్లే అటు వృత్తికి, ఇటు ప్రవృత్తికి న్యాయం చేయగలిగా. నేను పతకం సాధించడంలో నా కుటుంబం, ఉన్నతాధికారుల ప్రోత్సాహం ఎంతో కీలకం.





సకల సౌధం

కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా వసతుల కల్పన

ఉద్యోగస్తుల కోసం వర్క్ ఫ్రం హోమ్ స్పేస్	పార్కింగ్‌లో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు	పిల్లల కోసం స్టడీ, డిజిటల్ క్లాస్ రూమ్	టెర్రస్, క్లబ్‌హౌస్‌పై సౌర విద్యుత్ సౌకర్యం	పెంపుడు జంతువుల కోసం పెట్‌పార్క్

నివాస సముదాయాల్లో అన్ని వసతులు ఉండాల్సిందే.. ఆ విషయంలో మాత్రం అస్సలు తగ్గేదే లే అంటున్నారు కొనుగోలుదారులు.. గతంలో కమ్యూనిటీలలో జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి నాలుగైదు వసతులు ఉంటే సరిపోయేది. కానీ.. ప్రస్తుతం భవిష్యత్తు అవసరాలతో పాటు అభిరుచులకు తగ్గట్టుగా వసతులు ఉండాల్సిందే. ఇంటి నుంచి పని కోసం కో–వర్కింగ్ స్పేస్, ఆన్‌లైన్ క్లాస్‌ల కోసం డిజిటల్ క్లాస్ రూమ్ నుంచి మొదలుపెడితే.. టెర్రస్, క్లబ్ హౌస్‌పై సౌర విద్యుత్ ఏర్పాట్లు, ఔట్‌డోర్ జిమ్, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్, హోమ్ థియేటర్, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, పెట్‌పార్క్, గోల్ఫ్ కోర్స్ వరకూ అన్ని ఆధునిక వసతులు కావాలని గృహ కొనుగోలుదారులు భావిస్తున్నారు.

–సాక్షి, సిటీబ్యూరో



పెట్ పార్క్, స్పా..

జంతు ప్రేమికుల కోసం కూడా డెవలపర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నివాస సముదాయాల్లో వసతుల జాబితాలో పెట్ పార్కులు కూడా చేరిపోయాయి. గేటెడ్ కమ్యూనిటీలలో కొనుగోలుదారులు పెంచుకునే పెంపుడు జంతువుల కోసం పెట్ పార్క్, క్లబ్‌హౌస్‌లో పెట్ స్పాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తులు, శిక్షకులు, వ్యాయామ ఉపకరణాలు వంటివి ఆయా ప్రాజెక్ట్‌లలో అందుబాటులో ఉంటాయి.



సోలార్, హోమ్ గార్డెనింగ్

సొంతిల్లు కొనుగోలు చేసే క్రమంలో గేటెడ్ కమ్యూనిటీలో కామన్ ఏరియాలు ఎంత వరకు ఉన్నాయో అడిగి మరీ తెలుసుకుంటున్నారు. గతంలో కామన్ ఎలివేటర్, కామన్ కారిడార్, గ్యారేజ్, స్టేర్‌కేస్ ఉండేవి ఇప్పుడు వాటిని ప్రైవేట్ కావాలని అడుగుతున్నారు. ఇంట్లో సొంత అవసరాల కోసం కమ్యూనిటీ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నపాటి స్థలంలో ఆకు కూరలు, కూరగాయలు పండించుకునేలా వర్టికల్ గార్డెనింగ్, బాల్కనీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వారాంతాల్లో కమ్యూనిటీ వాసులతో ఆహ్లాదంగా గడిపేందుకు ఔట్‌డోర్ కిచెన్, డైనింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. టెర్రస్, క్లబ్‌హౌస్‌పై సౌర విద్యుత్ ఏర్పాటు చేస్తున్నారు. వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం ఈ విద్యుత్‌నే వినియోగిస్తున్నారు. దీంతో నివాసిత సంఘానికి కరెంట్ బిల్లు భారం తగ్గుతుంది.

ఈవీ చార్జింగ్ స్టేషన్లు

పెట్రోల్, డీజిల్ వంటి వాహనాలతో పర్యావరణం కాలుష్యం అవుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వాహన కొనుగోళ్లపై రాయితీలు అందిస్తుండటంతో పాటు చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తున్నాయి. డెవలపర్లు కూడా నివాస, వాణిజ్య సముదాయాల నిర్మాణంలో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. నగరానికి చెందిన మైహోమ్, రాజపుష్ప, ప్రణీత్ గ్రూప్, పౌలోమి ఎస్టేట్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా వసతులను కల్పిస్తున్నారు.







వసతులు ఇలా..

- నివాస సముదాయంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, ప్రతి పార్కింగ్ ప్లేస్ వద్ద చార్జింగ్ పెట్టుకునేందుకు వీలుగా పాయింట్లను ఇస్తున్నారు.
- జంతు ప్రేమికుల కోసం నివాస సముదాయంలోనే పెట్‌పార్క్, క్లబ్ హౌస్‌లో పెట్ స్పాలను ఏర్పాటు చేస్తున్నారు. పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తులు, శిక్షకులు, వ్యాయామ ఉపకరణాలు వంటివి ఆయా ప్రాజెక్ట్‌లలో అందుబాటులో ఉంటాయి.
- రిచ్‌మ్యాన్ గేమ్‌గా పిలిచే గోల్ఫ్ కూడా వసతుల జాబితాలో చేరిపోయింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో జిమ్ చేయాలని అందరూ భావిస్తున్నారు. దీంతో ఇండోర్ జిమ్‌లు కాస్త ఔట్‌డోర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఓజోనైజ్డ్ మెడిటేషన్ హాల్, ఉష్ణోగ్రత నియంత్రణ స్విమ్మింగ్ పూల్స్ వచ్చేశాయి.
- వైద్య అవసరాల కోసం మినీ ఆస్పత్రి, మెడికల్ షాపు, అంబులెన్స్, పారా మెడికల్ సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- గతంలో మాదిరిగా సినిమాలకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో నివాస సముదాయంలోనే మల్టీప్లెక్స్ అనుభూతి కలిగేలా స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్‌ను డెవలపర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.



షెహర్.. హుషార్

హైదరాబాద్, బెంగళూరు, ముంబైలలో ఇళ్లకు డిమాండ్

దేశీయ రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలో హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాలు కీలకంగా మారాయి. ఈ ఏడాది గృహ విక్రయాలు ఈ మూడు నగరాల్లోనే అధిక స్థాయిలో జరిగాయి. తక్కువ వడ్డీ రేట్లు, స్థిరమైన ప్రాపర్టీ ధరలే ఇందుకు కారణమని హౌసింగ్.కామ్ ఇండియన్ రెసిడెన్షియల్ ఇండెక్స్ ఫర్ ఆన్‌లైన్ సెర్చ్ (ఐఆర్ఐఎస్) అంచనా వేసింది. రియల్టీ స్టేక్ హోల్డర్లు, ప్రభుత్వం, బ్యాంక్‌లు, ప్రాపర్టీ ఇన్వెస్టర్లు అందరూ టర్న్ ఎరౌండ్ మార్కెట్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపింది. అది గతేడాది సానుకూల దృక్పథంతో మొదలైందని తెలిపింది. గతేడాది వృద్ధే ఈ ఏడాది కూడా కొనసాగుతోంది.

– సాక్షి, సిటీబ్యూరో

- దేశీయ రియల్టీ రంగంలో ఈ మూడు నగరాలు కీలకం
- కంపెనీ నియామకాలు పెరగడంతో అద్దెలకూ ఆసక్తి

ప్రధాన నగరంలో ఇరుకు ఇళ్ల మధ్య ఉండటం బదులు శివారు ప్రాంతాలు, హరిత భవనాలు, విస్తీర్ణం ఎక్కువగా ఉండే ఫ్లాట్లు, విల్లాలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి పట్టణాలలోని ప్రాపర్టీలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో సూరత్, జైపూర్, పాట్నా, మోహాలీ, లక్నో, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలు ఆన్‌లైన్‌లో ప్రాపర్టీల సెర్చ్‌లో గణనీయమైన వృద్ధి నమోదు చేశాయని తెలిపింది. ఆయా ద్వితీయ శ్రేణి పట్టణాల్లో గృహ కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొంది. నోయిడాలోని నోయిడా ఎక్స్‌టెన్షన్, ముంబైలోని మీరా రోడ్ ఈస్ట్, అంధేరి వెస్ట్, బోరివలీ వెస్ట్, బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతాలు ఈ ఏడాది దేశీయ నివాస సముదాయ మార్కెట్‌ను లీడ్ చేస్తాయని తెలిపింది.

మారిన అభిరుచులు..

ఆన్‌లైన్‌లో రూ.2 కోట్లకు పైబడిన ప్రాపర్టీల శోధన ఒకట్నిర శాతం వృద్ధి చెందిందని పేర్కొంది. గతంలో ప్రాపర్టీ కొనాలంటే ధర, వసతులు ప్రధాన అంశాలుగా ఉండేవి. ప్రస్తుతం గృహ కొనుగోలుదారుల ఎంపికలో మార్పులొచ్చాయని హౌసింగ్.కామ్ కన్జ్యూమర్ సెంటిమెంట్ ఔట్‌లుక్ తెలిపింది. 3 బీహెచ్‌కే, ఆపై పడక గదుల గృహాల్లో 2023తో పోలిస్తే 2024లో 15 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. అదే సమయంలో గతేడాది పెద్ద సైజు ఫ్లాట్లలో 42 శాతం పెరుగుదల కనిపించిందని తెలిపింది.

అద్దెలకు గిరాకీ..

ప్రాజెక్ట్‌ల ఆలస్యం, దివాళా డెవలపర్లు వంటి ప్రతికూల వాతావరణంలోనూ నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో ప్రాపర్టీ కోసం సెర్చ్ గణనీయంగా పెరిగింది. నోయిడా ఎక్స్‌టెన్షన్ ప్రాంతం ఆన్‌లైన్ ప్రాపర్టీ సెర్చింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఈ రీజియన్‌లో పలు మౌలిక సదుపాయల ప్రాజెక్ట్‌లను ప్రకటించడం, ధరలు అందుబాటులో ఉండటం వంటివి ఈ రీజియన్‌లో ప్రాపర్టీల వృద్ధికి కారణమని తెలిపింది. ఐటీ, ఫార్మా కంపెనీలు ఉద్యోగ నియామకాలను పెంచడంతో ముంబై, బెంగళూరు, ఢిల్లీ మార్కెట్లలో అద్దెలకు గిరాకీ పెరిగిందని పేర్కొంది.



గృహం.. సుందరం..

ఉన్నంతలో ఇంటిని అందంగా పెట్టుకోవటం కళే. ఇందుకోసం ప్రత్యేకంగా షాపింగ్‌లేమీ చేయాల్సిన అవసరం లేదు. కాస్తంత కళాత్మక దృష్టి ఉంటే చాలు. గోడలకు మంచి వాల్‌పేపర్స్ అతికించడం, పాత ఫర్నిచర్‌కు మెరుగులు దిద్దటం, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్, డ్రాయింగ్ రూములను చిన్న చిన్న మార్పులతో పొందికగా మలుచుకోవటం లాంటివి చేస్తే చాలు. ఇల్లు ముచ్చటగా.. పొదరిల్లులా మారుతుంది.

– సాక్షి, సిటీబ్యూరో



- డైనింగ్ రూమ్‌లో పెద్ద టేబుల్ పెట్టి దాన్ని చైనీస్ పోర్సిలిన్ తరహా వస్తువులతో అలంకరిస్తే చూడముచ్చటగా ఉంటుంది. ఆ వస్తువులు గది రంగుకి మ్యాచ్ అవ్వాలనేమీ లేదు.
- వంటింటికి అందమైన లెనిన్ కర్టెన్ అమర్చాలి. ఇలా చేస్తే కిచెన్ లుక్ బాగుండటమే కాదు లోపల మనం ఏం చేస్తున్నది ఎవ్వరికీ తెలిసే అవకాశం ఉండదు. వంటింటికి స్టీల్ అండ్ గ్లాస్ కేస్‌మెంట్స్ ఫ్రేమ్స్‌ని పెడితే చూడ్డానికి అందంగా ఉంటుంది. ఆరు బయట ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పని చేసుకోవచ్చు.
- బెడ్‌రూమ్‌లో మంచంపై మిక్స్ అండ్ మ్యాచ్ దుప్పట్లు వేస్తే ఆ రూముకి కొత్త అందం వస్తుంది. బెడ్‌రూమ్‌లో యాంటిక్ కేజ్‌లైట్స్ పెట్టుకుంటే మరింత బాగుంటుంది.
- బాత్‌రూమ్‌లో పెడస్టల్ టబ్, ఫిక్సర్లు అమర్చుకుంటే బాగుంటుంది. ఇల్లు కట్టిన కాలాన్ని గుర్తు చేసేలా ఆ ఇంట్లోని వస్తువుల అమరిక ఉంటే గదులకు యాంటిక్ లుక్ వస్తుంది.
- ఇంట్లో ఉన్న పాత సోఫా, ఇతర ఫర్నిచర్‌లకు పెయింట్ వేస్తే న్యూలుక్‌తో అవి మెరిసిపోతాయి. హాలులో ఉన్న పెద్ద గోడలకు వెరైటీగా రంగు రంగుల ప్లేట్లను అతికిస్తే చూడ్డానికి ఆర్ట్‌పీస్‌లా ఎంతో బాగుంటుంది.
- గెస్ట్ రూమ్‌లో విన్నైల్ షేడ్స్‌తో వాల్ పేపర్లను అతికిస్తే ఆ గది అందంగా తయారవుతుంది.
- ఇంట్లో ఉన్న వాలు కుర్చీలపై పాత కర్టెన్లు పరిస్తే వెరైటీగా ఉంటుంది. వాటిపైనున్న పాతకాలం నాటి డిజైన్లు కుర్చీలకు కొత్త అందాన్ని ఇస్తాయి.



సేల్స్ డల్

- స్టూడియో అపార్ట్‌మెంట్లకు ఆదరణ కరువు
- చిన్న సైజు గృహాలకు తగ్గుతున్న డిమాండ్



తెల్లారింది లేచామా.. ఆఫీసుకు వెళ్లామా.. రాత్రికి ఎప్పుడో ఇంటికి చేరుకున్నామా.. మరుసటి రోజు మళ్లీ సేమ్ టు సేమ్.. ఇదే నగరవాసి జీవితం.. సంపాదన బిజీలో పడిన సగటు జీవికి కాసేపు సేదతీరేందుకే గూడు. ఇదంతా కరోనాకు ముందు.. కరోనా వచ్చి సగటు మనిషి ప్రపంచాన్నే మార్చేసింది. కేవలం తినడం, పడుకోవడమే కాదు.. ఆఫీసు, స్కూల్, వ్యాయామం, వినోదం అన్నీ ఇంటి నుంచే కావడంతో ఒకప్పుడు హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన స్టూడియో అపార్ట్‌మెంట్లకు క్రమంగా డిమాండ్ పడిపోయింది. వీటి స్థానంగా విశాలమైన గృహాలు, ఫ్లాట్స్‌కు గిరాకీ పెరిగిపోయింది.

– సాక్షి, సిటీబ్యూరో

- బెడ్ కం లివింగ్ రూమ్, కిచెన్, అటాచ్‌డ్ బాత్‌రూమ్ ఉండే వాటిని స్టూడియో అపార్ట్‌మెంట్ అంటారు. కరోనా మొదలైన ఏడాది(2020) నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఈ తరహా అపార్ట్‌మెంట్ల సరఫరా క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. గతేడాది తొలి అర్ధ వార్షికం(జనవరి–జూన్)లో 1,063 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో కేవలం 9 శాతం (91 ప్రాజెక్ట్‌లు) మాత్రమే స్టూడియో అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 1,207 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో 145 ప్రాజెక్ట్‌లు స్టూడియో అపార్ట్‌మెంట్లున్నాయి.

19 శాతానికి స్టూడియో ప్రాజెక్ట్‌లు..

2013 నుంచి 2019 మధ్య స్టూడియో అపార్ట్‌మెంట్ల ట్రెండ్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2013లో ఏడు ప్రధాన నగరాల్లో 2,102 ప్రాజెక్ట్‌లు ప్రారంభం కాగా.. ఇందులో 4 శాతంతో 75 ప్రాజెక్ట్‌లు **స్టూడియో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి.** అలాగే 2014లో 151, 2015లో 190, 2016లో 128, 2017లో 197, 2018లో 446 స్టూడియో ప్రాజెక్ట్‌లు లాంచ్ అయ్యాయి. 2019లో 1,921 ప్రాజెక్ట్‌లు ప్రారంభం కాగా.. 19 శాతం వాటాతో 368 ప్రాజెక్ట్‌లు స్టూడియో అపార్ట్‌మెంట్లే..

లొకేషన్ ముఖ్యం..

స్టూడియో అపార్ట్‌మెంట్లను బ్యాచ్‌లర్స్, పర్యాటకులు, వ్యాపార ప్రయాణికులు, యువ దంపతులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వీటికి విస్తీర్ణంతో కాకుండా లొకేషన్ ఆధారంగా డిమాండ్ ఉంటుంది. తరచూ ఇవి ఉపాధి, వ్యాపార కేంద్రాల చుట్టూ, ఖరీదైన ప్రదేశాలలో ఎక్కువగా ఉంటాయని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. కానీ, కరోనా కారణంగా వర్క్ ఫ్రం హోమ్ సంస్కృతి మొదలైంది. దీంతో 2020 నుంచి పెద్ద సైజు ఇళ్లకు డిమాండ్ పెరిగిందన్నారు.

మన దగ్గర తక్కువే..

స్టూడియో అపార్ట్‌మెంట్లకు ఉత్తరాది నగరాల్లో ఉన్నంత డిమాండ్ దక్షిణాదిలో ఉండదు. ముంబై, పుణె నగరాల్లో ఈ తరహా ఇళ్ల ట్రెండ్ కొనసాగుతోంది. 2013–20 మధ్య కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో లాంచింగ్ **అయిన స్టూడియో అపార్ట్‌మెంట్లలో 96** శాతం వాటా ముంబై, పుణెలదే. ఇదే కాలంలో దక్షిణాది నగరాలైన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో కేవలం 34 స్టూడియో ప్రాజెక్ట్‌లు ప్రారంభమయ్యాయి. గతేడాది హెచ్–1లో ఏడు నగరాలలో ప్రారంభమైన 91 స్టూడియో ప్రాజెక్ట్‌ల్లో.. 71 ప్రాజెక్ట్‌లు ముంబైలోనే ఉన్నాయి. ఆ తర్వాత పుణెలో 18, బెంగళూరులో రెండు ప్రాజెక్ట్‌లు లాంచ్ అయ్యాయి.



కమాల్ హై

షాపింగ్ మాల్స్‌లో రిటైల్ స్పేస్ పెరుగుదల

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో డిమాండ్

ఈ ఏడాది నిర్మాణంలో 20 లక్షల చ.అ.మాల్స్

కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: గతేడాది హైదరాబాద్ స్థిరాస్తి రంగానికి బాగానే కలిసొచ్చింది. నివాస, వాణిజ్య, కార్యాలయ విభాగాలతో పాటు రిటైల్ రంగం కూడా మెరుగైన పనితీరునే కనబర్చింది. షాపింగ్ మాల్స్‌లో రిటైల్ స్పేస్ క్రమంగా పెరుగుతోంది. గతేడాది నగరంలో 18 లక్షల రిటైల్ స్పేస్ లావాదేవీలు జరిగాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, కోకాపేట వంటి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) ప్రాంతాల్లో 2 లక్షల చ.అ.లావాదేవీలు జరిగాయని తెలిపింది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలలో కొత్తగా 59.48 లక్షల చ.అ. విస్తీర్ణంలో 11 షాపింగ్ మాల్స్ అందుబాటులోకి వచ్చాయి.

సిటీలో మూడు మాల్స్

గతేడాది అత్యధికంగా హైదరాబాద్‌లో మూడు మాల్స్ అందుబాటులోకి వచ్చాయి. పుణె, చెన్నైలో రెండేసి, ముంబై, ఢిల్లీ, ఎన్‌సీఆర్, బెంగళూరు, అహ్మదాబాద్‌లో ఒక్కోటి చొప్పున అందుబాటులోకి వచ్చాయి. కోల్‌కత్తాలో ఒక్క మాల్ కార్యరూపంలోకి రాలేదు. 2023లో 15 లక్షల చ.అ.షాపింగ్ మాల్ స్పేస్ మార్కెట్‌లోకి రాగా.. ఈ ఏడాది నిర్మాణంలో ఉన్న మరో 20 లక్షల చ.అ. స్థలం అందుబాటులోకి రానుంది. నల్లగండ్ల, నానక్‌రాంగూడ, కొంపల్లి వంటి ప్రాంతాలలో కొత్త మాల్స్ నిర్మాణంలో ఉన్నాయి. నల్లగండ్లలో అపర్ణా సంస్థ 7 లక్షల చ.అ. విస్తీర్ణంలో మాల్ అండ్ మల్టీప్లెక్స్‌ను నిర్మిస్తోంది. కూకట్‌పల్లి 16.60 లక్షల చ.అ. లేక్‌షోర్ మాల్స్ శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్నాయి.

5–25 శాతం పెరిగిన అద్దెలు

నగరంలో ఫ్యాషన్, హైపర్ మార్కెట్, ఫుడ్ అండ్ బేవరేజ్ వంటి విభాగాల పనితీరు బాగుండటంతో రిటైల్ స్పేస్‌కు గిరాకీ పెరిగింది. ప్రధానంగా కొంపల్లి, కోకాపేట, ఏఎస్‌రావ్ నగర్, నల్లగండ్ల, వనస్థలిపురం, కొండాపూర్, మణికొండ వంటి ప్రాంతాల్లో ఎక్కువ కార్యకలాపాలు జరిగాయి. అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొంపల్లి, కొత్తపేట, మాదాపూర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో అద్దెలు పెరిగాయి. గత కొన్ని త్రైమాసికాలలో ఆయా ప్రాంతాలలో అద్దెలు 5–25 శాతం మేర వృద్ధి చెందాయి.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నపై కేసు ఎందుకు నమోదు చేయలేదు?

పోలీసులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు చేసినప్పటికీ ఆయనపై కేసు ఎందుకు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీచేసింది. ఈ నెల 2న వరంగల్‌లో జరిగిన బీసీ సంఘ సమావేశంలో నవీన్ ఒక కులాన్ని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా ఫిర్యాదు చేసినా.. పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదంటూ సిద్దిపేటకు చెందిన కె.అరవింద్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిద్దిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని, డీ జీపీ, పోలీసు కమిషనర్లకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. కౌంటర్ దాఖలు చేయాలని సిద్ది పేట పోలీసులను ఆదేశిస్తూ విచారణ ఈనెల 21కి వాయిదా వేశారు.

సీఎంఆర్ కాలేజీ ఘటనపై లోతైన విచారణ చేస్తున్నాం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద


సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ జిల్లాలోని సీఎంఆర్ కాలేజీ ఘటనపై లోతైన విచారణ చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద వెల్లడించారు. విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కళాశాల యాజమాన్యంతో పాటు విద్యార్థినులతో పలు కోణాల్లో విచారణ చేసినట్లు చెప్పారు. ఎలాంటి ఘటనలు జరగలేదని కాలేజీ యాజమాన్యం చెబుతుండగా.. విద్యార్థినులు మాత్రం జరిగినట్లు చెప్పారన్నారు. ఈక్రమంలో లోతైన విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని వెల్లడించారు. శుక్రవారం మహిళా కమిషన్ కార్యాలయంలో శారద మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ విద్యా సంస్థలోనైనా విద్యార్థినులు ఇబ్బందులు పడితే కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. వెంటనే అలాంటి వాటిపై అప్రమత్తమై విచారణ చేపడతామని తెలిపారు.

ఫుట్‌వేర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులకు గడువు

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగాడ్యుయేట్ కోర్సులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను కోరుతున్నామని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహుగారి తేజ్‌లోహిత్‌రెడ్డి (ఐఏఎస్) తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ఎఫ్‌డీడీఐలలో ప్రవేశాలకు దేశమంతటా నిర్వహించే అర్హత పరీక్షను ఆలిండియా సెలక్షన్ టెస్ట్-2025 (ఏఐఎస్‌టీ-2025) నిర్వహించి అందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారికి అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. దరఖాస్తు ఫారాలను ఏప్రిల్ 20వ తేదీ లోపు అందించాలని సూచించారు. హైదరాబాద్ రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో ఉన్న కోర్సులు, ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ 9440471336లో సంప్రదించాలని సూచించారు.

నేతకాని, మహర్ కులాలకు ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేయాలి: మందకృష్ణ మాదిగ



పంజగుట్ట(హైదరాబాద్): 'దళితుల్లో మాదిగ, మాలల తర్వాత అత్యధిక జనాభా ఉన్న మూడవ కులం నేతకాని. నేతకానికి మహర్ కులం కూడా సారూప్యంగా ఉంటుంది. ఈ రెండింటికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగో పెద్ద కులమైన బుడగజంగాలకు మరో 14 కులాలు కలిపి ఒక గ్రూపుగా చేసినప్పుడు, మూడవ పెద్దకులాన్ని మరికొన్ని కులాలను కలిపి ఒక గ్రూపుగా చేయడంలో సమస్య ఏముందని ఆయన ప్రశ్నించారు. ఎక్కువ జనాభా ఉన్న మహర్, నేతకానిలను మాలలతో కలిపి చూపించి ఎస్సీ 'సీ'లో చేర్చి వారి అవకాశాలను కూడా మాలలే దండుకునేందుకు కుట్రలు పన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. ఎన్నికల సమయంలో పెద్దపల్లిలో ఓట్లు దండుకునేందుకు ఎమ్మెల్యే వివేక్ నేతకానిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు వారికి ప్రత్యేక గ్రూపునకు ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలుస్తామని, ప్రభుత్వం మెడలు వంచి అయినా మాదిగలకు 11 శాతం, నేతకాని, మహర్‌లకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయిస్తామన్నారు. పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన జాబితా తప్పుల తడకగా ఉందని, నేతకాని జనాభా 10 లక్షల వరకు ఉంటే కేవలం లక్షా 33 వేలు చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నేతకాని విద్యార్థి సంఘం అధ్యక్షుడు సాయిప్రసాద్ నేత, నాయకులు దుర్గం రాజేష్, భువనచంద్ర, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లల గొంతు తడిచేదెలా!

తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 450 ప్రభుత్వ స్కూళ్లకు తాగునీటి సరఫరా లేదు. 1,000కి పైగా స్కూళ్లలో స్థానికులు అరకొరగా కుండల్లో, క్యాన్లలో నీళ్లు అందిస్తున్నారు. మొదటి గంటలోనే ఇవి ఖాళీ. మధ్యాహ్నం వేళ విద్యార్థులు మంచినీటి కోసం అల్లాడే పరిస్థితి ఉంది.

- ఎండలు పెరుగుతుండటంతో నానాటికీ తీవ్రమవుతున్న సమస్య
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలల్లో ఇదే దుస్థితి
- విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చిన డీఈఓలు
- 6 వేల స్కూళ్లకు 'మిషన్ భగీరథ'దూరం
- 4,500 పాఠశాలల్లో ట్యాంకుల నిర్వహణ లోపం
- 10 వేల స్కూళ్లల్లో ఇళ్ల నుంచే నీళ్లు తెచ్చుకుంటున్న వైనం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇతర సౌకర్యాల మాట అటుంచితే వందలాది స్కూళ్లలో కనీసం తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. దాహం తీర్చుకునేందుకు పిల్లలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల విద్యాశాఖ జరిపిన సమీక్షలో దాదాపుగా అన్ని జిల్లాల డీఈవోలు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలోనూ తాగునీరు అందుబాటులో లేని పరిస్థితి ఉంటోందని ఎంఈవోలు వివరిస్తున్నారు. స్కూళ్ళలో నీటి ట్యాంకుల నిర్వహణ సరిగా లేకపోవడం, గత ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ మంచినీటి సరఫరా లేకపోవడం, అనేకచోట్ల విద్యుత్ కోతల కారణంగా ఓవర్ హెడ్ ట్యాంకులు నిండకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ స్కూళ్లుండగా.. ప్రభుత్వానికి అందిన వివరాల ప్రకారం దాదాపు 6 వేల స్కూళ్ళకు భగీరథ నీరు సరఫరా అవ్వడం లేదు. 10 వేల స్కూళ్ళల్లో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్ళే తాగుతున్నారు. దాదాపు 4500 స్కూళ్ళల్లో నీళ్ళ ట్యాంకులు మరమ్మతుకు నోచుకోకపోవడం లేదా, నిర్వహణ లోపం వల్ల విద్యార్థులకు మంచి నీటి కొరత ఉంది.

దాదాపు అన్నిచోట్లా అదే దుస్థితి

» ఆదిలాబాద్ జిల్లాలోని పలు స్కూళ్ళలో విద్యార్థులకు మంచినీటి సౌకర్యం లేదు. మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు నీటి కోసం విద్యార్థులు ఎగబడే పరిస్థితి ఉంది. అంతమంది విద్యార్థులకు వాటర్ క్యాన్లలో నీళ్లు తేవడం సాధ్యం కావడం లేదని అక్కడి డీఈవో ఉన్నతాధికారులకు తెలిపారు.

» కరీంనగర్ జిల్లాలోని 600 స్కూళ్ళకు మిషన్ భగీరథ నీటి సరఫరా లేదు. తాగునీటి కోసం ప్రధానోపాధ్యాయులు.. స్థానిక నేతలను ఆశ్రయిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానికులు నీళ్ళు అందిస్తున్నారు. 800 ప్రభుత్వ స్కూళ్ళల్లో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత చేతులు కడుక్కునే నీళ్ళు కూడా పొదుపుగా వాడాల్సిన పరిస్థితి ఉంది.

» నిజామాబాద్‌లో పలు హాస్టళ్ళు, స్కూళ్ళల్లో నీటి నిల్వకు అవసరమైన వాటర్ ట్యాంకులు లేవు. దీంతో అప్పటికప్పుడు క్యాన్లలో నీళ్ళు తెప్పిస్తున్నారు. ఇవి మొదటి గంటలోనే అయిపోతున్నాయి.

» వరంగల్ జిల్లాలో 1500 స్కూళ్ళలో విద్యార్థులు ఇళ్ళ నుంచే నీళ్ళు తెచ్చుకుంటున్నారు. తెచ్చుకోని తోటి విద్యార్థులు దాహం అవుతోందని అన్నా.. సందేహిస్తూనే ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటోంది. పలువురు హెచ్ఎంలు ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళారు.

» ఉమ్మడి ఖమ్మం జిల్లా మారుమూల పల్లెల్లోని 820 పాఠశాలల్లో తాగునీటి సరఫరా అరకొరగా ఉంది. దీంతో విద్యార్థులు మధ్యలోనే స్కూళ్ళ నుంచి ఇంటికెళ్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 600 స్కూళ్ళలో నీటి ట్యాంకుల నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థులు దాహార్తితో అల్లాడుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి

పెరుగుతున్న ఎండలతో పాటు స్కూళ్లలో మంచినీటి సమస్య తీవ్రమవుతుండటంతో విద్యాశాఖ అప్రమత్తమైంది. పాఠశాలల నుంచి సమగ్ర వివరాలు తెప్పించుకునే పనిలో ఉంది. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తుండటంతో నీటి కొరత వేధిస్తోందని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. తక్షణ చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక బడ్జెట్ విడుదల కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. ఈలోగా స్థానిక ప్రజాప్రతినిధులు, అలా వీలు కాకపోతే హెచ్ఎంలు అవసరమైన తాగు నీటిని తెప్పించాలని, ఇందుకు సంబంధించిన బిల్లులను చెల్లిస్తామని డీఈవోలకు తెలిపారు. ఎంఈవోలు స్కూళ్ళలో నీటి సమస్యపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

కాలయాపన సరికాదు

- మార్గదర్శి కేసులో ఆర్‌బీఐ తీరుపై తెలంగాణ హైకోర్టు అసంతృప్తి
- ఆర్‌బీఐని ఆదేశించిన ద్వి సభ్య ధర్మాసనం.. విచారణ 14కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ ఆర్థిక అవకతవకలపై కౌంటర్లు దాఖలు చేయడంలో కాలయాపన సరికాదని తెలంగాణ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అందరి వాదనలు విని వీలైనంత త్వరగా తీర్పు వెల్లడించాలని సుప్రీంకోర్టు సూచించిన విషయాన్ని గుర్తు చేసింది. అదనపు కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు రెండు వారాలు గడువు కావాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కోరడం సరికాదంది. అంత సమయం ఇవ్వలేమని, వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇకపై ప్రతి శుక్రవారం విచారణ చేపడతామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తను పేరును కాజ్ లిస్టులో చేర్చాలని అక్టోబర్‌లో రిజిస్ట్రీని ఆదేశించినా అది అమలు కావడం లేదని కోర్టు సహాయకుడు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీంతో మరోసారి ధర్మాసనం రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది.



సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణ

చట్ట నిబంధలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. అలాగే తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం 2024 ఏప్రిల్ 9న హైకోర్టు తీర్పును కొట్టివేసింది. ఆ తీర్పును తప్పుబడుతూ.. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని చెప్పింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ కె.సుజన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకుడిగా మాజీ ఎంపీ అరుణ్‌కుమార్, ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వర్చువల్‌గా.. ఏపీ స్పెషల్ జీపీ రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ పీపీ పల్లె నాగేశ్వర్‌రావు నేరుగా విచారణకు హాజరయ్యారు. కౌంటర్ దాఖలు చేయడానికి రెండు వారాలు గడువు కావాలని ఆర్‌బీఐ కోరిందని ఎల్.రవిచందర్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అంత గడువు ఇవ్వలేమని, వారంలో దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణ 14కు వాయిదా వేసింది.

విచారణ 18 సార్లు వాయిదా

సుప్రీంకోర్టు ఆదేశాలతో గత జూన్ 25న తెలంగాణ హైకోర్టు విచారణ ప్రారంభించింది. తొలుత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వీలైనంత త్వరగా వాదనలు వినిపించాలని, వాయిదాలు కోరవద్దని పలుమార్లు ధర్మాసనం న్యాయవాదులకు సూచించింది. అయినా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయడంతో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయి. ఎట్టకేలకు గత నెలలో కౌంటర్లు దాఖలు చేశాయి. ఇదే క్రమంలో తీరా వాదనలు ప్రారంభమయ్యే సమయంలో రామోజీరావు మరణించినందున కేసు కొట్టివేయాలంటూ మార్గదర్శి అఫిడవిట్ వేసింది. దీనిపై కూడా వాదనలు వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ సుజోయ్‌పాల్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బాధ్యతల్లో ఉండటంతో విచారణ జస్టిస్ శ్యామ్‌కోషి ధర్మాసనానికి బదిలీ అయ్యింది. జనవరి 31న కేసు లిస్టయినా.. విచారణ నుంచి జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు తప్పుకుంటున్నారు. శుక్రవారం జస్టిస్ శ్యామ్ కోషి నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఆర్‌బీఐ అదనపు కౌంటర్ దాఖలుకు సమయం కోరడంతో వాయిదా పడింది. ఇలా దాదాపు ఏడున్నర నెలల్లో ఇప్పటి వరకు 18 సార్లు విచారణ వాయిదా పడింది.

న్యాయవాదులకు సీపీఆర్‌పై అవగాహన 10న

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులకు ఈ నెల 10న సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బార్ కౌన్సిల్ సభ్యుడు బి.కొండారెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేర్ ఆస్పత్రి, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, పలువురు న్యాయవాదుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. న్యాయవాదులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.


ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం: ఎంబీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను స్వాగతిస్తున్నామని అత్యంత వెనుకబడిన షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు (ఎంబీఎస్సీ) హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం మంత్రుల సముదాయంలో వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను ఎంబీఎస్సీ పోరాట సమితి ప్రతినిధులు బైరి వెంకటేశం, బత్తుల పాండు, ఉపాదే సనాదన్ తదితరులు కలిశారు. వర్గీకరణ ప్రక్రియను చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో మంత్రిని సత్కరించారు.

19 మంది హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్ ట్యాప్

- ఓ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఫోన్ కూడా..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ
- ముగిసిన వాదనలు..తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు చెందిన 19 మంది న్యాయమూర్తుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌కు సంబంధించి శుక్రవారం జరిగిన విచారణలో ఆయన వాదనలు వినిపించారు.



ట్యాపింగ్ బాధితుల్లో ఓ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా ఉన్నారని ఈ సందర్భంగా పీపీ చెప్పారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లలోని డేటాను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించగా, ఈ వివరాలన్నీ తెలిశాయని పేర్కొన్నారు. ఇలాంటి కేసులో పరారీలో ఉన్న నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు బెయిల్ ఇవ్వవద్దని పీపీ విజ్ఞప్తి చేశారు. కాగా, ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే విచారణకు సహకరించడానికి శ్రవణ్‌కుమార్ సిద్ధంగా ఉన్నారని అతని న్యాయవాది తెలిపారు. ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తి కావడంతో న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది. గత ఏడాది పాస్‌పోర్టు అథారిటీ అతని పాస్‌పోర్టును రద్దు చేసిన విషయం తెలిసిందే. విదేశాల్లో ఉన్న శ్రవణ్‌కుమార్ ఏ విమానాశ్రయంలో దిగినా హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే ట్రయల్ కోర్టు కూడా ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ శ్రవణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తొలుత విచారణ చేపట్టిన న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేసినా, రోస్టర్ మారడంతో ఆ పిటిషన్.. విచారణ జడ్జి వద్దకు వచ్చింది. దీంతో శ్రవణ్‌కుమార్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన శుక్రవారం విచారణ జరిపారు.

జడ్జిల ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరం..

పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్‌ను 'ప్రకటిత నేరస్తుడు'గా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ట్రయల్‌కోర్టులో పిటిషన్ దాఖలు చేశాం. బెయిల్‌కు శ్రవణ్‌కుమార్ ఎంతమాత్రం అర్హుడుకాదు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లలోని డేటాను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించగా, అత్యంత కీలక వివరాలు తెలిశాయి. తెలంగాణ హైకోర్టుకు చెందిన 19 మంది న్యాయమూర్తులు, సుప్రీంకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఫోన్లు ట్యాప్ చేసినట్లు తేలింది. ఇది తీవ్రమైన నేరం. ఈ వివరాలను హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో అందజేశాం. దర్యాప్తు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ఈ పిటిషన్‌ను కొట్టివేయండి'అని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీ వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ విదేశాల్లో ఉన్నప్పటికీ, తనకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. విదేశాల్లో తన నివాస చిరునామా, ఫోన్ నంబర్లు మొదలైన వాటిని పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. పిటిషనర్ పూర్తి వివరాలను వెల్లడిస్తూ హైదరాబాద్ సీపీకి ఈ-మెయిల్ కూడా పంపారు. అతనికి బెయిల్ మంజూరు చేసినట్లయితే దర్యాప్తులో సహకరించడానికి సిద్ధంగా ఉన్నారు'అని పేర్కొన్నారు. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. కాగా, ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు నిందితులకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. తిరుపతన్నకు సుప్రీంకోర్టు, భుజంగరావు, రాధాకిషన్‌రావులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

స్టేటస్‌కో ఆదేశాలున్నా.. నిర్మాణాలా?

- అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం
- అలాంటి నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలి
- అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోం
- అక్రమ నిర్మాణాలపై దాఖలైన పిటిషన్‌లో న్యాయస్థానం హెచ్చరిక
- విచారణకు హాజరైన వివరణ ఇచ్చిన హెచ్ఎండీఏ కమిషనర్

సాక్షి, హైదరాబాద్ : గచ్చిబౌలి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 51, 52, 53 లలో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా చేపట్టిన నిర్మాణాలపై నివేదిక అందజేయాలని ఆ ఏరియా జోనల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రజలంతా సమానమేనని చెబుతున్నా.. అధికారులు మాత్రం పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయం అమలు చేస్తున్నారని మండిపడింది. కోట్ల రూపాయల విలువైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని భూముల ఆక్రమణలను ఎలా క్రమబద్ధీకరిస్తారని ప్రశ్నించింది. 10 మీటర్ల స్థలంలో పేదలు గుడిసెలు వేసుకుంటే క్రమబద్ధీకరణకు సవాలక్ష కారణాలు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పెద్దల కోసం ప్రత్యేక చట్టం ఏమన్నా తీసుకొచ్చారా అని మండిపడింది. జీవనోపాధి లేని నిరుపేదలు నిర్మాణాలు చేసుకుంటే క్రమద్ధీకరించాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. మా పరిగణనలోకి వచ్చిన అక్రమ నిర్మాణాలకు ఎలాంటి మినహాయింపు ఇవ్వబోమని తేల్చిచెప్పింది. మార్చి 7లోగా నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ధిక్కరణ నోటీసులు జారీ..

గచ్చిబౌలి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్లు 51, 52, 53తోపాటు అనుబంధ నంబర్లలోని 42.24 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు జారీ చేసిన అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ ఎం.యాదయ్య 2021లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ భూముల్లో లార్డ్ ఫర్నిచర్, స్నేహ చికెన్ సెంటర్, శ్రీసాయి కోల్ డిపో, విజయభారతి స్కూల్, హాయ్ జూమ్ మోటార్స్, శాంతినాథ్ గ్రానైట్స్, స్వస్తిక్ ప్రాపర్టీస్ సహా పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను 2022లో ఆదేశించింది. అయినా పట్టించుకోకపోవడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించిన యాదయ్య ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పలు నిర్మాణాలపై స్టేటస్‌కో ఆదేశాలున్నా.. ఇష్టారాజ్యంగా బహిరంగ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టి.. ఎలాంటి అక్రమ నిర్మాణాలను అనుమతించడం లేదని నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించింది. పలుమార్లు అవకాశమిచ్చినా నివేదిక దాఖలు చేయకపోవడంతో గత నెల కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కమిషనర్ వివరణ కోరుతూ.. విచారణ ఫిబ్రవరి 7కు వాయిదా వేసింది.

ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి శుక్రవారం మళ్లీ విచారణ చేపట్టారు. కోర్టు ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అక్రమ నిర్మాణాలకు అనుమతుల విషయంలోగాని, కూల్చివేతల విషయంలోగాని హెచ్ఎండీఏకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. దీంతో తదుపరి విచారణకు హాజరు నుంచి న్యాయమూర్తి మినహాయింపు ఇచ్చారు. జీహెచ్ఎంసీ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్టేటస్‌కో ఆదేశాలున్నా.. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా.. అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించలేదన్నారు. జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం విధి నిర్వహణలో నిరక్ష్యంగానే పరిగణిస్తున్నామని చెప్పారు. కమిషనరే విధి నిర్వహణలో విఫలమైతే ఎవరు అక్రమ నిర్మాణాలను నిర్మూలిస్తారని ప్రశ్నించారు. న్యాయస్థానాలను, వాటి ఆదేశాలను తక్కువ అంచనా వేస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరి ఇలాంటి నిర్మాణాల విషయంలో హైడ్రా ఎక్కడకు పోయిందో అని అభిప్రాయం వ్యక్తం చేశారు. హైడ్రా వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. ఒకవేళ అక్రమ నిర్మాణాలను తొలగించని పక్షంలో న్యాయస్థానం గౌరవాన్ని కాపాడటం కోసం విచక్షణాధికారాన్ని వినియోగించాల్సి వస్తుందని తేల్చిచెప్పింది. ఈ కోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేసేలా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తూ, విచారణ మార్చి 7కు వాయిదా వేసింది.

నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలిస్తాం..

పాత కుట్ర.. కొత్త సిరా!

- వైఎస్ వివేకా హంతకుడు దస్తగిరి ద్వారా బాబు పన్నాగం
- డాక్టర్ చైతన్యరెడ్డి తనకు రూ.20 కోట్లు ఆఫర్ చేశారంటూ మరోసారి తప్పుడు ఫిర్యాదు

సాక్షి, అమరావతి / సాక్షి ప్రతినిధి, కడప : మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు సర్కారు రంగంలోకి దిగింది! తానే స్వయంగా వైఎస్ వివేకాను హత్య చేశానని ఒప్పుకున్న దస్తగిరి తప్పుడు ఫిర్యాదు ఆధారంగా అక్రమ కేసు నమోదు చేసి కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. దస్తగిరి గతంలో న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌ను కొట్టివేసినప్పటికీ... అదే ఫిర్యాదుపై తాజాగా కూటమి ప్రభుత్వం కేసు నమోదు చేయడం అందుకు నిదర్శనం.



+ బెడిసికొట్టిన పన్నాగం..

2023 నవంబరులో తాను కడప జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నప్పుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి తనను కలసి బెదిరించినట్లు దస్తగిరి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాడు. జైలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ సందర్భంగా చైతన్య రెడ్డి జైలులోకి తన బ్యారక్ వద్దకు రూ.20 కోట్లు తెచ్చి లోబరుచుకునేందుకు యత్నించారని పిటిషన్‌లో ఆరోపించాడు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణతో అసలు విషయాలు వెల్లడయ్యాయి. జైలులో ప్రత్యేక బ్యారక్‌లో ఉన్న దస్తగిరిని చైతన్యరెడ్డిగానీ ఇతరులుగానీ కలువ లేదని జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్ తన నివేదికలో స్పష్టం చేశారు. దీంతో దస్తగిరి అభియోగాలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు వచ్చాక మరోసారి అదే కుట్రను తెరపైకి తెచ్చారు. చైతన్యరెడ్డి కడప జైలులో దస్తగిరిని కలిశారన్న ఫిర్యాదుపై విచారించాలని జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావును ఆదేశించారు. 2024 నవంబరు 25న ఆయన కడప జైలుకు వచ్చి విచారించగా.. దస్తగిరిని చైతన్యరెడ్డి బెదిరించినట్లుగానీ కనీసం కలిసినట్లుగానీ నిర్ధారణ కాలేదు.

అయినా తప్పుడు ఫిర్యాదు...

వైఎస్ వివేకా హత్య వెనుక అసలు వాస్తవాలు వెల్లడి కాకూడదన్నదే నర్రెడ్డి సునీత దంపతుల లక్ష్యంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబును కొన్నాళ్ల క్రితం నర్రెడ్డి సునీత కలిశారు. అప్పటి నుంచి కుట్ర కార్యాచరణ వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో దస్తగిరి గతంలో ఇచ్చిన తప్పుడు ఫిర్యాదునే మరోసారి తెరపైకి తెచ్చారు. 2023 నవంబరులో తాను కడప జైలులో ఉండగా డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించారని.. రూ.20 కోట్లు ఆఫర్ చేసి లొంగదీసుకునేందుకు యత్నించారని పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 3న అర్ధరాత్రి 11.30 గంటలకు దస్తగిరి ఫిర్యాదు చేయడం... ఆ వెంటనే కనీసం ప్రాథమిక దర్యాప్తు కూడా చేయకుండానే పోలీసులు చైతన్యరెడ్డితోపాటు ఇతరులపై అక్రమ కేసు నమోదు చేయడం చకచకా సాగిపోయాయి. అనంతరం దస్తగిరి ఫిర్యాదుపై విచారించాలని జైళ్ల శాఖ ఎస్పీ రాహుల్‌ను ఆదేశించారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత నవంబరులో జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావు ఇదే ఫిర్యాదుపై విచారించారు. దస్తగిరి ఫిర్యాదులో పేర్కొన్నవి అవాస్తవాలని నిగ్గు తేల్చారు. కానీ అదే ఆరోపణలపై కూటమి ప్రభుత్వం మరోసారి విచారణకు ఆదేశించడం గమనార్హం. ఐజీ స్థాయి అధికారి దర్యాప్తు చేసిన ఉదంతంపై.. ఆయన కంటే కింది స్థాయి అధికారి అంటే ఎస్పీ రాహుల్‌తో విచారణకు ఆదేశించడంపై పోలీసు వర్గాలు విస్తుపోతున్నాయి.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 8-2-2025



● శోధన

కళంకారి వెలుగు దారి

కలంకారి అనే మాట ఎంతో సుపరిచితం. అయితే ఈ సుప్రసిద్ధ కళ చరిత్ర చాలామందికి అపరిచితం. ఆ ఘనచరిత్రను ఈ తరానికి పరిచయం చేయడానికి, కలంకారీని మరింత వైభవంగా వెలిగించడానికి పూనుకుంది లీలావతి. కలంకారి అద్దకపు పనికి బోలెడంత ఓపిక కావాలి అంటారు. పరిశోధకులకు కూడా అంతే ఓపిక కావాలి. పెద్ద వస్తువు నుంచి చిన్నవాక్యం వరకు ఎన్నో ఎన్నెన్నో పరిశోధనకు ఇరుసుగా పనిచేస్తాయి. ఈ ఎరుకతో కలంకారిపై లోతైన పరిశోధన చేసిన లీలావతి.. ఆ కళపై పీహెచ్‌డీ పట్టా పొందిన తొలి మహిళగా ప్రశంసలు అందుకుంటోంది..

కలంకారి అంటే గుర్తుకు వచ్చేది పెడన. కృష్ణా జిల్లా పెడన పట్టణంలో కలంకారి వస్త్రాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 2,500 సంవత్సరాల క్రితమే ప్రారంభమైన ఈ కళపై చరిత్ర అధ్యాపకురాలు గుడివాడకు చెందిన పామర్తి లీలావతి పరిశోధన చేసింది. ఈ పరిశోధనకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి ఇటీవల పీహెచ్‌డీ పట్టా అందుకుంది. కలంకారిపై తొలిసారిగా పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందిన మహిళగా ప్రశంసలు అందుకుంటోంది.

పెడనలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలిగా విధుల్లో చేరిన లీలావతికి సహజంగానే అక్కడి వాతావరణం వల్ల కలంకారి కళపై ఆసక్తి పెరిగింది. కళాశాలకు వెళ్లే సమయంలో కలంకారి వస్త్రాలపై ముద్రణ నుంచి కలంకారి కళాకారుల జీవన శైలి వరకు ఎన్నో విషయాలు గమనించేది. నాగార్జున యూనివర్శిటీలో కలంకారి పరిశ్రమలపైన, ఆయా కుటుంబాల సామాజిక పరిస్థితులపై ఒకసారి పరిశోధన ప్రసంగం చేసింది.

ఆ ప్రసంగానికి మంచి స్పందన లభించింది. ఆ సమయంలోనే 'కలంకారి కళ'పై పీహెచ్‌డీ చేయాలనే ఆలోచన వచ్చింది. నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ స్టూడెంట్‌గా ప్రవేశం పొందింది.

'కలంకారి కళకు సుదీర్ఘ చరిత్ర ఉంది. దేశ విదేశాల్లో గుర్తింపు ఉన్న కలంకారిపై ఇప్పటి వరకు ఎవరూ పరిశోధన చేయకపోవడంతో నేనే ఎందుకు చేయకూడదని నిర్ణయించుకుని ఆ దిశగా అడుగులు వేశాను' అంటుంది లీలావతి.

విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న లీలావతి కలంకారిపై మరిన్ని పరిశోధనలు చేయాలని ఆశిద్దాం.

– నారగాని గంగాధర్
సాక్షి, పెడన

ఎన్నో దారులలో...

కలంకారిపై పరిశోధనలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందడం సంతోషంగా ఉంది. కలంకారి పరిశ్రమ చరిత్ర, సంస్కృతి, దేశ విదేశాల్లో ఉన్న ప్రాధాన్యం, ఆదరణ, కార్మికుల జీవన స్థితిగతులపై నా పరిశోధనలో సమగ్రంగా తెలుసుకున్నాను. పరిశోధనలో ఉన్న విశేషం ఏమిటంటే ఒక దారి అనేక దారులకు దారి చూపుతుంది. ఇలా కలంకారి గురించి అనేక కోణాలలో అనేక విషయాలు తెలుసుకోగలిగాను.

- పామర్తి లీలావతి



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్‌షిప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం! ఈ వారం స్కీమ్ 'ముద్ర లోన్స్'.



ముద్ర లోన్స్



ప్రాథమిక అర్హతలు కలిగిన పేద, మహిళలందరూ స్వల్ప వ్యవధిలో సూక్ష్మ, చిన్నతరహా వ్యాపారాలు మొదలుపెట్టేలా ప్రోత్సహించే పథకమే 'ముద్ర లోన్స్'. 2015, ఏప్రిల్‌లో ప్రారంభమైన కేంద్రప్రభుత్వ పథకమిది. 'క్రెడిట్ గ్యారంటీ ఫండ్'ద్వారా ప్రభుత్వమే రుణ గ్యారంటీ సదుపాయాన్ని కల్పిస్తోంది. రూ. 20 లక్షల వరకు లోన్ దొరుకుతుంది. దీన్ని గ్రామీణ, వాణిజ్య, కో-ఆపరేటివ్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి పొందవచ్చు. ఈ రుణాలను మూడు విభాగాల్లో అందిస్తారు.

శిశు: 50 వేల రూపాయల వరకు రుణం అందుతుంది. అతి చిన్న, వీధి వ్యాపారాలు, కుటీర పరిశ్రమలకు అనుకూలమైనది. ఇందులో అత్యధికంగా 44 వేల 891 కోట్ల రూపాయల వరకు రుణాలు అందించారు. **కిశోర:** దీనికింద రూ. 50 వేల నుంచి అయిదు లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. పూచీకత్తు అవసరం లేదు. **తరుణ:** రూ. అయిదు లక్షల పైబడి పది లక్షల వరకు రుణాన్ని పొందవచ్చు. లబ్ధిపొంది, రుణాన్ని విజయవంతంగా తిరిగి చెల్లిస్తున్నవారు అదనంగా మరో 20 లక్షల రూపాయల వరకు 'తరుణ్ ప్లస్' రుణాన్ని పొంది, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశమూ కల్పిస్తోంది ఇది.

కనీస అర్హతలు: రుణాల్లో ఎగవేత రికార్డ్ ఉండకూడదు. క్రెడిట్ ట్రాక్ బాగుండాలి. ప్రాజెక్ట్ రిపోర్ట్ అవసరం. దరఖాస్తుతో ఆధార్, పాన్‌కార్డ్, ఓటరు ఐడీ లేదా డ్రైవింగ్ లైసెన్స్, ఏడాది బ్యాంక్ స్టేట్‌మెంట్, వ్యాపారానికి సంబంధించిన స్కిల్ సర్టిఫికెట్‌ను జత చేయాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలయితే క్యాస్ట్ సర్టిఫికెట్‌నూ పెట్టాలి. తరుణ్ ప్లస్ లోన్‌కి ఐటీఆర్ కూడా పొందుపరచాలి. 18 ఏళ్ల పైబడి 60 ఏళ్లలోపు వారందరూ అర్హులే! మంచి వ్యాపార ప్రణాళికతో బ్యాంకులను సంప్రదించాలి. బ్యాంకువారు.. మనం వ్యాపారం పెట్టాలనుకుంటున్న ప్రాంతం, వ్యాపార వృద్ధికి అక్కడున్న అవకాశాలను బట్టి ఎంత రుణమివ్వాలో నిర్ణయిస్తారు. తీసుకున్న రుణాన్ని అయిదేళ్లలోపు చెల్లించే వెసులుబాటు ఉంటుంది. సబ్సిడీ సదుపాయం లేదు. కానీ టాప్ అప్, సీసీ లోన్స్‌ను పొందే వీలుంటుంది. దీనికి వస్తు ఉత్పత్తి, మార్కెట్, సేవారంగాల్లో మంచి అవకాశాలున్నాయి. కూరగాయల అంగళ్లు, విస్తరాకుల తయారీ, పేపర్ కప్స్, సారీ రోలింగ్, లాండ్రీ, కిరాణా షాప్స్, కర్రీ పాయింట్స్, పిండి మరలు, జిరాక్స్, ఇంటర్నెట్, డయాగ్నస్టిక్స్, స్టేషనరీ నుంచి ఆటో, క్యాబ్, ట్రాక్టర్, వరికోత మిషన్‌లు, జేసీబీల దాకా దేనికైనా రుణాన్ని పొందవచ్చు.

ఈ వ్యాపారం ఎలా ప్రారంభించాలి, సమస్యలను ఎలా అధిగమించాలి వంటివాటి మీద MSME, DIC, బ్యాంకింగ్ రంగాల వారు అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నారు. అంతేకాదు ప్రభుత్వం కూడా శిక్షణ కార్యక్రమాలనూ చేపడుతోంది.



– బి.ఎన్. రత్న, బిజినెస్ కన్సల్టెంట్, దలిప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ

● ఫస్ట్ ఉమెన్





బెంగళూరుకు చెందిన అనన్య ప్రసాద్ అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ఒంటరి ప్రయాణం చేసిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. స్పానిష్ కానరీ దీవుల్లోని లా గోమెరా నుంచి 52 రోజుల్లో కరీబియన్ దీవుల్లోని ఆంటిగ్వాకు చేరుకుంది. 52 రోజుల్లో 3,000 మైళ్ల చారిత్రాత్మక యాత్రను ముగించింది.

సాటి లేరెవరూ నీ సాహసానికి!

అనన్య ప్రముఖ కన్నడ కవి జీఎస్ శివరుద్రప్ప మనవరాలు.

బెంగళూరులో పుట్టిన అనన్య పెరిగింది, చదువుకున్నదీ యూకేలో. సరదాగా మొదలైన రోయింగ్ హాబీ ఆ తరువాత అంకితభావంతో కూడిన పాషన్‌గా మారింది.

'రోయింగ్‌ను వ్యాయామంగా ఆస్వాదిస్తాను. రోయింగ్ అనేది నా దృష్టిలో సాహసం' అంటుంది అనన్య.

'వరల్డ్స్ టఫెస్ట్ రో'లో అన్ని వయసులు, అన్ని దేశాల వారు పాల్గొంటారు. ఈ రేసుకు అర్హత సాధించడానికి మూడున్నరేళ్లు శిక్షణ తీసుకుంది అనన్య. శిక్షణలో మానసిక, శారీరక ఫిట్‌నెస్, సాంకేతిక నైపుణ్యంపై పట్టు సాధించింది.

తన యాత్రలో అనూహ్యమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోవడం లాంటి ఎన్నో ప్రతికూల పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొంది. ప్రతిరోజు 60 నుంచి 70 కిలోమీటర్లు ప్రయాణించేది. రోజుకు 5 నుంచి 6 గంటలు మాత్రం విశ్రాంతికి కేటాయించేది.

'ఒంటరిగా ఉన్నప్పటికీ నాకు ఎప్పుడూ ఒంటరిగా అనిపించలేదు. వాతావరణ, సాంకేతిక నిపుణులు, సోషల్ మీడియా బృందాలతో ఎప్పుడూ టచ్‌లోనే ఉన్నాను' అని తన ప్రయాణాన్ని గుర్తుతెచ్చుకుంది అనన్య.

తన సాహసానికి సామాజిక ప్రయోజనాన్ని కూడా జత చేసింది. మన దేశంలోని అనాథ పిల్లలకు ఆసరాగా నిలిచే మెంటల్ హెల్త్ ఫౌండేషన్, దీనబంధు ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థల కోసం విరాళాలు సేకరించింది.

కిచెన్ టిప్స్

పెరుగు పులవకుండా..



- పెరుగు పుల్లగా మారకుండా ఉండాలంటే పెరుగులో కొబ్బరి ముక్కను వేయాలి.
- పెరుగు తోడు పెట్టేముందు గిన్నెను పటిక ముక్కతో రుద్దాలి ఇలా చేయడం వల్ల పెరుగు రుచిగా, సరిగ్గా తోడుకుంటుంది.
- ఒకవేళ పెరుగు బాగా పులుపుగా అయితే అందులో కొన్ని పాలు కలుపుకుంటే కమ్మగా అవుతుంది.

దోసెలు పెనానికి అతుక్కోకుండా..



దోసెలపిండిలో ఒక కప్పు సగ్గుబియ్యం కూడా వేసి రుబ్బితే, దోసెలు చిరగకుండా పల్చగా వస్తాయి. ఇక దోసెలు పెనానికి అతుక్కుపోకుండా ఉండాలంటే.. ముందుగా పెనంపై వంకాయ ముక్క లేదా ఉల్లిపాయతో రుద్దితే సరిపోతుంది.

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

చుండ్రు నివారణకు మేలు బంతి



చుండ్రు అనేది నెత్తిమీద మంట, దురద కలిగించే ఒక పరిస్థితి. తెల్లని పొలుసులు రాలే ఈ చుండ్రు ఇబ్బందికరంగా అనిపిస్తుంది. చుండ్రు నివారణకు ఇప్పటికే అనేక రకాల రెమెడీస్ అందుబాటులో ఉన్నాయి. వాటితో ఫలితం లేదనుకుంటే ఈ బంతిపువ్వు ఫ్యూజన్ ప్రయత్నించి చూడవచ్చు. రాత్రి పడుకునే ముందు మీ తలకు మేరిగోల్డ్ ఆయిల్ మసాజ్ చేయండి. మరుసటి రోజు బంతి పువ్వు నీటితో మీ జుట్టును కడిగి శుభ్రం చేసుకోండి. ఈ రెండింటి కలయిక మీ జుట్టుపై క్లెన్సింగ్, యాంటీ బాక్టీరియల్ ప్రభావాలను చూపుతాయి. స్కాల్ప్ నుంచి బ్యాక్టీరియాను తొలగించడానికి ఇది సహాయపడుతుంది. చుండ్రును తగ్గించడానికి స్కాల్ప్‌ను శుభ్రపరచడానికి ఉపయోగపడుతుంది. జుట్టు పెరుగుదలకు అవసరమైన పోషణను అందిస్తుంది. కొన్ని వారాలలో ఆరోగ్యకరమైన మెరిసే జుట్టును సొంతం చేసుకోవచ్చు.

● క్లీనింగ్

వంటిల్లు

ది గ్రేట్ ఇండియన్ కిచెన్



అదొక సామ్రాజ్యం...
అక్కడ మహారాణుల పాలనే ఎక్కువ.
తళతళలాడే గిన్నెలతోనే కాదు
కత్తులతో కూడా దోస్తానా ఉంటుంది.
అదొక ప్రయోగ శాల...
ఏ కూరగాయతో ఏ కాంబినేషన్ కలిపితే ఏ రుచి వస్తుందో ప్రతి పూటా పరిశోధన సాగుతూనే ఉంటుంది.
అదొక యంత్రశాల...
మీట నొక్కితే మల్లెపువ్వులా అన్నం సిద్ధం.
పొడులు, పచ్చళ్లకు మిక్సీతోనే పని.
అవెన్‌లో బేకింగ్, ఆర్వో నీళ్లు.
బ్రెడ్‌కి టోస్టర్,
మిగిలిన కూరలు, వండని పప్పులను కూడా తనలో దాచుకునే ఫ్రిడ్జ్.
అది యుద్ధ శాల కూడా...
అన్నీ ఉన్న వంటిల్లే అయినా
సరిగ్గా అమర్చకపోయినా,
శుభ్రత పాటించకపోయినా గిన్నెలు, గరిటెలతోనే కాదు అనారోగ్యాలతోనూ ఇంటిల్లిపాది యుద్ధం చేయాల్సిందే!

వంటగదిలో నిత్యం ఆహారపు అంగడి జరుగుతూనే ఉంటుంది. ఆ మాటునే మాటు వేసుకొని దుమ్ము, ధూళి, క్రిములు, సాలెగూళ్లు, బొద్దింకలు... ఇల్లు దులపడం, కడగడం, తుడవటం ఓ పెద్ద యజ్ఞం. కష్టంగా అనిపించే ఈ 'శుభ్రమైన' ప్రక్రియను సులువుగా చేయాలంటే ఏమైనా కిటుకులు ఉంటాయా..? దులిపి తీసుకువచ్చాం. ఒకసారి ఆ జాబితా చదివేయండి.

ఈ రోజుల్లో చాలామంది ఉరుకుల పరుగులతో వారమంతా గడిపేస్తున్నారు. వారంతాన్ని క్లీనింగ్‌కు కేటాయించుకుంటారు. కానీ, వంటగదిని శుభ్రం చేయడం అంటే ఒకరోజు సరిపోదని రంగంలోకి దిగాక గానీ తెలిసి రాదు. ఎంత శుభ్రత గురించి జాగ్రత్త తీసుకున్నా ఇంకా ఏదైనా మిస్ చేశామా అనే భావన కూడా కలుగుతుంది. అందుకే, ముందుగా కిచెన్‌ను కొన్ని భాగాలుగా విభజిద్దాం...

మూలన ఏమున్నాయి...

రోజూ ఇల్లు ఊడ్చేటప్పుడు, తుడిచేటప్పుడు వంటగది మూలలపై సరిగ్గా ధ్యాస ఉండదు. గ్యాస్ సిలండర్ వెనక, క్యాబిన్స్ మూలల్లో దుమ్ము పేరుకుపోతుంటుంది. అందుకని, కిచెన్‌లో ఏ మూలనూ వదలకూడదు.

చిన్న కప్ బోర్డ్‌లు

పొడులు, సీసాలు, డబ్బాలు పెట్టుకోవడానికి అనువుగా చిన్న కప్‌బోర్డ్స్ జాబితా ఒకటుంటుంది. వీటి వాడకం రోజూ ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే చీమలు, బొద్దింకలు వీటిలో చేరే అవకాశం ఎక్కువ కాబట్టి వారానికి ఒకసారి సొరుగులను పూర్తిగా ఖాళీ చేసి, పురుగుమందులను చల్లి, తర్వాత శుభ్రం చేయాలి.

కట్లరీ విభాగం

ఈరోజుల్లో మాడ్యులర్ కిచెన్‌లు సౌకర్యాలను పెంచినట్లే, అవి శుభ్రతను కూడా విస్మరించేలా చేస్తున్నాయి. ఎందుకంటే మాడ్యులర్ కిచెన్‌లలో పాత్రలను ఉంచడానికి ఉపయోగించే ట్రాలీలు రోజువారీ శుభ్రపరచడం కష్టం. దీంతో ట్రాలీ లోపల ధూళి పేరుకు పోతుంది. పైకి మాత్రం చూడటానికి బాగానే ఉంటాయి. ట్రాలీ లోపల ఉన్న స్పూన్లు, చాకులు, ఫోర్కులు, బ్లేడ్లను తీసి ట్రాలీలను శుభ్రంగా తుడవాలి. పూర్తిగా ట్రాలీని బయటకు తీసి, కడగవచ్చు.



ఫ్రిజ్‌ని ఒకసారి చూడండి

అనారోగ్యానికి అతి పెద్ద హేతువు ఫ్రిజ్. ఎప్పటికప్పుడు 'శుభ్రం చేద్దాం' అనుకుంటూ వాయిదా వేసే కోల్డ్ స్టోరేజీ. శుభ్రం చేయడానికి ముందు ఫ్రిజ్‌కు ఉన్న కరెంట్ కనెక్షన్ ఆఫ్ చేయాలి. తర్వాత ఫ్రిజ్‌లో పెట్టిన నానా రకాల పదార్థాలనూ తీసి, అన్ని ట్రేలను బయటకు తీయాలి. వాటిపై నీళ్లు పోసి కొన్ని నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. క్లీనింగ్ లిక్విడ్స్ స్ప్రే చేసి ఉంచాలి. దీనివల్ల మురికి తొలగి పోయి సులభంగా శుభ్రం అవుతుంది. ట్రేలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని తిరిగి ఫ్రిజ్‌లో ఉంచండి. తేమ బ్యాక్టీరియాను పెంచుతుంది కాబట్టి ఫ్రీజర్‌ను శుభ్రం చేయడం మర్చిపోవద్దు. రోజూ మామూలు శుభ్రతతో సరిపెట్టుకున్నా, కనీసం పదిహేను రోజులకు ఒకసారైనా డీప్ క్లీనింగ్ చేయడం అవసరం.





సింక్ సంరక్షణ

నిరంతరం ఉపయోగించేవాటిలో కిచెన్ సింక్ ఒకటి. పాత్రలు శుభ్రం చేసేది ఎలాగూ సింక్‌లోనే కదా... వాటితోపాటు సింక్ కూడా శుభ్రం అవుతుందనే భావనను వదిలేయాలి. ప్రతి రెండురోజులకు ఒకసారి క్లీనర్స్‌తో శుభ్రం చేయాలి. వేడి నీటిని సింక్‌లో పోయాలి. గొట్టంలో ఇరుక్కున్న జిడ్డు కూడా దీనివల్ల వదులుతుంది.

పై భాగాలు

వంటగదిలో పై షెల్ఫ్‌లు, కప్‌బోర్డ్స్.. వంటివి ఎత్తు కారణంగా అంతగా ఉపయోగించం. వీటిని సంవత్సరానికి రెండుసార్లు శుభ్రం చేయవచ్చు. అల్మారా పై భాగం, ఎగ్జాస్ట్ ఫ్యాన్, చిమ్నీ మొదలైన వాటిని ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రం చేయాలి.

పెండింగ్ పనులు ఇప్పుడే

ఓవెన్, ఇండక్షన్ స్టౌ, గ్యాస్ స్టౌ.. గిన్నెలు ఉంచే టబ్, పాన్ హ్యాండిల్ చుట్టూ తరచుగా మురికి పేరుకుపోతుంది. పోపు పెట్టే మూకుడు, కుక్కర్ విజిల్.. మరోసారి చూద్దాం అని పక్కన పెట్టేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిందే.

కిచెన్ క్లీనింగ్‌లో కౌంటర్ టాప్ వంటివి రోజూ శుభ్రం చేస్తాం. చిన్న చిన్న సొరుగులు వారానికి ఒకసారి, పెద్ద పెద్ద ట్రాలీలు 15 రోజులకు ఒకసారి.. ఇలా దేనికది విభజించుకుంటూ నోట్ ప్రకారం శుభ్రత పాటిస్తే పని సులువు అవుతుంది. శుభ్రత వల్ల ఇంటిల్లిపాది ఆరోగ్యమూ బాగుంటుంది.

కలర్ కోడింగ్ స్పాంజ్‌లు

వంటగదిలో తుడవడానికి స్పాంజ్‌లు వేర్వేరు రంగులలో పెట్టుకుంటే క్లీనింగ్ కూడా సులువు అవుతుంది. కిచెన్ క్లీనింగ్‌కి ఉపయోగించే స్పాంజ్ వివిధ రంగులలో ఉండటం వెనుక గల కారణాలను ప్రముఖ సెలబ్రిటీ చెఫ్ అనన్యా బెనర్జీ ఆసక్తికరంగా వివరించారు.



అనన్యా బెనర్జీ

➡ "ఎల్లో స్పాంజ్‌ని సాధారణ క్లీనింగ్‌కి వాడాలి. దీనిని పచ్చి, వండిన మాంసం అవశేషాలతో ఉన్న పాత్రలను కడగడానికి ఉపయోగించే స్పాంజ్ లేదా స్క్రబ్బర్ ను మరో పాత్రలను, ఆహారాన్ని తయారు చేసే కౌంటర్‌టాప్‌ను శుభ్రం చేయడానికి ఉపయోగించకూడదు.

➡ ఎరుపు, నారింజ, గులాబీ రంగు స్పాంజ్‌లు కుండలు, పాన్‌ల నుంచి రోజుల తరబడి పేరుకుపోయిన మురికిని తొలగించడానికి అనుకూలంగా ఉంటాయి. ఆకుపచ్చ స్పాంజ్‌లు జిడ్డుగా ఉండే పాత్రలను కడగడానికి అనువుగా ఉంటాయి. సింక్, కౌంటర్ టాప్ శుభ్రం చేయడానికి పసుపు స్పాంజ్‌లను ఉపయోగించడం మేలు.



➡ నీలిరంగు స్పాంజ్/స్క్రబర్లు అతి తక్కువ రాపిడి కలిగి ఉంటాయి. వీటితో గాజు లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ వంటివి శుభ్రం చేయడానికి ఉపయోగించాలి. ఈ కలర్-కోడింగ్ స్పాంజ్‌లు వంటగదిలో క్రాస్-కాలుష్యాన్ని నివారించడానికి మేలైన పద్ధతి' అంటున్నారు.

స్పాంజ్ రంగు రాపిడిని సూచిస్తుందా?

పరిశుభ్రత, క్రాస్-కాలుష్య సమస్యలకు మించి స్పాంజ్ రంగు, రాపిడి స్థాయిని కూడా సూచిస్తుంది. ఆకుపచ్చ స్క్రబ్బింగ్ ప్యాడ్‌లు అధిక రాపిడిని కలిగి ఉంటాయి. ఇవి కఠినమైన మరకలను పరిష్కరించడానికి అనువైనవి. దీనికి విరుద్ధంగా, తెలుపు లేదా లేత-రంగు ప్యాడ్‌లు నాన్-స్టిక్ వంటసామాను వంటి సున్నితమైన పై భాగాల శుభ్రతకు సురక్షితమైనవి.



ఆరోగ్యవంతమైన జీవన శైలి అంటే మంచి విషయాలని మంచి అలవాట్లుగా మార్చుకోవడం. అంటే, సరైన సమయానికి సరైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం వంటివి. ఇవి గుర్తొచ్చినప్పుడో, మనకు కుదిరినప్పుడో చేయడం కాకుండా అలవాటుగా మారిపోవాలి. అంటే ఆటోమాటిక్‌గా రోజూ జరిగిపోతుండాలి. తల్లిదండ్రులు, పెద్ద వాళ్ళు, టీచర్లు, మెడికల్ ప్రొఫెషనల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ కోచెస్... అందరూ మంచి అలవాట్లు చేసుకోవడం గురించి చెప్తూనే ఉంటారు. కానీ, అవి ఎందుకు చేసుకోవాలో మీరెప్పుడైనా ఆలోచించారా? ఇదిగో, ఇక్కడ చూడండి.

అలవాటుగా మార్చుకుందాం..



అలవాటు అంటే ఏమిటి? దాని గురించి ప్రత్యేకంగా ఆలోచించకుండా రోజూ చేసేదాన్ని అలవాటు అంటారు. అందరికీ కొన్ని అలవాట్లు ఉంటాయి. ఒక టైమ్‌కి నిద్ర లేవడం, ఒక పద్ధతిలో బ్రష్ చేసుకోవడం, ఒక సమయంలో స్నేహితులతో మాట్లాడడం లాంటివి. ఈ అలవాట్లు మన జీవితంలో ఎంతగా మమేకం అయిపోవాలంటే అవే మనం అనిపించేంతగా... ఎవరైనా సరే, తాము మారాలి అనుకుంటే ముందుగా చేయాల్సిన పని వారి అలవాట్లని మార్చుకోవడం.



చాలా కాలం నుంచి ఉన్న కొన్ని అలవాట్లని మార్చుకోవడం కొద్దిగా కష్టమే. ముఖ్యంగా చెడు అలవాట్లని మార్చుకోవడం ఇంకా కష్టం. అలాగని అసాధ్యమేమీ కాదు. ఉదాహరణకి ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను పెంచుకోవాలనుకుంటే రోజుని గోరువెచ్చని నీటితో, లేదా గోరు వెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం వేసుకునో తాగడం మొదలు పెట్టండి. అప్పుడు పొద్దున్నే కాఫీ తాగే అలవాటు మారుతుంది.

మంచి అలవాట్లు చేసుకోవడానికి కొన్ని తేలిక మార్గాలు

'నేను రేపటి నుంచి వ్యాయామం చేస్తాను' అనుకోవడానికి బదులు 'నేను రేపు ఆఫీసు నుంచి ఇంటికెళ్లగానే ఎక్సర్సైజ్ డ్రెస్ లోకి మారి, ఒక అరగంట సేపు సోషల్ మీడియాలో టైమ్ స్పెండ్ చేసి ఆ తరువాత అర గంట పాటూ నడుస్తాను' అనుకోవడం వల్ల అలవాట్లు తొందరగా ఫార్మ్ అవుతాయని అంటున్నారు.

ఒక కొత్త అలవాటు చేసుకుందామని ప్రయత్నం చేస్తున్నప్పుడు కొన్ని విషయాలు మనని వెనక్కి లాగుతాయి. ఉదాహరణకి, ఆరోగ్యమైన తిండి తిందామని అనుకుంటున్నప్పుడు ఇంట్లో ఉన్న జంక్ లేదా ఇన్‌స్టంట్ ఫుడ్ మనని వెనక్కి లాగుతుంది కాబట్టి అలాంటి వాటిని ముందుగానే ఎవరికైనా ఇచ్చేయడం లేదా మన కంటపడకుండా జాగ్రత్త పడటం ద్వారా లక్ష్య సాధన తేలిక అవుతుంది.

ఆరోగ్యకరమయిన అలవాట్లను మనకు మనం నిర్ణయించుకోవడం, వాటిని అలవాటు చేసుకోవడం ద్వారా జీవితం నేడే కాదు... రేపు కూడా బంగారం లాగే ఉంటుంది. భవిష్యత్తు బంగారం అవుతుంది. ఇదేమీ అసాధ్యమైన పనేమీ కాదు.

జీవితాంతం ఉండే అలవాట్లు...

మీ అలవాట్లు మీతో జీవితాంతం ఉంటాయి. మీరు అవతలి వారిని ఆనందంగా పలకరిస్తే మీరు సంతోషాన్ని పంచే వ్యక్తి అవుతారు. మీకు ప్రతి భోజనం లోనూ సలాడ్ తినే అలవాటుంటే మీరు ఆరోగ్యకరమైన వ్యక్తి అవుతారు.

మీకు ఒక గోల్ ఉన్నప్పుడు దాన్ని రీచ్ అవ్వడానికి మీకు సహకరించేది మీ గోల్ కాదు, ఆ లక్ష్య సాధనకు మీరు అనుసరిస్తున్న అలవాట్లే మీ గోల్ రీచ్ అవ్వడానికి పునాది రాళ్ళు. అంతేకాదు, మంచి అలవాట్లని పెంపొందించుకోవటం వలన సమయం వృథా కావడం తగ్గుతుంది. మన పని కూడా తొందరగా అయిపోతుంది.



లక్ష్యానికి చేరువ చేసేలా...

మీరు ఒక మారథాన్ రన్నర్ అవుదామని అనుకున్నారనుకోండి. మీ సిటీలో జరిగే ఫస్ట్ మారథాన్ లో పరిగెత్తడం మీ మొదటి స్టెప్ కాదు కదా. మారథాన్ రేస్‌లో పాల్గొనాలంటే కావాల్సిన ఫిట్‌నెస్‌కి సంవత్సరాల తరబడి ట్రైనింగ్ ఉండాలి. లక్ష్యాన్ని చేరుకోవాలంటే చేయాల్సిన మొదటి పని దానికి కావాల్సిన అలవాటుని చేసుకోవడం.

లైఫ్@360

● యోగా

మేలైన జీవనానికి రాజయోగం



చదివింది సరిగా గుర్తుండటం లేదని పిల్లలు... ఒత్తిడి ఎక్కువై మర్చిపోతున్నాం అని పెద్దలు... మానసిక ఒత్తిడి వల్ల ఇలా జరుగుతుంది నిపుణులు అంటుంటారు. కానీ, మనల్ని ఎవరైనా బాధిస్తే వారినీ, ఆ సందర్భాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోం. ఆ బాధ తాలూకు జ్ఞాపకం మన మెదడులో అలా నిక్షిప్తం అయిపోతుంది. మన మెదడుకు ఏ అంశాలు చేరాలి, స్పష్టతను ఎలా సాధించాలనేది నిత్యం కృషి చేయాలి. 'నియమబద్ధంగా సాధన చేయడం వల్ల దీనిని సాధించవచ్చు' అంటున్నారు యోగా నిపుణులు.

మొదటిసారి...

15వ శతాబ్దం ప్రారంభంలో, నాథ వంశానికి చెందిన కొంతమంది యోగాభ్యాసకులు ముందు కొన్ని ఆసనాలను సాధన చేయడం ప్రారంభించారు. మనస్సును స్వాధీనం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. దీంతో వారు దానిని 'మొండి' యోగా సాధన అని పిలిచారు. రాజ యోగ సాధన మానసికంగా సవాలుతో కూడిన విధానం అవడంతో దీని నుంచే హఠ యోగం పుట్టింది. 15వ శతాబ్దపు ప్రఖ్యాత రుషి, స్వామి స్వాత్మరాముడు, హఠ యోగ ప్రదీపికను వెలుగులోకి తెచ్చాడు.

సంస్కృతంలో హఠ అంటే 'మొండితనం' అని అర్థం. హఠ యోగా అంటే మనలోని ఐదు ఇంద్రియాలు, మనస్సు జోక్యం లేకుండా యోగాను మొండిగా సాధన చేయడం. సాధారణంగా, ప్రజలు హఠ యోగాను ఆసన (యోగ భంగిమలు) సాధనగా మాత్రమే భావిస్తారు. కానీ ఇది ఆసనం, ప్రాణాయామం, ధ్యానానికి సంబంధించిన కఠినమైన అభ్యాసం.

లేచి నిల్చొనేటప్పుడు, కూర్చున్నప్పుడు, నడిచేటప్పుడు, మరే పని చేసేటప్పుడయినా ఆ పనిని శ్రద్ధతో చేయాలి. మన చుట్టూ ఉన్న ప్రదేశం వివరాలన్నీ ప్రయత్నపూర్వకంగానైనా మదిలోకి చేర్చుకుంటూ ఉండాలి. కొంత కాలం గడిచేటప్పటికి, కోరిన లక్ష్యం దానంతటదే లభిస్తుంది.

ఉపయోగించే సాధనాలు...

ఆసనాలు - శరీరంపై నియంత్రణ సాధించడానికి ప్రాణాయామం - శ్వాసపై నియంత్రణ సాధించడానికి ముద్రలు - ప్రాణాలను (సూక్ష్మ శక్తులను) మార్చటానికి, ఉత్తేజపరచడానికి బంధాలు - చక్రాలను (శక్తి కేంద్రాలు) ఉత్తేజపరచడానికి షట్ క్రియలు - అంతర్గత అవయవాలను శుద్ధి చేయడానికి మంత్రాలు - మనస్సును నియంత్రణకు

● **వ్యాయామం:** శరీరం ఆరోగ్యకరంగా ఉంటే మనసు కూడా స్థిమితంగా ఉంటుంది. స్థిరత్వం, సౌలభ్యంతో కూడిన యోగా భంగిమలు ఓర్పు, బలం, వశ్యతను అభివృద్ధి చేయడానికి ప్రభావంతంగా పనిచేస్తాయి.

● **శ్వాస:** యోగాలో, శ్వాస పద్ధతుల ద్వారా మనస్సును ఎలా నియంత్రించాలో నేర్చుకుంటాం. హఠ యోగాలో మనస్సు, శరీరం ఈ రెండింటిపై దృష్టి కేంద్రీకరించడానికి విస్తృత శ్రేణి శ్వాస పద్ధతులు ఉన్నాయి.

● **విశ్రాంతి:** శరీరానికి క్రమం తప్పకుండా విశ్రాంతి ఇవ్వడం వల్ల కండరాలు సరిగ్గా కోలుకోవడానికి, ఇంద్రియాలను ప్రశాంతంగా ఉంచడానికి విశ్రాంతి అవసరం.

సూర్య చంద్రులు...

హఠ యోగా రాజ యోగం నుండి ఉద్భవించింది. దీనిలో అన్ని యోగా భంగిమలను సాధనచేయవచ్చు. ప్రాణాయామ వ్యాయామాలను హఠ యోగాగా వర్గీకరించవచ్చు. కాబట్టి, ఏదైనా యోగా ఆసనాలు లేదా ప్రాణాయామ వ్యాయామాలను అభ్యసిస్తే, మీరు హఠ సాధన చేస్తున్నారని అర్థం. హ (సూర్యుడు) + ఠ (చంద్రుడు) అంటే సూర్య చంద్రులు శక్తిని ఈ యోగా ద్వారా పొందచ్చు.



అభిమౌర్య, యోగా నిపుణులు

● **ఆహారం:** ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకుంటే మనస్సు, శరీరం, ఆత్మను మెరుగ్గా ఉంచుతుంది. యోగ ఆహారంలో ఎక్కువగా శాఖాహారమే ప్రధానంగా ఉంటుంది. మనస్సు, భావోద్వేగాలు, విద్య, ప్రవర్తన.. వంటి అంశాలన్నీ మనం తీసుకునే ఆహారం వల్ల కూడా ప్రభావితం అవుతాయి.

● **సానుకూల ఆలోచన:** మనం ఆలోచించే విధానం మన మనస్సు, శరీర స్థితిని ప్రభావితం చేస్తుంది. అందువల్ల, సమతుల్య శరీరం, మనస్సును సాధించడానికి సానుకూల ఆలోచన లేదా ధ్యానం, అభ్యాసం చాలా ముఖ్యం. సాధారణంగా, హఠ యోగా చేయడానికి 90 నిమిషాల సమయం పడుతుంది.

● **శ్వాసక్రియ:** మొదటి భాగం శ్వాస వ్యాయామాలను చేయాలి. వీటిలో కపాలభాతి (బలంగా ఉచ్ఛ్వాసాలు - అనులోమ విలోమ (నాసికా రంధ్రం నుండి) పద్ధతిలో చేయాలి.

● **వార్మ్-అప్:** రెండవ భాగం మొత్తం శరీరానికి వార్మ్-అప్ వ్యాయామాలు చేయాలి. ముందుగా సూర్య నమస్కారంతో ప్రారంభించాలి. దీని వల్ల వెన్నెముకకు పూర్తి వార్మ్-అప్ లభిస్తుంది.

● **ఆసనాలు:** హఠ యోగాలో 12-15 యోగా ఆసనాలు చేయాల్సి ఉంటుంది. 84 సాంప్రదాయ హఠ యోగా భంగిమలు ఉన్నాయి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

శారీరక.. మానసిక ప్రయోజనాలు



కీళ్లలోనూ, కణజాలంలోనూ చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అన్ని శరీర వ్యవస్థల పనితీరును మెరుగుపరుస్తుంది. కణాల మరమ్మత్తు, పునరుత్పత్తిని ప్రేరేపిస్తుంది. వెన్నుపాము, మెదడులో రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. ఊపిరితిత్తులు, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. దృష్టిని పదును పెడుతుంది. భావోద్వేగాలను సమతుల్యం చేస్తుంది. ఆందోళన, నిరాశను తగ్గిస్తుంది. మానసిక అలసటను తొలగిస్తుంది. సృజనాత్మకతను పెంపొందిస్తుంది. నేర్చుకోవడం, అభివృద్ధిని ప్రేరేపిస్తుంది.

సాక్షి సినిమా

ఖైదీలో..?



● కమల్‌హాసన్

ప్రముఖ నటుడు కమల్‌హాసన్ 'ఖైదీ 2' సినిమాలో నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. కార్తీ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఖైదీ'. 2019లో తెలుగు, తమిళ భాషల్లో విడుదలై ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'ఖైదీ 2' రూపొందనుంది. ఈ మూవీలోనూ కార్తీ హీరోగా నటించనుండగా లోకేశ్ కనగరాజే దర్శకత్వం వహించనున్నారు. కాగా ఈ సీక్వెల్‌లో కమల్‌హాసన్ కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్. కమల్‌హాసన్, లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో వచ్చిన 'విక్రమ్' (2022) సినిమా సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ మూవీ అప్పుడు వీరిద్దరి మధ్య మంచి బాండింగ్ కుదిరింది. దీంతో 'ఖైదీ 2'లోని ఓ కీలక పాత్ర చేయాలని కమల్‌ని లోకేశ్ అడగడం.. ఆ పాత్ర కూడా ఆయనకు బాగా నచ్చడంతో చేసేందుకు కమల్ ఓకే అన్నారని తమిళ సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. త్వరలో ఈ చిత్రం ఆరంభం కానుంది.

అందమైన ప్రేమకథ



● రాశీ ఖన్నా, సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీ రోల్ చేస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఫిబ్రవరి 7) సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజు సందర్భంగా 'తెలుసు కదా' నుంచి న్యూ పోస్టర్స్ రిలీజ్ చేశారు. ఓ ఫొటోలో శ్రీనిధీ శెట్టితో, మరో ఫొటోలో రాశీ ఖన్నాతో కలిసి ఉన్నారు సిద్ధు. ఇద్దరు అమ్మాయిలతో హీరో అందమైన ప్రేమకథను ప్రజెంట్ చేస్తున్నాయి పోస్టర్స్.

వినోదాల జాక్... సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న వినోదాత్మక చిత్రం 'జాక్-కొంచెం క్రాక్'. ఇందులో వైష్ణవీ చైతన్య హీరోయిన్. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.

వినోదాల డాన్ బోస్కో



● మిర్నా మీనన్, రుష్య, చుక్కపల్లి సురేష్

రుష్య, మిర్నా మీనన్, మౌనిక, మురళీ శర్మ, విష్ణు ఓయ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి ముఖ్య తారలుగా 'డాన్ బోస్కో' సినిమా షురూ అయింది. పి. శంకర్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని (బెన్నీ), శైలేష్ రామ నిర్మిస్తున్న ఈ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నిర్మాత నాగ వంశీ ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమాలతో చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి కెమెరా స్విచ్చాన్ చేయగా, చుక్కపల్లి సురేష్ క్లాప్ కొట్టారు. చినబాబు స్క్రిప్ట్‌ని మేకర్స్‌కు అందజేశారు. ''వినోదం నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'డాన్ బోస్కో'. ఈ మూవీలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌గా మురళీ శర్మ, లెక్చరర్ సుమతిగా మిర్నా మీనన్ నటిస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమేరా: ఎదురోలు రాజు.

అతన్ని నమ్మి నాలా నష్టపోవద్దు

– సదానంద్



''నిర్మాత సింగనమల రమేశ్‌బాబు మోసాలకు పాల్పడేందుకు మళ్లీ ఇండస్ట్రీకి వస్తున్నాడు. అతన్ని నమ్మి సినిమాలకు పెట్టుబడి పెట్టి.. నాలా ఎవరూ నష్టపోవద్దు'' అని ఫైనాన్షియర్ వైజయంతీ రెడ్డి భర్త సదానంద్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ– ''రమేశ్‌బాబు మా పెట్టుబడితో 'కొమరంపులి, ఖలేజా' సినిమాలు తీసి, మాకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. డబ్బులు ఇవ్వమని అడిగితే కొందరు మనుషులతో గన్ పెట్టి బెదిరించాడు. దాంతో హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు పెట్టాం. మా డబ్బులు రికవరీ చేసుకునేందుకు అవసరమైతే హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు వెళ్లి పోరాడతాం. 'కొమరం పులి, ఖలేజా' చిత్రాల ఆలస్యానికి ఓ కారణం రమేశ్‌కు ఉన్న చెడు అలవాట్లయితే.. కొందరు రౌడీలను లొకేషన్‌లో కూర్చోబెట్టేవాడు. దీంతో నటీనటులు ఇబ్బందులకు గురయ్యేవారు. రమేశ్, ఇతరులపై మేం పెట్టిన కేసును నాంపల్లి క్రిమినల్ కోర్టు జనవరి 31న కొట్టివేసింది. దానిపై సీఐడీతో పాటు మేం కూడా తెలంగాణ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లనున్నాం. ఇక ప్రొద్దుటూరుకు చెందిన ఇంకెందరో ఫైనాన్షియర్స్ దగ్గర దాదాపు రూ. 300 కోట్లు తీసుకుని, తిరిగి ఇవ్వమంటే చంపేస్తామంటూ బెదిరించారు. మిగతా బాధితులందరినీ కలుపుకుని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌గార్లను కలిసి, అన్ని విషయాలు వివరిస్తాం'' అన్నారు.

అడవి నేపథ్యంలో...



● రోషన్ కనకాల

రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఈ నెలలో ప్రారంభం కానుంది. ''అడవి నేపథ్యంలో సాగే లవ్ స్టోరీ చిత్రం 'మోగ్లీ 2025'. రోషన్‌ను సందీప్ రాజ్ కొత్త కోణంలో చూపించనున్నారు. 'మోగ్లీ 2025' తర్వాత రోషన్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు'' అని పేర్కొన్నారు మేకర్స్.

తండ్రి బాటలో...



● దినేష్ మహీంద్ర

'శ్రీరాములయ్య, ఎన్‌కౌంటర్, జయం మనదేరా, భద్రాచలం, జై బోలో తెలంగాణ' వంటి విజయవంతమైన చిత్రాలు తెరకెక్కించారు దర్శకుడు ఎన్. శంకర్. ఆయన తనయుడు దినేష్ మహీంద్ర తండ్రి బాటలో దర్శకత్వంపై అడుగులు వేస్తున్నారు. త్వరలోనే దినేష్ మహీంద్ర దర్శకత్వంలో ఆరెక్స్ క్రియేషన్స్‌పై ఓ సినిమా తెరకెక్కనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న చిత్రమిది. ఈ సినిమా ద్వారా నూతన తారలతో పాటు నూతన సాంకేతిక నిపుణులు పరిచయం కానున్నారు. దర్శకత్వం, స్క్రీన్‌ప్లే విభాగాల్లో శిక్షణ పొందాడు దినేష్. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పాటల రికార్డింగ్ జరుగుతోంది. ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

జూన్ 1 నుంచి మలయాళ చిత్రాల షూటింగ్ బంద్

● నటీనటుల పారితోషికం తగ్గాలి ● పన్ను రద్దు చేయాలి



● సురేష్‌కుమార్

''**మ**లయాళ చిత్రపరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంది... ఇలానే కొనసాగితే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది'' అంటూ మాలీవుడ్ చిత్రసీమకు చెందిన పలు శాఖలు ఆందోళన చెందుతున్నాయి. ఈ మేరకు కొన్ని మార్పులు చేయకపోతే... జూన్ 1 నుంచి సంపూర్ణంగా షూటింగ్స్, అలానే సినిమాలకు సంబంధించిన ఇతర కార్యకలాపాలను నిలిపివేయాలని, చివరికి సినిమాల ప్రదర్శనలను కూడా ఆపాలని నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు ప్రచారంలో కొచ్చాయి. కేరళ చిత్ర నిర్మాతల మండలి, కేరళ చిత్ర పంపిణీదారుల సంఘం, కేరళ చలన చిత్ర కార్మికుల సమాఖ్య, కేరళ సినిమా ఎగ్జిబిటర్ల సంఘం... ఇవన్నీ కలిపి ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అందరూ కలిసి తీసుకున్న ఈ నిర్ణయాన్ని మలయాళ అగ్రనిర్మాత, కథానాయిక కీర్తీ సురేష్ తండ్రి సురేష్‌కుమార్ ప్రకటించారు.

60 శాతం పారితోషికాలకే...

''సినిమా పరిశ్రమ 30 శాతం పన్ను కడుతోంది. ఇలా 30 శాతం పన్ను విధింపబడుతున్న ఇండస్ట్రీ ఏదీ లేదు. ఈ 30 శాతంలో జీఎస్‌టీ కాకుండా అదనంగా వినోదపు పన్ను కూడా ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పన్ను రద్దు చేయాలి. అలాగే ఇండస్ట్రీపరంగా నటీనటులు, టెక్నీషియన్ల పారితోషికాలు బాగా పెరిగిపోయాయి. వాటిని తగ్గించాలి. సినిమాకి అవుతున్న బడ్జెట్‌లో 60 శాతం యాక్టర్ల పారితోషికాలకే కేటాయిస్తున్న పరిస్థితుల్లో నిర్మాతలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇది మాత్రమే కాకుండా కొత్తగా వస్తున్న యాక్టర్లు, డైరెక్టర్లు కూడా ఎక్కువ పారితోషికం డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి కారణాల వల్ల సినిమా నిర్మాణం అనేది లాభదాయకంగా లేదు'' అని సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

50 రోజుల్లో పూర్తి చేయకుండా...

ఇంకా సినిమా నిర్మాణానికి అవుతున్న సమయం గురించి పేర్కొంటూ... ''50 రోజుల్లోనే పూర్తి చేయడానికి వీలున్న సినిమాలకు కూడా 150 రోజులు చేస్తున్నారు. దీని వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోతోంది. ఇలా తక్కువ రోజుల్లో పూర్తి చేయలేకపోవడంతో నిర్మాతలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను తీవ్రతరం చేస్తోంది'' అన్నారు.

176 చిత్రాలు... అపజయంపాలు...

బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ సినిమా పరిశ్రమని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నాయని చెబుతూ – ''2024లో విడుదలైన చిత్రాల్లో 176 చిత్రాలు వసూళ్లపరంగా నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే రూ. 101 కోట్లు నష్టం వాటిల్లింది. ఈ నష్టం సినిమా కోసం తెరవెనుక పని చేస్తున్న నిపుణుల ఉపాధిపై ప్రభావం చూపుతోంది'' అని పేర్కొన్నారు సురేష్‌కుమార్.

ఇక తాజాగా తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో పన్ను తగ్గింపు లేదా ఎత్తివేతను కోరుతూ మలయాళ చిత్రసీమకు చెందిన కీలక శాఖల అధ్యక్షులు త్వరలో కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ని, ఇతర సంబంధిత మంత్రులను కలిసి ఓ వినతి పత్రాన్ని సమర్పించడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. నటీనటుల పారితోషికం తగ్గింపు, తక్కువ రోజుల్లో సినిమా పూర్తి చేయడం... వంటి విషయాల్లో సరైన పరిష్కారం లభించకపోతే జూన్ 1 నుంచి షూటింగ్స్, సినిమాకి సంబంధించిన ఇతర కార్యకలాపాలు నిలిపివేయడం ఖాయం అని బలమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మరి... మలయాళ చిత్రాల షూటింగ్స్ ఆగుతాయా? చర్చలు సజావుగా జరిగి, పరిష్కార మార్గం వెతుక్కుని షూటింగ్స్ చేస్తారా? అనేది రానున్న రోజుల్లో తెలుస్తుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
198	43
77,860	23,560

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,583	▽ 210
డోజోన్స్	44,450	▽ 297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,700	▽ 27
డాక్స్	21,787	▽ 115
షాంఘై	3,286	△ 86
నికాయ్	38,787	▽ 280

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	58,882	△ 83
బంగారం (22 క్యారెట్)	58,646	▽ 86
వెండి (కిలో)	71,576	▽ 629

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.05	88.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.00	110.88
€	యూరో	ఎస్‌బీఐ	89.60	92.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.28
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.99	56.21
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.55	66.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.42	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.92	24.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.12	12.94

ఈఎంఐలు ఇక దిగొస్తాయ్!



కొత్త గవర్నర్ సారథ్యంలో ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం

- అయిదేళ్ల తర్వాత తొలిసారి వడ్డీ రేట్ల తగ్గింపు...
- రెపో రేటు పావు శాతం కోత.. 6.25 శాతానికి డౌన్
- మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు చికిత్స
- 2025–26లో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా అంచనా
- ద్రవ్యోల్బణం 4.2%కి తగ్గే చాన్స్

ఎన్నాళ్లో వేచిన ఉదయం.. అన్నట్లుగా దాదాపు ఐదేళ్ల తర్వాత రుణ గ్రహీతలకు ఆర్‌బీఐ నుంచి చల్లని కబురు అందింది. కీలక రెపో రేటును పావు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు ఇక దిగి రానున్నాయి. దీంతో ఈఎంఐల భారం తగ్గనుంది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా పెరగడమే కానీ, తగ్గడమంటే ఏంటో తెలియని గృహ రుణ గ్రహీతలకు ఇది బంపర్ అవకాశమనే చెప్పొచ్చు. అటు మందగమనంతో ఆశగా ఎదుచుచూస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి కూడా తాజా తగ్గింపు తగిన బూస్ట్ ఇస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ముంబై: రుణ గ్రహీతలకు ఊరటనిచ్చేలా కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలో రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందించేలా దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత కీలక రెపో రేటును పావు శాతం తగ్గించింది. దీంతో ఈ ప్రామాణిక వడ్డీ రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి దిగి రానుంది. గవర్నర్ సారథ్యంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. తాజా బడ్జెట్లో కేంద్రం మధ్య తరగతి వర్గాలకు ఆదాయపు పన్నులో భారీ ఉపశమనం కల్పించిన వెంటనే ఆర్‌బీఐ కూడా తీపి కబురు అందించడం విశేషం. కాగా, ప్రస్తుత పాలసీ విషయంలో ప్రస్తుత తటస్థ (న్యూట్రల్) విధానాన్నే కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది.

వృద్ధి రేటు ఇలా...: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.7 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. మరోపక్క, ద్రవ్యోల్బణం కూడా 4.2 శాతానికి (ఈ ఆర్థిక సంవత్సరం అంచనా 4.8 శాతం) దిగొస్తుందని లెక్కగట్టింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.4 శాతానికి (నాలుగేళ్ల కనిష్టం) తగ్గిపోవచ్చని, ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేయడం తెలిసిందే. గతేడాది అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 6.21 శాతం గరిష్టాన్ని తాకింది. ఆ తర్వాత నెమ్మదిగా శాంతిస్తూ.. నవంబర్లో 5.48 శాతానికి, డిసెంబర్లో 5.22 శాతానికి దిగొచ్చింది. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి వెంటాడుతోంది. మరోపక్క, ద్రవ్యోల్బణం భయాలతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు బ్రేక్ ఇచ్చింది. ఈ పరిణామాలతో రూపాయి ఘోరంగా పడిపోతోంది. తాజాగా డాలరు మారకంలో సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 87.60కి క్రాష్ అవ్వడం తెలిసిందే. ఈ తరుణంలో ఆర్‌బీఐ రేట్ల కోత దేశీయంగానూ ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందని, రూపాయి పతనంతో విదేశీ నిధులు మరింత తరలిపోయే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

రెపో రేటు అంటే..

బ్యాంకులు ఆర్‌బీఐ నుంచి తీసుకునే రుణాలపై విధించే వడ్డీ రేటునే రెపో (రీపర్చేజ్) రేటుగా వ్యవహరిస్తారు. రెపో అధికంగా ఉంటే బ్యాంకులకు నిధుల సమీకరణ వ్యయం పెరుగుతుంది, దీంతో రుణాలపై వడ్డీ రేట్లు పెంచుతాయి. రెపో రేటు తగ్గడం వల్ల బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు బదలాయిస్తాయి. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత కార్పొరేట్ లోన్లపైనా వడ్డీ భారం తగ్గుతుంది. అయితే, రెపో రేటు తగ్గడం వల్ల డిపాజిట్ రేట్లతో పాటు ఇతర పొదుపు సాధనాలపై కూడా తక్కువ వడ్డీ లభిస్తుంది.

ఇతర ముఖ్యాంశాలు...

- సైబర్ మోసాలకు అడ్డకట్ట వేసి, భద్రతను కట్టుదిట్టం చేయడం కోసం ప్రత్యేకంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇంటర్నెట్ డొమైన్‌ను డాట్ ఇన్ (.in)కు మార్చుకోవాలి. అంటే బ్యాంకులు 'bank.in', బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు 'fin.in' ఉపయోగించాలి. బ్యాంకు డొమైన్ మార్పు 2025 ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుండగా.. నాన్–బ్యాంకులకు రాబోయే రోజుల్లో అమలు చేయనున్నారు.
- స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీలో రిజిస్టర్ అయిన బ్యాంకింగేతర బ్రోకరేజ్ సంస్థలు తమ క్లయింట్ల తరఫున... ప్రభుత్వ సెక్యూరిటీల్లో సెకండరీ మార్కెట్ లావాదేవీల కోసం ఇక నేరుగా నెగోషియేటెడ్ డీలింగ్ సిస్టమ్–ఆర్డర్ మ్యాచింగ్ (ఎన్‌డీఎస్–ఓఎం)ను ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ నియంత్రిత సంస్థలకు, బ్యాంకులు, ప్రత్యేక ప్రైమరీ డీలర్ల తరఫున క్లయింట్లకే అందుబాటులో ఉంది.
- తదుపరి పాలసీ సమీక్ష ఏప్రిల్ 7–9 తేదీల్లో జరుగుతుంది.

సానుకూల పరిస్థితులతోనే...



"గడిచిన కొన్ని పాలసీ చర్యల కారణంగా ఆహార ద్రవ్యోల్బణం దిగొచ్చే అవకాశాలున్నాయి. 2025–26లో ద్రవ్యోల్బణం మరింత శాంతించి ఆర్‌బీఐ టార్గెట్ (4%) స్థాయికి చేరుతుందని భావిస్తున్నాం. ఈ సానుకూల పరిస్థితుల కారణంగానే మందగమనంలో ఉన్న వృద్ధికి తోడ్పాటు అందించేలా ఎంపీసీ ఏకగ్రీవంగా రెపో రేటు కోతకు మొగ్గు చూపింది. 2024–25 రెండో త్రైమాసికంలో వృద్ధి 5.4 శాతానికి (రెండేళ్ల కనిష్టం) తగ్గిన తర్వాత మళ్లీ క్రమంగా పుంజుకుంటోంది. ఈ వృద్ధి–ద్రవ్యోల్బణం లెక్కలను భేరీజు వేసుకునే నిర్ణయం ప్రకటించాం. స్థూల ఆర్థిక అంచనాల మేరకు భవిష్యత్తు సమావేశాల్లో తగిన నిర్ణయాలు తీసుకుంటాం. ఫైనాన్షియల్ వ్యవస్థలో తగినంత ద్రవ్య సరఫరా (లిక్విడిటీ) ఉండేలా అవసరమైన చర్యలన్నీ చేపడతాం. భారత్ మళ్లీ కచ్చితంగా 7 శాతానికి మించి వృద్ధి రేటు సాధిస్తుంది. బడ్జెట్లో ఆదాయపు పన్ను ఊరట వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం లేదు, నిజానికి ఇది వృద్ధికి చేదోడుగా నిలుస్తుంది. ఇక రూపాయి పతనం విషయానికొస్తే, డాలరుతో దేశీ మారకం విలువ 'నిర్దిష్ట స్థాయి లేదా శ్రేణి'లో ఉండాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోలేదు.

– సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ గవర్నర్

గృహ రుణంపై ఊరట ఎంతంటే..?

20 ఏళ్ల వ్యవధికి రూ.25 లక్షల ఇంటి రుణం	ఈఎంఐ (రూ.లలో)	మొత్తం వడ్డీ (రూ.లలో)
వడ్డీ రేటు 9%	22,493	28,98,365
వడ్డీ రేటు 8.75%	22,093	28,02,264
ఎంత ఆదా	400	96,091

ఒక వ్యక్తి తాజా రెపో రేటు కోతకు ముందు 9 శాతం వడ్డీ రేటుతో 20 ఏళ్ల కాలానికి రూ. 25 లక్షల ఇంటి రుణం తీసుకున్నారనుకుందాం. అతనికి ప్రస్తుతం రూ.22,493 చొప్పున నెలవారీ వాయిదా (ఈఎంఐ) పడుతుంది. ఆర్‌బీఐ తాజా పావు శాతం రేటు కోత నేరుగా బ్యాంకులు వర్తింపజేస్తే.. గృహ రుణంపై వడ్డీ రేటు 8.75 శాతానికి తగ్గుతుంది. దీని ప్రకారం ఈఎంఐ రూ.22093కు దిగొస్తుంది. అంటే నెలకు రూ.400 తగ్గినట్లు లెక్క. మిగతా రుణ వ్యవధిలో ఇతరత్రా ఎలాంటి మార్పులు జరగకుండా ఉంటే, దీర్ఘ కాలంలో రుణ గ్రహీతకు రూ. 96 వేలు మిగులుతాయి. ఒకవేళ అదే ఈఎంఐ మొత్తాన్ని కొనసాగిస్తే.. రుణ కాల వ్యవధి 10 నెలలు తగ్గుతుంది.

5 ఏళ్లలో తొలిసారి..

2020 తర్వాత తొలి సారి రెపో రేటు ను తగ్గించగా.. రెండున్నరేళ్ల తర్వాత మళ్లీ కీలక రేట్లలో మార్పులు చేయడం విశేషం. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి వరకు ఆర్‌బీఐ రెపో రేటును ఏకధాటిగా 4% నుంచి 6.5 శాతానికి, అంటే 2.5% పెంచేసింది. ఆ తర్వాత రేట్లలో మార్పు లేకుండా యథాతథ పాలసీని కొనసాగిస్తూ వస్తోంది. ఇక గృహ రుణాలపై వడ్డీ రేట్లు ఆల్‌టైమ్ కనిష్టాన్ని (దాదాపు 6%) తాకిన తర్వాత కొండెక్కి కూర్చున్నాయి. ప్రస్తుతం 9–9.5% రేంజ్‌లో తీవ్ర భారంగా మారాయి. అధిక వడ్డీ రేట్లకు తోడు పన్నుల భారం ధరల పెరుగుదల దెబ్బతో గత రెండేళ్లుగా ఇల్లు కొనాలంటే బెదిరిపోయే పరిస్థితి నెలకొంది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో గృహ రుణ గ్రహీతలకు మళ్లీ మంచి రోజులు వచ్చినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు.

సమయానుకూల నిర్ణయం..



ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు నిర్ణయం సరైన సమయంలో వెలువడింది. నియంత్రణ పరంగా చేపట్టిన చర్యలను కూడా స్వాగతిస్తున్నాం.

– సి.ఎస్. శెట్టి, ఎస్‌బీఐ చైర్మన్

ఇది సరిపోదు...

ఆర్బీఐ పావు శాతం రేట్ల తగ్గింపు వల రియల్ ఎస్టేట్ పరిశ్రమపై ప్రత్యక్ష ప్రభావం పరిమితంగానే ఉంటుంది. మొత్తం డిమాండ్‌ను పెంచి, ఇళ్ల విక్రయాలు జోరందుకోవాలంటే (ముఖ్యంగా అందుబాటు ధరల విభాగంలో) మరిన్ని రేట్ల కోతలు ఉంటాయని ఆశిస్తున్నాం.

– బొమన్ ఇరానీ, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు

హౌసింగ్‌కు బూస్ట్...



ఆర్బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. రెపో తగ్గింపు వల్ల గృహ రుణాలపై వడ్డీ రేట్లు దిగొస్తాయి. దీంతో మళ్లీ ఇళ్ల కొనుగోళ్లు పుంజుకునేందుకు దోహదం చేస్తుంది.

– జి. హరిబాబు, నరెడ్కో జాతీయ అధ్యక్షుడు

మార్కెట్లకు నచ్చలే..



- మెప్పించని ఆర్‌బీఐ పాలసీ
- స్టాక్ సూచీలకు మూడోరోజూ నష్టాలే

ముంబై: ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్ల తగ్గింపు సైతం స్టాక్ మార్కెట్ నష్టాలను అడ్డుకోలేకపోయింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల నేపథ్యంలో కీలక రంగాల షేర్లలో శుక్రవారం కూడా లాభాల స్వీకరణ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 198 పాయింట్లు కోల్పోయి 77,860 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు నష్టపోయి 23,560 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా మూడోరోజూ నష్టాల ముగింపు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన ప్రకటన తర్వాత బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్ 582 పాయింట్లు కోల్పోయి 77,476 వద్ద, నిఫ్టీ 160 పాయింట్లు పతనమై 23,443 వద్ద కనిష్టాలు తాకాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.68% క్షీణించగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.13 శాతం స్వల్పంగా లాభపడింది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
ఇన్ఫోసిస్‌లో 300 మంది ఫ్రెషర్ల తొలగింపు
100 గిగావాట్లకు సోలార్ విద్యుత్

సాక్షి స్పోర్ట్స్

తైక్వాండోలో హర్షప్రదకు రజతం... వరుణ్‌కు కాంస్యం





డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో శుక్రవారం తెలంగాణ ఖాతాలో ఒక పతకం... ఆంధ్రప్రదేశ్ ఖాతాలో ఒక పతకం చేరాయి. మహిళల తైక్వాండో (క్యోరుగీ) అండర్–73 కేటగిరీలో తెలంగాణకు చెందిన పాయం హర్షప్రద రజత పతకం సొంతం చేసుకుంది. ఫైనల్లో హర్షప్రద 0–2తేడాతో ఇతిషా దాస్ (చండీగఢ్) చేతిలో పరాజయం పాలైంది. ప్రస్తుతం తెలంగాణ ఆరు పతకాలతో (1 స్వర్ణం, 1 రజతం, 4 కాంస్యాలు) 28వ స్థానంలో ఉంది. మరోవైపు పురుషుల తైక్వాండో అండర్–68 కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టి.వరుణ్ కాంస్య పతకం గెలిచాడు. సెమీఫైనల్లో వరుణ్ 0–2తో మహేంద్ర పరిహార్ (ఉత్తరాఖండ్) చేతిలో ఓడిపోయాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ 10 పతకాలతో (4 స్వర్ణాలు, 1 రజతం, 5 కాంస్యాలు) 18వ స్థానంలో ఉంది.

బుమ్రా ఫిట్‌గా ఉన్నాడా!



నేడు బీసీసీఐ వైద్య బృందం నివేదిక

బెంగళూరు: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడే అవకాశాలపై సందిగ్ధత వీడనుంది. వెన్ను నొప్పికి చికిత్స తీసుకుంటూ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఉన్న బుమ్రా ఫిట్‌నెస్‌పై నేడు స్పష్టత రానుంది. అతనికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం శనివారం బీసీసీఐకి తమ నివేదికను అందజేస్తుంది. ఇందులో బుమ్రా గాయం తీవ్రత, చికిత్సతో పాటు మ్యాచ్ ఫిట్‌నెస్‌కు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయి. ప్రస్తుతానికి భారత పేసర్ బెంగళూరులోనే ఉండనున్నాడు. నివేదికను అందుకున్న తర్వాత బోర్డు అధికారులు బుమ్రాను ఆడించే విషయంపై భారత టీమ్ మేనేజ్‌మెంట్‌తో చర్చించే అవకాశం ఉంది. జనవరిలో సిడ్నీ టెస్టు అనంతరం ఆస్ట్రేలియా నుంచి తిరిగొచ్చిన తర్వాత బుమ్రా గాయానికి స్కానింగ్ తీశారు. వెన్ను నొప్పి కారణంగానే ఆ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్‌కు దిగలేదు. నాడు ఆ రిపోర్టులను న్యూజిలాండ్‌కు చెందిన ప్రముఖ క్రీడా వైద్యుడు డాక్టర్ రోవన్ షూటెన్‌కు చూపించారు. అతని పర్యవేక్షణలోనే చికిత్స కొనసాగింది కాబట్టి ఇప్పుడు కూడా రోవన్ అభిప్రాయం కీలకం కానుంది. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇప్పటికే ప్రకటించిన జట్టులో మార్పులు చేసుకునేందుకు ఈ నెల 12 వరకు గడువు ఉంది. బుమ్రా పూర్తిగా కోలుకోకపోతే అతని స్థానంలో భారత జట్టు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి లేదా పేసర్ హర్షిత్ రాణాలలో ఒకరిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.



మార్చి 1న బీసీసీఐ ఎస్‌జీఎం

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్త కార్యదర్శి పదవి కోసం ఆసక్తికర పోటీ సాగుతోంది. బోర్డులో ఇప్పటికే తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న ముగ్గురు సీనియర్ సభ్యులు ఈ పదవిపై ఆసక్తి చూపిస్తున్నారు. అవిషేక్ దాల్మియా (బెంగాల్ సంఘం), రోహన్ జైట్లీ (ఢిల్లీ సంఘం), సంజయ్ నాయక్ (ముంబై సంఘం) లలో ఒకరికి ఈ అవకాశం దక్కనుంది. అయితే కార్యదర్శి, కోశాధికారి ఎంపిక తరహాలోనే ఈ పదవికి కూడా ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎంపిక చేసేందుకు బోర్డు ప్రయత్నిస్తోంది. నిబంధనల ప్రకారం సంయుక్త కార్యదర్శి ఎంపిక కోసం మార్చి 1న ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) నిర్వహించనుంది. దీనికి సంబంధించి అన్ని రాష్ట్ర సంఘాలకు నోటీసులు పంపించారు. ఇప్పటి వరకు సంయుక్త కార్యదర్శిగా ఉన్న దేవ్‌జిత్ సైకియా కార్యదర్శిగా ఎన్నిక కావడంతో ఈ పదవికి ఖాళీ ఏర్పడింది.



సెమీస్‌లో మాయ

ముంబై: తన సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ–125 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 15 ఏళ్ల మాయ 6–4, 3–6, 6–2తో ప్రపంచ 285వ ర్యాంకర్ మి యామగుచి (జపాన్)పై గెలిచింది. రెండు గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మాయ ఐదు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మాయ నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ 117వ ర్యాంకర్ జిల్ టెచ్‌మన్ (స్విట్జర్లాండ్)తో తలపడుతుంది. భారత మూడో ర్యాంకర్, తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక 2–6, 2–6తో జిల్ టెచ్‌మన్ చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైన రష్మికకు 3,450 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 27 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

స్మిత్ 36వ సెంచరీ



స్మిత్

కేరీ

గాలె: స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (239 బంతుల్లో 120 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్), వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (156 బంతుల్లో 139 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీలతో కదంతొక్కారు. ఫలితంగా శ్రీలంకతో రెండో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (21), ఉస్మాన్ ఖ్వాజా (36) ఎక్కువసేపు నిలవలేక పోగా... లబుషేన్ (4) విఫలమయ్యాడు. దీంతో ఆసీస్ జట్టు 91 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ స్మిత్, కేరీ లంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఈ జంట ఆడుతూ పాడుతూ పరుగులు చేయడంతో ఆసీస్ భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. ఈ క్రమంలో స్మిత్ 191 బంతుల్లో టెస్టుల్లో 36వ సెంచరీ నమోదు చేసుకోగా... కేరీ 118 బంతుల్లో టెస్టుల్లో తన రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 239 పరుగులు జోడించారు. లంక బౌలర్లలో నిశాన్ పైరిస్ 2 వికెట్లు తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 229/9తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 97.4 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (139 బంతుల్లో 85 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) పోరాడాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, లయన్, కునేమన్ తలా 3 వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే తొలి టెస్టులో గెలిచి సిరీస్‌లో 1–0తో ముందంజలో ఉన్న ఆస్ట్రేలియా... రెండో టెస్టులో ప్రస్తుతం 73 పరుగుల ఆధిక్యంలో ఉంది.

అలెక్స్ కేరీ అజేయ శతకం

- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 330/3
- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 257 ఆలౌట్

36 టెస్టుల్లో స్మిత్ చేసిన సెంచరీలు. అత్యధిక సెంచరీలు చేసిన టెస్టు బ్యాటర్ల జాబితాలో స్మిత్ ఐదో స్థానానికి చేరాడు. సచిన్ టెండూల్కర్ (51 : భారత్), జాక్వెస్ కలిస్ (45 : దక్షిణాఫ్రికా), రికీ పాంటింగ్ (41 : ఆస్ట్రేలియా), సంగక్కర (38 : శ్రీలంక) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు. జో రూట్ (ఇంగ్లండ్), రాహుల్ ద్రవిడ్ (భారత్) కూడా 36 సెంచరీల చొప్పున చేశారు.

1983 ఆసియా ఉపఖండంలో స్మిత్ చేసిన పరుగులు. అత్యధిక పరుగులు చేసిన ఆస్ట్రేలియా క్రికెటర్‌గానూ స్మిత్ గుర్తింపు పొందాడు. రికీ పాంటింగ్ (1889 పరుగులు) పేరిట ఉన్న రికార్డును స్మిత్ అధిగమించాడు.

197 టెస్టుల్లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆస్ట్రేలియా ఫీల్డర్‌గా స్మిత్ నిలిచాడు. రికీ పాంటింగ్ (196) పేరిట ఉన్న రికార్డును స్మిత్ సవరించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

ఫైనల్లో సాకేత్–రామ్ జోడీ



చెన్నై: కొత్త ఏడాదిలో ఆడుతున్న మూడో టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్, భారత డేవిస్ కప్ జట్టు మాజీ సభ్యుడు సాకేత్ మైనేని టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌తో జత కట్టిన సాకేత్ చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి సెమీఫైనల్లో మూడో సీడ్, డిఫెండింగ్ చాంపియన్ సాకేత్–రామ్‌కుమార్ (భారత్) ద్వయం 7–6 (7/5), 7–6 (10/8)తో టాప్ సీడ్ రే హో (చైనీస్ తైపీ)–మాథ్యూ క్రిస్టోఫర్ రోమియోస్ (ఆస్ట్రేలియా) జోడీపై సంచలన విజయం సాధించింది. 98 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. రెండు జోడీలు తమ సర్వీస్‌లను రెండేసి సార్లు కోల్పోయాయి. అయితే టైబ్రేక్‌లో మాత్రం సాకేత్–రామ్ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే ఫైనల్లో షింటారో మొచిజుకి–కైటో యుసుగి (జపాన్) జోడీతో సాకేత్–రామ్ ద్వయం తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో మొచిజుకి–యుసుగి జంట 4–6, 6–4, 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్ జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీపై గెలిచింది.

రాజస్తాన్ రాయల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులే



జైపూర్: భారత మాజీ లెగ్‌స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టుతో మరోసారి జత కట్టనున్నాడు. టీమ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులేను మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) కోచ్‌లలో ఒకడిగా ఉన్న బహుతులే 2018–21 మధ్య కాలంలో కూడా రాజస్తాన్ రాయల్స్ సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్నాడు. టీమ్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బౌలింగ్ కోచ్ షేన్ బాండ్‌లతో కలిసి అతను పని చేస్తాడు. భారత జట్టు హెడ్ కోచ్‌గా ద్రవిడ్ ఉన్న సమయంలో రెండు వేర్వేరు సిరీస్‌లలో బహుతులే కోచింగ్ బృందంలో ఉన్నాడు. బహుతులే భారత్ తరఫున 2 టెస్టులు, 8 వన్డేలు ఆడి 5 వికెట్లు తీశాడు.

హైరిస్క్ జోన్‌లో వందేభారత్!

కుదుపులు లేని వేగవంతమైన ప్రయాణం, ఆధునిక కప్లింగ్ సిస్టం వల్ల కోచ్‌ల మధ్య సమన్వయం, 'కవచ్'ఏర్పాటుతో ప్రమాదాలకు అతి తక్కువ ఆస్కారం.. వందేభారత్ రైళ్ల గురించి రైల్వే శాఖ చెప్పే విశేషాలివి. నిజానికి ఈ రైళ్లు హై రిస్క్ జోన్‌లో పరుగు పెడుతున్నాయి. ఒక్క ప్రాంతంలో తప్ప మరెక్కడా రైలు ప్రమాదాలు నివారించే కవచ్ వ్యవస్థ ఈ రైళ్లలో లేదు. ఢిల్లీ-అగ్రా, మధుర-పల్వాల్ సెక్షన్ల మధ్య 86 కి.మీ. నిడివిలో మాత్రమే వందేభారత్ రైళ్లు సురక్షితంగా ప్రయాణిస్తాయి. మిగతా ప్రాంతాల్లో సాధారణ రైళ్లకు ఉన్న ప్రమాద భయం వీటినీ వెంటాడుతోంది. గంటకు 50 - 70 కి.మీ. సగటు వేగంతో ప్రయాణించే సాధారణ రైళ్లు నిరంతరం 'రిస్క్'లో ఉంటే.. 100 కి.మీ. సగటు వేగం (గరిష్టం 130 కి.మీ.)తో దూసుకెళ్లే వందేభారత్ రైళ్లు హై రిస్కులో ఉన్నాయని స్పష్టమవుతోంది. తెలంగాణ మీదుగా నడుస్తున్న ఐదు వందేభారత్ రైళ్లు ప్రమాదకరంగానే పరుగు పెడుతున్నాయి. పట్టాలపై రైళ్ల అధిక సాంద్రత, సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించకపోవటం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. - సాక్షి, హైదరాబాద్



కవచ్ వ్యవస్థతో ఇంకా కాని అనుసంధానం

- దేశంలో ఒకే వందేభారత్ రైలుకు కవచ్
- తెలంగాణలోని ఐదు రైళ్లు ప్రమాద జోన్‌లోనే..
- లోకోమోటివ్‌లలో మాత్రమే కవచ్ పరికరం
- ట్రాక్, స్టేషన్లలో లేకపోవటంతో అవి నిరుపయోగమే
- కవచ్ లేకుండానే వందేభారత్‌లను పెంచుతున్న రైల్వే శాఖ


ఆ పరికరం నిరుపయోగమే..

ప్రస్తుతం వందేభారత్ రైళ్లలో కవచ్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. లోకో పైలట్ నిర్లక్ష్యంగా ఉన్నా, తప్పుడు సిగ్నల్‌తో వేరే రైళ్లకు చేరువగా దూసుకెళ్లినా రైలు తనంతట తానుగా బ్రేక్ వేసుకుంటుందనే భావన చాలా మందిలో ఉంది. కానీ, రైళ్ల లోకోమోటివ్‌లలో మాత్రమే కవచ్ యంత్రం ఉంటే నిరుపయోగమే. కవచ్ వ్యవస్థ పనిచేయాలంటే, రైలు ఇంజిన్లలో కవచ్ పరికరం ఉండటంతో పాటు, ప్రతి స్టేషన్‌లో కవచ్ వ్యవస్థ ఉండాలి. అక్కడి ట్రాక్ వెంట ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్ ఏర్పాటు చేయాలి. ట్రాక్ వెంట ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఉండాలి. వీటిని అనుసంధానిస్తూ ఆ మార్గంలో నిర్ధారిత నిడివిలో టెలికం టవర్లు ఏర్పాటు చేయాలి. ఇవన్నీ అనుసంధానమై పనిచేసినప్పుడే రైళ్లు వాటంతటే అవి ప్రమాదాన్ని నివారించుకోగలవు. లోకో పైలట్లను కవచ్ వ్యవస్థ అప్రమత్తం చేస్తుంది. మిగతావి ఏవీ లేకుండా కేవలం ఇంజిన్లలో కవచ్ పరికరంతో పరుగుపెట్టే వందేభారత్‌లు ప్రమాదాన్ని నివారించుకోలేవని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

ఒకే మార్గంలో..

ఢిల్లీ-ఆగ్రా మధ్య దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్ పరుగు పెడుతోంది. దీని వేగం గంటకు 160 కి.మీ.. ఈ వేగాన్ని సాధారణ ట్రాక్ తట్టుకోలేదన్న ఉద్దేశంతో ఆ మార్గంలో 125 కి.మీ. ప్రత్యేక ట్రాక్ నిర్మించారు. అదే మార్గంలోని మధుర-పల్వాల్ సెక్షన్ల మధ్య 86 కి.మీ. మేర పూర్తిస్థాయి కవచ్ వ్యవస్థ ఏర్పాటైంది. ఆ మార్గంలో మాత్రమే రైళ్లు కవచ్ రక్షణతో ఉన్నట్టు. ఆ మార్గంలో ఒకే ఒక వందేభారత్ రైలు నడుస్తోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని లింగంపల్లి-వికారాబాద్-వాడీ సెక్షన్ల మధ్య 245 కి.మీ. మేర కవచ్ ఏర్పాటైంది. కానీ ఆ మార్గంలో వందేభారత్ రైలు తిరగటం లేదు. మన్మాడ్-ముద్ఖేడ్-డోన్ మధ్య 959 కి.మీ... బీదర్-పర్బణి మధ్య 241 కి.మీ. మేర కవచ్ వ్యవస్థ ఏర్పాటైంది. నార్తర్న్ రైల్వే పరిధిలో కూడా కొంతమేర ఉంది. మొత్తంగా 1,548 రూట్ కి.మీ. మేర మాత్రమే ఇది ఏర్పడింది. మరో 3 వేల కి.మీ.లో పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం వందేభారత్ రైళ్లను పెంచటంపై ప్రదర్శిస్తున్న వేగం.. కవచ్ వ్యవస్థ ఏర్పాటులో చూపటం లేదు.

'గోల్డెన్' హీరోనా రాబరీ విలనా?



ఓ నిధి వేటగాడి నిజమైన కథ..

సినిమాల్లో, కథల్లో రాజుల కాలం నాటి గుప్త నిధుల కోసం అన్వేషిస్తుంటారు. ఎన్నో కష్టాలు అనుభవించి నిధిని కనుగొంటారు. ఆ సంపదతో గొప్పవాళ్లుగా మారిపోతుంటారు. ఇదీ అలాంటిదే. కానీ నిజంగా జరిగిన కథ. సముద్రంలో టన్నులకొద్దీ బంగారంతో మునిగిపోయిన ఓడను కనిపెట్టినా.. జైలులో మగ్గుతున్న ఓ ఆధునిక 'ట్రెజర్ హంటర్' వ్యథ. చివరికి ఓ న్యాయమూర్తి తీర్పుతో త్వరలో విడుదల కాబోతున్న బంగారం నిధి వేటగాడు, శాస్త్రవేత్త 'టామీ గ్రెగరీ థాంప్సన్' గాథ. - సాక్షి సెంట్రల్ డెస్క్

అది 1857వ సంవత్సరం.. సుమారు 21 టన్నుల బంగారం తీసుకుని ఎస్ఎస్ సెంట్రల్ అమెరికా అనే ఓడ అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి న్యూయార్క్‌కు బయలుదేరింది. ఒక్కసారిగా విరుచుకుపడ్డ తుఫానుతో సముద్రం మధ్యలోనే ఓడ మునిగిపోయింది. 'షిప్ ఆఫ్ గోల్డ్'గా పేరుపొందిన ఆ ఓడ, దానిలోని బంగారం కోసం ఎందరో అన్వేషించినా జాడ దొరకలేదు. అలా బంగారం వేటకు దిగినవారిలో శాస్త్రవేత్త టామీ గ్రెగరీ థాంప్సన్ నేతృత్వంలోని బృందం ఒకటి. అప్పటికే కొన్నేళ్లుగా పరిశోధన చేస్తున్న థాంప్సన్.. 1988లో సోనార్ సాయంతో సముద్రం అడుగున జల్లెడ పడుతుండగా 'షిప్ ఆఫ్ గోల్డ్'జాడ పట్టేసుకున్నాడు.





బంగారం కరిగించి నాణాలుగా మార్చి..

అమెరికాలోని కొందరు ధనికులు థాంప్సన్ పరిశోధనకు స్పాన్సర్ చేశారు. నిధి దొరికితే ఎవరి వాటా ఎంతెంత అని ముందే ఓ మాట అనుకున్నారు. 1988లో ఓడ జాడ దొరికినా.. బంగారం నిధిని రూఢీ చేసుకుని, వెలికి తీయడానికి కొన్నేళ్లు పట్టింది. బయటికి తీసిన బంగారాన్ని కరిగించి నాణాలుగా మార్చారు. అందులో 500 నాణాలు మాయమయ్యాయి. అది చేసినది థాంప్సన్ అని తేల్చారు. నాణాలు ఏవని అడిగితే.. రెండు అమెరికా ఖండాల మధ్య ఉండే 'బెలిజ్' అనే చిన్న దేశంలో ఓ ట్రస్టుకు దానమిచ్చానన్నాడు. అంతే.. అదే ట్రస్టో చెప్పలేదు, మరొక్క మాటా బయట పెట్టలేదు, రికవరీకి చాన్స్ ఇవ్వలేదు..

పదేళ్లుగా జైల్లోనే.. త్వరలోనే విడుదల..

అధికారులు 2015లో థాంప్సన్‌ను జైల్లో పెట్టారు. నాణాల జాడ చెప్పనంత కాలం.. రోజుకు వెయ్యి డాలర్లు (సుమారు రూ.87 వేలు) జరిమానా చెల్లించాలని ఆదేశించారు. సుమారు పదేళ్లుగా థాంప్సన్ జైల్లోనే ఉన్నారు. ఆయన చెల్లించాల్సిన జరిమానా.. 33,35,000 డాలర్లకు (మన కరెన్సీలో రూ.29 కోట్లకు) చేరింది. ఆయన మాయం చేసిన బంగారు కాయిన్ల విలువ 2.5 మిలియన్ డాలర్లు (మన కరెన్సీలో రూ.22 కోట్లు)గా అంచనా వేశారు. థాంప్సన్ పదేళ్లుగా జైల్లోనే ఉన్నారు. వయసు ఇప్పుడు 72 ఏళ్లు. ఆయన మాయం చేసిన బంగారం విలువ కంటే.. చెల్లించాలన్న జరిమానానే చాలా ఎక్కువైపోయింది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఓ న్యాయమూర్తి థాంప్సన్‌ను విడుదల చేయాలని తాజాగా తీర్పు ఇచ్చారు. కానీ తన పరిశోధనకు స్పాన్సర్ చేసిన ధనికులు పెట్టిన ఓ క్రిమినల్ కేసులో థాంప్సన్ రెండేళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంది. ఆ తర్వాతే బయటికొస్తాడన్నమాట.

ఆ బంగారం ఎవరికి ఇచ్చినదీ ఇప్పటికీ థాంప్సన్ బయటపెట్టలేదు.

ట్రస్టు ద్వారా పేదలకు సాయం కోసం ఇచ్చిన 'గోల్డెన్' హీరోనా? సొమ్ము దోచేసుకున్న విలనా?

దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని

ఆయన జీవితం స్ఫూర్తిదాయకం

- అన్నపూర్ణ స్టూడియోను విదేశీ సెలబ్రిటీలకు విజిటింగ్ ప్లేస్ చేస్తాం
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- అక్కినేనిపై తాను రాసిన పుస్తకాన్ని ప్రధానికి అందజేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



అక్కినేని నాగేశ్వరరావుపై తాను రాసిన పుస్తకాన్ని ప్రధాని మోదీకి అందజేస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. చిత్రంలో అక్కినేని నాగార్జున, అమల, నాగచైతన్య, శోభిత, ఇతర కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు సినీ చరిత్రలో అక్కినేని నాగేశ్వరరావు ఓ ధ్రువతార అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఆడంబరాలు, అతి అంచనాలతో కాకుండా వాస్తవ భౌతిక పరిస్థితులతో కింది స్థాయి నుంచి ఎదిగిన విలక్షణ నటుడు అని చెప్పారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమను తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు తేవడంతో అక్కినేని చేసిన కృషిని గుర్తు చేశారు. ఆనాడు ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయం వల్లే ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా మన్ననలు అందుకుంటోందన్నారు. అక్కినేనిపై మాజీ ఎంపీ, విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'మహాన్ అభినేత అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ'అనే పుస్తకాన్ని సినీ హీరో అక్కినేని నాగార్జున, సతీమణి అమల, కుమారుడు నాగచైతన్య, కోడలు శోభిత తదితరులతో కలిసి శుక్రవారం పార్లమెంట్ భవనంలో ప్రధాని మోదీకి అందజేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఏఎన్నార్ నటుడు మాత్రమే కాదని, గొప్ప మానవతావాది అని ప్రశంసించారు. అన్నపూర్ణ స్టూడియో ద్వారా వేలాది యువతకు, చిత్ర నిర్మాతలకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అని చెప్పారు. అన్నపూర్ణ స్టూడియో స్థాపించి 50 ఏళ్లు అయిందని నాగార్జున చెప్పగా.. 'విదేశాల నుంచి వచ్చే సినీ ప్రముఖుల కోసం అన్నపూర్ణ స్టూడియోను విజిటింగ్ స్టూడియోగా చేస్తాం' అని మోదీ తెలిపారు. దేశ సినీ వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, సంరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మోదీ చెప్పారు.

కుటుంబ సభ్యులతో ముచ్చట్లు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నాగార్జున, అమల, నాగచైతన్య, శోభితతో పాటు నాగార్జున సోదరి నాగసుశీల, అక్కినేని జ్యోత్స్న, అక్కినేని ఆదిత్య, అక్కినేని ఐశ్వర్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ వారందరితో సంభాషించారు. నాగార్జున నటిస్తున్న సినిమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్‌లో ప్రదర్శించిన చిత్రం 'అన్నమయ్య'కదా అంటూ మోదీ ఆనాటి విశేషాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున, అమల ప్రధాని మోదీకి అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

మోదీకి నాగ్ కృతజ్ఞతలు

'మోదీజీ.. మీరు ఇటీవల మన్ కీ బాత్‌లో నా తండ్రి ఏఎన్నార్ గురించి ప్రస్తావించడం నాకెంతో సంతోషంగా ఉంది. మీ నోట నా తండ్రి మాట రావడం చూసి ఆయన కుమారుడిగా గర్వపడుతున్నాను. ఏఎన్నార్ నటించిన చిత్రాల్లో మన సంప్రదాయాలు, విలువలు చక్కగా చూపించారని గుర్తు చేసుకోవడం మా కుటుంబానికెంతో సంతోషాన్ని ఇచ్చే సందర్భమే. నా తండ్రిని ఉద్దేశించి మీరు మాట్లాడిన చక్కని మాటలు యావత్ భారతదేశం వినడం, వాటిపై హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఇందుకు మా కుటుంబ సభ్యుల నుంచి మీకు కృతజ్ఞతలు'అని ప్రధాని మోదీతో నాగార్జున చెప్పారు.

జేఎన్టీయూహెచ్ అనుబంధ కాలేజీలకు ఆన్‌లైన్ తరగతులు

ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి వెల్లడి



కేపీహెచ్‌బీ కాలనీ (హైదరాబాద్): జేఎన్టీయూహెచ్ అనుబంధ కళాశాలల విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి తెలిపారు. శుక్రవారం జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఆయన ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన క్యాంపస్‌లో అందిస్తున్న విద్యలో 15 నుంచి 20 శాతం వరకు ఇతర గ్రామీణ అనుబంధ కళాశాలల విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఈ ఆన్‌లైన్ తరగతులు రూపొందించామన్నారు. శుక్ర, శనివారంతోపాటు అధ్యాపకులు అందుబాటులో ఉన్నప్పుడు తరగతులు నిర్వహిస్తారన్నారు. వనపర్తి, సిరిసిల్ల, మహబూబాబాద్ ఇతర అనుబంధ కళాశాలల్లో చేరిన విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల్లో పాల్గొనవచ్చన్నారు.



నీట్ యూజీ-2025 రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మార్చి 7 వరకు తుది గడువు.. మే నాలుగో తేదీన పరీక్ష నిర్వహణ

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, డెంటల్, ఇతర వైద్య విద్య అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2025కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మార్చి ఏడో తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు ఇచ్చినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ప్రకటించింది. https://neet.nta.in/ వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్చి 9 నుంచి 11వ తేదీల మధ్య తప్పులు సరిచేసుకునే అవకాశం ఉంటుంది. జనరల్ కేటగిరీ విద్యార్థులు రూ.1,700, జనరల్-ఈడబ్ల్యూఎస్/ఓబీసీ విద్యార్థులు రూ.1,600, ఎస్సీ/ఎస్టీ/థర్డ్ జెండర్ విద్యార్థులు రూ.1,000 చొప్పున రుసుము చెల్లించాలి. దేశం వెలుపల ఉన్న విద్యార్థులు రూ.9,500 చెల్లించాలి. మార్చి ఏడో తేదీ అర్ధరాత్రి 11.50 గంటలలోపు విద్యార్థులు క్రెడిట్/డెబిట్ కార్డులు/నెట్ బ్యాంకింగ్/యూపీఐ ద్వారా ఈ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. మే నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నీట్ పరీక్షను నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో 13 భాషల్లో ఈ పరీక్ష ఉంటుంది. ఏప్రిల్ 26వ తేదీ నాటికి పరీక్ష కేంద్రాలను ప్రకటిస్తారు. మే ఒకటో తేదీ నాటికి అడ్మిట్ కార్డులు ఎన్టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. జూన్ 14 నాటికి ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా 23.33 లక్షల మంది విద్యార్థులు నీట్ యూజీ రాయగా, 13.15లక్షల మంది అర్హత సాధించారు. మన రాష్ట్రం నుంచి 64,929 మంది పరీక్షకు హాజరుకాగా, 43,788 మంది అర్హత పొందారు. ఈసారి నీట్ యూజీ రాసేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ వెబ్ ఆప్షన్‌కు రేపు ఆఖరు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికి బీఎడ్ ఓడీఎల్ (ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్) వెబ్ ఆప్షన్ ఆన్‌లైన్‌లో నమోదు కోసం ఈనెల 9వ తేదీ ఆఖరు అని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎడ్ ప్రవేశ పరీక్ష-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్ కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 040-2368 0333/444/544 ఫోన్ నంబర్లలో సంప్రదించ వచ్చని వెల్లడించారు.

సెంటిలియాన్ రూ.500 కోట్ల పెట్టుబడి

రాష్ట్రంలో డ్రోన్ల తయారీ రంగంలో కార్యకలాపాలు

- దావోస్ పెట్టుబడి ఒప్పందాలను ఆచరణలోకి తెస్తున్నాం
- తప్పుడు ప్రచారంతో ప్రతిపక్షాలు భయపెడుతున్నాయి
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డ్రోన్ల తయారీ రంగంలో సెంటిలియాన్ నెట్‌వర్క్స్‌కు చెందిన హెచ్‌సీ రోబోటిక్స్ సంస్థ రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ 9 దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్‌వేర్, టెలి కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధితో పాటు పలు రంగాల్లో సేవలు అందిస్తూ 2,000 మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ పెట్టుబడి వివరాలను మంత్రి వెల్లడించారు. ప్రస్తుత పెట్టుబడితో ఈ ఏడాది 500 మందికి ఉద్యోగాలు వస్తాయని, వచ్చే మూడేళ్లలో ఈ సంఖ్య 2,000కు చేరుతుందని తెలిపారు. ఇటీవల దావోస్‌లో చేసుకున్న రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

దావోస్‌లో గత ఏడాది చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 ఆచరణలోకి వచ్చాయని, వీటిలో 10 ఒప్పందాల్లో 50 శాతానికిపైగా పురోగతి ఉందని మంత్రి వివరించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు

ప్రజలను రెచ్చగొడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూ సేకరణ పనులు అడ్డుకోలేదని తెలిపారు. గతంలో భూములు కేటాయించినా కార్యకలాపాలు ప్రారంభించని సంస్థల నుంచి సదరు భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఇతర అవసరాలకు వినియోగిస్తామని చెప్పారు. పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌పై అధ్యయనం చేసి, అవసరమైతే ఎక్కువ నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సెంటిలియాన్ నెట్‌వర్క్ చైర్మన్ వెంకట్, డైరెక్టర్ రాధాకిషోర్, ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ పాల్గొన్నారు.

యూజీసీ మార్గదర్శకాలపై పోరాడుతాం

ఉన్నత విద్యపై రాష్ట్ర అధికారాలను నియంత్రించేలా ఉన్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన ముసాయిదా మార్గదర్శకాలను ఉపసంహరించుకునే వరకు రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతుందని శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఈ నెల 5న బెంగళూరులో నిర్వహించిన 6 రాష్ట్రాల విద్యాశాఖ మంత్రుల సమావేశం దీనిపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు పంపిందని తెలిపారు. ఈ అంశంపై త్వరలో కేరళలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఉన్నత విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను లాక్కోవాలని చూడటం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఇందూరులోని హింగుళాదేవి ఆలయం



ఆలయం లోపలి భాగం





గర్భగుడిలో హింగుళామాత మూలవిరాట్టు

ఇందూరులో హింగుళాదేవి ఆలయం

పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ హింగుళామాత మూలస్థానం

- 1982లో ఇందూరులో భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిర్మాణం
- రెండు నెలల కిందట ధ్వజస్తంభం ఏర్పాటు
- ఏటా ఘనంగా నవరాత్రి ఉత్సవాలు, పండుగలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 52 శక్తి స్వరూపాల్లో ఒకటైన హింగుళాదేవి ప్రధాన ఆలయం పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ ప్రాంతంలో ఉంది. కరాచీకి 90 కిలోమీటర్ల దూరంలో హింగుళ పర్వతంపై హింగోసీ నదీతీరం ఈ శక్తిపీఠానికి మూలస్థానం. హింగుళా మాత అసలు పేరు కోటరి. హింగుళ పర్వతంపై ఉండటంతో హింగుళాదేవిగా ప్రసిద్ధి పొందింది. ఈ పర్వతంపై గుహలో హింగుళామాత నిత్యం జ్వలిస్తూ దర్శనమిస్తుంది. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాల్లో ఒకరైన అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలో హింగుళాదేవి ప్రస్తావన ఉంది. ఇంతటి ప్రాచీన చరిత్ర కలిగిన ఈ శక్తిస్వరూపిణి ఆలయాన్ని నిజామాబాద్ జిల్లా ఇందూరులో 1982లో నిర్మించారు. రెండు నెలల కిందట ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. రంగరి (వస్త్రాలకు రంగులు వేసే) కులానికి చెందిన 'భావసార్ క్షత్రియ సమాజ్'వారు ఈ ఆలయాన్ని నిర్మించారు.

దేశవిభజన సమయంలో వచ్చిన భవసార్ క్షత్రియ సమాజ్..

దేశవిభజన సమయంలో రంగరి (భవసార్ క్షత్రియ సమాజ్) కులస్తులు బెలూచిస్తాన్ ప్రాంతం నుంచి రాజస్తాన్‌కు వలస వచ్చారు. తర్వాత కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో వీరు వెయ్యి కుటుంబాలకు పైగా ఉన్నారు. ప్రాచీన చరిత్ర ప్రకారం క్షత్రియులుగా ఉన్న వీరిని అంతమొందించేందుకు పరశురాముడు వెంటాడితే వీరి వంశీయులు దేవీమాత శరణు కోరారు. హింగుళాదేవి వీరిని కాపాడింది. అలాగే వీరికి వస్త్రాలకు రంగులు అద్దే కళను కటాక్షించింది. అప్పటి నుంచి ఈ వృత్తిని చేస్తున్నట్లు ఈ సమాజ్ పెద్దలు తెలిపారు. వీరు కొలిచే హింగుళా దేవి ఆలయాలు రాజస్తాన్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఈ సమాజ్ వారుండే ప్రాంతాల్లో నిర్మిస్తున్నారు.

- ఇందూరులోని హింగుళా మాత ఆలయంలో ప్రతి రోజూ అభిషేకం నిర్వహిస్తారు. ప్రతి మంగళవారం భజనలు ఉంటాయి. ప్రతి పౌర్ణమికి యజ్ఞం, సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నదానం చేస్తారు. దసరా నవరాత్రులు నిర్వహిస్తారు. ఇందూరులో ఊరపండుగ అయ్యాక వారం రోజుల తర్వాత పసుపు, కుంకుమ, కాగడాలతో పాటలు పాడుతూ గోందాల్ ఉత్సవాలు నిర్వహిస్తారు.



డ్రోన్‌తో వరిపంటకు క్రిమిసంహారక మందు పిచికారీ

తెగుళ్లపై 'డ్రోనా'స్త్రం

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కృష్ణనగర్ గ్రామ శివారులో రైతు సాయన్న.. వరి పంటలో చీడల నివారణకు డ్రోన్ సహాయంతో క్రిమిసంహారక మందు పిచికారీ చేయిస్తున్నాడు. మానిక్‌భండార్ తండాకు చెందిన యువకుడు సాంబయ్య హైదరాబాద్‌లో రూ.8 లక్షలకు డ్రోన్‌ను కొనుగోలు చేశాడు. ఎకరానికి రూ.500 చొప్పున తీసుకుని.. క్రిమిసంహారక మందులు, ఎరువులను పిచికారీ చేస్తున్నాడు. ఈ డ్రోన్‌తో మూడు గంటలలోపే ఐదు ఎకరాల పొలంలో పిచికారీ చేయొచ్చని సాంబయ్య తెలిపాడు.


-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఎండిన చెట్టు మెరుపు.. దూరపు కొండ నునుపు

ప్రకృతి మార్పులు సహజం.. సుందరం.. ఈ పరస్పర భిన్నదృశ్యాలే ఇందుకు నిదర్శనం.. ఎండిపోయిన వృక్షం కూడా పచ్చని వరి పొలంలో మెరిసిపోతోంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామ శివారులో ఈ మోడువారిన వృక్షం కనువిందు చేస్తోంది. కాల్వశ్రీరాంపూర్ శివారులో పచ్చని వరి పైర్ల మధ్య దూరపుకొండ ప్రకృతి చెక్కిన శిల్పంలా కనిపిస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

తెలంగాణలో మూడు ఫ్లోటింగ్ జెట్టీలు

- రూ.7.66 కోట్లతో కృష్ణా నదిపై ఏర్పాటు
- లోక్‌సభలో కేంద్రమంత్రి శర్బానంద్ సోనోవాల్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కృష్ణా నదిపై అంతర్గత జలమార్గ రవాణా ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ తెలిపారు. ఇందులో భాగంగా కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్, సాగర్ కొండల వద్ద రూ.7.66 కోట్లతో మూడు ఫ్లోటింగ్ జెట్టీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 2026 డిసెంబర్ కల్లా ఈ మూడు జెట్టీలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు శుక్రవారం ఆయన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు లోక్‌సభలో బదులిచ్చారు.

సుప్రీంకోర్టులో 82,922 కేసులు పెండింగ్

ఈ ఏడాది జనవరి 30వ తేదీ నాటికి సుప్రీం కోర్టులో 82,922 కేసులు, అలాగే వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో 62,28,980, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 4,56,17,477 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఈ గణాంకాలు వెల్లడించారు.

రాష్ట్రంలో 53.2 శాతం మంది గర్భిణుల్లో రక్తహీనత

తెలంగాణలో 53.2% మంది గర్భిణీల్లో రక్తహీనత సమస్య ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. ఇది జాతీయ సగటు 52.2% కంటే ఎక్కువ అని కేంద్రమంత్రి పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 (2019–21) ప్రకారం దేశవ్యాప్తంగా 15–49 ఏళ్ల మధ్యలో ఉన్న మహిళల్లో రక్తహీనత 57.0 శాతం, 6–59 నెలల మధ్య ఉన్న పిల్లల్లో రక్తహీనత 67.1 శాతంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

తెలంగాణలో 36 వన్‌స్టాప్ సెంటర్లు

తెలంగాణలోని 33 జిల్లాల్లో మొత్తం 36 వన్‌స్టాప్ సెంటర్స్ పనిచేస్తున్నాయని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న 802 వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా గతేడాది డిసెంబర్ వరకు 10.61 లక్షల మంది మహిళలకు సహాయం అందించినట్లు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు బదులిచ్చారు. కాగా ఈ పథకం కింద తెలంగాణకు 2023–24లో రూ.12.71 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

రక్షణ శాఖ భూమిలో పనులకు 17 దరఖాస్తులు

పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పబ్లిక్ యుటిలిటీ ప్రాజెక్టుల కోసం రక్షణ శాఖ భూమిలో పనులు చేసేందుకు అనుమతులు కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నుంచి 2021 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 17 దరఖాస్తులు వచ్చాయని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. వీటిలో 12 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. వీటిలో 8 కేసుల్లో పనిచేసుకొనేందుకు అనుమతులను జారీ చేయగా, 4 దరఖాస్తులను తిరస్కరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



మల్లు అనంతరాములుకు సీఎం నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికార నివాసంలో సీఎం శుక్రవారం రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు కూడా పుష్పాంజలి ఘటించారు.

వలస కార్మికుల లెక్కలేవీ?

- సమగ్ర సర్వేలో వలస వెళ్లిన వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసిన ఎన్యుమరేటర్లు
- ప్రవాసుల లెక్క తేల్చితే వారి సంక్షేమానికి ప్రణాళిక రూపొందించవచ్చనే వాదన



సమగ్ర సర్వేలో భాగంగా కుటుంబ వివరాలను నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో వలస కార్మికుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసినా, వారి సంఖ్యను బహిర్గతం చేయలేదు. అసెంబ్లీలో కులాల వారీగా జనాభా లెక్కలను వెల్లడించినా, విదేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్యను మాత్రం తేల్చలేదు. సర్వే ఫారమ్ 48వ కాలమ్‌లో విదేశాలకు వలస వెళ్లినవారు, పొరుగు రాష్ట్రానికి వలస వెళ్లినవారు...ఎందుకు వలస వెళ్లారో ఆ వివరాలను ప్రత్యేకంగా నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గల్ఫ్ దేశాలతోపాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్య 15 లక్షల వరకు ఉంటుందని అంచనా. మన రాష్ట్రం నుంచి విదేశాలకు అందులో గల్ఫ్ దేశాలకే వలస వెళ్లిన కార్మికుల సంఖ్య అత్యధికంగా ఉంది. వలస కార్మికుల సంఖ్య తేలితే వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించడానికి కార్యాచరణ రూపొందించడానికి అవకాశం ఉంటుందని వలస కార్మికుల సంఘాలు భావించాయి. సమగ్ర సర్వే వివరాలను వెల్లడించిన ప్రభుత్వం.. వలస కార్మికుల సంఖ్యను బహిర్గతం చేయడానికి ఎందుకు వెనుకాడుతుందో అర్థం కావడం లేదని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. గల్ఫ్ వలస కార్మికుల కోసం కొన్ని పథకాలను ప్రవేశపెట్టినా, వలసదారులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలిగించే కార్యక్రమం అమలులో లేదు. కార్మికుల సంఖ్య తేలితే వారి ప్రభావం ఎంత వరకు ఉంటుందో తెలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వలస కార్మికుల సంఖ్యను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని పలువురు కోరుతున్నారు.

వామ్మో.. భారీ మొసలి!

కిన్నెరసాని కెనాల్‌లో గుర్తింపు



మొసలిని బంధిస్తున్న వైల్డ్‌లైఫ్ రెస్క్యూ టీమ్

పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయం నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి నీటి సరఫరా జరిగే కెనాల్‌లో శుక్రవారం ఒక భారీ మొసలిని గుర్తించారు. అందులో మొసలి ఉందన్న సమాచారంతో వైల్డ్‌లైఫ్ రెస్క్యూ టీమ్‌కు చెందిన ఇబ్రహీం, కల్యాణ్, వెంకన్న కాల్వ పొడవునా వలలతో గాలించారు. ఎట్టకేలకు మధ్యాహ్నం రెండు గంటల సమయాన ఈ మొసలి వలకు చిక్కింది. దీంతో దాన్ని తీసుకెళ్లి కిన్నెరసాని జలాశయంలో వదిలేశారు. కెనాల్‌లో అటు పర్యాటకులు, ఇటు సమీప గురుకులంలోని కళాశాల విద్యార్థులు స్నానాలు చేస్తుంటారు. ఎవరూ ప్రమాదం బారిన పడకముందే మొసలిని గుర్తించి తీసుకెళ్లడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటింటికో 'కృష్ణయ్య'

- పగిడ్యాల్ గ్రామంలో 90 శాతం ఇళ్లలో కృష్ణ పేరు
- కృష్ణ తాతగా ప్రసిద్ధి చెందిన కృష్ణ బ్రహ్మేంద్రస్వామి
- 78 ఏళ్ల క్రితం సజీవ సమాధి..
- గండేడ్ మండలం పగిడ్యాల్‌లో ఆలయ నిర్మాణం
- ఏటా బ్రహ్మోత్సవాలు



గుడిలో ప్రతిష్టించిన కృష్ణతాత విగ్రహం



కృష్ణ తాత దంపతులు



పగిడ్యాల్‌లోని కృష్ణతాత గుడి

గండేడ్: కృష్ణయ్య, కృష్ణప్ప, చిన్న కృష్ణయ్య, నడిపి కృష్ణయ్య.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ ఊరిలో.. ప్రతి ఇంట్లో వినిపించే పేరు 'కృష్ణ'. అదే మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం పగిడ్యాల్ గ్రామ ప్రత్యేకత. కృష్ణ తాత మీద ఉన్న భక్తితో ఆ గ్రామంలో ప్రతి ఇంట్లో ఒకరిద్దరికి ఆయన పేరు పెట్టుకున్నారు. 78 ఏళ్ల క్రితం కృష్ణ తాత సజీవ సమాధి అయ్యారు. ఆయన పేరు మాత్రం ఇంటింటా మార్మోగుతోంది. ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. పగిడ్యాల్‌లో కృష్ణ బ్రహ్మేంద్రస్వామి (కృష్ణ తాత) గుడి ఉంది. రామయ్య, భాగ్యమ్మల సంతానం అయిన కృష్ణ తాత.. వయసు పెరిగే కొద్దీ ఆధ్యాత్మికంలో మునిగి తేలారు. వివాహానంతరం.. తన మహిమలు చూపడం ప్రారంభించారని భక్తులు చెబుతారు. నమ్మిన వారికి కొండంత అండగా ఉంటూ.. వారి కష్టాలను తీర్చడంలో ఆయన తనశక్తిని ఉపయోగించేవారని వారి నమ్మకం. 1856లో జన్మించిన కృష్ణతాత 91 ఏళ్లు జీవించారు. కృష్ణ తాత లీలలు అపారమని ఆయన వంశస్తులు, భక్తులు స్పష్టం చేస్తున్నారు. అనారోగ్యం కలిగినవారు.. తాతను దర్శించుకొంటే తగ్గుతుందని వారి నమ్మకం.

నిద్రాహారాలు మాని..

కృష్ణతాత రోజుల తరబడి నిద్రాహారాలు మాని ధ్యానంలోకి వెళ్లిపోయేవారట. కొండలు, గుట్టలే కాక నీళ్లల్లో సైతం రోజుల తరబడి తిండి తిప్పలు లేకుండా ఉండేవారట. అప్పట్లో ఎవరూ వెళ్లని చెన్నరాయుడి గుట్టకు సైతం వెళ్లి రోజుల తరబడి ఉండేవారని.. రుషీశ్వరులతో కలిసి తపస్సు చేసేవారని చెబుతారు. మహబూబ్‌నగర్ అబ్దుల్‌ఖాదర్ దర్గాగా పిలిచే అబ్దుల్ ఖాదర్, షాషాబ్ గుట్టగా పిలిచే షాషాబ్ వంటి ప్రముఖులు.. కృష్ణ తాత దగ్గరకు వచ్చి వెళ్లేవారట. ఆయనకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భక్తులు, శిష్యులు చాలామంది ఉన్నారు. కులాలకతీతంగా అందరినీ చేరదీసేవారని.. సామూహిక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేవారని అంటారు. ఆధ్యాత్మిక సత్సంగాలతో పాటు భజన కార్యక్రమాలు నిర్వహించేవారు.

తాతపై భక్తితోనే..



అప్పట్లో తాతపై ఉన్న భక్తి, నమ్మకమే ఆయన పేరు పెట్టుకునేలా చేసింది. ఇప్పటికీ చాలామంది ఎలాంటి అనారోగ్యానికి గురైనా.. తాతను దర్శించుకొని.. అక్కడి విభూతి రాసుకుంటే తగ్గిపోతుందనే నమ్మకం. ఆయన వంశంలో పుట్టడం పూర్వజన్మ సుకృతం.

- కృష్ణవాసు, కృష్ణతాత మనవడు, పగిడ్యాల్

ఏ సమస్యకైనా గుడికెళ్లి..



కృష్ణ తాత అంటే మా ఇంట్లో వారందరికీ అమితమైన భక్తి. ఏ సమస్య వచ్చినా.. అనారోగ్యానికి గురైనా తాత గుడికి వెళ్లి మొక్కుకుంటాం. ఏ ఇబ్బంది రాకుండా తాత చూసుకుంటాడని నమ్మకం. అమ్మానాన్నలు నాకు తాత పేరు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నా. మా అక్క పేరు కూడా కృష్ణమ్మ అని పెట్టారు.

- అన్నసారపు కృష్ణారెడ్డి, పగిడ్యాల్

మా పాలిట దైవం



నేను పుట్టగానే కృష్ణయ్య అని పేరు పెట్టారు. మొదటి నుంచి తాతనే దేవుడిగా భావిస్తాం. అన్నింటికీ మాకు కృష్ణతాత అండగా ఉంటాడనేది నమ్మకం. ఆయన లీలలు మా పెద్దవారు చెప్పేవారు. అందుకే తాత అంటే ఎనలేని భక్తి.

- కావలి కృష్ణయ్య, పగిడ్యాల్

91వ ఏట సజీవ సమాధి

కృష్ణతాత తాను 91వ ఏటా సజీవ సమాధి అవుతానని ముందుగానే చెప్పారు. దీంతో దౌల్తాబాద్‌లో పొలం దగ్గర గుట్టమీద మూడుచోట్ల సమాధి తవ్వించి పెట్టారు. అప్పట్లో రజాకార్ల హయాం కావడంతో కొంత ఆటంకం ఎదురైనా.. మూడు రోజుల ముందు సమాధిలోకి వెళ్తానని చెప్పారు. చెప్పినట్టే చివరిరోజు 1947లో సమాధి అయ్యారు. అనంతరం సమాధిపై గుడికట్టి ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటినుంచి ఏటా రథసప్తమి సమయంలో కృష్ణతాత బ్రహోత్సవాలను మూడురోజులు పాటు నిర్వహిస్తారు.

ఊరంతా పండుగ..

పగిడ్యాల్ గ్రామం కృష్ణతాత పేరుతో ఇంటింటా మార్మోగుతోంది. గ్రామం అంతా ప్రతి ఇంట్లో ఒక్కరి పేరైన కృష్ణయ్య, కృష్ణప్ప, చిన్న కృష్ణయ్య, పెద్దకృష్ణయ్య, నడిపి కృష్ణయ్య, కృష్ణారెడ్డి.. ఇలా రకరకాలుగా తాతా పేరు వచ్చేలా పేర్లు పెట్టుకున్నారు. దీంతో పాటు మిగతా మండలాల్లో కూడా చాలామంది కృష్ణతాత పేరు పెట్టుకున్నారు. జాతర సమయంలో తమ బంధువులను ఆహ్వానించి.. ఊరంతా పండుగ చేసుకుంటారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ తలనీలాలిచ్చి, గోదానం, మొక్కులు తీర్చడం వంటివి చేస్తారు.



పదిలంగా అల్లుకున్న పొదరిల్లు

మండుటెండలో ఇంటిముందు ఇలా అల్లుకున్న పొదరిల్లు కింద కూర్చొని సేదతీరితే ఆ ఆనందమే వేరు. అనంతపురం సమీపంలోని ఆలమూరులో ఓ ఇంటిముందు ఒద్దికగా అల్లుకున్న ఈ పూలతీగను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రిజిస్ట్రేషన్లు ఢమాల్..

సంపద సృష్టిస్తానంటూ సీఎం చంద్రబాబు రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఇలా వెలవెలబోతున్నాయి. కడపలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 11:30 గంటల సమయంలో పరిస్థితి ఇదీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



నీవే స్ఫూర్తి... యువతకు చైతన్య దీప్తి...

భారతీయ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి స్వామీ వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం విశాఖలో వివేకానంద శోభా యాత్ర నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర బీచ్‌రోడ్డులోని ఆర్.కె మిషన్ వరకు సాగింది. కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ దీనిని ప్రారంభించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఎయిమ్స్‌ను సందర్శించిన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను శుక్రవారం నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ సందర్శించారు. ఎయిమ్స్ పురోగతి, రోగులకు అందుతున్న సేవలపై ఎయిమ్స్ వైద్యులు, అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. వివిధ రోగుల సంరక్షణ ప్రాంతం, ఓపీడీ, రేడియాలజీ, ఆంకాలజీ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్ తుమ్మా, వైద్య అధ్యాపకులు రోగులకు అందిస్తున్న సేవలను వివరించారు.

'స్వచ్ఛ ఆంధ్ర'కు నోడల్ అధికారులు

సాక్షి, అమరావతి: ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర రోజుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆయా కార్యక్రమాల అమలుకు నోడల్ అధికారులను నియమించింది. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లాకు ఒకరి చొప్పున 26 జిల్లాలకు నోడల్ అధికారులను నియమిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఆదేశాలిచ్చింది. ఈ నోడల్ అధికారులు వారివారి కార్యకలాపాలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు నివేదించాల్సి ఉంటుంది. ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించింది.

పీడీఎస్ ద్వారా ఫైన్ వెరైటీస్ బియ్యం

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఫైన్ వెరైటీస్ బియ్యం పంపిణీ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. వీటిని పండించేందుకు ముందుకొచ్చే రైతులకు బోనస్ ఇచ్చే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై శుక్రవారం సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ఈ వివరాలను మంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు వివరించారు. ప్రజలకు అవసరమైన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రంగాల్లో ప్రస్తుతం 15.76 శాతం వృద్ధిరేటులో ఉందని, ఈ ఏడాది 20 శాతం వృద్ధి రేటు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు తెలిపారు. ఐదారు రోజులు నిల్వ చేసేలా కుప్పంలో ఏర్పాటు చేసిన సబ్జీ కూలర్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించినట్టు తెలిపారు. వీటి కోసం 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఈ నెల 20న నిర్ణయం వెలువరిస్తామని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలకు వామపక్షాల పిలుపు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలపై వామపక్ష పార్టీలు నిరసనలకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల రాష్ట్ర కీలక నేతలు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ నెల 14 నుంచి 20 వరకు నిరసనలు చేపట్టనున్నట్టు పేర్కొన్నాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ధర్నాలు, వివిధ రూపాల్లో నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించాయి. మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలిచ్చి, పేదలను విస్మరించిందని, నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గతేడాదికంటే బాగా తగ్గిపోయిందని, ఉపాధి హామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదని, ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందని వామపక్ష పార్టీలు పేర్కొన్నాయి.

నాన్న.. నేను ఇదే బ్యాంక్‌లో పనిచేశాం



మచిలీపట్నం బ్యాంక్‌లో మా నాన్న 1938 నుంచి 1964 వరకు ఉద్యోగం చేశారు. అందులోనే నేను 1962లో మెసెంజరుగా చేరాను. నెలకు రూ.80 జీతం. 39 ఏళ్ల సర్వీసు చేసి, 2001 మార్చి 31న క్లర్క్‌గా రిటైర్ అయ్యాను. ఈ బ్రాంచ్ 1993లో మెకనైజేషన్ కాగా 2005లో కంప్యూటరైజ్ అయింది. అయితే 2001లో 100 మంది ఉద్యోగులు ఉండగా.. కంప్యూటరీకరణతో నేడు కేవలం 20 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

– కేవీ. నరసింహరావు, రిటైర్డు ఉద్యోగి.

నాడు ఎంతో ఘనం



స్టేట్ బ్యాంక్‌లో క్లర్క్ / క్యాషియర్‌గా 1980లో చేరా. నెలకు రూ.360 బేసిక్ పే జీతం. సంవత్సరానికి రెండు సార్లు ఒక నెల బేసిక్ పే బోనస్‌గా ఇచ్చేవారు. నాడు ఉద్యోగం చాలా సంతోషంగా సాగేది. ఉద్యోగులకు మధ్యాహ్నం వరకు విధులు. అందరం కలిసి భోజనం చేసేవాళ్లం. రిక్రియేషన్ సెంటర్‌లో టెన్నిస్, చెస్, క్యారమ్స్, షటిల్ ఆడేవాళ్లం. పోటీలు నిర్వహించుకునేవాళ్లం.

– డి. శ్యామసుందర్, రిటైర్డు ఉద్యోగి.

బందరు బ్యాంక్ @219 ఏళ్లు

1806లో 14 ఎకరాల్లో బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌గా ఏర్పాటు

- 1908 జనవరి 1 నుంచి ప్రత్యేక బ్రాంచ్ ఏర్పాటు
- 1923లో ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్పు
- 1955 నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఆవిర్భావం
- ఆర్బీఐలో మసులీపట్నంగా నమోదు.. నేటికీ అదే పేరు
- తొలి రోజుల్లో వందల్లోనే ఖాతాదారులు.. నేడు 50వేలు పైనే





ఇంపీరియల్ బ్యాంక్‌గా సేవలు అందించిన పాత భవనం. (ఇన్‌సెట్‌లో)మసులీపట్నం బ్రాంచ్‌గా ఉన్న బోర్డు.

సాక్షి, మచిలీపట్నం: ఒకవైపు సముద్రతీరం మరోవైపు కృష్ణమ్మ ఒడి.. ఒడ్డున వెలిసిన ప్రాచీన పట్టణం మచిలీపట్నం. ఇక్కడ ఏర్పాటు చేసిన బ్యాంక్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పొందింది.ఈ బ్యాంక్ ఏకంగా 218 వసంతాలు పూర్తి చేసుకొని 219వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. బ్రిటీష్ పాలనలో ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలు చెల్లించేందుకు ఏర్పాటు చేసిన ఈ బ్యాంక్ నేడు సామాన్య ప్రజలకు వివిధ రకాల సేవలందిస్తోంది. అప్పట్లో ఇది బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌గా ఆవిర్భవించి.. అనంతరం ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారింది. గుంటూరు బ్యాంక్‌కు సబ్ బ్రాంచ్‌గా ఉన్న ఈ బ్యాంక్ 1908లో ప్రత్యేక బ్రాంచ్‌గా ఆవిర్భవించింది. జనవరి 1వ తేదీతో ప్రత్యేక బ్రాంచ్ ఏర్పడి 117 ఏళ్లు పూర్తయ్యాయి.

బ్రిటిష్ కాలంలో ఓ వెలుగు వెలిగిన పట్టణం

బ్రిటీష్‌వారు తమ పాలనకు ఎంతో అనువైన పట్టణంగా మచిలీపట్నాన్ని గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ రోజుల్లో మచిలీపట్నం దేశంలో మూడో మున్సిపాలిటీగా గుర్తింపు పొందింది. ఇక్కడి నుంచి ఎందరో స్వాతంత్ర్యం కోసం సాగిన పోరులో పాల్గొనడంతో పాటు రాజకీయ, సినీ, సామాజిక రంగాల్లో రాణించారు. మచిలీపట్నంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్‌కు ఎంతో చరిత్ర ఉంది. రిటైర్డ్ ఉద్యోగులు, చరిత్రకారుల వివరాల మేరకు.. 1806లో దీన్ని బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌గా 14 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా ఉద్యోగులు శిక్షణ కేంద్రం కూడా నెలకొల్పారు. 1905 నుంచి గుంటూరు బ్యాంక్‌కు అనుబంధంగా సబ్ బ్రాంచ్‌గా నిర్వహించి, 1908 జనవరి 1 నుంచి ప్రత్యేక బ్రాంచ్‌గా ఏర్పాటు చేశారు. 1923లో ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పడి, 1955 జూన్ 30 వరకు సేవలందించింది. అదే ఏట జూలై 1 నుంచి ఆర్బీఐలో విలీనమై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారింది. మచిలీపట్నం పేరు ఆర్బీఐలో మసులీపట్నంగా నమోదు కాగా నేటికీ అదే పేరు ఉంది.

ఉద్యోగులు, పెన్షనర్ల కోసం..

బ్రిటిష్ కాలంలో ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఇక్కడ బ్యాంక్ ఏర్పాటు చేశారు. నాడు పదిమంది లోపు మాత్రమే ఉద్యోగులు ఉండేవారు. 1955లో స్టేట్ బ్యాంక్‌గా ఏర్పడిన తరువాత ఉద్యోగుల సంఖ్య 20కి చేరింది. అప్పట్లో బ్యాంకింగ్ సేవలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే ఉండేవి. ఆ రోజుల్లో వందల్లోనే ఖాతాదారులు, పదుల్లో లావాదేవీలు జరిగేవి. నేడు 50 వేలకు పైగా ఖాతాదారులు ఉండగా రోజూ వెయ్యికి పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. 1905లో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆంగ్లేయులకు అన్ని విధాలా ఉపయోగపడింది. రెండో ప్రపంచయుద్ధం (1913–1945) సమయంలో ఆంగ్లేయులు పెద్ద మొత్తంలో డబ్బు, బంగారం ఈ బ్యాంక్‌లో భద్రపరచినట్లు పెద్దలు చెబుతున్నారు.

• దిగుబడి ఘనం.. రైతుకు అధనం

కోకో.. కేక



- కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగు
- ఎకరాకు రూ.3 లక్షల అదనపు ఆదాయం
- ప్రస్తుతం క్వింటాల్ గింజల ధర రూ.70 వేలు

దేవరపల్లి: చాక్లెట్లు, బేకరీల్లో తయారు చేసే కేక్‌ల తయారీలో వాడే కోకో గింజల సాగు పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు అదనపు ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడటం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో మంచి లాభాలు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లోని రైతులు 13,538 ఎకరాల్లో కోకోను కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్నారు. దాదాపు 20 సంవత్సరాలుగా జిల్లాలో కోకో సాగు జరుగుతోంది. మెట్ట ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. దేవరపల్లి మండలం కురుకూరు, పల్లంట్ల, దేవరపల్లి గ్రామాల్లో ఎక్కువగా కోకో సాగు జరుగుతోంది.

దిగుబడి, ధర.. ఆశాజనకం

క్యాడ్‌బరీ, మోర్డ్ వంటి సంస్థలు రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేస్తుంటాయి. ఆయా సంస్థల ప్రతినిధులు రైతుల వద్దకు నేరుగా వచ్చి గింజలు కొనుగోలు చేసి, తీసుకు వెళతారు. ప్రస్తుతం క్వింటాల్ కోకో గింజల ధర రూ.70 వేలు పలుకుతోంది. గింజ నాణ్యతను బట్టి రూ.80 వేల వరకూ కూడా వస్తోందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది క్వింటాల్ కోకో గింజల ధర రూ.1.10 లక్షల నుంచి రూ.1.25 లక్షలు పలకడంతో రైతులకు కాసుల పంట పండింది. ఆ సమయంలో అమ్ముకున్న రైతులకు మంచి లాభాలు వచ్చాయి. మే తర్వాత ధర రూ.50 వేలకు తగ్గినప్పటికీ రైతుకు మంచి ఆదాయమే వచ్చింది. గత ఏడాది దిగు బడులు ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు రాగా, ఎకరాకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని రైతులు వివరించారు.

ఎకరాకు 7 క్వింటాళ్లు

మొక్క వేసిన నాలుగో సంవత్సరం నుంచి కోకో గింజల దిగుబడి వస్తోంది. గతంలో ఈ మొక్కలను ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రాయితీపై సరఫరా చేసేది. కొంత కాలంగా రైతులే నేరుగా కొనుగోలు చేసి, తోటలు వేస్తున్నారు. కొబ్బరిలో ఎకరాకు 160, ఆయిల్‌పామ్ తోటలో 120 మొక్కలు వేస్తారు. మొక్క ఖరీదు రూ.12.50గా ఉంది. బొమ్మూరులోని నర్సరీ నుంచి ఈ మొక్కలు కొనుగోలు చేస్తున్నారు. మొక్క వేసిన తర్వాత 25 నుంచి 30 సంవత్సరాల పాటు దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. అంతర పంటగా సాగు చేస్తున్న కోకో ద్వారా ఎకరాకు గరిష్టంగా 6 నుంచి 7 క్వింటాళ్ల గింజల దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు మొక్క తోటల్లో 4 నుంచి 5 క్వింటాళ్లు, ముదర తోటల్లో 6 నుంచి 7 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీలో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకూ అధిక దిగుబడులు వస్తాయి. ఈ కాలంలో ఎకరాకు సుమారు ఆరేడు క్వింటాళ్ల గింజల దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు.

ఎకరాకు రూ.4 లక్షల ఆదాయం



కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు అంతర పంటగా కోకో సాగు చేసి మంచి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఎకరాకు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల రాబడి వస్తోంది. కొవ్వూరు డివిజన్‌లోని చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో కోకో సాగు చేస్తున్నారు. ఈ నాలుగు మండలాల్లోనే 11,165 ఎకరాల్లో కోకో సాగు జరుగుతోంది. రబీలో మొక్క తోటలు వేశారు. 25 నుంచి 30 సంవత్సరాల వరకూ దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కిలో గింజల ధర రూ.650 నుంచి రూ.700 పలుకుతోంది.

– బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి,

రైల్వే ఉద్యోగిపై హత్యాయత్నం

నాలుగు నెలల బిల్లులపై ఒకేసారి సంతకాలు చేయాలని టీడీపీ కాంట్రాక్టరు సోదరుని ఒత్తిడి

- కుదరదని చెప్పిన హెల్త్ ఇన్‌స్పెక్టర్‌ను చంపుతానంటూ దాడి
- తన వెనక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారంటూ బెదిరింపులు
- ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడితో జీఆర్పీ పోలీసులు నామమాత్రపు కేసు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందకిశోర్ యాదవ్

ఒంగోలు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా సంతకాలు చేయడానికి నిరాకరించిన రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై అధికార టీడీపీకి చెందిన రైల్వే పారిశుధ్య కాంట్రాక్టరు సోదరుడు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుని కథనం మేరకు.. విజయవాడకు చెందిన టీడీపీ నేత తానికొండ రాధాకృష్ణ ఎస్వీఆర్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో వివిధ రైల్వేస్టేషన్లలో క్లీనింగ్ పనులను కాంట్రాక్టు తీసుకుని చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రతీనెలా రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. అయితే, గత ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరుతో పాటు ఈ ఏడాది జనవరికి సంబంధించి మొత్తం నాలుగు నెలల బిల్లులను కాంట్రాక్టరు సోదరుడు గిరిధర్ ఈనెల 5న తీసుకొచ్చారు. ఈ బిల్లులపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. ఇందుకు ఒంగోలు రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎన్. నందకిశోర్ యాదవ్ అంగీకరించలేదు. బిల్లులను పరిశీలించిన తర్వాతే సంతకాలు చేస్తానని, దానికి సమయం పడుతుందని తేల్చిచెప్పారు. దీంతో.. గిరిధర్ కోపంతో ఊగిపోతూ నందకిషోర్ చొక్కా పట్టుకుని దాడికి ప్రయత్నించాడు. ''నా వెనక అధికార పార్టీ ఉంది, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారు.. నా సంగతి నీకు తెలీదు నా కొ..''. అంటూ పచ్చిబూతులతో విరుచుకుపడ్డారు. దీంతో నందకిషోర్ దగ్గరలోని జీఆర్పీ పోలీసుస్టేషన్‌కు పరుగు పరుగున వెళ్లి జరిగిన సంగతి చెప్పారు. తనకు ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించమని కోరారు. కానీ, బీరువా తాళాలు మరిచిపోవడంతో తిరిగి ఆయన ఆఫీసులోని తన గదికి వెళ్లగా గిరిధర్ మళ్లీ వచ్చి తన మీదే పోలీసు కేసు పెడతావా అంటూ రెచ్చిపోయాడు. నిన్ను చంపుతానంటూ నందకిశోర్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో ఆయన చేయి విరిగింది. శుక్రవారం శస్త్ర చికిత్స నిర్వహించారు.

రైల్వే పోలీసులకు ఎమ్మెల్యే దామచర్ల ఫోన్..

ఇదిలా ఉంటే.. కాంట్రాక్టరు రాధాకృష్ణకు మద్దతుగా ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జీఆర్పీ పోలీసులకు ఫోన్‌చేసి కేసుకు నీరుగార్చేందుకు ప్రయత్నించినట్లు రైల్వే ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. గిరిధర్ మీద నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రాధాకృష్ణ కాంట్రాక్టును రద్దుచేయాలని, గిరిధర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని రైల్వే సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.



శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,908 మంది స్వామిని దర్శించుకున్నారు. 19,549 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది.

గజవాహనంపై నృసింహుడి చిద్విలాసం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుబంధ గోనుపల్లిలో వెలసిన గొల్లబోయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మ నక్షత్రం మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని శుక్రవారం స్వామికి ఉదయం పాలు, తేనె, చందనం, పెరుగు, పసుపు, కొబ్బరి నీరు, వివిధ రకాలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పూలంగి సేవ, గోపూజ, హోమం నిర్వహించారు, సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిని గజ వాహనం, తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు


చౌడేపల్లె: చిత్తూరు జిల్లా బోయకొండలోని గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ


డాబాగార్డెన్స్: విశాఖలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

నేడు, రేపు వైఎస్సార్ జిల్లా రచయితల సభలు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం రెండవ మహాసభలు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. కడప నగరంలోని ఐఎంఏ హాలులో ఈ రెండు రోజులు ప్రత్యేక వేదికలపై సభలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీకృష్ణ దేవరాయల సభా వేదికపై సాహిత్యవేత్త ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరగనున్న సభకు మరో సాహితీవేత్త డాక్టర్ మందలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.



వెటర్నరీ జూడాల వినూత్న నిరసన



తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాల సమ్మె ఐదో రోజుకు చేరింది. ఇందులో భాగంగా శుక్రవారం విద్యార్థులు వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. వర్సిటీ ఆవరణలోని గ్రౌండ్‌లో ×ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నల్లదుస్తులు, వైట్ యాప్రాన్లను ధరించి వెటర్నరీ వైద్య లోగో ఆకారంలో కూర్చొని తమ నిరసనను తెలియజేశారు. గౌరవేతనాన్ని వెంటనే పెంచాలని, అన్ని వైద్య విభాగాల్లో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు అందజేస్తున్న స్టైఫండ్‌తో సమానంగా తమకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానిని కలసి వినతిపత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

'మన మిత్ర' ద్వారా హాల్ టికెట్స్

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్స్‌ను మన మిత్ర ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులు ప్రాక్టికల్ హాల్ టికెట్స్‌ను కాలేజ్ లాగిన్‌లో, పబ్లిక్ డొమైన్ httpr://bie.ap.gov.inలో ఉన్నాయని వివరించారు.

● రికార్డ్

ఐదేళ్ల వయసు... ఇంగ్లిషులో అదుర్స్



ఐదేళ్ల వయసులో పిల్లలు ఆటల్లో, అల్లరిలో గడిపేస్తుంటారు. కానీ తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన ఎస్.కపిల్‌నితిన్ ఇంగ్లిషు పదాలతో విన్యాసాలు చేస్తూ ప్రతిభ చాటుతున్నాడు. యూకేజీ చదువుతున్న కపిల్‌కి చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు ఇంగ్లిషులో శిక్షణ ఇచ్చారు. చిన్నవయసులోనే వందలాది ఇంగ్లీషు పదాలు అతని మెదడులో నిక్షిప్తమయ్యాయి. ఈ టాలెంట్ అందరికీ తెలియాలని తల్లిదండ్రులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి దరఖాస్తు చేశారు. జనవరి 1, 2025న 18 నిమిషాల 33 సెకండ్లలో నితిన్ 1018 ఇంగ్లిష్ పదాలు చదివి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇంత చిన్న వయసులో అన్ని పదాలు గుర్తుపెట్టుకొని, తప్పులు లేకుండా చదవడాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు మెచ్చుకుని అతనికి ధ్రువపత్రం అందించారు.

● వండర్ కిడ్స్

ఆ హోటల్లో పిల్లలే చెఫ్‌లు







సాధారణంగా హోటళ్లలో అనుభవం కలిగిన చెఫ్‌లు వంటలు వండుతారు. కానీ పిల్లలే చెఫ్‌లుగా ఉన్న హోటల్ ఒకటుందని మీకు తెలుసా? అవును. అమెరికాలోని 'కిండర్ కుక్కేఫ్' (Kinder kook kafe) అనే రెస్టారెంట్ అచ్చంగా పిల్లలే నిర్వహిస్తారు. అక్కడ వంట చేసేదంతా చిన్నారులే! దీన్ని 1981లో ప్రారంభించారు. ఇది ఓపెన్ కిచెన్. అంటే పిల్లలు నేరుగా వచ్చి, అక్కడ తమకు నచ్చింది తాము వండుకోవచ్చు. లేదా వంటలో సాయం చేయొచ్చు. ఇతరులకు వాటిని వడ్డించవచ్చు. పాత్రలు కడగడం, శుభ్రం చేయడం, రెస్టారెంట్‌ను పరిశుభ్రంగా ఉంచడం వంటివన్నీ పిల్లలే స్వయంగా చేస్తారు.

పిల్లలే వంటలు వండితే అవి ఎలా ఉంటాయి? వాటిని ఎవరైనా తింటారా అనే సందేహం వస్తుందా? అలాంటి సందేహాలేవీ అక్కర్లేదు. పిల్లల్ని పర్యవేక్షించేందుకు, వారి వంటల్ని గమనించేందుకు కొందరు నిర్వాహకులు అందుబాటులో ఉంటారు. పిల్లలు చేసే వంటను తినేందుకు ఎక్కడెక్కడి నుంచో ఆ రెస్టారెంట్‌కు వస్తుంటారు. కొందరు తమ పుట్టినరోజుల్ని అక్కడే చేసుకుని, అందరికీ డిన్నర్ ఇస్తుంటారు. రద్దీ బాగా ఉన్న సమయాల్లో అక్కడ టేబుళ్లను ముందే రిజర్వ్ చేసుకుంటారు.

ఐదు నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న ఎవరైనా ఇక్కడికి వచ్చి వంట చేయొచ్చు. ఇందుకోసం ముందుగా పిల్లలు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలి. అలాగే వారు వచ్చేటప్పుడు కనీసం ఇద్దరు పెద్దల్ని తీసుకురావాలి. వంట చేసేటప్పుడు గొడవ, అల్లరి చేయడం, ఇతరుల్ని దూషించడం, అలగడం వంటివి చేయకూడదు. అందరితో స్నేహపూర్వకంగా ఉండాలి. పిల్లలకు ఇంటి పనులు నేర్పేందుకు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడికి తీసుకొచ్చి, వారి చేత వంట చేయిస్తుంటారు. భలే బాగుంది కదా? మరి మీరు కూడా వంట చేస్తారా? ముందుగా మీ ఇంట్లో ప్రయత్నించండి.

● మన సినిమా

డాడీ... హాలిడే అంటే ఇలానా?



పిల్లలూ... హాలిడేస్ వస్తే మీరు ఎలా సెలబ్రేట్ చేసుకుంటారు? అమ్మానాన్నలకు చెప్పి ఒక ట్రిప్ ప్లాన్ చేసుకుంటారు కదా. సరదాగా వెళ్లి సరదాగా ఇల్లు చేరుతారు కదా. కాని ఇక్కడ ఓ ఫ్యామిలీ మాత్రం వాళ్ళ డాడీ హారిబుల్ ప్లానింగ్ వల్ల చిక్కుల్లో పడ్డారు. అయ్యబాబోయే అనుకునే అనుభవాలను చవి చూస్తారు. అవి మనకు థ్రిల్లింగ్‌గా కామెడీగా ఉండటమే 'డిజాస్టర్ హాలిడే' అనే సినిమా. ఈ సినిమా సౌత్ ఆఫ్రికాలో స్థిరపడ్డ ఒక కుటుంబానిది. ఈ కుటుంబంలోని తండ్రి వర్క్‌హాలిక్. అంటే ఆఫీస్ పని జాస్తి. అయితే పిల్లలు మాత్రం హాలిడే ట్రిప్‌కు తీసుకెళ్లమని పోరు పెడుతుంటే 'డర్బన్'లో బిజినెస్ మీటింగ్‌కు వెళ్లినట్టుంటుంది... పిల్లలకు హాలిడే ట్రిప్ పూర్తి చేసినట్టుంటుందని ప్లాన్ చేస్తాడు. అయితే అతను విమానంలో కాకుండా కారులో అంత దూరం ట్రిప్ ప్లాన్ చేయడంతో నవ్వులొచ్చే కష్టాలు మొదలవుతాయి. ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు సాగే ఈ ట్రిప్‌లో ఒక వైపు బాస్ ఫోన్లు మరోవైపు పిల్లల సణుగుడు భలే సరదా. సూపర్ హాలిడే ఓ ఫ్లాపర్ హాలిడేగా ఇంకా చెప్పాలంటే డిజాస్టర్ హాలిడేగా ఎలా మారిందో చూడాలంటే కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ టు నెట్ ఫ్లిక్స్ ఫర్ క్రూజింగ్ టు ఎ డిజాస్టర్ హాలిడే.

- ఇంటూరు హరికృష్ణ

● మహనీయులు

భారతదేశపు కోయిల... సరోజినీ నాయుడు



పిల్లలూ! వసంతకాలం రాబోతోంది. కొమ్మల్లో కోయిలలు తియ్యగా రాగాలు పాడతాయి. అందుకే తియ్యగా పాడేవారిని కోయిలతో పోలుస్తారు. ఇంగ్లిషులో కోయిలని 'Ni-ght-in-gale' అంటారు. మనదేశంలో 'Nightingale of Ind-ia' అని ఒకరున్నారని తెలుసా? ఆమె గురించి ఎప్పుడైనా విన్నారా? ఆమే సరోజినీ నాయుడు. ఫిబ్రవరి 13 ఆమె జయంతి.

సరోజిని 1879 ఫిబ్రవరి 13న హైదరాబాదు నగరంలో జన్మించారు. తండ్రి అఘోరేనాథ్ ఛటోపాధ్యాయ. అప్పట్లో నిజాం కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉండేవారు. వారిది బెంగాల్ అయినా అలా హైదరాబాదు నగరం సరోజిని జన్మస్థలమైంది. సరోజిని 12వ తరగతి వరకూ ఇక్కడ చదువుకొని,తర్వాత ఇంగ్లండ్ వెళ్లి కింగ్స్ కళాశాలలో చదువుకున్నారు. కేంబ్రిడ్జిలోని గిర్టన్ కళాశాలలో చదువు పూర్తి చేశారు. అక్కడే మచిలీపట్నానికి చెందిన గోవిందరాజ నాయుడిని కలుసుకున్నారు. 1898లో భారతదేశం తిరిగి వచ్చి ఆయనను పెళ్లి చేసుకుని సరోజినీ నాయుడుగా మారారు.

ఆ రోజుల్లో స్వాతంత్ర్య సంగ్రామం ఉధృతంగా సాగుతోంది. ఆ సమయంలో కాంగ్రెస్‌లో చేరిన సరోజిని అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. 1914లో తొలిసారి ఆమె మహాత్మాగాంధీని కలిశారు. అనంతరం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అనేక వేదికలపై సమర్థంగా మాట్లాడి, మహిళల ఆకాంక్షలను అందరికీ తెలిసేలా చేశారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని, వారికి సమాన హక్కులు కావాలని పోరాడారు.

రాజకీయాల్లో పనిచేస్తూనే సరోజిని అద్భుతమైన కవయిత్రిగా పేరు తెచ్చుకున్నారు. 12వ ఏట తొలిసారి 'మహర్ మునీర్' అనే నాటకం రాయగా, అప్పటి నిజాం రాజు ఆ నాటకాన్ని మెచ్చుకున్నారు. అనంతరం ఇంగ్లిషులో కవిత్వం రాయడం సాధన చేసి, అందరికీ వినిపించి ప్రశంసలు పొందారు. ఆమె కవిత్వంలోని పదాల అల్లిక, ఉన్నతమైన భావలు, సృజనాత్మక సౌందర్యం చూసి 'భారతదేశపు ఈట్స్' అని మెచ్చేవారు. "The Golden Th-re-shol-d' పేరుతో 1905లో తొలి కవిత్వ పుస్తకాన్ని ఆమె విడుదల చేశారు. ఆ తర్వాత "The Bird of Ti-me-', "The Broken Wing' లాంటి మరికొన్ని పుస్తకాలు రాశారు. "In the Bazaars of Hyde-ra-ba-d' పేరుతో ఆమె రాసిన కవిత నేటికీ ఎంతో ప్రసిద్ధి పొందింది. 1949 మార్చి 2వ తేదీన ఆమె కన్ను మూశారు.

● తెలుసుకుందాం

టూత్ బ్రష్.. దీని కథ తెలుసా?





రోజూ పొద్దున లేచి, పళ్లు తోమిన తర్వాతే ఏదైనా తినాలి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. కొందరు పళ్లు తోమడానికి బద్ధకిస్తారు. తోమకుండానే ఉండిపోతారు. దీనివల్ల పళ్లు చెడిపోయి, దుర్వాసన వస్తుంది. కాబట్టి పళ్లు తోమడం తప్పనిసరి. పళ్లు తోమేందుకు బ్రష్ వాడతాం కదా, ఆ బ్రష్ చరిత్రేమిటో తెలుసా?

పళ్లు తోమేందుకు బ్రష్ కనిపెట్టకముందే ఆదిమానవులు పళ్లు శుభ్రం చేసుకునేందుకు రకరకాల వస్తువులు వాడేవారు. చెట్టు బెరడు, పక్షి రెక్కలు, జంతువుల ఎముకలతో పళ్లను శుభ్రం చేసుకునేవారు. ఆ తర్వాత కాలంలో పళ్లను తోమేందుకు చెట్ల కొమ్మల్ని వాడేవారు. అందులోనూ వేపపుల్లల్ని ఎక్కువగా వాడేవారు. వాటిని నమలుతూ పళ్లను శుభ్రంగా ఉంచుకునేవారు. ఒక వైపు తోమాక, మరో వైపుతో నాలుక శుభ్రం చేసుకునేవారు. ప్రపంచంలో అనేకచోట్ల చెట్ల కొమ్మల్నే పళ్లు శుభ్రం చేసుకునేందుకు వాడినట్లు ఆధారాలున్నాయి. అయితే పుల్లలు వాడకుంటూ బొగ్గు, ముగ్గు, బూడిద, ఇతర పదార్థాలను ఉపయోగించి చేత్తోనే పళ్లు తోమే అలవాటు కూడా చాలామందికి ఉండేది.

ఆ తర్వాత తొలిసారి చైనాలో బ్రష్ కనిపెట్టారు. ఒక చేత్తో బ్రష్ చివర పట్టుకుంటే మరో వైపు ఉన్న బ్రిజిల్స్ పళ్ల మీద మదువుగా రుద్దుతూ శుభ్రం చేసేవి. ఆ బ్రిజిల్స్‌ని రకరకాల వస్తువులతో తయారుచేసేవారు. అయితే ఇది కొందరికే అందుబాటులో ఉండేది.1780లో యూకేలో మొదటిసారి విలియం అడ్డీస్ అనే వ్యక్తి జైల్లో ఉండగా, పళ్లను శుభ్రం చేసుకునేందుకు సొంతంగా బ్రష్ తయారుచేసుకున్నాడు. ఆయన బయటకు వచ్చాక వాటిని తయారు చేసి అమ్మడం మొదలుపెట్టాడు. అలా బ్రష్‌లు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఆయన మరణించాక ఆయన కొడుకు ఆ పనిని కొనసాగించాడు. ఆ తర్వాత అనేక కంపెనీలు బ్రష్‌ల తయారీ మొదలుపెట్టాయి. ఇప్పుడు రకరకాల రూపాల్లో బ్రష్‌లు వస్తున్నాయి. చూశారా! ఇవాళ మనం వాడే బ్రష్‌ల వెనుక ఇంత చరిత్ర ఉంది.

● పాడుదాం గేయం

నవలోకం



అదిగో నవలోకం.. పలికే స్నేహగీతం
అదిగో నవలోకం.. మనకే అది సొంతం
రంగుల పువ్వులు.. మెరిసే తారలు
పారే సెలయేళ్లు.. పరిగెత్తే వాగులు

టపటప ఎగిరే రెక్కల పక్షులు
చకచక సాగే ఉడుత పిల్లలు
రివ్వున సాగే సీతాకోకచిలుకలు
తియతియ్యగ పాడే కోయిలలు

మెరిసే అందాల వెండి మబ్బులు
మురిసే పచ్చని ఉద్యానవనాలు
పలుకులు పలికే రామచిలుకలు
నడకలు నేర్పే హంస వన్నెలు

అన్నీ ఉన్న బంగారులోకం
అందరూ మెలిగే చల్లని లోకం
అదే అదే మన నవలోకం
పదండి వెళదాం.. రారండి

● ప్రాణిలోకం

రాముడు భీముడు



మన సినిమాల్లో కవలలు పుడితే రాముడు-భీముడులాంటి పేర్లు పెడుతుంటారు. వీరి వీటి పేరేమిటో? హాంకాంగ్‌లోని జూలో మొదటిసారి కవల పాండాలు పుట్టాయి. వాటిని జాగ్రత్తగా కాపాడి త్వరలో ప్రదర్శకులకు చూపించనున్నారు. ఎత్తయిన ప్రాంతాల్లోని అడవుల్లో, ముఖ్యంగా వెదురు వనాలు ఉన్న చోట బతికే పాండాలు అత్యంత అమాయక, సాధు జీవులు. అందుకే అందరికీ పాండాలంటే ఇష్టం. చైనాలో వీటి జనాభా ఎక్కువ. కాని అడవుల్లో వీటిపై దాడి చేసే ఎలుగుబంట్లు, చిరుతల వల్ల వీటి ఉనికి కష్టంగా మారింది. సున్నితమైన జీవులు కనుక వీటి పిల్లలు బతికి వెదురు పట్టడం కూడా కష్టమే. అడవుల్లో పాండాలు సగం కాన్పుల్లో కవలలను పెడతాయి. ఇవి 160 రోజుల పాటు గర్భంలో బిడ్డను మోసి కంటాయి. అడవుల్లో పాండాకు కవలలు పుడితే తల్లి ఒకదాన్నే బతికించుకుంటుంది. ఎందుకంటే దాని దగ్గర ఇద్దరికి పట్టడానికి పాలు ఉండవు. అయితే ఇక్కడ కనిపిస్తున్న పాండాలు జూలో పుట్టాయి కాబట్టి చక్కగా పాలు తాగి పెద్దవయ్యాయి. పర్యావరణంలో అన్నీ ముఖ్యమే. మనకు పర్యావరణ స్పృహ ఉండాలి.

● కథ

ఇసుక తక్కెడ పేడ తక్కెడ



ఒక ఊరిలో ఇద్దరు దొంగలు వుండేవాళ్ళు. ఒకని ఇల్లేమో ఉత్తరం వైపు, మరొకని ఇల్లేమో దక్షిణం వైపు. వాడు దొంగని వీనికి తెలీదు. వీడు దొంగని వానికి తెలీదు. ఇద్దరూ ఎదుటి వాళ్ళను మాటలతో బోల్తా కొట్టించి మోసం చేయడంలో ఆరితేరినవాళ్లే.

ఒకసారి వాళ్ళలో ఒకడు ఒక కావడి తీసుకొని దానికి రెండువైపులా రెండు ఇసుక కుండలు పెట్టి, అవి కనబడకుండా చిరిగిపోయిన బట్టలు కట్టి భుజానికి తగిలిచ్చుకోని ఎవరిని మోసం చేద్దామా అని వెదుక్కుంటా పోసాగాడు.

సరిగ్గా అదే సమయానికి ఇంకొకడు కూడా ఒక కావడి తీసుకోని రెండు వైపులా రెండు పెండతో నింపిన కుండలు పెట్టి, అవి కనబడకుండా ఒక పాత మసిబట్ట కట్టి భుజానికి తగిలిచ్చుకోని మోసం చేయడానికి ఎవరు దొరుకుతారా అని వెదుక్కుంటా బైలు దేరాడు.

వాళ్లిద్దరూ అనుకోకుండా ఒక సత్రం వద్ద కలుసుకున్నారు. వాని మొహం వీడు గానీ, వీని మొహం వాడు గానీ ఎప్పుడూ చూల్లేదు. దాంతో ఇద్దరూ ఎదుటోడు చాలా మంచోడు అని అనుకున్నారు. ఒకరితో ఒకరు మాటల్లో పడ్డారు.

మధ్యలో ఇసుక దొంగ 'అనా.. .. అనా... ఎక్కడికి పోతావున్నావు. ఏముంది నీ కావడిలో అన్నాడు.

అప్పుడు వాడు. 'ఆ... ఏం లేదు. నేను పెద్ద రత్నాల వ్యాపారిని. ఈ రెండు కుండలనిండా మేలు జాతి రత్నాలు వున్నాయి. దారిలో దొంగల భయం ఎక్కువ గదా... అందుకని కుండలకు పాత బట్టలు కట్టినాను. మా పాప పెళ్ళీడు కొచ్చింది. ఈ రత్నాలు అమ్మి బంగారం కొని పాపకు నగలు చేపియ్యాల' అన్నాడు.

ఆ మాటలు వినగానే ఇసుక దొంగ 'అబ్బ... వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు వీడు కనబన్నాడు. ఎట్లాగయినా వీన్ని మోసం చేయాలి' అనుకున్నాడు.

అంతలో పేడ దొంగ 'అవును... నువ్వేమి చేస్తావుంటావు. నీ కుండల్లో ఏమున్నాయి' అన్నాడు.

దానికా ఇసుక దొంగ చిరునవ్వుతో 'అనా... నేను నీ లాగే వ్యాపారినే. కాకపోతే నగల వ్యాపారిని. మంచి మేలు జాతి రత్నాలు కొని వాటిని బంగారంలో పొదిగి విలువైన హారాలు తయారు చేసి అమ్ముతుంటాను. ఈ రెండు కుండలనిండా బంగారం వుంది. దాన్ని అమ్మి విలువయిన రత్నాలు కొనాలని పోతున్నాను' అన్నాడు.

ఆ మాటలినగానే పేడదొంగ 'అబ్బ.... దొరికినాడురా కావలసినోడు. వీన్ని ఎట్లాగయినా మోసం చేసి వీని దగ్గరున్న బంగారం కొట్టేయ్యాలి' అనుకున్నాడు.

వెంటనే 'అరెరే... మనిద్దరినీ ఆ దేవుడు ఒక్క చోట కావాలనే కలిపినట్టున్నాడు. నీకు కావలసిన బంగారం నా దగ్గరుంది. నాకు కావలసిన మేలు జాతి రత్నాలు నీ దగ్గరున్నాయి. మనం ఒకరి కావడి మరొకరు మార్చుకుంటే సరి' అన్నాడు. ఆ మాటలకు ఇసుకదొంగ లోపల్లోపల 'పడిందిరా పిట్ట' అని నవ్వుకుంటా 'అలాగే నువ్వెలా చెప్తే నేనలాగే' అన్నాడు.

నీ కావడిలో ఏముందో చూపించు అంటే అవతలి వాడు కూడా నీ కావడిలో ఏముందో నువ్వు చూపించు అంటారు గదా... అందుకని ఇద్దరు గూడా మారు మాట్లాడకుండా.. ఎదుటివాన్ని మోసం చేస్తున్నాం అనుకుంటా సంబరంగా ఒకరి కావడి మరొకరు మార్చుకున్నారు.

మార్చుకున్నాక మరుక్షణం గూడా ఆలస్యం చేయకుండా ఇసుకదొంగ 'అనా... జాగ్రత్త. దారిలో దొంగలుంటారు. నీ దగ్గరున్నది బంగారం అని తెలిస్తే అంతే.. చీకటి పడకముందే తొందరగా ఇంటికి చేరుకో'' అన్నాడు.

దానికి వాడు 'తమ్ముడూ నువ్వు కూడా రత్నాలను జాగ్రత్తగా ఇంటికి తీసుకొని పో' అంటూ వాడు బైలు దేరాడు.

ఇద్దరూ సంబరంగా పరుగు పరుగున ఇంటికి చేరుకొని కావడి మీద వున్న బట్ట తీసి చూస్తే ఇంకేముంది ఇసుక దొంగ చేతికి పేడ అంటుకుంది. పేడ దొంగ చేతికి ఇసుక వచ్చింది. 'అమ్మో నేనే పెద్ద దొంగను అనుకుంటే, ఆవతలోడు నా కన్నా నాలుగాకులు ఎక్కువే చదివినట్లున్నాడే' అనుకుంటా ఇద్దరూ గమ్మున నోరుమూసుకున్నారు. ఇదీ కథ.

కథ విన్నారుగా... ఈ కథ నుంచే అంతా మోసం అనే అర్థంలో... 'ఇసుక తక్కెడ – పేడ తక్కెడ' అనే జాతీయం వచ్చింది.

- డా.ఎం.హరికిషన్

బిజినెస్ రీల్

కాస్మెటిక్స్ విభాగంలోకి అనన్య బిర్లా

ఈ ఏడాది కొత్త వెంచర్ ఆవిష్కరణ



ముంబై: వ్యాపార దిగ్గజం కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లా (30) తాజాగా సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ విభాగంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ ఏడాది కొత్త వెంచర్ ద్వారా పలు బ్యూటీ, పర్సనల్ కేర్ బ్రాండ్లను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టనున్నారు. అంతర్జాతీయ ఉత్పత్తులు, వ్యక్తిగత సంరక్షణ అంశాలపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ వినియోగదారులు, దేశీ బ్రాండ్ల నుంచి మరింతగా ఆశిస్తున్నట్లు అనన్య ఒక ప్రకటనలో తెలిపారు. వారి ఆకాంక్షలను తీర్చే విధంగా తమ ఉత్పత్తుల శ్రేణి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అయితే, వెంచర్ పేరు, పెట్టుబడి ప్రణాళికలు మొదలైన వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం ఏటా 10–11 శాతం వృద్ధి చెందుతున్న పర్సనల్ కేర్ మార్కెట్ 2028 నాటికి 34 బిలియన్ డాలర్లకు చేరొచ్చనే అంచనాలు ఉన్నాయి. 17 ఏళ్ల వయస్సులోనే అనన్య బిర్లా సూక్ష్మ రుణాల సంస్థ స్వతంత్ర మైక్రోఫిన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఇది దేశీయంగా రెండో అతి పెద్ద ఎన్‌బీఎఫ్‌సీ–ఎంఎఫ్‌ఐగా కార్యకలాపాలు సాగిస్తోంది. గాయని, పాటల రచయిత కూడా అయిన అనన్య.. 62 బిలియన్ డాలర్ల ఆదిత్య బిర్లా గ్రూప్ బోర్డులో డైరెక్టరుగా ఉన్నారు.

అకౌంట్ అగ్రిగేషన్ వ్యాపారానికి ఫోన్‌పే గుడ్‌బై

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే అకౌంట్ అగ్రిగేషన్ (ఏఏ) వ్యాపారం నుంచి వైదొలిగినట్లు ప్రకటించింది. ఈ సేవలు అందించేందుకు సరిపడా భాగస్వాములను పొందలేకపోయినట్లు తెలిపింది. ఎన్‌బీఎఫ్‌సీ–ఏఏ లైసెన్స్‌ను ఆర్‌బీఐకి స్వాధీనం చేయాలని నిర్ణయించినట్లు, అకౌంట్ అగ్రిగేషన్ కార్యకలాపాలను మూసివేసే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. తన యూజర్ల ఆమోదం మేరకు వారి ఆర్థిక సమాచారాన్ని బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లతో పంచుకోవడం ద్వారా రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర సేవలు అందించేందుకు ఈ లైసెన్స్ కింద అనుమతి ఉంటుంది. ''రెండేళ్లలోపే మా ఏఏ ప్లాట్‌ఫామ్‌పై 5 కోట్ల మంది భారతీయులను చేర్చుకోవడం గర్వకారణంగా ఉంది. పోటీ ప్రాధాన్యతల దృష్ట్యా ఎక్కువ మంది ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ప్రొవైడర్లను మా ప్లాట్‌ఫామ్ వైపు ఆకర్షించలేకపోయాం. దీంతో ఫోన్‌పే గ్రూప్ అకౌంట్ అగ్రిగేషన్ వ్యాపారం నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. దీనికి బదులు మార్కెట్లో ఉన్న ఇతర ఏఏలతో జట్టు కడతాం''అని ఫోన్‌పే ప్రకటించింది. తమ ఏఏ యూజర్లకు త్వరలోనే ఈ విషయాన్ని తెలియజేస్తామని తెలిపింది. 2023 జూన్‌లో ఫోన్‌పేకు ఎన్‌బీఎఫ్‌సీ–ఏఏ లైసెన్స్ రావడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-2-2025

విశాఖ	455-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	443-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	138.16	4.24
ITCHOTELS	178.53	3.73
BHARTIARTL	1,678.00	3.6
JSWSTEEL	980.2	3.35
TRENT	5,440.00	3.09

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	430.1	-2.49
SBIN	736.4	-2.11
BRITANNIA	4,872.00	-1.7
ADANIPORTS	1,145.55	-1.59
TCS	4,032.00	-1.24

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,548
ఎన్‌ఎస్‌ఈ	88,909
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,77,863
ఎఫ్‌ఐఐ	- 470
డీఐఐ	+ 454

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.72 (రాత్రి 11.30కు)	$ 70.61 (క్రితం ముగింపు)
బ్రెంట్	74.39 (రాత్రి 11.30కు)	$ 74.29 (క్రితం ముగింపు)

సోలార్ విద్యుత్ @100 గిగావాట్లు

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటన
- రెండేళ్లు ఆలస్యంగా లక్ష్యం చేరిక



న్యూఢిల్లీ: సోలార్ విద్యుదుత్పాదన సామర్థ్యంలో భారత్ కీలక మైలురాయిని అధిగమించింది.''గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీజీ దార్శనిక నాయకత్వంలో భారత్ చరిత్రాత్మక 100 గిగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని సాధించింది. పరిశుద్ధమైన, పర్యావరణ అనుకూల భవిష్యత్ కోసం విశ్రమించని మా అంకిత భావానికి ఇది నిదర్శనం''అని నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రి ప్రహ్లాద్ జోషి ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ పెట్టారు. 2022 నాటికి 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని కేంద్ర సర్కారు లక్ష్యాన్ని విధించుకోగా, ఇందులో 100 మెగావాట్లు సోలార్ ద్వారా సమకూర్చుకోవాలన్నది ప్రణాళిక. కానీ, కరోనా విపత్తు, ఆ సమయంలో లాక్‌డౌన్‌లతో లక్ష్యం చేరిక రెండేళ్లు ఆలస్యమవడం గమనార్హం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మోదీ సర్కారు లక్ష్యంగా నిర్దేశించుకుంది. ''సోలార్ ప్యానెళ్లు, సోలార్ పార్క్‌లు, రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. ఫలితమే నేడు భారత్ 100 గిగావాట్ల సోలార్ ఇంధన లక్ష్యాన్ని సాధించింది. పర్యావరణ అనుకూల ఇంధనంలో భారత్ స్వీయ సామర్థ్యాలపై ఆధారపడడమే కాకుండా, ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపిస్తోంది''అని ప్రహ్లాద్‌జోషి పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ప్రతి ఇంటికి శుద్ధ ఇంధనాన్ని అందిస్తుందన్నారు.

పదేళ్లలో చేరిక

2014 నాటికి దేశంలో సోలార్ విద్యుదుత్పాదన సామర్థ్యం 2.82 గిగావాట్లుగానే ఉండగా, పదేళ్లలో 100 గిగావాట్లను చేరుకోవడం విశేషం. 2025 జనవరి 31 నాటికి స్థాపిత సోలార్ సామర్థ్యం 100.33 గిగావాట్లు అయితే, మరో 84.10 గిగావాట్ల సామర్థ్యం ఏర్పాటు దశలో ఉంది. మరో 47.49 గిగావాట్లు టెండర్ దశలో ఉండడం గమనార్హం. కేవలం 2024లోనే 24.5 గిగావాట్ల సామర్థ్యం కొత్తగా అందుబాటులోకి వచ్చింది. మరోవైపు 2014 నాటికి దేశంలో కేవలం 2 గిగావాట్ల సోలార్ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం ఉంటే, 2024 నాటికి 60 గిగావాట్లకు చేరుకుంది.

దేశవ్యాప్తంగా పెరిగిన ట్రక్ అద్దెలు


- జనవరిలో మెరుగైన రికవరీ
- శ్రీరామ్ ఫైనాన్స్ బులెటిన్ వెల్లడి



ముంబై: దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో ట్రక్‌ల అద్దెలు జనవరిలో గణనీయంగా కోలుకున్నాయి. శీతాకాలంలో పండ్లు, కూరగాయల దిగుబడులు ఇందుకు మద్దతుగా నిలిచాయి. కొన్ని మార్గాల్లో ట్రక్‌ల అద్దెలు 2024 డిసెంబర్‌తో పోల్చితే జనవరిలో 4 శాతం వరకు పెరిగినట్టు శ్రీరామ్ ఫైనాన్స్ నెలవారీ బులెటిన్ వెల్లడించింది. ''సాధారణంగా జనవరి–మార్చి కాలం రద్దీగా ఉంటుంది. రబీ పంట తర్వాత వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకుంటాయి. పలు రంగాల్లోనూ తయారీ కార్యకలాపాలు జోరుగా సాగుతాయి'' అని శ్రీరామ్ ఫైనాన్స్ తెలిపింది. వాణిజ్య వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్యాసింజర్ బస్సులు, మ్యాక్సీ క్యాబ్‌లు, వ్యవసాయ ట్రైలర్ల అమ్మకాలు గత నెలలో గణనీయంగా పెరిగినట్టు గుర్తు చేసింది. ఢిల్లీ–ముంబై–ఢిల్లీ మార్గంలో ట్రక్‌ల అద్దెల ధరలు 4 శాతం పెరిగాయి. ముంబై–కోల్‌కతా–ముంబై మార్గంలో 3.7 శాతం మేర ధరలు అధికమయ్యాయి. ఢిల్లీ–హైదరాబాద్–ఢిల్లీ మార్గం, కోల్‌కతా–గువహటి–కోల్‌కతా మార్గంలో అద్దెలు 3.3 శాతం పెరిగినట్టు ఈ నివేదిక వెల్లడించింది. ''లాజిస్టిక్స్ రంగంలో ట్రక్‌ల అద్దె రేట్లు పెరగడం సానుకూల సంకేతం. శీతాకాల పండ్లు, కూరగాయల దిగుబడులతో రవాణా, స్టోరేజీ వసతులకు డిమాండ్ పెరిగింది''అని శ్రీరామ్ ఫైనాన్స్ ఎండీ, సీఈవో వైఎస్ చక్రవర్తి తెలిపారు.

టెలికం చార్జీలను మరింత పెంచాల్సిందే

- అప్పుడే పరిశ్రమలో ఆర్థిక స్థిరత్వం
- ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్



న్యూఢిల్లీ: ఇప్పటికే పలు విడతలుగా మొబైల్ టెలిఫోన్ చార్జీలను పెంచినప్పటికీ.. మరింత పెంపు అవసరమని భారతీ ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విఠల్ వ్యాఖ్యానించారు. టెలికం రంగ ఆర్థిక స్థిరత్వం కోసం ఇది అవసరమన్నారు. డిసెంబర్ క్వార్టర్ కంపెనీ త్రైమాసిక ఫలితాల అనంతరం ఇన్వెస్టర్లతో ఏర్పాటు చేసిన ఎర్నింగ్స్ కాల్‌లో భాగంగా ఆయన ఈ అంశంపై మాట్లాడారు. నెట్‌వర్క్‌పై పెట్టుబడులు తగ్గించి, ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. తద్వారా కస్టమర్ల అనుభవంలో అంతరాలను తొలగించి, గృహ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించనున్నట్టు తెలిపారు. ''2023–24 కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయాలు తక్కువగా ఉంటాయి. 2025–26లోనూ మరింత తగ్గుతాయి. డిజిటల్ సామర్థ్యాల ఏర్పాటుపై మేము పెట్టిన దృష్టి ఇప్పుడు ఫలితాలనిస్తోంది''అని చెప్పారు. భారత్‌లో సగటు టెలికం యూజర్ నుంచి వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) ప్రపంచంలోనే తక్కువగా ఉందన్నారు. ఆర్థికంగా నిలదొక్కుకుని, నిలకడైన రాబడుల కోసం మరో విడత టారిఫ్‌లకు చికిత్స అవసరమని వ్యాఖ్యానించారు. గతేడాది జూలైలో ఎయిర్‌టెల్ సహా ఇతర టెలికం కంపెనీలు టారిఫ్‌లను సగటున 10–21 శాతం మధ్య పెంచడం గమనార్హం. మార్జిన్లు తక్కువగా ఉండే హోల్‌సేల్ వాయిస్, మెస్సేజింగ్ సేవల నుంచి ఎయిర్‌టెల్ తప్పుకుంటున్నట్టు విఠల్ ప్రకటించారు. కంపెనీ లాభాలపై దీని ప్రభావం ఉండదన్నారు. డిసెంబర్ త్రైమాసికంలో ఎయిర్‌టెల్ రూ.16,134 కోట్ల లాభాలను నమోదు చేయడం గమనార్హం. ఒక్కో యూజర్ నుంచి సగటున రూ.245 ఆదాయం సమకూర్చుకుంది. ఇది కనీసం రూ.300 ఉండాలని ఎయిర్‌టెల్ ఎప్పటినుంచో చెబుతూ వస్తోంది.

రెండొంతుల డిజిటల్ స్టార్లు.. ఉల్లంఘనులే

- ఫ్యాషన్, టెలికం రంగాల్లో అత్యధికం
- ఏఎస్‌సీఐ వెల్లడి



ముంబై: 'డిజిటల్ స్టార్లు'గా వెలుగొందుతున్న చాలా మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు వాస్తవానికి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అడ్వర్టైజింగ్ ప్రమాణాల మండలి ఏఎస్‌సీఐ ఆందోళన వ్యక్తం చేసింది. మూడింట రెండొంతుల మంది (69 శాతం) యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వ్యాఖ్యానించింది. 'ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్ 2024' జాబితాలో పేర్కొన్న ఇన్‌ఫ్లుయెన్సర్ల తీరుతెన్నులను పరిశీలించి రూపొందించిన నివేదికలో ఏఎస్‌సీఐ ఈ విషయాలు వెల్లడించింది. ఇందుకోసం 2024 సెప్టెంబర్–నవంబర్ మధ్యకాలంలో వారు ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్‌లో ప్రమోట్ చేసిన పోస్టులను విశ్లేషించింది. దీని ప్రకారం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు నిర్దేశించిన డిస్‌క్లోజర్ (కీలక వివరాలను ఫాలోయర్లకు వెల్లడించడం) మార్గదర్శకాలను పాటించడంలో 69 శాతం మంది విఫలమైనట్లు ఏఎస్‌సీఐ పేర్కొంది. పరిశీలించిన 100 పోస్టుల్లో 29 పోస్టుల్లో మాత్రమే తగినన్ని డిస్‌క్లోజర్స్ ఉన్నాయని, 69 కేసుల్లో ఉల్లంఘనలు రుజువయ్యాయని వివరించింది. ఫ్యాషన్–లైఫ్‌స్టయిల్, టెలికం ఉత్పత్తులు, పర్సనల్ కేర్ విభాగాల్లో ఈ ధోరణి అత్యధికంగా కనిపించింది. నిర్దిష్ట మార్గదర్శకాల ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లు తాము ప్రమోట్ చేసే కంపెనీలు లేదా ఉత్పత్తులతో తమకున్న సంబంధాన్ని స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. దీనితో వారి ఫాలోయర్లు పూర్తి సమాచారం ఆధారంగా సముచిత నిర్ణయం తీసుకునే వీలుంటుంది. ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రకటనల్లో పారదర్శకత లోపించడం, నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుండటం ఆందోళనకరమైన విషయమని నివేదిక పేర్కొంది. నియంత్రణ సంస్థపరమైన చర్యలకు గురికాకుండా ప్రకటనకర్తలు, ఏజెన్సీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సమష్టిగా నిబంధనలకు అనుగుణంగా పని చేయడంపై దృష్టి పెట్టాలని సూచించింది.

ఇన్ఫోసిస్‌లో 300 మంది ఫ్రెషర్ల తొలగింపు

- అంతర్గత మదింపులో నెగ్గకపోవడంతో చర్య
- బాధితుల సంఖ్య ఎక్కువేనన్న ఉద్యోగుల సంఘం



న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ 300 మంది ఫ్రెషర్లను తొలగించింది. మైసూరులోని క్యాంపస్‌లో వీరికి ప్రాథమిక శిక్షణ ఇవ్వగా, అంతర్గతంగా నిర్వహించిన మదింపు ప్రక్రియల్లో మెరుగైన పనితీరు చూపించలేకపోయినట్టు, మూడు విడతలు అవకాశం ఇచ్చినప్పటికీ ఉత్తీర్ణత సాధించకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్టు ఇన్ఫోసిస్ ప్రకటించింది. కానీ, వాస్తవానికి ఇలా తొలగించిన వారి సంఖ్య మరింత ఎక్కువే ఉంటుందని ఐటీ ఉద్యోగుల సంఘం నైటిస్ తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖకు ఫిర్యాదు చేస్తామని కూడా హెచ్చరించింది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని కంపెనీపై కఠినమైన చర్య తీసుకోవాలని డిమాండ్‌చేసింది. దీనిపై మీడియా సంస్థలు వివరణ కోరగా.. ''ఇన్ఫోసిస్‌లో కఠినమైన నియామక ప్రక్రియను అనుసరిస్తాం. మైసూరు క్యాంపస్‌లో విస్తృతమైన ప్రాథమిక శిక్షణ అనంతరం అంతర్గత మదింపు ప్రక్రియల్లో ఫ్రెషర్లు (ఎలాంటి అనుభవం లేకుండా కొత్తగా ఉద్యోగ అవకాశాలు పొందిన వారు) విజయం సాధించాల్సి ఉంటుంది. ఇందుకు గాను ప్రతి ఒక్కరి మూడు విడతలుగా అవకాశం కల్పిస్తాం. అయినప్పటికీ విఫలమైతే వారు సంస్థతో కలసి కొనసాగలేరు. ఉద్యోగ కాంట్రాక్టులో ఈ నిబంధన కూడా ఉంటుంది. రెండు దశాబ్దాల నుంచి ఇదే ప్రక్రియ అమల్లో ఉంది. మా క్లయింట్ల అవసరాలను తీర్చే అత్యుత్తమ నైపుణ్యాలు ఉండేలా చూడడమే ఇందులోని ఉద్దేశ్యం''అని ఇన్ఫోసిస్ సంస్థ వివరణ ఇచ్చింది.

మూడు నెలల క్రితమే చేరిక

తాజాగా తొలగింపునకు గురైన వారి సంఖ్య గణనీయంగా ఉంటుందని నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నైటిస్) పేర్కొంది. వీరిని 2024 అక్టోబర్‌లో నియమించుకున్నట్టు తెలిపింది. ''ఆఫర్ లెటర్లు అందుకున్న తర్వాత వీరంతా రెండేళ్లపాటు నిరీక్షించారు. నైటిస్, బాధిత అభ్యర్థులు కలసి చేసిన సుదీర్ఘ పోరాటం తర్వాతే వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు''అని ప్రకటించింది.

ఓలా ఎలక్ట్రిక్ నష్టాలు పెరిగాయ్

క్యూ3లో రూ. 564 కోట్లు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన(ఈ2డబ్ల్యూ) కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర నష్టం భారీగా పెరిగి రూ. 564 కోట్లకు చేరింది. ఆదాయం నీరసించడం, తీవ్రతర పోటీ, సర్వీస్ సవాళ్లతో పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 376 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,296 కోట్ల నుంచి రూ. 1,045 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు రూ. 1,597 కోట్ల నుంచి రూ. 1,505 కోట్లకు తగ్గాయి. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 3.33 లక్షల యూనిట్ల ఈ2డబ్ల్యూ రిజి్స్ట్రేషన్లు నమోదైనట్లు ఓలా వెల్లడించింది. గతేడాది క్యూ3తో పోలిస్తే ఇవి 37 శాతంపైగా అధికమని తెలియజేసింది. సర్వీసింగ్ సమస్యల పరిష్కారానికి రూ. 110 కోట్లు వెచ్చించినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఓలా షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.4 శాతం నీరసించి రూ. 70 వద్ద ముగిసింది.

బలరామ్‌పూర్ చినీ లాభం డౌన్

క్యూ3లో రూ. 70 కోట్లు



ముంబై: చక్కెర తయారీ దిగ్గజం బలరామ్‌పూర్ చినీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం క్షీణించి రూ. 70 కోట్లకు పరిమితమైంది. గతేడాది ఇదే కాలంలో రూ. 91 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 3 శాతం వెనకడుగుతో రూ. 1,192 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 1,230 కోట్ల అమ్మకాలు సాధించింది.

ఫలితాల నేపథ్యంలో బలరామ్‌పూర్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతం క్షీణించి రూ. 460 వద్ద ముగిసింది.

క్యూ3 ఫలితాలు

ఎంఅండ్ఎం లాభం స్పీడ్

క్యూ3లో రూ. 3,181 కోట్లు



ముంబై: ఆటో రంగ దేశీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం జంప్‌చేసి రూ. 3,181 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ. 2,658 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 41,470 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 35,299 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఆటో విభాగంలో అమ్మకాలు 16 శాతం పుంజుకుని 2,45,000కు చేరగా.. యూవీ విక్రయాలు 1,42,000 యూనిట్లను తాకాయి. ఈ విభాగం ఆదాయం 21 శాతం జంప్‌చేసి రూ. 23,391 కోట్లకు చేరింది. నికర లాభం 20 శాతం బలపడి రూ. 1,438 కోట్లయ్యింది. వ్యవసాయ పరికరాల విభాగం నికర లాభం 11 శాతం పుంజుకుని రూ. 996 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్ఎం షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.7 శాతం లాభంతో రూ. 3,193 వద్ద ముగిసింది.

ఎల్ఐసీ లాభం అప్

క్యూ3లో రూ. 11,056 కోట్లు



ముంబై: బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 11,056 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ. 9,444 కోట్లు మాత్రమే ఆర్జించింది. అయితే నికర ప్రీమియం ఆదాయం రూ. 1,17,017 కోట్ల నుంచి రూ. 1,06,891 కోట్లకు క్షీణించింది. ఈ బాటలో మొత్తం ఆదాయం సైతం రూ. 2,12,447 కోట్ల నుంచి రూ. 2,01,994 కోట్లకు వెనకడుగు వేసింది. నిర్వహణా వ్యయాలు రూ. 18,194 కోట్ల నుంచి రూ. 14,416 కోట్లకు తగ్గాయి. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 2024 డిసెంబర్ కల్లా 10 శాతం బలపడి రూ. 54,77,651 కోట్లను తాకాయి. బీమా సఖి యోజన పథకంలో భాగంగా ఇప్పటివరకూ 1.25 లక్షల మంది మహిళలు రిజిస్టరైనట్లు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ వెల్లడించారు. బీమా సఖిగా 70,000 మంది ఎంపికైనట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం క్షీణించి రూ. 811 వద్ద ముగిసింది.

సన్‌టీవీ లాభాలకు కోత

20 % క్షీణతతో రూ.363 కోట్లు



న్యూఢిల్లీ: సన్‌టీవీ నెట్‌వర్క్స్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) రూ.363 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. ఇదే కాలంలో కార్యకలాపాల ద్వారా ఆదాయం సైతం 10 శాతం క్షీణించి రూ.827 కోట్లకు పరిమితమైంది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.454 కోట్ల లాభాన్ని, రూ.923 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయడం గమనార్హం. మొత్తం వ్యయాలు 11 శాతం అధికమై రూ.500 కోట్లకు చేరాయి. డిసెంబర్ క్వార్టర్‌లో మొత్తం ఆదాయం సైతం 8.6 శాతం క్షీణించి రూ.967 కోట్లకు పరిమితమైంది. వాటాదారుల వద్దనున్న ప్రతి ఒక్క షేరుపై రూ.2.50 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీ20 ఫ్రాంచైజీలు ఈ సంస్థ కిందే ఉండడం గమనార్హం. తెలుగు, తమిళం సహా ఏడు భాషల్లో టెలివిజన్ ఛానళ్లను సైతం నిర్వహిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సన్‌టీవీ షేరు 1.5% నష్టపోయి రూ.630 వద్ద ముగిసింది.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ లాభం జూమ్

క్యూ3లో రూ.254 కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్న ఫోర్టిస్ హెల్త్‌కేర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయమైన పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూసినప్పుడు 89 శాతం పెరిగి రూ.254 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.134 కోట్లుగా ఉండడం గమనార్హం. బెంగళూరులోని రిచ్‌మండ్ రోడ్ హాస్పిటల్‌ను విక్రయించడం రూపంలో వచ్చిన రూ.23.5 కోట్లు కూడా లాభాల్లో కలసి ఉన్నట్టు సంస్థ తెలిపింది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,680 కోట్ల నుంచి రూ.1,928 కోట్లకు చేరింది. వ్యయాలు సైతం రూ.1,515 కోట్ల నుంచి రూ.1,696 కోట్లకు పెరిగిపోయాయి. ''క్యూ3లోనూ సానుకూల పనితీరును కొనసాగించాం. మా కన్సాలిడేటెడ్ ఆదాయంలో ఆస్పత్రుల వ్యాపారం 84 శాతం సమకూర్చింది''అని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఎండీ, సీఈవో అశుతోష్ రఘువంశీ తెలిపారు. ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, కార్డియాక్ సైన్సెస్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆర్థోపెడిక్స్, రీనల్‌సైన్సెస్‌తో కూడిన స్పెషాలిటీ విభాగం నుంచే 62 శాతం ఆదాయం వచ్చినట్టు చెప్పారు.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈలో ఈ షేరు 0.8% నష్టపోయి రూ.646 వద్ద ముగిసింది.

నిరాశపరిచిన షిప్పింగ్ కార్పొరేషన్

44% తగ్గిపోయిన లాభం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలహీన పనితీరు నమోదు చేసింది. ఈ కాలానికి రూ.75 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.134 కోట్లతో పోల్చి చూస్తే 44 శాతం తగ్గిపోయింది. కార్యకలాపాల ద్వారా రూ.1,350 కోట్ల ఆదాయం సమకూరింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలోనూ ఆదాయం రూ.1,363 కోట్లుగా ఉండడం గమనార్హం. వ్యయాలు రూ.1,214 కోట్ల నుంచి రూ.1,277 కోట్లకు ఎగిశాయి. వ్యయాలు గణనీయంగా పెరిగిపోవడం లాభాలకు చిల్లుపెట్టినట్టు తెలుస్తోంది.

శుక్రవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు 1%పైగా నష్టపోయి రూ.192 వద్ద స్థిరపడింది.

అపోలో టైర్స్ లాభం జారుడు

క్యూ3లో రూ. 337 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అపోలో టైర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 32 శాతం క్షీణించి రూ. 337 కోట్లకు పరిమితమైంది. ముడిసరుకుల వ్యయాలు మార్జిన్లను దెబ్బతీయడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 497 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,595 కోట్ల నుంచి రూ. 6,928 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,878 కోట్ల నుంచి రూ. 6,467 కోట్లకు పెరి గాయి. దీనిలో ముడిసరుకుల వ్యయాలు రూ. 2,885 కోట్ల నుంచి రూ. 3,223 కోట్లకు ఎగశాయి.

ఫలితాల నేపథ్యంలో అపోలో టైర్స్ షేరు బీఎస్‌ఈలో 1% నీరసించి రూ. 416 వద్ద ముగిసింది.

రామ్‌కో సిమెంట్స్ లాభం రెండింతలు

న్యూఢిల్లీ: రామ్‌కో సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (క్యూ3) గణనీయమైన లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూసినప్పుడు రెట్టింపునకు పైగా పెరిగి రూ.181 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.81 కోట్లుగానే ఉంది. కార్యకలాపాల ద్వారా ఆదాయం మాత్రం 6 శాతం తగ్గి రూ.1,983 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.2,111 కోట్లుగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా క్యూ3లో కంపెనీ పెట్టుబడులు/మిగులు భూమి విక్రయం రూపంలో రూ.188 కోట్లను ఆర్జించడం లాభం గణనీయంగా పెరిగేందుకు దారితీసింది. ఈ మొత్తాన్ని ఏకీకృత అంశంగా చూపించింది. అమ్మకాల పరిమాణం 9 శాతం పెరిగి 4.37 మిలియన్ టన్నులుగా నమోదైంది. సిమెంట్ తయారీ సామర్థ్య వినియోగం 74 శాతం నుంచి 75 శాతానికి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో రామ్‌కో సిమెంట్స్ షేరు 1% నష్టంతో రూ.890 వద్ద ముగిసింది.



పోరాడి ఓడిన రిత్విక్ జోడీ

సాక్షి, హైదరాబాద్: డాలస్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అమెరికాలోని టెక్సస్‌లో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్ (భారత్)–నికోలస్ బారింటోస్ (కొలంబియా) ద్వయం 6–7 (4/7), 7–5, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో రాజీవ్ రామ్–ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. 1 గంట 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బారింటోస్ మూడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో అనుభవజ్ఞులైన రాజీవ్ రామ్, క్రాయిసెక్ పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకున్నారు. రిత్విక్–బారింటోస్‌లకు 11,840 డాలర్ల (రూ. 10 లక్షల 38 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. గత ఏడాది అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో నిలకడగా రాణించిన రిత్విక్ ... గత వారం భారత్–టోగో జట్ల మధ్య న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ గ్రూప్ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ మ్యాచ్ ద్వారా డేవిస్ కప్‌లో అరంగేట్రం చేశాడు.

ముంబైకు ఎదురుందా!

- నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్
- హరియాణాతో రహానే బృందం మ్యాచ్
- విదర్భతో తమిళనాడు 'ఢీ'
- జమ్మూకశ్మీర్‌తో కేరళ పోరు
- సౌరాష్ట్రతో గుజరాత్ సమరం

కోల్‌కతా: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్ నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు హరియాణాతో పోరుకు సిద్ధమైంది. శనివారం ప్రారంభం కానున్న క్వార్టర్ ఫైనల్లో అజింక్య రహానే సారథ్యంలోని ముంబై జట్టు తరఫున స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేస్ ఆల్‌రౌండర్లు శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్‌లపై అందరి దృష్టి నిలవనుంది. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ హరియాణాలోని లాహ్లీలో నిర్వహించాల్సింది. కానీ, అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో బీసీసీఐ ఈ మ్యాచ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ చేజిక్కించుకున్న ముంబై జట్టు మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండగా... పెద్దగా అనుభవం లేని హరియాణా జట్టు ముంబైకి ఏమాత్రం పోటీనిస్తుందనేది ఆసక్తికరం. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా ముంబై 7 మ్యాచ్‌లాడి 4 విజయాలు, 2 పరాజయాలు, ఒక 'డ్రా'తో 29 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాకౌట్‌కు అర్హత సాధించింది. చివరి గ్రూప్ మ్యాచ్‌లో మేఘాలయపై ఇన్నింగ్స్ 456 పరుగుల తేడాతో గెలిచి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. రహానే, సూర్యకుమార్, శివమ్ దూబే, సిద్ధేశ్ లాడ్, ఆకాశ్ ఆనంద్, షమ్స్ ములానీలతో ముంబై బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. ఆల్‌రౌండర్ శార్దుల్ జోరు మీదున్నాడు. అతడు గత మ్యాచ్‌లో 42 బంతుల్లోనే 84 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లోనూ విజృంభించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. బౌలింగ్‌లో శార్దుల్‌తో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ షమ్స్ ములానీ, ఆఫ్ స్పిన్నర్ తనుశ్ కొటియాన్ కీలకం కానున్నారు. మరోవైపు ఎలైట్ గ్రూప్ 'సి'లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 3 గెలిచి, 4 'డ్రా' చేసుకున్న హరియాణా 29 పాయింట్లతో క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. ఆ జట్టులో అంతర్జాతీయ అనుభవం ఉన్న ఆటగాళ్లు లేకపోయినా... ప్రతిభకు కొదువలేదు. అంకిత్ కుమార్, నిశాంత్ సింధు, హిమాన్షు రాణా, యువరాజ్ సింగ్, అన్షుల్ కంబోజ్, అనూజ్ ఠక్రాల్, జయంత్ యాదవ్‌లపై ఆ జట్టు అధికంగా ఆధారపడుతోంది.

కరుణ్ నాయర్‌పైనే దృష్టి

తాజా రంజీ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విదర్భ జట్టు... క్వార్టర్స్‌లో తమిళనాడుతో తలపడనుంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట గెలిచిన మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న విదర్భ 40 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఫుల్ ఫామ్‌లో ఉన్న సీనియర్ ఆటగాడు కరుణ్ నాయర్ సెంచరీల మీద సెంచరీలతో జోష్‌లో ఉండగా... కెప్టెన్ అక్షయ్ వాడ్కర్, అథర్వ తైడె, హర్ష్ దూబేతో విదర్భ బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. బౌలింగ్‌లో ఉమేశ్ యాదవ్, ఆకాశ్, ఆదిత్య కీలకం కానున్నారు. మరోవైపు ఎలైట్ గ్రూప్ 'డి'లో రెండో స్థానంతో క్వార్టర్స్ చేరిన తమిళనాడు జట్టు... విజయ్ శంకర్, జగదీశన్, బాబా ఇంద్రజీత్ ప్రదర్శనపై ఎక్కువ ఆధారపడుతోంది. పుణేలో జరిగే మరో క్వార్టర్ ఫైనల్ పోరులో ఎలైట్ గ్రూప్ 'ఎ' నుంచి 35 పాయింట్లు సాధించిన జమ్మూకశ్మీర్‌తో గ్రూప్ 'సి'లో రెండో స్థానంలో నిలిచిన కేరళ జట్టు తలపడుతుంది. రాజ్‌కోట్ వేదికగా గుజరాత్, సౌరాష్ట్ర జట్ల మధ్య నాలుగో క్వార్టర్ ఫైనల్ జరుగుతుంది.



సూర్యకుమార్ యాదవ్

పాక్ ఫుట్‌బాల్ సమాఖ్యపై మళ్లీ వేటు వేసిన 'ఫిఫా'

కరాచీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) పాకిస్తాన్ ఫుట్‌బాల్ సమాఖ్యపై సస్పెన్షన్ వేటు వేసింది. 'ఫిఫా' నియమావళికి అనుగుణంగా పాక్ ఫుట్‌బాల్ సమాఖ్య (పీఎఫ్ఎఫ్) నిర్వహణ జరగకపోవడంతో 'ఫిఫా' శుక్రవారం ఆ దేశ సమాఖ్యపై నిషేధం విధించింది. 'ఫిఫా' నియమావళి ప్రకారం నడుచుకునేలా పీఎఫ్ఎఫ్ నిబంధనల్ని సవరించుకోవాలని, తద్వారా దేశంలో ఆటపై జవాబుదారీతనం పెరగాలని 'ఫిఫా' పలు సూచనల్ని చేసినా... పీఎఫ్ఎఫ్ పెడచెవిన పెట్టింది. నిషేధాజ్ఞలుంటాయని హెచ్చరించినా సవరణలు చేయకపోవడంతో 'ఫిఫా' తాజాగా సమాఖ్యను సస్పెండ్ చేస్తూ... తాము సూచించిన సవరణలు పూర్తి చేసేదాకా నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. 2019 జూన్‌లో 'ఫిఫా' నియమించిన కమిటీనే పీఎఫ్ఎఫ్ వ్యవహారాలను చక్కబెడుతోంది. కానీ హరూన్ మాలిక్ నేతృత్వంలోని ఈ కమిటీని అక్కడి ప్రభుత్వం శాసించడంతో ఎన్నికల నిర్వహణ, నిబంధనల్లో సవరణల ప్రక్రియ మాత్రం చేపట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో హరూన్ తమపై వేటు తప్పదని ఇటీవల పార్లమెంటరీ ప్యానెల్ దృష్టికి తెచ్చినా అక్కడి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. 'ఫిఫా' నియమావళికి తగ్గ మార్పుచేర్పులకు పాక్ ప్రభుత్వ ఆజమాయిషీలోని సమాఖ్య సిద్ధంగా లేదని హరూన్ మాలిక్ ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే 'ఫిఫా' కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. 2017 నుంచి పాక్ సమాఖ్యపై వేటు పడటం ఇది మూడోసారి!

చాంపియన్స్ ట్రోఫీకి అయూబ్ దూరం

చీలమండ గాయం నుంచి ఇంకా కోలుకోని పాక్ ఓపెనర్



కరాచీ: పాకిస్తాన్ ఓపెనర్ సయీమ్ అయూబ్ గాయం కారణంగా సొంతగడ్డపై ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. గత నెల దక్షిణాఫ్రికా పర్యటనలో ఉండగా అతని చీలమండకు ఫ్రాక్చర్ అయ్యింది. దీంతో అతను ఇంగ్లండ్‌లోనే పునరావాస శిబిరంలో గడుపుతున్నాడు. అయితే గాయం తీవ్రత దృష్ట్యా కనీసం పది వారాలు విశ్రాంతి తీసుకోవాలని బోర్డు వైద్య సిబ్బంది నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీకి అతను గైర్హాజరు కానున్నాడు. ఈ 22 ఏళ్ల ఎడంచేతి వాటం బ్యాటర్ ఆస్ట్రేలియా, జింబాబ్వే, దక్షిణాఫ్రికా పర్యటనలలో అదరగొట్టాడు. సఫారీతో జరిగిన వన్డేల్లో సెంచరీలతో కదంతొక్కిన అయూబ్ జింబాబ్వేతో టి20లో 'శత'క్కొట్టాడు. వచ్చే నెల న్యూజిలాండ్ పర్యటనకు అతను అందుబాటులో ఉండేది అనుమానమేనని తెలిసింది. మెడికల్ రిపోర్టులు, ఫిట్‌నెస్ టెస్టులను పరిశీలించాకే కివీస్ పర్యటనకు ఎంపిక చేయాలా వద్దా అనేది నిర్ణయిస్తామని పాక్ క్రికెట్ బోర్డు తెలిపింది. న్యూజిలాండ్‌లో పాకిస్తాన్ ఐదు టి20లు, మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 5 వరకు ఈ రెండు పరిమిత ఓవర్ల సిరీస్‌లు జరుగుతాయి.



40 ఏళ్ల వయసులో 40 పాయింట్లు!

లెబ్రాన్ జేమ్స్ కొత్త రికార్డు

లాస్‌ఏంజెలిస్: అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ ప్రతిష్టాత్మక నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్‌లో అరుదైన ఘనతను నమోదు చేశాడు. ఒక ఎన్‌బీఏ గేమ్‌లో 40కి పైగా పాయింట్లు సాధించిన అతి పెద్ద వయస్కుడిగా అతను నిలిచాడు. గురువారం లెబ్రాన్ గోల్డెన్ స్టేట్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 120–112 పాయింట్ల తేడాతో లాస్ ఏంజెలిస్ లేకర్స్ విజయం సాధించింది. ఇందులో లెబ్రాన్ ఒక్కడే 42 పాయింట్లు సాధించాడు. గత ఏడాది డిసెంబర్ 30న లెబ్రాన్ 40 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. గతంలో ఆల్‌టైమ్ గ్రేట్ మైకేల్ జోర్డాన్ 40 ఏళ్ల 3 రోజుల వయసులో (2003లో వాషింగ్టన్ విజార్డ్స్ తరఫున) ఒక గేమ్‌లో 40కి పైగా పాయింట్లు నమోదు చేశాడు. ఈ రికార్డును ఇప్పుడు లెబ్రాన్ సవరించాడు.

'పునరాగమనం చేస్తా'

షఫాలీ వర్మ ఆశాభావం



న్యూఢిల్లీ: దాదాపు ఐదేళ్ల పాటు భారత మహిళల క్రికెట్ జట్టులో కీలక ప్లేయర్‌గా పలు విజయాల్లో భాగంగా ఉన్న షఫాలీ వర్మ మూడు నెలల క్రితం టీమ్‌లో చోటు కోల్పోయింది. ముందుగా ఆస్ట్రేలియాతో, ఆపై స్వదేశంలో వెస్టిండీస్, ఐర్లాండ్‌లతో సిరీస్‌లకు కూడా ఆమెను ఎంపిక చేయలేదు. అయితే ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో చెలరేగిన షఫాలీ పరుగుల వరద పారించింది. సీనియర్ వన్డే చాలెంజర్ టోర్నీలో 5 మ్యాచ్‌లలోనే 82.80 సగటుతో 414 పరుగులు సాధించింది. ఇదే జోరులో తాను భారత జట్టులోకి పునరాగమనం చేస్తానని షఫాలీ విశ్వాసం వ్యక్తం చేసింది. 'గత కొన్ని నెలలు నా జీవితంలో కఠినంగా గడిచాయి. నాన్నకు అనూహ్యంగా గుండెపోటు వచ్చిన రెండు రోజులకే టీమ్‌లో స్థానం కోల్పోయాను. మానసికంగా ఎంతో ఇబ్బంది పడ్డా. అయితే నా కుటుంబం నాకు అండగా నిలిచి ప్రోత్సహించింది. అందుకే మళ్లీ మైదానంలో పట్టుదలగా ఆడగలిగా. నాకు అవకాశం వచ్చిన ప్రతీసారి భారీగా పరుగులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పూర్తిగా దానిపైనే దృష్టి పెట్టా. అందు కోసం పట్టుదలగా సిద్ధం కావడమే నేను చేయగలిగింది. ఇలాగే ప్రాక్టీస్ కొనసాగించి పరుగులు సాధిస్తే తిరిగి భారత జట్టులో రాగలను' అని షఫాలీ వ్యాఖ్యానించింది. డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న షఫాలీ ప్రస్తుతం సన్నాహకాల్లో ఉంది. సీజన్ ఆరంభానికి ముందు క్యాపిటల్స్ నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంప్‌లో ఆమె పాల్గొంటోంది. డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌ల ద్వారా ఇన్నింగ్స్ ఎలా నిర్మించాలో తాను నేర్చుకున్నానని ఆమె వెల్లడించింది. 'డబ్ల్యూపీఎల్‌లో ప్లేయర్లకు ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుంది. ఆటలో స్వల్ప మార్పులు కూడా చేసుకోవచ్చు. వ్యక్తిగతంగా చూస్తే ఇన్నింగ్స్ ఎలా నిర్మించాలో నేర్చుకోగలిగాను. అనుభవజ్ఞులైన విదేశీ క్రికెటర్లతో కలిసి ఆడే అవకాశం రావడం ఎంతో మేలు చేస్తుంది. మైదానంలో కీలక సమయాల్లో, మైదానం బయట కూడా ప్రశాంతంగా ఎలా ఉండవచ్చో వారిని చూస్తే తెలుస్తుంది. తాజా సీజన్ కోసం మా జట్టు సన్నాహాలు చాలా బాగా సాగుతున్నాయి' అని షఫాలీ పేర్కొంది. డబ్ల్యూపీఎల్ రెండు సీజన్లలో కూడా ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ టైటిల్ సాధించడంలో మాత్రం విఫలమైంది.



విన్నర్స్ ట్రోఫీతో రషీద్ ఖాన్, మార్క్‌రమ్

'హ్యాట్రిక్' టైటిల్‌పై సన్‌రైజర్స్ గురి

- దక్షిణాఫ్రికా (ఎస్ఏ) టి20 లీగ్‌లో వరుసగా మూడోసారి ఫైనల్స్‌కు
- నేడు ఎంఐ కేప్‌టౌన్‌తో టైటిల్ పోరు
- రాత్రి 9 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–2, స్పోర్ట్స్ 18 చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సెంచూరియన్: భారత్‌కు చెందిన సన్‌రైజర్స్ యాజమాన్యంలోని ఈస్టర్న్ కేప్ జట్టు దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో 'హ్యాట్రిక్' టైటిల్‌పై కన్నేసింది. 'ఎస్ఏ20' పేరిట జరుగుతున్న ఈ టోర్నీలో రెండుసార్లు చాంపియన్ అయిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్ వరుసగా మూడోసారి ఫైనల్స్‌కు అర్హత పొందింది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ 8 వికెట్ల తేడాతో పార్ల్ రాయల్స్‌పై జయభేరి మోగించింది. 2023, 2024 సీజన్లలో సన్‌రైజర్స్ జట్టే టైటిల్స్‌ను గెలుచుకుంది. రెండో క్వాలిఫయర్‌లో మొదట రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. రూబిన్ హెర్మన్ (53 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రిటోరియస్ (41 బంతుల్లో 59; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సన్‌రైజర్స్ బౌలర్లు క్రెయిగ్ ఓవర్టన్, జాన్సెన్, ఒటేనీల్, మార్క్‌రమ్ తలా ఒక వికెట్ తీశారు. తర్వాత సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ 19.2 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది. టోని డి జోర్జి (49 బంతుల్లో 78; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్మాన్ (48 బంతుల్లో 69 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 111 పరుగులు జోడించి జట్టును సులువుగా లక్ష్యానికి చేర్చారు. ఎలిమినేటర్ మ్యాచ్ లో జొబర్గ్ సూపర్‌కింగ్స్‌ను ఓడించిన 24 గంటలకే మరో ప్లేఆఫ్స్ మ్యాచ్ ఆడిన సన్‌రైజర్స్ నెగ్గి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. నేడు జరిగే ఫైనల్లో భారత్‌కు చెందిన ముంబై ఇండియన్స్ యాజమాన్యంలోని ఎంఐ కేప్‌టౌన్‌తో తలపడుతుంది. తొలి క్వాలిఫయర్‌లో అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నేతృత్వంలోని కేప్‌టౌన్ జట్టు 39 పరుగుల తేడాతో పార్ల్ రాయల్స్‌పై గెలిచింది.

నేటి నుంచి పాక్‌లో ముక్కోణపు టోర్నీ

తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో పాకిస్తాన్ పోరు
మధ్యాహ్నం గం. 2:30 నుంచి ఫ్యాన్ కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



విన్నర్స్ ట్రోఫీతో సాంట్నర్, బవుమా, రిజ్వాన్

లాహోర్: పాకిస్తాన్‌లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత క్రికెట్ పండగ జరగబోతోంది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం నవీకరించిన స్టేడియాల సామర్థ్యం, ఆ టోర్నీకి ముందు సిద్ధమైన మూడు మేటి జట్ల సత్తా ఏంటో పరీక్షించుకునేందుకు సన్నాహక ముక్కోణపు టోర్నీ నేటి నుంచి జరుగుతుంది. లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికలపై ఆతిథ్య పాక్ సహా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లు ఈ ముక్కోణపు సిరీస్‌లో తలపడనున్నాయి. ఇందులో భాగంగా శనివారం పాకిస్తాన్, న్యూజిలాండ్‌ల మధ్య లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో తొలి పోరు జరగనుంది. 35 వేల సీట్ల సామర్థ్యం గల ఈ స్టేడియాన్ని ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నవీకరించింది. వందల సంఖ్యలో రోజుల తరబడి కార్మికులు శ్రమించి నిర్ణీత సమయానికల్లా మైదానాలకు అందుబాటులోకి తెచ్చారని పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మోసిన్ నఖ్వీ కితాబిచ్చారు. ఇటు ఆతిథ్య దేశంతో పాటు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలు మెగా ఈవెంట్‌కు సరైన సన్నాహక టోర్నీగా ఈ ముక్కోణపు టోర్నీ మ్యాచ్‌ల్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నాయి. తద్వారా స్థానిక పరిస్థితులకు అలవాటు పడటంతో పాటు ఐసీసీ మెగా టోర్నీకి వేదికలైన స్టేడియాల పిచ్‌పై కూడా అవగాహన పెంచుకోవచ్చని కివీస్, సఫారీలు భావిస్తున్నాయి. ఇరుజట్లలోని ఆటగాళ్లలో కొందరు మినహా దాదాపు మెగా ఈవెంట్‌లో పాల్గొనే క్రికెటర్లతోనే ఈ టోర్నీ ఆడేందుకు వచ్చాయి. ఫిబ్రవరి 14న కరాచీలో జరిగే ఫైనల్స్‌తో ఈ ముక్కోణపు టోర్నీ ముగుస్తుంది. తర్వాత ఐదు రోజుల వ్యవధిలోనే 19న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మొదలవుతుంది.



యూరప్ సంఘీభావ కేంద్రంలో కార్డ్ బోర్డుల సాయంతో 'సాలిడారిటీ' అక్షరాకృతిలో తీర్చిదిద్దిన కుడ్యచిత్రం వద్ద యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్, పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్



కేరళలో ఎర్నాకులం శివాలయంలో శుక్రవారం శివేలీ ఉత్సవంలో భాగంగా బారులు తీరిన ఏనుగులు

వలసదారుల విమానాల ఖర్చు మిలియన్ డాలర్లు!

వాషింగ్టన్: అధికారంలోకి వస్తే అమెరికా చరిత్రలోనే లేనంతటి భారీ ఆపరేషన్‌తో వలసదారులను వెనక్కి పంపిస్తామంటూ ఇచ్చిన హామీ అమలుకు ట్రంప్ సర్కారుకు భారీగానే చేతి చమురు వదులుతోంది. ఈ నెల 5న అమెరికా నుంచి అమృత్‌సర్‌కు 104 మంది అక్రమ వలసదారులతో చేరుకున్న అమెరికా వైమానిక దళ భారీ విమానం సీ-17ఏ గ్లోబ్‌మాస్టర్ 3 ప్రయాణ ఖర్చు చూస్తే ఎవరైనా నోరు వెళ్లబెట్టాల్సిందే. అమెరికా తమ దేశంలోని వలసదారులను సైనిక విమానంలో పంపడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) విభాగం అంచనాల ప్రకారం..వలసదారుల కోసం వాడే చార్టర్ విమానం ప్రతి గంట ప్రయాణానికి 8,577 డాలర్ల ఖర్చవుతుంది. ప్రమాదకరమైన వలసదారుల కోసమైతే ఈ ఖర్చు మరికాస్త ఎక్కువగానే ఉంటుంది. అయితే, బలగాలు, వాహనాలు, ఇతర సరఫరాల రవాణా కోసం గ్లోబ్ మాస్టర్‌ను 1995 నుంచి అమెరికా ఎయిర్ ఫోర్స్ వినియోగిస్తోంది. ఈ భారీ విమానం ఖర్చు ఏకంగా గంటకు 28,562 డాలర్ల వరకు ఉంటుందని అమెరికా ఎయిర్ మొబిలిటీ కమాండ్ గణాంకాలు చెబుతున్నాయి. సాధారణ చార్టర్ విమానం ఖర్చుకు ఇది మూడు రెట్లు ఎక్కువ. ఎందుకంటే, ఇతర విమానాల మాదిరిగా కాకుండా ఇంధన కోసం మిలటరీ ఎయిర్ బేస్‌ల వద్దే ల్యాండవుతుంది. సైనిక విమానం అయినందున ప్రయాణం కూడా ఇతర దేశాల గగనతలంలో చేసే ప్రయాణంతో పోలిస్తే వేరుగా ఉంటుంది. ఫ్లైట్‌రాడార్ 24 రికార్డు ప్రకారం ఈ విమానం సోమవారం కాలిఫోర్నియాలోని శాన్‌డియాగో మెరైన్ కార్ప్స్ ఎయిర్ స్టేషన్ నుంచి బయలుదేరింది. హవాయికి వెళ్లి పసిఫిక్ మహా సముద్రం మీదుగా ఫిలిప్పీన్స్ పమీపంలోని లుజాన్‌కు చేరుకుంది. అటు నుంచి ఇండోనేసియా, మలేసియాల మీదుగా హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా ఎయిర్ బేస్‌కు చేరుకుంది. అటు నుంచి ఇండియాలో ప్రవేశించింది. మొత్తంగా 43 గంటల ప్రయాణానికి గాను కనీసం 10 లక్షల డాలర్లు అంటే సుమారు రూ.8.78 కోట్ల వరకు ఖర్చయినట్లు లెక్కలేస్తున్నారు. అంటే ఒక్కో వలసదారుడికి 10వేల డాలర్ల వరకు అంటే రూ.8.78 లక్షల సొమ్మును ట్రంప్ ప్రభుత్వం వెచ్చించినట్లవుతోంది. సాధారణ ఎయిర్‌లైన్స్ విమానంలో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి న్యూఢిల్లీ టిక్కెట్ ఖరీదు కనిష్ఠంగా వెయ్యి డాలర్లు, బిజినెస్ క్లాస్‌కైతే నాలుగు వేల డాలర్లు కావడం విశేషం.

యాక్సియోమ్-4 మిషన్ వాయిదా?

- ఇంకా సిద్ధం కాని స్పేస్‌ఎక్స్ 'డ్రాగన్'స్పేస్‌క్రాఫ్ట్
- సునీతా విలియమ్స్, విల్మోర్ ఆగమనం మరింత ఆలస్యమయ్యే అవకాశం

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమిపైకి తిరిగి రావడం మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఫిబ్రవరిలోనే వారిని వెనక్కి తీసుకురావాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా', స్పేస్ ఎక్స్ సంస్థ తొలుత నిర్ణయించాయి. సాంకేతిక కారణాలతో మార్చి నెలకు వాయిదా వేశాయి. అది కూడా సాధ్యమయ్యే అవకాశం లేదని సైంటిస్టులు అంటున్నారు. ఐఎస్ఎస్ నుంచి ఇద్దరు వ్యోమగాములను రప్పించడానికి స్పేస్‌ఎక్స్ సిద్ధం చేస్తున్న నూతన అంతరిక్ష వాహనం 'డ్రాగన్'లో తలెత్తిన సాంకేతిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. బ్యాటరీల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఎప్పటిలోగా సరి చేస్తారన్న ఎవరూ చెప్పలేకపోతున్నారు. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ సిద్ధమైతే తప్ప సునీతా విలియమ్స్, విల్మోర్ వెనక్కి రాలేరు. ఏప్రిల్ నాటికి కూడా డ్రాగన్ అందుబాటులోకి రావడం అనుమానమేనని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, సునీతా విలియమ్స్, విల్మోర్ రాక ఆలస్యమవుతుండడం మరో కీలక ప్రయోగంపై ప్రభావం చూపుతోంది. యాక్సియోమ్-4 మిషన్‌లో భాగంగా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోనే భారత గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సహా మరో ముగ్గురు ప్రైవేట్ వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు చేరుకోవాల్సి ఉంది. ఏప్రిల్‌లో ఈ ప్రయోగం చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించారు. డ్రాగన్‌లో సునీతా విలియమ్స్, విల్మోర్‌ను వెనక్కి వస్తేనే ఈ నలుగురు ఐఎస్ఎస్‌కు చేరుకోగలుగుతారు. లేకపోతే ప్రయోగం వాయిదా వేయక తప్పదు. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే మార్చి 19లోగా ఇద్దరు వ్యోమగాములు వెనక్కి వచ్చేస్తారు. అప్పుడు యాక్సియోమ్-4 మిషన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సునీతా విలియమ్స్, విల్మోర్ గత ఏడాది జూన్‌లో బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం వారం రోజుల్లో భూమిపైకి తిరిగిరావాలి. స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో అది సాధ్యం కాలేదు. వారిద్దరూ అక్కడే ఉండిపోయారు. వారి ఆరోగ్యం బాగుందని, ఎలాంటి సమస్యలు లేవని నాసా అధికారులు ప్రకటించారు.

ఐవీఎఫ్ ద్వారా కంగారూ పిండాల సృష్టి

ఈ ఘనత ప్రపంచంలోనే తొలిసారి

న్యూఢిల్లీ: నానాటికీ అంతరించిపోతున్న అరుదైన కంగారూ జంతువులను పరిరక్షించడంలో భాగంగా సైంటిస్టులు మరో ముందడుగు వేశారు. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) ద్వారా కంగారూ పిండాలను విజయవంతంగా సృష్టించారు. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్ శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. ఐవీఎఫ్ ద్వారా ల్యాబ్‌లో కంగారూ పిండాలను సృష్టించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఈ వివరాలను రీప్రొడక్టివ్, ఫెర్టిలిటీ, డెవలప్‌మెంట్ జర్నల్‌లో ప్రచురించారు. కంగారూలతోపాటు కోలాలు, టాస్మానియన్ డెవిల్స్ వంటి జంతువులు అంతరించిపోకుండా పరిరక్షించాలన్నదే తమ లక్ష్యమని సైంటిస్టు, సీనియర్ యానిమల్ సైన్స్ లెక్చరర్ ఆండ్రెస్ గాంబినీ చెప్పారు. అరుదైన జంతువులను పరిరక్షించే విధానాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వాటి జన్యు పదార్థాలను నిలువ చేసి, అవసరమైన సమయంలో కొత్త జంతువులను సృష్టించవచ్చని అన్నారు. ఐవీఎఫ్ ప్రక్రియ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఎన్నో రకాల జీవులు దీనిద్వారా జన్మించాయి. జర్మనీలో గత ఏడాది ఐవీఎఫ్ ద్వారా ల్యాబ్‌లో సృష్టించిన ఖడ్గమృగం పిండాన్ని మరో ఆడ ఖడ్గమృగం గర్భంలో ప్రవేశపెట్టారు. దాంతో ఖడ్గమృగం జన్మించింది. మగ జంతువు నుంచి సేకరించిన శుక్రకణాలను, ఆడ జంతువు నుంచి సేకరించిన అండాలను కలిపి ల్యాబ్‌లో ఫలదీకరించడమే ఐవీఎఫ్ విధానం. కంగారూ పిండాల సృష్టిలో ఈ విధానం చక్కగా పనికొచ్చిందని శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తంచేశారు.

డోజ్‌పై 13 రాష్ట్రాల దావా

ప్రభుత్వ పేమెంట్ డేటా యాక్సెస్ పట్ల ఆందోళనలు

- మస్క్ అధికారంపై డెమొక్రాట్లు, యూనియన్ల ఆందోళన

వాషింగ్టన్: ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)కు ప్రభుత్వ చెల్లింపుల వ్యవస్థ యాక్సెస్‌ను వ్యతిరేకిస్తూ అమెరికాలో పలు రాష్ట్రాల్లో కదలిక మొదలైంది. డోజ్‌కు యాక్సెస్‌ను అడ్డుకునేందుకు దావా వేస్తామని 13 రాష్ట్రాల డెమొక్రటిక్ అటార్నీ జనరల్స్ గురువారం ప్రకటించారు. ''మన రాజ్యాంగాన్ని, గోప్యతా హక్కులను, దేశవ్యాప్తంగా వివిధ సమాజాల సంక్షేమ నిధులను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం''అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన మస్క్‌కు నో చెప్పడం అలవాటు లేకపోవచ్చు. కానీ అమెరికాలో చట్టానికి ఎవరూ అతీతులు కారు''అన్నారు. వ్యక్తుల సమాచారాన్ని తనకు నచ్చిన వారికి ఇచ్చే అధికారం అధ్యక్షుడికి లేదని, కాంగ్రెస్ ఆమోదించిన ఫెడరల్ చెల్లింపులకు ఆయన కోత విధించలేరని స్పష్టం చేశారు. ఎప్పుడు దావా వేస్తారనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ పరిణామంపై వైట్‌హౌస్ స్పందించలేదు.

ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో సున్నితమైన చెల్లింపు డేటాకు డోజ్‌కు అనుమతి లభించడం, దానిపై అధికారులతో పాటు కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతుండటం తెలిసిందే. ఫెడరల్ ప్రభుత్వ చెల్లింపు వ్యవస్థలో డోజ్ ప్రమేయంపై అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనధికారిక వ్యక్తులకు ఈ స్థాయి యాక్సెస్ చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యమూ కాదని డెమొక్రటిక్ అటార్నీ జనరల్స్ అంటున్నారు. మిలియన్ల మంది అమెరికన్ల నుంచి అందే చెల్లింపులను అడ్డుకోవడానికే ఈ చర్యలని మండిపడ్డారు. ఇది భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని, సామాజిక భద్రత, మెడికేర్ వంటి సంక్షేమ కార్యక్రమాలకు గండికొట్టే ప్రమాదముందని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే కోర్టుకు వెళ్లగా మస్క్‌తో సహా మరెవరికీ అనుమతివ్వడానికి వీల్లేదని ఫెడరల్ జడ్జి ఆదేశించారు. డోజ్‌కు రీడ్ ఓన్లీ యాక్సెస్ మాత్రమే ఇచ్చామని ట్రెజరీ విభాగం తెలిపింది. డోజ్‌పై విమర్శలను మస్క్ ఖండించారు. పన్ను చెల్లింపుదారులకు డోజ్ మిలియన్ల డాలర్లు ఆదా చేస్తోందని చెప్పారు.

ఒత్తిళ్లకు లోనుకాకుండా పరీక్షలు రాయాలి

ప్రశాంత చిత్తంతో సిద్ధం కావాలి

- విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ: విద్యార్థులు ప్రశాంత చిత్తంతో పరీక్షలకు సిద్ధం కావాలని, ఆందోళన అవసరం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా పరీక్షలు రాయాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని సుందర్ నర్సరీలో విద్యార్థులతో సమావేశమయ్యారు. వారితో ముఖాముఖి సంభాషించారు. కేరళ, పంజాబ్, బిహార్, త్రిపుర సహా పలు రాష్ట్రాల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు సంబంధించిన అంశాలపై మోదీ చర్చించారు. ఎనిమిదో ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' త్వరలో జరుగనున్న నేపథ్యంలో దానికి సన్నాహకంగా మోదీ ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. చిన్నప్పుడు తనకు ఎదురైన అనుభవాన్ని ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. స్కూల్‌లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు తన చేతిరాతను మెరుగుపర్చేందుకు చాలా ప్రయత్నించారని తెలిపారు. ఉపాధ్యాయుల చేతిరాత మరింత మెరుగుపడింది తప్ప తన చేతిరాతలో ఎలాంటి మార్పు రాలేదని నవ్వుతూ చెప్పారు. ఏడాది పరీక్షా పే చర్చ ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని భారత మండపంలో జరుగనుంది. ఈ కార్యక్రమానికి దీపికా పదుకోన్, మేరీ కోమ్, అవనీ లేఖరా, సోనాలీ సభర్వాల్, భూమి పడ్నేకర్ తదితర ప్రముఖులు హాజరు కాబోతున్నారు.

అది నివారించదగిన చర్య

వలసదారులకు సంకెళ్లపై విదేశాంగ శాఖ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన అక్రమ వలసదారులకు సంకెళ్లు వేసి స్వదేశానికి పంపించడంపై కేంద్రం ఆందోళన వెలిబుచ్చింది. ఇది నివారించదగిన చర్యగా పేర్కొంది. అమెరికా మిలటరీ విమానంలో 40 గంటల ప్రయాణంలో భారత అక్రమ వలసదారులను సంకెళ్లు వేసి ఉండటంపై విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పందించారు. ఇది నివారించదగిన చర్యగా పేర్కొంటూ అమెరికాకు ఆందోళన తెలుపుతామన్నారు. ఇకపై ఇలాంటివి జరిగితే వెంటనే అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. భారత పౌరులుగా భావిస్తున్న మరో 487 మందిని వెనక్కి పంపనున్నట్లు అమెరికా అధికారులు సమాచారం అందించారన్నారు. వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని చెప్పారు. వీరిలో 298 మందికి సంబంధించిన సమాచారాన్ని మాత్రమే అందజేశారని మిస్రీ వివరించారు. అమెరికా నుంచి అందిన సమాచారాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే విధానాన్ని అమెరికా 2012 నుంచి అమలు చేస్తోందని గుర్తు చేశారు. దీనిపై ఇప్పటి వరకు ఎన్నడూ నిరసన తెలపలేదని ఆయన వివరించారు. అయితే, గతంలో ఘటనలతో పోలిస్తే రెండు రోజుల క్రితం అమెరికా నుంచి అమృత్‌సర్‌కు వలసదారులతో చేరుకున్న గ్లోబ్ మాస్టర్ రవాణా విమానం ఉదంతం వేరని ఆయన వివరించారు. అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా పేర్కొంటూ 104 మంది అక్రమ వలసదారులను ప్రత్యేకంగా సైనిక విమానంలో సంకెళ్లు వేసి పంపించిందని మిస్రీ చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని అమెరికా అధికారులను కోరామన్నారు. వెనక్కి పంపుతున్న వలసదారుల్లో అనేక రకాలైన వారు ఉన్నారని చెప్పారు. ఈ విషయంలో అమెరికా అధికారులతో ఎలాంటి దాపరికానికి తావులేకుండా చర్చలు జరుపుతున్నామన్నారు.

విదేశీ జైళ్లలో మన వాళ్లు 10,152 మంది

న్యూఢిల్లీ: విదేశాల్లోని జైళ్లలో 10,152 మంది భారతీయులు ఉన్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. వీరిలో విచారణ ఖైదీలు, దోషులుగా నిర్ధారణమైన వారు ఉన్నారని వివరించింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. వీరంతా అమెరికా, రష్యా, చైనా, అర్జెంటీనా, శ్రీలంక, సౌదీ అరేబియా, కువాయిట్, యూఏఈ, ఖతార్, నేపాల్, పాకిస్తాన్ తదితర 86 దేశాల్లో ఉన్నారన్నారు. సౌదీ అరేబియాలో 2,633 మంది, యూఏఈలో 2,518 మంది, నేపాల్‌లో 1,317 మంది, శ్రీలంకలో 98 మంది, పాకిస్తాన్‌లో 266 మంది భారతీయ ఖైదీలు ఉన్నట్లు తమకు సమాచారముందన్నారు. ఖతార్‌లో 611 మంది భారతీయ ఖైదీల్లో అత్యధికులు కేరళీయులున్నారని చెప్పారు. భారతీయులెవరైనా అరెస్టయితే సంబంధిత దేశంలోని మన కాన్సులేట్లకు సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. బాధితులు, వారి కుటుంబాలకు సాధ్యమైనంత మేర సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటారని వివరించారు. భారతీయ ఖైదీల హక్కుల పరిరక్షణ విషయంలో శ్రద్ధ తీసుకుంటారన్నారు.

నాన్సీపై సైకత్ పోటీ

డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీ రేసులో భారత సంతతి యువనేత



నాన్సీ పెలోసీ



సైకత్ చక్రవర్తి

వాషింగ్టన్: అమెరికా హౌస్ మాజీ స్పీకర్, 21వసారి కాంగ్రెస్‌కు పోటీ పడుతున్న నాన్సీ పెలోసీ(85)కి భారత సంతతికి చెందిన యువ రాజకీయ నేత నుంచి అనూహ్యంగా గట్టి పోటీ ఎదురవనుంది. శాన్‌ఫ్రాన్సిస్కో కంగ్రెషనల్ స్థానానికి డెమొక్రాటిక్ పార్టీ తరఫున పెలోసీపై పోటీ చేయనున్నట్లు సైకత్ చక్రవర్తి ప్రకటించారు. పురుషాధిక్యత కలిగిన అమెరికా రాజకీయాల్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా తిరుగులేని నాయకురాలిగా పెలోసీ కొనసాగుతున్నారు. 2026 నవంబర్‌లో జరిగే ఎన్నికకు మళ్లీ ఎన్నికయ్యేందుకు ఆమె ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఆమె ఈ విషయాన్ని బహిరంగంగా ప్రకటించలేదు. ప్రతినిధుల సభలో సభ్యురాలిగా 2027 జనవరి వరకు పెలోసీ కొనసాగుతారు. ఈ పదవికి 2026 నవంబర్‌లో ఎన్నిక జరగనుంది. అదే సమయంలో డెమొక్రాటిక్ ప్రైమరీకి 2026 ఆరంభంలో ఎన్నిక నిర్వహిస్తారు.

శాన్‌ఫ్రాన్సిస్కో డెమొక్రాట్లకు కంచుకోట వంటిది. ప్రైమరీలో గెలుపొందిన వారే భవిష్యత్తులో ప్రతినిధుల సభకు ఎన్నికయ్యే అవకాశాలెక్కువ. 'నాన్సీ పెలోసీ మరోసారి పోటీ చేయనున్నారని తెలిస్తే చాలా మంది ఆశ్చర్యపోవడం ఖాయం. కానీ, ఇది ఆమెకు 21వ సారి. 45 ఏళ్ల క్రితం ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి అమెరికాకు ఇప్పటికి ఎంతో తేడా ఉంది. డెమొక్రాటిక్ పార్టీ కొత్త నాయకత్వాన్ని కోరుకుంటోందన్నది సుస్పష్టం. అధ్యక్షుడు ట్రంప్, ఎలాన్ మస్క్‌ల పాలన చూసి ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారు. అందుకే నాన్సీ పెలోసీపై ఈసారి బరిలోకి దిగాలనుకుంటున్నా'అని సైకత్ గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెద్దపెద్ద దాతలిచ్చే విరాళాల కంటే ఓటర్లతో మమేకం అయ్యేందుకు కృషి చేస్తానన్నారు.

ఎవరీ సైకత్ చక్రవర్తి?

1986లో టెక్సాస్‌లో బెంగాలీ కుటుంబంలో జన్మించిన సైకత్ హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి 2007లో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా సిలికాన్ వ్యాలీలో కొంతకాలం పనిచేశారు. 2015లో సెనేటర్ బెర్నీ శాండర్స్ అధ్యక్ష ప్రచార కమిటీలో సేవలందించారు. దీంతోపాటు రాజకీయ సలహాదారుగా డెమొక్రాటిక్ పార్టీకి చెందిన అలెగ్జాండ్రియా ఒకాసియో-కార్టెజ్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా గతంలో వ్యవహరించారు. 2018లో కాంగ్రెస్‌కు పిన్న వయస్సులోనే గెలిచిన మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె గెలుపులో సైకత్ కీలకంగా ఉన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి నాలుగు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నాన్సీ వయోభారంతోపాటు ఆరోగ్య సమస్యలు వెన్నాడుతున్నాయి. ఈ నేపథ్యంలో యువ రాజకీయ కెరటం సైకత్ రంగ ప్రవేశం నాన్సీ పెలోసీపై ఒత్తిడి పెంచనుంది.అమెరికా చరిత్రలోనే హౌస్ స్పీకర్‌గా ఎన్నికైన తొలి మహిళ నాన్సీ పెలోసీ. కాంగ్రెస్ ప్రతినిధిగా సుదీర్ఘకాలంలో ఎందరో అధ్యక్షులు తీసుకువచ్చిన చట్టాలకు మద్దతివ్వడం లేదా తిరస్కరించడంలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షుల తర్వాత మూడో శక్తివంతమైన పదవి హౌస్ స్పీకర్.



కుప్పకూలిన విమానం తాలూకు శకలాలు

రోడ్డుపై కూలిన బుల్లి విమానం

బ్రెజిల్‌లో ఘటన, ఇద్దరి మృతి

సావో పావ్‌లో: బ్రెజిల్‌లో ఓ బుల్లి విమానం ఒకటి అదుపు తప్పి నడిరోడ్డుపై కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్, విమాన యజమాని మరణించారు. శుక్రవారం సావో పావ్‌లో నగరంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రైవేట్ విమానాశ్రయం నుంచి టేకాఫైన కాసేపటికే విమానం నగరంలోని జనసమ్మర్ధ ప్రాంతమైన బుర్రా ఫండా వద్ద రోడ్డుపైకి దూసుకొచ్చి కూలిపోయింది. మంటల్లో కాలుతూ నాలుగు రోడ్ల కూడలి గుండా దూసుకెళ్లింది. కూడలికి అటువైపు భారీ సంఖ్యలో బారులు తీరిన కార్లు, ఇతర వాహనాలకు పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. విమానం విడిభాగాలు రోడ్డుపై బస్సు, మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టాయి. దాంతో నలుగురు గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. విమానంలో ఇద్దరే ఉన్నట్టు అధికారులు తెలిపారు.

ఎఫ్‌బీఐ చీఫ్‌గా పటేల్ ఆమోదం జాప్యం

నామినేషన్ ఓటింగ్‌ను వాయిదా వేసిన డెమొక్రాట్లు

తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పటేల్‌పై ఆరోపణలు

వాషింగ్టన్: అమెరికా అత్యున్నత స్థాయి దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ చీఫ్‌గా కాశ్ పటేల్ నామినేషన్‌ను ఆమోదించే ప్రక్రియపై ఓటింగ్ వాయిదా పడింది. ఓటింగ్‌లో వారం రోజుల జాప్యాన్ని అనుమతించే నిబంధనను విపక్ష డెమొక్రటిక్ పార్టీ సద్వినియోగం చేసుకుంది. నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును నిరసించే 'శత్రువుల జాబితా'పై వివాదం నేపథ్యంలో డెమొక్రాట్లు ఈ కీలక ఓటింగ్‌ను ఆలస్యం చేశారు. పటేల్‌ను రెండోసారి విచారించాలని డిమాండ్ చేశారు. అది వచ్చే గురువారం జరిగే అవకాశముంది.

తొలి నుంచీ...

పటేల్ నామినేషన్ మొదటినుంచీ రాజకీయంగా చర్చనీయంగా మారింది. అనుభవ లేమి, స్వభావం తదితర కారణాలతో ఈ పదవికి ఆయన అనర్హుడంటూ డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుట్ర సిద్ధాంతాలతో ఆయన అనుబంధం, రాజకీయ శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటామంటూ గతంలో ఆయన చేసిన ప్రకటనలు, చర్యలను తమ వ్యతిరేకతకు కారణాలుగా పేర్కొన్నారు. ''పటేల్ వాంగ్మూలంలో అసంబద్ధతలు, అసత్యాలున్నాయి. వాటిపై మరింత వివరణ కావాలి. ట్రంప్ ఎఫ్‌బీఐ ప్రతీకార ప్రణాళికల గురించిన సమాచారాన్ని దాచిపెట్టారు. ఈ చర్యల వెనక రాజకీయ ప్రతీకారం దాగుంది. పటేల్‌ను ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది''అని డెమొక్రాట్ సెనేటర్లు ఆరోపిస్తున్నారు. ''పటేల్ అమెరికన్ల ప్రయోజనాల పరిరక్షణకు పాటుపడతారా? లేక ట్రంప్ ప్రయోజనాల కోసం పని చేస్తారా?''అని ప్రశ్నిస్తున్నారు. పలు ఉన్నత పదవులకు ట్రంప్ ఎంపిక చేసుకున్న నేతలపై ఆరోపణలు వెల్లువెత్తుతుండటం తెలిసిందే.

బెంగళూరులో 'లక్కీ భాస్కర్' గ్యాంగ్

బెంగళూరు: లక్కీ భాస్కర్ సినిమా ప్రేరణతో ఏటీఎం దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను బెంగళూరు పోలీసులు పట్టుకున్నారు. ముఠా సభ్యులందరూ సెక్యూర్ వాల్యూ ప్రైవేట్ లిమిటెడ్ అనే క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన వారే కావడం విశేషం. ఏటీఎంలలో పెట్టాల్సిన డబ్బును వీరంతా పథకం ప్రకారం పక్కదారి పట్టిస్తున్నారు. బ్యాంకు అధికారుల అంతర్గత ఆడిటింగ్‌లో రూ.43.76 లక్షల సొమ్ము గల్లంతైనట్లు ఇటీవల తేలింది. దీనిపై వారు మహాలక్ష్మి లే అవుట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్యాష్ అధికారులు, ఏటీఎం మెయింటెనెన్స్ స్టాఫ్ సిబ్బంది తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు వీరిపై ఓ కన్నేసి ఉంచారు. శుక్రవారం నిఘా సమాచారంతో కెంపెగౌడ నగర్‌లోయీ ముఠా వెళ్తున్న ఓ కారును పోలీసులు అడ్డగించారు. పక్కదారి పట్టించిన రూ.52 లక్షల సొమ్ము ఆ కారులోనే ఉంది. అంతేకాదు, కొట్టేసిన సొమ్ముతో వీరు కొనుగోలు చేసిన రూ.40 లక్షల విలువైన మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. దుల్కర్ సల్మాన్ నటించిన మలయాళం సినిమా లక్కీ భాస్కర్‌లో హీరో ఓ బ్యాంకు ఉద్యోగి. కుటుంబ పోషణకు మరో దారిలేక ఆర్థిక నేరాలకు పాల్పడుతుంటాడు.

ఏ మతంలోని ప్రతి వ్యక్తిపై కర్మ సిద్ధాంత ప్రభావం ఉంటుంది?

మతం

మానవుడు తన పుట్టుక నుంచి మరణం వరకు ప్రకృతిలో సంభవించే వివిధ అంశాలు అగమ్యగోచర శక్తి ప్రభావాలే అని నమ్మాడు. తన ప్రశ్నలు, సందేహాలన్నింటికీ ఊహాత్మక భావనల మేరకు సమాధానం వెతుక్కున్నాడు. అంతిమంగా అవన్నీ 'మానవాతీత శక్తి సృష్టి' అనే భావనకు వచ్చాడు. సామాజిక మానవ శాస్త్రవేత్తలు ఈ మానవాతీత శక్తి (సూపర్ పవర్)నే అలౌకిక శక్తిగా విశ్లేషించారు. ఈ అలౌకిక శక్తుల మనుగడకు సంబంధించిన విశ్వాసమే మతంగా ఆవిర్భవించిందని చెప్పవచ్చు.

మతానికి సామాజిక శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలు

- మానవాతీత శక్తులపై ఉండే వైఖరులే మతం.
  – ఆగ్బర్న్
- మానవ జీవితం, స్వభావానికి మార్గం చూపి, వాటిని నియంత్రించే మానవాతీత శక్తులపై ఉన్న విశ్వాసమే మతం.
  – జేమ్స్ అండ్ ఫ్రేజర్
- మానవుడికి, మానవుడికి మధ్య ఉండే సంబంధమే కాకుండా అతీతమైన శక్తితో మానవుడికి ఉండే సంబంధాన్ని తెలియజేసేదే మతం.
  – మెకైవర్

మతం విశ్వజనీనమైంది. మతం లేని సమాజం లేదు. మానవాతీత శక్తుల్లో విశ్వాసం కలిగి ఉండటమే మతంలోని ప్రధానాంశం.

భారతదేశంలోని ప్రధాన మతాలు

1. హిందూ మతం 2. ఇస్లాం
3. క్రైస్తవం 4. సిక్కు మతం
5. బౌద్ధం 6. జైనం
7. జొరాస్ట్రియన్ (పార్శీ) మతం

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వివిధ మతాలవారు	
1. హిందువులు	79.8 శాతం
2. ముస్లింలు	14.2 శాతం
3. క్రైస్తవులు	2.3 శాతం
4. సిక్కులు	1.7 శాతం
5. బౌద్ధులు	0.7 శాతం
6. జైనులు	0.4 శాతం
7. ఇతరులు	0.7 శాతం

హిందూ మతం

'హిందూ' అనే పదం భారతదేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవహిస్తున్న 'సింధూ' నది పేరు నుంచి వచ్చిందని భావిస్తున్నారు. కాలక్రమంలో సింధూ అనేది 'హిందూ'గా మారింది. భారతదేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు సింధూనదిని 'ఇండస్' అని పిలిచారు. దీని ఆధారంగా భారతదేశానికి 'ఇండియా' అనే పేరు వచ్చింది. భారతీయులందరినీ 'హిందువులు'గా పిలిచారు.

హిందూ మతాన్ని ఒక మతం అని పిలవడం కంటే 'విశ్వాసాల సమ్మేళనం'గా పేర్కొనడం ఉత్తమం. పురాతన కాలం నుంచి భారతీయులకు అనేక విశ్వాసాలు ఉన్నాయి.

ఉదా: పితృదేవతలను పూజించడం, ప్రకృతి శక్తుల ఆరాధన (నదులు, చెట్లు), బహు దేవతారాధన, ఏకేశ్వర ఉపాసన.

ప్రాచీన కాలంలో భారతీయ నాగరిక ఆశయాల్లో అన్ని మానవ విశ్వాసాలు సమ్మిళితమయ్యాయని ఎస్.కె. బోస్ పేర్కొన్నారు. క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం మాదిరిగా హిందూ మతానికి ఒక ప్రారంభకుడు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

హిందూ మతానికి చెందిన వ్యక్తి జీవితమంతా మత విలువలపైనే ఆధారపడి ఉంది. మంచి కార్యాలు చేసినవారు మరణించిన తర్వాత ఉత్తమ జీవితాన్ని పొందుతారు, చెడ్డ పనులు చేసినవారు తర్వాతి జన్మలో అనేక బాధలు అనుభవిస్తారనే నమ్మకంపై హిందూ మత విలువలు ఆధారపడి ఉన్నాయి.

హిందూ మత మౌలిక ధార్మిక గ్రంథాలు రెండు రకాలు. **అవి: 1. శృతులు 2. స్మృతులు.**

1. శృతులు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం'గా పేర్కొంటారు. దీన్ని అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. వీటినే 'అపౌరుషేయాలు' అంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారని అర్థం.

2. స్మృతులు

వేదాంగాలు, పురాణాలు, ఉపవేదాలు, ఇతిహాసాలను 'స్మృతి సాహిత్యం' అంటారు. వీటిని జ్ఞాన సముపార్జులైన రుషులు రాశారు.

పైన పేర్కొన్న అంశాల ద్వారా హిందూ జీవన విధానాన్ని తెలుసుకోవచ్చు. కర్మ సిద్ధాంతం, వర్ణ వ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ, పురుషార్థాలు హిందువులు ఆచరించాల్సిన విధానాల గురించి వివరిస్తాయి.

కర్మ సిద్ధాంతం

హిందూ మతంలోని ప్రతి వ్యక్తిపై కర్మ సిద్ధాంతం ప్రభావం ఉంటుంది. వ్యక్తి చేసే పనులు, మంచి చెడుల ఆధారంగా ప్రస్తుత జీవితం, పునర్జన్మ ఉంటాయని కర్మ సిద్ధాంతం తెలుపుతుంది. 'ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఇది శాశ్వతమైంది. దీనికి పునర్జన్మ ఉంటుంది. ప్రస్తుత జీవితం గత జీవితంలో చేసిన మంచి – చెడుల ఫలితం' అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

వర్ణ వ్యవస్థ

ఇది అత్యంత కీలకమైంది. రుగ్వేదంలోని 10వ అధ్యాయంలో పురుషసూక్తం దీని గురించి తెలుపుతుంది. దీని ప్రకారం ఈ సృష్టికర్త బ్రహ్మ. ఆయన తన శరీరం నుంచి ఈ సృష్టిని వర్ణం ఆధారంగా 4 రకాలుగా సృష్టించారని పేర్కొన్నారు. దీన్నే 'దైవాంశ సంభూత సిద్ధాంతం' అంటారు. దీని ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాల వారిని దైవం (బ్రహ్మ) సృష్టించాడని భావించారు. వీరిలో మొదటి మూడు వర్ణాల వారిని 'ద్విజులు' అంటారు. వీరికి ఉపనయనం, క్రతువులు ఉంటాయి. గాయత్రి మంత్రం ఆచరించడానికి, ఉచ్ఛరించడానికి వీరికి అర్హత ఉంటుంది. కింది స్థాయిలోని శూద్రులకు ఇవేవి ఉండవు. ఈ వర్ణవ్యవస్థ నుంచి తదనంతర కాలంలో కులాలు, ఉపకులాలు, ఆవిర్భవించాయి. కానీ వీటికి, ప్రస్తుతం ఉన్న కులాలకు చాలా తారతమ్యం ఉంది.

ఆశ్రమ వ్యవస్థ

హిందూ సామాజిక వ్యవస్థలో ప్రతి వ్యక్తి అంతిమ లక్ష్యం 'మోక్షం' పొందడం. ప్రతి హిందువు నాలుగు దశల ద్వారా దీన్ని చేరాలి.

హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం ఆశ్రమం అంటే వ్యక్తి తన జీవిత కాలంలో చేసే ఒక్కో మజిలీ. ఒక వ్యక్తి తర్వాత దశ చేరుకోవడానికి అర్హత పొందే శిక్షణా దశలే ఆశ్రమాలు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త అల్టేకర్ ప్రకారం క్రీ.పూ. 100 నుంచే హిందువుల్లో ఆశ్రమ పద్ధతి అమల్లో ఉంది. నాలుగు రకాల ఆశ్రమాలు ఉన్నాయి. బ్రహ్మను చేరుకోవడానికి ఈ ఆశ్రమాలు నాలుగు మెట్లు కలిగిన నిచ్చెన లాంటివని భీష్ముడు పేర్కొన్నట్లు హిందువులు భావిస్తారు.

i) **బ్రహ్మచర్యాశ్రమం:** ఒక వ్యక్తి ఉపనయనం తర్వాత మొదటిదశ అయిన బ్రహ్మచర్యాశ్రమంలోకి చేరుకోవచ్చు. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటి జన్మ. ఈవిధంగా పుట్టిన వ్యక్తిని ఎలాంటి లక్ష్యం లేనివాడిగా భావిస్తారు. ఆ తర్వాత బ్రహ్మచర్యాశ్రమంలోకి ప్రవేశింపజేయడానికి ఒక ఉత్సవం నిర్వహిస్తారు. దీన్నే 'ఉపనయనం' అంటారు. అంటే 'మళ్లీ జన్మించినవాడు' అని అర్థం. ఉపనయనం జరిగిన వ్యక్తిని 'ద్విజుడు' అంటారు. మహిళలు, శూద్రులకు ఉపనయనం లేదు.

ఉపనయనంలో ఒక లక్ష్యంలేని, క్రమబద్ధం కాని జీవితాన్ని ఒక నిర్దిష్ట ఆశయం ఉన్న జీవితంగా మారుస్తారు. వర్ణాల ఆధారంగా ఉపనయనం అర్హత నిర్ధారిస్తారు. సాధారణంగా బ్రాహ్మణులకు 8, క్షత్రియులకు 10, వైశ్యులకు 12 ఏళ్ల వయసులో దీన్ని నిర్వహిస్తారు. అనివార్య పరిస్థితుల్లో ఇలా జరగకపోతే మరో నాలుగేళ్ల తర్వాత ఉపనయనం చేస్తారు. దీని తర్వాత సంబంధిత వ్యక్తి గాయత్రీ మంత్రం నేర్చుకోవడానికి అర్హత పొందుతాడు. వేదాంగాల్లో భాగమైన కల్పలోని గృహసూత్రంలో 11వ యాగం ఉపనయనం గురించి తెలియజేస్తుంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

వేదాంగాలు 6 రకాలు. అవి:

1. శిక్ష 2. నిరుక్త
3. వ్యాకరణం 4. జ్యోతిషం
5. ఛందస్సు 6. కల్ప

కల్ప 3 రకాలు

1. **గృహసూత్రం:** మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 యాగాల (షోడశ కర్మలు) గురించి తెలుపుతుంది. 11వ యాగం ఉపనయనం గురించి వివరిస్తుంది.
2. **శ్రౌతసూత్రం:** చక్రవర్తి ప్రజల కోసం నిర్వహించాల్సిన యాగాల గురించి తెలుపుతుంది.
3. **సుళువ సూత్రం:** హోమగుండాల నిర్మాణం గురించి తెలుపుతుంది.

ఉపనయనం తర్వాత బ్రహ్మచర్య ఆశ్రమం ప్రారంభమవుతుంది. ఈ ఆశ్రమంలో వ్యక్తి ఉపాధ్యాయుడి గృహంలో విద్యార్థిగా ప్రవేశిస్తాడు. గురువు అతడికి వెంటనే విద్య నేర్పటం ప్రారంభించడు. వ్యక్తి ముందుగా గురువు ఇంటి పనులు చేయాలి. గురువు అతడికి పశువులు కాయడం; వంట చెరకు తీసుకురావడం; క్రతువులకు ఏర్పాట్లు చేయడం; తనకు, తన గురువుకు భిక్షను యాచించడం లాంటి పనులు అప్పగిస్తాడు. ఈ సేవల ద్వారా సంతృప్తి పొందితే గురువు వెలుగును (విద్యా) వేదాధ్యయనం ద్వారా బోధించడం మొదలు పెడతాడు. 'విద్' అంటే వెలుగు. జ్ఞానమనే వెలుగులో అజ్ఞానాంధకారాన్ని పారదోలడానికి గురువు వారధి లాంటివారు.

సన్మార్గం కోసం హిందువులకు ఒక బాధ్యతగా వేదాధ్యయనం నేర్పిస్తారు. పుట్టిన ప్రతి వ్యక్తి 3 రుణాలను చెల్లించాలని హిందూ మతం చెబుతోంది. అవి..

ఎ. **రుషులకు రుణం చెల్లించడం:** వేదాలు వల్లె వేయడం ద్వారా గురువు కంటే ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించి గురువుతో ప్రశంసలు పొందేలా జ్ఞానాన్ని పొందడం. దీంతో రుషి రుణం తీరినట్లవుతుంది.

బి) **దైవ రుణం తీర్చడం:** యజ్ఞయాగాదుల ద్వారా ఈ రుణం తీర్చుకోవచ్చని హిందూ ధర్మగ్రంథాలు తెలుపుతున్నాయి.

సి) **పితృ (తల్లిదండ్రుల) రుణం:** జన్మ ఇచ్చిన తల్లిదండ్రులను గౌరవించడం, వృద్ధాప్యంలో వారికి సేవలందించడం ద్వారా వారికి మోక్ష ప్రాప్తి లభించేలా చూడాలి.

ii) **గృహస్థ ఆశ్రమం:** బ్రహ్మచర్యంలో సంపాదించిన జ్ఞానం ఆధారంగా స్వశక్తితో జీవించడం ప్రారంభించిన తర్వాత వివాహం ద్వారా గృహస్థాశ్రమ ప్రవేశం జరుగుతుంది. హిందువుల్లో వివాహానికి ధర్మ, ప్రజా, రతి అనే మూడు లక్షణాలు ఉన్నాయి.

ధర్మ: సాంఘిక, మతపరమైన బాధ్యతలను నిర్వర్తించడం.

ప్రజా: సంతానాన్ని పొందడం. పురుష సంతానం వాంఛితమైందిగా భావిస్తారు. అతడు తల్లిదండ్రులను పుత్ (నరకం)లో పడకుండా రక్షిస్తాడనే నమ్మకం ఉంది.

రతి: ఇది లైంగిక వాంఛలు, కోరికలను తృప్తి పరుస్తూ సంతానోత్పత్తికి అవసరమైంది.

ఈ మూడు లక్ష్యాలను వ్యక్తి గృహస్థ దశలో సాధిస్తాడు. మనుసంహిత ప్రకారం ఒక గృహస్థు రోజూ 'పంచ మహాయజ్ఞాలు' చేయాలి. అవి.. బ్రహ్మయజ్ఞం, పితృ యజ్ఞం, దైవ యజ్ఞం, భూత యజ్ఞం, నరయజ్ఞం.

బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు పోషణార్థం గృహస్థు ఆశ్రమంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల దీన్ని ఉన్నతమైందిగా భావిస్తారు.

వార్ధక్య ఛాయలు (ముఖంపై ముడతలు, జుట్టు నెరవటం) వచ్చిన తర్వాత లేదా కుమారులకు వివాహమైన అనంతరం గృహస్థు తన ఇంటిని కుమారులకు అప్పగించి భార్య సహాయంతో గృహస్థ ఆశ్రమాన్ని వదిలి వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించాల్సి ఉంటుంది.

iii) **వానప్రస్థ ఆశ్రమం:** ఇది గృహస్థ, సన్యాస ఆశ్రమాలకు వారధి లాంటిది. ఈ ఆశ్రమంలో ఒక వ్యక్తి వెంట భార్య వెళ్లవచ్చు. ఈ దశలోనూ 'పంచ మహాయజ్ఞాలు' నిర్వర్తిస్తారు. దీన్ని ప్రజా జీవనానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో గడపాలి. అందువల్ల అడవిలో ఆశ్రమం నిర్మించుకొని జీవిస్తారు. వ్యక్తి ప్రారంభంలో పచ్చి ఆకులు, వేర్ల సహాయంతో ఆకలి తీర్చుకోవాలి. ఆ తర్వాత నీరు, చివరకు గాలి మాత్రమే సేవించి ఆకలి తీర్చుకోవాలి.

శారీరక సుఖాలన్నింటిని వదిలేయాలి. ఈ దశలో అర్థకామాలు ఉండవు. వేదాలు, వేదాంగాలు, స్మృతుల పఠనం ద్వారా ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడానికి శరీరానికి క్రమశిక్షణ అలవాటు చేయాలి.


సన్యాస ఆశ్రమం స్వీకరించే ముందు భార్యను కుమారులతో కలిసి జీవించడానికి ప్రోత్సహించాలి. వ్యక్తి క్రమంగా తన అభిమానం, కుటుంబం, గ్రామం అనే సంకుచిత పరిధుల నుంచి బయటపడి విశ్వమానవాళిని ప్రేమించాలి. ఇవన్నీ సాధించిన తర్వాత సన్యాసి రూపంలో సంఘ ప్రవేశం చేయాలి.

iv) **సన్యాస ఆశ్రమం:** ఇది చివరి దశ. ఈ దశలో కఠినమైన జీవితాన్ని గడపాలి. ప్రాపంచిక విషయాల పట్ల అనాసక్తత ప్రదర్శించాలి. మోక్ష సాధనకు ప్రయత్నించాలి. భిక్షాటన ద్వారా మాత్రమే జీవించాలి. సన్యాసి తాను తిరుగాడే ప్రజల నుంచి గొప్ప గౌరవాన్ని పొందాలి. ఆ ప్రజల మనసులు, జీవితాలపై గొప్ప ప్రభావాన్ని చూపాలి. వ్యక్తిగత ఉదాహరణ ద్వారా, మతబోధ ద్వారా మార్గదర్శకంగా ఉండేలా సమాజానికి ప్రోత్సాహం కల్పించాలి. అంటే సన్యాసి ఒక మహత్తర సాంఘిక పాత్రను నిర్వహిస్తాడు.

మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?

మాదిరి ప్రశ్నలు

1. భారత్‌తో అత్యధిక భూసరిహద్దును పంచుకుంటున్న దేశం ఏది?
   1) చైనా 2) నేపాల్
   3) పాకిస్తాన్ 4) బంగ్లాదేశ్
2. కర్కాటక రేఖ (23½° ఉత్తర అక్షాంశం) కింద పేర్కొన్న ఏ రాష్ట్రం ద్వారా వెళ్లదు?
   1) మిజోరాం 2) త్రిపుర
   3) మేఘాలయ 4) జార్ఖండ్
3. సింధూనదిని 'ఇండస్' అని ఎవరు పిలిచారు?
   1) పర్షియన్లు 2) గ్రీకులు
   3) డచ్‌వారు 4) ఫ్రెంచ్‌వారు
4. భారతదేశ ఉత్తర, దక్షిణ చివరల మధ్య దూరం ఎంత?
   1) 3,214 కి.మీ. 2) 2,933 కి.మీ.
   3) 1,324 కి.మీ. 4) 3,514 కి.మీ.
5. 82½° తూర్పు రేఖాంశం ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతోంది?
   1) 6 2) 7 3) 8 4) 5
6. రాడ్‌క్లిఫ్ రేఖ ఏ దేశాల మధ్య సరిహద్దుగా ఉంది?
   1) భారత్ – పాకిస్తాన్
   2) భారత్ – చైనా
   3) భారత్ – మయన్మార్
   4) భారత్ – బంగ్లాదేశ్
7. పాంబన్ దీవి వేటి మధ్య ఉంది?
   1) భారత్ – శ్రీలంక
   2) భారత్ – మాల్దీవులు
   3) భారత్ – ఇండోనేషియా
   4) భారత్ – మారిషస్
8. కింద పేర్కొన్న ఏ రాష్ట్రాలకు తీరరేఖ, విదేశాలతో భూ సరిహద్దు ఉన్నాయి?
   1) గుజరాత్, మహారాష్ట్ర
   2) గుజరాత్, పశ్చిమబెంగాల్
   3) పశ్చిమబెంగాల్, త్రిపుర
   4) పశ్చిమబెంగాల్, తమిళనాడు
9. లక్షదీవుల రాజధాని ఏది?
   1) సిల్వస్సా 2) పోర్ట్‌బ్లెయిర్
   3) కవరత్తి 4) పాండిచ్చేరి
10. మలబార్ తీరం ఏ రాష్ట్రానికి ఉంది?
    1) గోవా 2) మహారాష్ట్ర
    3) కేరళ 4) ఒడిశా
11. 'డంకన్ పాస్' వేటి మధ్య ఉంది?
    1) ఉత్తర అండమాన్, తూర్పు అండమాన్
    2) అండమాన్, నికోబార్ దీవులు
    3) ఉత్తర అండమాన్, దక్షిణ అండమాన్
    4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్



12. భారతదేశంలోని మొత్తం దీవుల (Distant Islands) సంఖ్య?
    1) 240 2) 247 3) 204 4) 194
13. ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
    1) జోంగ్‌మా 2) కోమలాంగిని
    3) సాగరమాత 4) చోగోరీ
14. మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
    1) ఉత్తరాఖండ్ 2) నాగాలాండ్
    3) అరుణాచల్ ప్రదేశ్ 4) బీహార్
15. భారతదేశంలో ఎత్తైన కనుమ ఏది?
    1) బుర్జిలా 2) కారకోరం
    3) ఖార్దూంగ్లా 4) జోజిలా
16. పిర్‌పంజాల్, ధౌలాధార్ పర్వత శ్రేణులు ఎక్కడ ఉన్నాయి?
    1) హిమాద్రి హిమాలయాలు
    2) హిమాచల్ హిమాలయాలు
    3) శివాలిక్ కొండలు
    4) ట్రాన్స్ హిమాలయాలు
17. భారతదేశంలో అతిపెద్ద నదీ ఆధారిత దీవి ఏది?
    1) గోవిందసాగర్ 2) మజులీ
    3) బైసాలా 4) ఏదీకాదు
18. సాత్పురా పర్వతాల్లో ఎత్తైన శిఖరం ఏది?
    1) అమర్‌కంటక్ 2) మైకల
    3) పంచమర్హి 4) ధవళగిరి
19. హిమాలయాలు ఏ యుగంలో ఆవిర్భవించాయి?
    1) ప్లిస్టోసీన్ 2) టెర్షియోరరీ
    3) కేంబ్రియన్ 4) ఏదీకాదు
20. సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) అమృత్‌సర్ 2) సిమ్లా
    3) డెహ్రాడూన్ 4) త్రివేంద్రం
21. కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
    1) యాలకుల కొండలు
    2) పళని కొండలు
    3) బాబా బుడాన్ గిరికొండలు
    4) తమిళనాడు కొండలు
22. మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) వింధ్య 2) సాత్పురా
    3) పశ్చిమ కనుమలు
    4) తూర్పు కనుమలు
23. ముంబై – నాసిక్‌ను కలిపే కనుమ ఏది?
    1) థాల్‌ఘాట్ 2) బోర్‌ఘాట్
    3) పాల్‌ఘాట్ 4) కలహట్టి
24. సాడిల్ పీక్ ఎక్కడ ఉంది?
    1) నికోబార్ దీవులు
    2) అండమాన్ దీవులు
    3) సుహేలి దీవులు
    4) మినికాయ్ దీవులు
25. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ' ఎక్కడ ఉంది?
    1) చెన్నై 2) పనాజీ
    3) బెంగళూరు 4) కొచ్చిన్

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

26. 'గ్రీష్మ రుతువు' కాలం ఏది?
    1) మార్చి, ఏప్రిల్ 2) మే, జూన్
    3) జూలై, ఆగస్టు
    4) సెప్టెంబర్, అక్టోబర్
27. భారత వాతావరణ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
    1) కోల్‌కతా 2) హైదరాబాద్
    3) పుణే 4) బెంగళూరు
28. అధిక వర్షపాతం సంభవించే 'మాసిన్ రామ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మణిపూర్ 2) అసోం
    3) నాగాలాండ్ 4) మేఘాలయ
29. జాతీయ వరద నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1956 2) 1975
    3) 1954 4) 1974
30. భారతదేశంలో ఎత్తైన జలపాతం ఏది?
    1) దూద్‌సాగర్ 2) జోగ్
    3) రకిమ్‌కుండ్ 4) కుంతల
31. కాలబైశాఖీలు అనే రుతుపవన ఆరంభ జల్లులు ఏ రాష్ట్రంలో కురుస్తాయి?
    1) ఉత్తరప్రదేశ్ 2) పశ్చిమబెంగాల్
    3) అసోం 4) కేరళ
32. లానినో, ఎల్‌నినోలు ఎక్కడ సంభవిస్తాయి?
    1) హిందూ మహాసముద్రం
    2) పసిఫిక్ మహాసముద్రం
    3) అట్లాంటిక్ మహాసముద్రం
    4) బంగాళాఖాతం
33. భారతదేశంలో అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే రుతుపవనాలు ఏవి?
    1) ఆగ్నేయ రుతుపవనాలు
    2) వాయువ్య రుతుపవనాలు
    3) నైరుతి రుతుపవనాలు
    4) ఈశాన్య రుతుపవనాలు
34. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం పొందే రాష్ట్రం ఏది?
    1) కేరళ 2) కర్ణాటక
    3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు
35. విస్తీర్ణపరంగా అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
    1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
    3) మిజోరాం 4) ఉత్తరప్రదేశ్
36. తీర ప్రాంతాల్లో అత్యధికంగా తుపాన్లకు గురయ్యే రాష్ట్రం ఏది?
    1) తమిళనాడు 2) ఒడిశా
    3) గోవా 4) అసోం
37. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
    1) లఢక్ 2) బికనీర్
    3) లే 4) జైసల్మీర్
38. మనదేశంలో అధిక విస్తీర్ణంలో ఉన్న అడవులు ఏవి?
    1) క్షారజల అరణ్యాలు
    2) సతతహరిత అరణ్యాలు
    3) ఆకురాల్చే అడవులు 4) చిట్టడవులు
39. దచిగామ్ దుప్పి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరాంచల్ 2) జమ్ము–కశ్మీర్
    3) బీహార్ 4) హిమాచల్ ప్రదేశ్
40. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) మార్చి 21 2) మార్చి 22
    3) మార్చి 29 4) మార్చి 24
41. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1992 2) 1991 3) 1990 4) 1994
42. మనదేశంలో మొదటి టైగర్ రిజర్వ్ కేంద్రం ఏది?
    1) కజిరంగా 2) బందీపూర్
    3) నామ్‌దఫా 4) సిమిపాల్
43. భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న నేలలేవి?
    1) చిత్తడి నేలలు 2) ఒండలి నేలలు
    3) నల్ల నేలలు 4) ఎర్ర నేలలు
44. సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1951 2) 1954
    3) 1958 4) 1960
45. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) బళ్లారి 2) కోటా
    3) పసద్ 4) ఊటీ
46. చేతివేళ్ల ఆకారంలో జరిగే క్రమక్షయాన్ని ఏమంటారు?
    1) వట క్రమక్షయం 2) వంక క్రమక్షయం
    3) అవనాళికా క్రమక్షయం
    4) వాలు క్రమక్షయం
47. వరి పంటను ఏ మృత్తికల్లో అత్యధికంగా పండిస్తారు?
    1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
    3) నల్లరేగడి నేలలు 4) జేగురు నేలలు
48. వేదకాలంలో 'చంద్రభాగ'గా పేర్కొన్న నది ఏది?
    1) రావి 2) చినాబ్
    3) బియాస్ 4) సట్లేజ్
49. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
    1) మజిలీ 2) పద్మా
    3) మేఘన 4) ఐరావతి
50. 'దక్షిణ గంగ' అని ఏ నదిని పిలుస్తారు?
    1) నర్మద 2) తపతి
    3) గోదావరి 4) కృష్ణా
51. రామ్‌గంగ తీరంలో ఉన్న కాంస్య నగరం ఏది?
    1) ఉజ్జయినీ 2) రూర్కెలా
    3) మొరాదాబాద్ 4) ఫిరోజ్‌పూర్
52. 'కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు
53. దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
    1) సాంబర్ 2) ఊలార్
    3) చిల్కా 4) లోక్‌తక్
54. బాగ్లీహార్ ప్రాజెక్ట్ విషయంలో భారత్‌కు ఏ దేశంతో వివాదం ఉంది?
    1) నేపాల్ 2) చైనా
    3) బంగ్లాదేశ్ 4) పాకిస్తాన్
55. బాబ్లీ ప్రాజెక్టు ఏ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైంది?
    1) కర్ణాటక –ఆంధ్రప్రదేశ్
    2) మహారాష్ట్ర – తెలంగాణ
    3) తమిళనాడు –కర్ణాటక
    4) కేరళ – తమిళనాడు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 1; 5) 4;
6) 1; 7) 1; 8) 2; 9) 3; 10) 3;
11) 4; 12) 2; 13) 3; 14) 3; 15) 3;
16) 2; 17) 2; 18) 3; 19) 2; 20) 3;
21) 2; 22) 4; 23) 2; 24) 2; 25) 2;
26) 2; 27) 3; 28) 4; 29) 3; 30) 2;
31) 2; 32) 2; 33) 3; 34) 4; 35) 1;
36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 1;
41) 1; 42) 2; 43) 4; 44) 3; 45) 4;
46) 2; 47) 2; 48) 2; 49) 3; 50) 3;
51) 3; 52) 4; 53) 2; 54) 4; 55) 2.

తెలంగాణ ఉద్యమం.. జేఏసీలు.. ప్రజా సంఘాల పాత్ర

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమ చరిత్ర

తెలంగాణ ఉద్యమం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష.. దాన్ని సాకారం చేసుకోవడంలో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లు.. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థుల పాత్ర అనిర్వచనీయం. 1969 మొదలు 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్ణయం వెలువడిన దశ వరకు ఇవి ఎంతో క్రియా శీలకంగా వ్యవహరించాయి. రాజకీయ పార్టీలను సైతం ఈ జేఏసీలు, ప్రజా సంఘాలు ప్రభావితం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులోప్రధాన భూమిక పోషించాయి. 2009 డిసెంబర్ 24న ఏర్పడిన రాజకీయ జేఏసీకి నేతృత్వం వహించి.. సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, మానవ హారం, సకల జనుల సమ్మె, సాగర హారం, జైల్‌భరో, రైల్‌రోకో, వంటా వార్పు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ప్రొఫెసర్ ఎం.కోదండరాం.. తెలంగాణ ఉద్యమంలో జేఏసీలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర ప్రజా సంఘాల పాత్రపై అందిస్తున్న ప్రత్యేక వ్యాసం..



తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోని వివిధ దశల్లో అనేక సంయుక్త కార్యాచరణ కమిటీలు (జేఏసీలు) ఏర్పడి తెలంగాణ ప్రజల ఆశలు- ఆకాంక్షల స్ఫూర్తిగా పోరాడాయి. తెలంగాణకు నదీజలాలు, ఉద్యోగాలు, విద్యావకాశాల విషయంలో అన్యాయం జరగడం, రాష్ట్ర ఆదాయాన్ని పంపిణీ చేసుకోవడంలో వివక్షలు, భారీ స్థాయిలో భూ ఆక్రమణలు, సాంస్కృతిక దురాక్రమణ, తెలంగాణ ప్రజల పట్ల చిన్నచూపు, ఇతర ఆధిపత్య ధోరణుల కారణంగా ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవాలనే నిర్దిష్ట లక్ష్యంతో జేఏసీలు ఏర్పడ్డాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న తెలంగాణ ఉద్యమంలో తొలి నుంచీ జేఏసీలు, ప్రజా సంఘాలే కీలక పాత్ర పోషించాయి. 1969 ఉద్యమంలో సైతం వీటి పాత్రే కీలకం. అప్పట్లో ప్రత్యేకంగా విద్యార్థి, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటం.. తెలంగాణ ప్రాంతంలోని మిగతా అన్ని వర్గాలను తెలంగాణ ఉద్యమం దిశగా కదిలించింది.

ఎన్‌జీవోలు.. విద్యార్థులు.. ప్రజాసమితి..

తెలంగాణ ఉద్యమంలో ఎన్‌జీవోలు, విద్యార్థులది ఘనమైన పాత్ర. 1968లో విద్యార్థులు, ఎన్‌జీవోలు ఒక్కతాటిపై నిలిచి హైదరాబాద్‌లో పీపుల్స్ కన్వెన్షన్‌ను నిర్వహించారు. ఈ సదస్సు తర్వాతి క్రమంలో ప్రజా సమితిగా మారింది. విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన స్ఫూర్తితో ఏర్పడిన ప్రజా సమితి.. 1969 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)గా రూపొందింది. దీనికి అప్పటి కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి నేతృత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచే తెలంగాణ వాదం వినిపించిన పలువురు నేతలు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చి తెలంగాణ ప్రజా సమితిలో చేరారు. ప్రజా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఎన్నో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ ఉద్యోగుల సంఘం 1969 జూన్ 10న సమ్మె నిర్వహించింది. చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితి తర్వాత క్రమంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. తర్వాత కూడా అదే స్ఫూర్తి కొనసాగించింది. ముఖ్యంగా 1969 జూన్‌లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్‌కు వచ్చి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అయినా కాంగ్రెస్ పార్టీ నిర్ణయంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. దాంతో తెలంగాణ ప్రజా సమితి 1971 పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పోటీ చేసింది. దీనికి తెలంగాణ ప్రాంతంలోని అన్ని వర్గాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంతంలోని 14 పార్లమెంట్ సీట్లకు గాను 10 స్థానాల్లో టీపీఎస్ విజయం సాధించింది. తర్వాత కాలంలో తెలంగాణ ప్రజా సమితిలోని నాయకులు తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ మనుగడ సాగించలేకపోయింది.

1996.. ముందుకొచ్చిన ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష, ఆ దిశగా మలి దశ ఉద్యమం 1996లో మొదలైంది. దీనికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం అనుసరించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలే. ఉపాధి కల్పన, జీవనోపాధి, ప్రజల సంక్షేమం పరంగా ప్రభుత్వం నుంచి అంతగా ఆశించకూడదని పేర్కొనడం, ప్రైవేటు వర్గాలకు చేయూతనిచ్చే విధంగా వ్యవహరించడం జరిగింది. దీంతో అప్పటికే తాము వివక్షకు గురవుతున్నామనే భావనలో ఉన్న తెలంగాణ ప్రజలు.. ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల తాము మరింత వివక్షకు గురవుతామని, విద్యా, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయని ఆందోళన చెందారు. దీనికి పరిష్కారం ప్రత్యేక తెలంగాణ సాధనే అనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో మలి దశ ఉద్యమం మొదలైంది. ఈ క్రమంలోనూ విద్యార్థులు కీలక పాత్ర వహించారు. తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్; తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ వంటి సంఘాలు ఆవిర్భవించాయి.

ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో సభ

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల జేఏసీ ఆధ్వర్యంలో 1993 ఆగస్టులో చిన్న రాష్ట్రాల ఏర్పాటుపై జాతీయ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఇందులో జార్జి ఫెర్నాండెజ్, జస్టిస్ మాధవ రెడ్డి, సురేంద్ర మోహన్ వంటి జాతీయ స్థాయి రాజకీయ, మేధావి వర్గాల వారు పాల్గొన్నారు. ఆ తర్వాత 1996లో తెలంగాణ జర్నలిస్టులు, రచయితల నేతృత్వంలోని ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పేరుతో సభ జరిగింది. 1996 నవంబర్ 1న వరంగల్‌లో తెలంగాణ ప్రజా సమితి నిర్వహించిన సభ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను ప్రస్ఫుటం చేసింది. ఈ సభకు భారీ ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. వాస్తవానికి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, తీవ్రతరం చేయడంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ ఉద్యమాన్ని క్రియాశీలకంగా నడపడంలో కృషి చేశాయి. తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా విద్యార్థి జేఏసీ 2009లో చలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చింది. అలాగే 2010 జనవరిలో విద్యార్థి జేఏసీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరసనకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే, హైకోర్టును ఆశ్రయించి భారీ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు మొదటి నుంచీ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారు.

టీఆర్ఎస్ ఆవిర్భావం

మలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత ప్రత్యేక పరిణామం.. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పాటు. అప్పటివరకు ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఈ ప్రాంత ప్రజలు చేపట్టిన అనేక ఆందోళన కార్యక్రమాలను, ఇతర నిరసనలను ప్రభుత్వాలు తమ అధికారంతో అణచివేశాయి. తెలంగాణ ఆకాంక్షను రాజ్యాంగబద్ధంగా తెలపాలనే ఉద్దేశంతో అప్పటివరకు తెలుగుదేశం పార్టీలో ఉన్న కె.చంద్రశేఖరరావు.. ప్రత్యేక తెలంగాణ అంశమే ఎజెండాగా 2001లో టీఆర్ఎస్ పార్టీని నెలకొల్పారు. దీంతో ఉద్యమంలో రాజకీయ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఏదో ఒక విధంగా ఉద్యమ కార్యక్రమాలు జరగడం, వాటిలో విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని వర్గాలు మమేకమయ్యాయి. మలి దశలో 1990ల నుంచి 2009 వరకు వేర్వేరుగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించిన వర్గాలు.. 2009లో ఐక్యమవడం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దిశగా కీలక పరిణామం. 2009 నవంబర్ 29 నుంచి టీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో మళ్లీ పౌర సంఘాల పాత్ర తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల ఐక్య వేదికలు కేసీఆర్ దీక్షకు సంఘీభావంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమాలను అణచివేయాలని అప్పటి ప్రభుత్వం ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లోని విద్యార్థులపై చేసిన లాఠీచార్జీ, కాల్పుల కారణంగా సాధారణ ప్రజానీకం సైతం ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు.

2009 నాటికి ప్రాధాన్యం గుర్తించిన అన్ని పార్టీలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు దిశగా రాజకీయ పార్టీలు విభిన్న శైలుల్లో వ్యవహరించాయి. 1999 ఎన్నికల సమయంలో కాకినాడ ప్లీనరీలో 'ఒక ఓటు-రెండు రాష్ట్రాలు' నినాదం చేసిన భారతీయ జనతాపార్టీ తర్వాత ఏకాభిప్రాయం పేరుతో వెనుకడుగు వేసింది. 2001లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం కూడా తెలంగాణకు వ్యతిరేకంగానే ఉంది. ఈ తీర్మానం అస్పష్టంగా ఉంది. రెండో ఎస్సార్సీని వేయాలని తీర్మానం చేసి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను గుర్తించడం గమనార్హం. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దిశగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలు.. 2009 నాటికి దీని ప్రాధాన్యం, ఆవశ్యకతను గుర్తించాయి. ముఖ్యంగా ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని చెప్పడంతోపాటు ఈ దిశగా ముందుకెళతామని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ మాత్రం మొదటి నుంచి పూర్తి వ్యతిరేకతతో వ్యవహరించింది. 2012 డిసెంబర్ 28న ఆల్ పార్టీ మీటింగ్‌లో తెలంగాణకు మద్దతు తెలిపినా.. రాజకీయంగా మాత్రం వ్యతిరేకంగా వ్యవహరించింది. ఎంఐఎం పార్టీ మాత్రం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీకే వదిలేసింది. చివరికి 2014లో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టగా అధికార, విపక్ష సభ్యులు మద్దతు తెలిపారు! 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభ, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును 2014 మార్చి1న రాష్ట్రపతి ఆమోదించారు. దశాబ్దాల పోరాటం ఫలించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా, భారతదేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది!!

మలిదశలోనూ.. ప్రజా సంఘాలే

మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులదే ముఖ్య పాత్ర అని చెప్పాలి. తొలుత 1989లో తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ ఏర్పాటయింది. దీని ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసంత్ టాకీస్‌లో భారీ సభ జరిగింది. 1969 ఉద్యమంలో పాల్గొన్న నేతలంతా ఈ సభకు హాజరై.. పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, వాటికి ఆంధ్ర నేతల అడ్డంకుల గురించి చర్చించారు. ఈ చర్చలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరడంతో తెలంగాణ ఆకాంక్ష మరింత తీవ్రమైంది. ఉద్యమంలో పల్లె స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పాల్పంచుకోవడం ప్రారంభమైంది. 1970ల తర్వాత విద్యావకాశాలు విస్తృతమయ్యాయి. రిజర్వేషన్లు, ఇతర కారణాల వల్ల ఆర్థిక కోణంలో మధ్యతరగతి వర్గం పెరిగింది. ఈ వర్గం నుంచి విద్యావంతుల సంఖ్య పెరిగింది. దాంతో తెలంగాణ ప్రజలు వివక్షకు గురవుతున్న విధానంపై మరింత చైతన్యం వచ్చింది. వారంతా తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. క్రమేణా 1990ల నాటికి ఈ పౌర సంఘాలు బలపడ్డాయి. మలి దశ ఉద్యమంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాయి. తెలంగాణ మహా సభ, తెలంగాణ జన సభ, తెలంగాణ ఐక్య వేదిక ఇలా ఎన్నో సంఘాలు ఏర్పడ్డాయి.

పొలిటికల్ జేఏసీ.. ఇలా:

తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు తెలంగాణ ఉద్యమ క్రమంలో అత్యంత ప్రత్యేకమైన పరిణామం. కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో డిసెంబర్ 9, 2009న అప్పటి కేంద్ర హోం శాఖ మంత్రి పి.చిదంబరం 'తెలంగాణ ఏర్పాటు దిశగా అవసరమైన చర్యల ప్రక్రియను ప్రారంభిస్తున్నాం' అని ప్రకటించారు. అయితే డిసెంబర్ 23 నాటికి పరిస్థితి తలకిందులైంది. డిసెంబర్ 9 ప్రకటనకు భిన్నమైన ప్రకటన విడుదలైంది. అన్ని పార్టీలను సంప్రదించిన తర్వాతే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని ఆ ప్రకటన సారాంశం. దీంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఆయా పార్టీల్లోని తెలంగాణ ప్రాంత నేతలు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో డిసెంబర్ 24, 2009న అన్ని రాజకీయ పార్టీల నేతలంతా కలిసి రాజకీయ ఐక్య వేదిక(జేఏసీ)ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా జేఏసీ నేతృత్వంలో సహాయనిరాకరణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె చరిత్రలో నిలిచిపోయేలా జరిగాయి. తెలంగాణ ప్రత్యేక ఉద్యమ క్రమంలో తెలంగాణ ఉద్యోగులు, పౌర సంఘాలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో.. 2011 ఫిబ్రవరి 17 నుంచి 16 రోజుల పాటు ఉద్యోగుల సహాయ నిరాకరణ; తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో 2011 మార్చి 10న మిలియన్ మార్చ్; 2011 సెప్టెంబర్ 13 నుంచి 42 రోజులపాటు జరిగిన సకల జనుల సమ్మె; 2011 సెప్టెంబర్ 24, 25 తేదీల్లో సడక్ బంద్; 2012 సెప్టెంబర్ 30న సాగర హారం నిర్వహణ ముఖ్య ఘట్టాలుగా పేర్కొనొచ్చు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు - ఆవశ్యకతపై 2010 ఫిబ్రవరి 10న కేంద్రం ఐదుగురు సభ్యులతో శ్రీ కృష్ణ కమిటీని నియమించింది.

Gilt edged securities refer to..



BANK EXAMS

BANKING AWARENESS

1. Who is the Chairman of NABARD (National Bank for Agriculture and Rural Development)?
a) Dr. Harsh Kumar Bhanwala
b) Mrs V.R.Iyer c) HR Kamath
d) B Bhattacharya
e) R Rajendran

2. For recovery of NPA from the defaulted borrowers, SARFAESI Act 2002, is implemented. What does the letter 'S' stands for in SARFAESI
a) Social b) Security
c) Seasonal d) Stamp
e) Systematic

3. Bank holidays under Sec.25 of N.I. Act are declared by
a) RBI
b) State govt. for the respect state
c) Central govt.
d) LHO e) Prime Minister

4. One rupee coin issued under _____ Act
a) Coinage Act 1906
b) RBI c) BR
d) All the above
e) None of these

5. Clean Note policy has been introduced as per
a) Banking Regulation Act
b) RBI Act c) SBI Act
d) PNB Act e) None of these

6. Under prevention of Money laundering Act 2002, the financial transaction records have to be preserved for _____ years.
a) 5 b) 10 c) 20 d) 40
e) None of these

7. Under prevention of Money laundering Act 2002, banks have to report suspicious transaction to _____
a) RBI b) CBI c) FIU-IND
d) LHO e) Central Govt.

8. RBI Has relaxed KYC norms for small account holders who do not intend to make deposits over Rs.50,000/- and total credits in the account in a year is limited to Rs. 1 lakh. Total withdrawls/ Transfer in a month does not exceed Rs. ____
a) 10,000 b) 20,000
c) 50,000 d) 60,000
e) None of these

9. When form15-H has been received, the bank shall forward the same to I.T. Department on or before ____ day of next month.
a) 3rd b) 5th c) 7th
d) 15th e) 17th

10. In which of the following transaction PAN should be quoted?
a) A time deposit exceeding Rs.50,000
b) Payment in cash to purchase bank draft or banker's cheque for an amount aggregating Rs.50,000 or more during any one day
c) Deposit cash aggregating Rs. 50,000 or more during any one day
d) All the above e) None of these

11. Currency Notes are printed at:
a) Nasik b) Dewas c) Mysore
d) Salboni e) All of these

12. If the customer does not cooperate for making their accounts KYC compliant, despite repeated communication/ contacts, their accounts should be _____.
a) Frozen b) Closed
c) Close the account only after compliance of KYC
d) a or c e) a & b

13. As per KYC Norms / AML measures risk categorization of all customer accounts should be done and review of risk categorization should be cared out at ____ months intervals every year.
a) 3 b) 6 c) 9
d) 12 e) 15

14. SLR has to be maintained by banks under _______
a) Sec. 24 of BR Act
b) Sec. 24 of RBI Act
c) Sec. 42 of RBI Act
d) Sec. 42 of BR Act
e) None of these

15. Who is the Chairman of IRDA?
a) T.S.Vijayan
b) Dr. Rangarajan
c) M.V.Nair
d) J.S. Bhatnagar e) HR Khan

16. Who is the authority for referring appeals against the award of banking ombudsman?
a) Deputy Governor, RBI
b) RBI Governor
c) CMD of concerned bank
d) Group of CMDs formed by RBI
e) None of the above

17. The sponsoring bank's share in RBIs is:
a) 50% b) 35% c) 15%
d) 75% e) None of these

18. Can a HUF join as a partner in a partnership firm?
a) Can be included
b) Can be included with company
c) Cannot join
d) Can join subject to the approval of CMD
e) None of the above

19. Bank's Lien is:
a) General lien b) Particular lien
c) Contingent lien
d) b & c e) None of these

20. Within how many days the CPIO (Central Public Information Officer) has to provide information under RTI Act?
a) 30 days b) 15 days
c) 45 days d) 10 days
e) 60 hours

21. Which of the following is not a negotiable instrument as per N.I. Act?
a) Promissory note b) Draft
c) TDR (Term Deposit Receipt)
d) Cheque
e) None of the above

22. Which of the following is not correct in respect of issue of CP:
a) It can now be issued as a standalone facility
b) Minimum issue is Rs. 5 lakh
c) CPs can be underwritten by a bank
d) Minimum Tangible net worth of the Corporate should be Rs. 4 crore
e) All the above

23. The maximum period for which a CD can be issued is _____
a) 1 month b) 3 months
c) 180 days d) 1 year
e) None of these

24. What is not true about CDs?
a) It is transferable from the data issues
b) It can be issued for a minimum period of 7 days
c) It is not all transferable
d) It can be issued in demat form only
e) None of these

25. Gilt edged securities refer to ___
a) Govt. securities
b) Shares of first class companies
c) Securities issued by first class companies
d) Duplicate securities
e) Securities issued by RBI Identified Companies

26. The standard rate at which the RBI is prepared to buy or rediscount export bills or other commercial paper eligible for purchase from banks under the RBI Act is known as _____
a) Bank rate b) Repo Rate
c) Card rate d) PLR
e) Base Rate

27. The result of increase in SLR by RBI is
a) Decrease in lendable resources of banks
b) Increase in loadable resources of banks
c) There will not be any change in loan able resources of banks
d) Only b and c
e) None of these

28. Blue chip securities mean ____
a) Shares of progressive, well managed companies with excellent record of payment of dividends.
b) The shares which are in blue ink
c) Securities issued by Chip Manufacturing companies
d) Securities identified by the concerned state governments
e) None of the above

29. Cash kept in the currency chest is owned by
a) Currency Chest Branch Bank
b) Central Government
c) Reserve Bank of India
d) State Bank of India
e) None of the above

30. Bank can't proceed against the borrower under SARFAESI Act where:
a) Security is agricultural land
b) Liability is less than Rs.1 lakh
c) Liability is less than 20% of the principal
d) Pledge of movables
e) All the above

31. The minimum capital required to start a new private sector bank is________
a) 100 crore b) 200 crore
c) 300 crore d) 400 crore
e) 500 crore

32. RBI injects liquidity through
a) Increase Bank Rate
b) Reduction of Repo Rate
c) Reduction of Reverse Repo
d) Increase CRR
e) Increase SLR

33. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
a) It can be accepted since the nominees are the family members of the depositor
b) Cannot be considered since the request is not received at the time of opening of account
c) Can be considered with 50% share each
d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
e) None of the above

KEY

1) a; 2) b; 3) b; 4) a; 5) a;
6) b; 7) c; 8) a; 9) c; 10) d;
11) e; 12) b; 13) b; 14) a; 15) a;
16) a; 17) b; 18) c; 19) a; 20) a;
21) c; 22) c; 23) d; 24) e; 25) a;
26) a; 27) a; 28) a; 29) c; 30) e;
31) e; 32) b; 33) d.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్ఏఐలో ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులు

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కి చెందిన నేషనల్ హైవేస్ ఇన్విట్.. ప్రాజెక్ట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 04
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: 40 ఏళ్లు ఉండాలి.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఈమెయిల్: hr.nhipmpl@nhai.org
- దరఖాస్తులకు చివరితేది: 11.02.2025.
- వెబ్‌సైట్: https://nhai.gov.in

నైపర్ పంజాబ్‌లో వివిధ పోస్టులు

పంజాబ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎన్ఐపీఈఆర్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 03.
- పోస్టుల వివరాలు: పోస్ట్ డాక్టోరల్ ఫెలో-02, రీసెర్చ్ అసోసియేట్ కమ్ అనలిటికల్ కెమిస్ట్(అనలిటికల్ ఆర్ అండ్ డీ)-01.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ (ఫార్మాస్యూటికల్ సైన్స్, అనటికల్ కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: 35 ఏళ్లు మించకూడదు.
- వేతనం: నెలకు రూ.65,000.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రొఫెసర్.ఎ.కె.బన్సాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మస్యూటిక్స్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీఈఆర్), సెక్టార్-67, ఎస్ఏఎస్ నగర్-160062 (పంజాబ్) చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 24.02.2025.
- వెబ్‌సైట్: https://niper.gov.in